
# ఆర్ఎస్ఎస్
# దేశానికి ప్రమాదం

ఎ. జి. నూరాని



ప్రజాశక్తి బుక్‌హౌస్

PSBH

# ఆర్ ఎస్ ఎస్
## దేశానికి ప్రమాదం

ఎ.జి. నూరాని

# ఆర్ ఎస్ ఎస్

## దేశానికి ప్రమాదం


రచన

**ఎ.జి.నూరాని**

సంక్షిప్త స్వేచ్ఛానువాదం

**కె.ఉషారాణి**



PSBH **ప్రజాశక్తి బుక్‌హౌస్**

ప్రజాశక్తి భవన్, అమరారెడ్డి కాలని, అరవిందా హైస్కూల్ వద్ద

తాడేపల్లి – 522 501. ఫోన్ : 0866 – 2577533

PSBH

**ప్రథమ ముద్రణ** : జులై, 2021

**రెండో ముద్రణ** : ఆగస్టు, 2021

**ప్రతులు** : 1000

వెల : ₹.200/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 - 2577533

**బ్రాంచీలు**

విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ,

ఏలూరు, విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

152219

# విషయసూచిక


ముందుమాట

✦ ఆర్ ఎస్ ఎస్ ఎందుకు స్థాపించబడింది? 25

✦ ఆర్ ఎస్ ఎస్ 19 శతాబ్దపు వారసత్వం 35

✦ భారత జాతీయవాద నిబద్ధత 42

✦ బ్రిటిష్ వారితో కుమ్మక్కు ఆండర్సన్, డాల్మేల నమోదు 48

✦ యూరప్ ఫాసిజం అంటే మోజు 52

✦ సావర్కర్ మహాసభ ఆక్రమణ 58

✦ ఆర్ ఎస్ ఎస్ చేతిలోకి ఓ బైబిల్ 64

✦ ఆర్ ఎస్ ఎస్ – స్వాతంత్ర్యం 71

✦ ఆర్ ఎస్ ఎస్ – గాంధీ 77

✦ ఆర్ ఎస్ ఎస్ పై నిషేధం 83

✦ జన సంఘ్, గోల్వాల్కర్ ముఖర్జీల ఒప్పందం 88

| | | |
|---|---|---|
| ✦ | ముఖర్జీ ఆర్ ఎస్ ఎస్, జనసంఘ్ | 94 |
| ✦ | ముఖర్జీ తదనంతర కాలంలో ఆర్ ఎస్ ఎస్ | 100 |
| ✦ | ఆర్ ఎస్ ఎస్ – అత్యవసర పరిస్థితి, జనతా పార్టీ | 105 |
| ✦ | బిజెపి ఆవిర్భావం, ఆర్ ఎస్ ఎస్ సమస్య | 114 |
| ✦ | రాముని పేరులో దాగున్న శక్తి | 122 |
| ✦ | హింసతో మోడీ ఎలా లాభం పొందారు? | 131 |
| ✦ | అద్వానీ కథ | 137 |
| ✦ | విజయోత్సాహంలో ఆర్ ఎస్ ఎస్ | 140 |
| ✦ | భారతదేశ ప్రధానిని ఎంపిక చేసేది ఆర్ ఎస్ ఎస్ | 145 |
| ✦ | మోడీ పాలనలో ఆర్ ఎస్ ఎస్ | 151 |
| ✦ | ఆఖరి పోరాటం–2018 | 163 |
| ✦ | ఆర్ ఎస్ ఎస్ – హింస | 171 |
| ✦ | ఆర్ ఎస్ ఎస్ వారసులు : ఎ బి వి పి, వి హెచ్ పి, బజరంగ్ దళ్ | 186 |
| ✦ | పన్నుల, ధార్మిక అధికారుల ముందు ఆర్ ఎస్ ఎస్ స్వయం | 196 |

# ముందుమాట

**తో**టకి రక్తం కావాల్సి వచ్చినప్పుడు ముందుగా తెగ్గోసినవి మా గొంతుకలు. కానీ, పూదోట మీదికాదు మాదంటున్నారు తోటలోని వారీనాడు...

ఈనాటి భారతదేశంలో ముస్లింల పరిస్థితులకు ఈ కవిత అద్దంపడుతున్నది. 1857లో జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ పోరాట బాధితులలో ముస్లింల సంఖ్యే అధికం; బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా హిందువులతో కలిసి పోరాడింది వీరే. అయినా 19 శతాబ్దం చివరికి వచ్చేసరికి ముస్లింలు పరాయి దేశస్థులని, ఈ దేశం హిందువులదని, హిందువులే ఈ దేశ ప్రజల చట్టాలను రూపొందించాలని అరుపులు మొదలయ్యాయి.

21వ శతాబ్దం మొదటికి ఆ కేకలు మరింత పదునెక్కాయి; మరింత రాటుదేలాయి; మరింత ప్రమాదకరంగా మారాయి. ఈ శక్తులు మైనారిటీలను భయభ్రాంతులను చేయడం మాత్రమే కాదు; భారతదేశ జాతీయత భావనలోనే, రాజ్యంలో మైనారిటీలకు స్థానం ఉండకూడదన్నాయి. ఇదెలా జరిగింది?

సామ్రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేసినందుకు, ఎర్రకోటలోని మొఘల్ చక్రవర్తి బహదూర్‌షా జాఫర్‌ను బ్రిటిష్ సైనిక కమిషన్ విచారణ జరిపింది. 21 రోజులపాటు సాగిన ఈ విచారణలో న్యాయవాది, 'ఇది స్థానికులు తమ అధికారం కోసం, తమ స్థానం నిలుపుకోవడం కోసం చేసిన పోరాటం; మతపరంగా గాని, రంగు, రూపం, అలవాట్లలోగాని ఏమాత్రం పోలిక లేని వారిని ఈ దేశం నుండి బహిష్కరించేందుకు చేసిన పోరాటం' అన్నారు. హిందూ ముస్లిం మతస్థులిద్దరూ బహదూర్‌షా జాఫర్ నాయకత్వంలో జరిగిన తిరుగుబాటులో పాల్గొన్నారు. లక్షలాది మంది భారతీయులు జాఫర్ నాయకత్వం వహించడాన్ని గౌరవంగా భావించి

కోరుకున్నావారే. కానీ మూఢనమ్మకంతో కాదు. ప్రసిద్ధ రచయిత అశోక్ మెహతా, మరింత లోతుగా విశ్లేషించి, ఈ తిరుగుబాటులో హిందువులకన్నా ముసల్మానులు మరింత వీరోచితంగా పోరాడారని రాసారు. అందువలననే ముస్లింలే అణచివేతకు గురయ్యారు; వారిపై తీవ్రవాదులనే ముద్రవేశారు. జజ్జర్, వల్లభ్ నగర్, ఫరూక్ నగర్, ఫురుకాబాద్ నవాబులను ఉరితీశారు, లేదా దేశ బహిష్కరణ చేశారు. ముస్లింల ఆస్తులు జప్తు చేశారు. ఆంగ్లేయులు ఢిల్లీని తిరిగి వశపరచుకున్న తరువాత హిందువులను తిరిగి రావడానికి అనుమతించారుగాని ముస్లింలను 1859 వరకు అనుమతించలేదు. ముస్లింల ఆస్తులలో 25% జుల్మానాగా వసూలు చేస్తే హిందువుల ఆస్తులలో 10% వసూలు చేసారు. ముస్లింలు ఈ అణచివేతను ఎదుర్కోడమే కాదు, ఓటమిని అంగీకరించలేదు కూడా. అనేక రూపాలలో చాలాకాలం పాటు ప్రతిఘటించారు. బ్రిటీష్ విద్యావిధానాన్ని తిరస్కరించారు; అందువలన ప్రభుత్వ ఉద్యోగాలు కోల్పోయారు; వృత్తులు కోల్పోయారు. అదే సమయంలో హిందువులు పశ్చిమ దేశాల ఆలోచనలను ఒంట పట్టించుకుని మారిన పరిస్థితులకు అనుగుణంగా మారారు.

మహమ్మద్ ఇక్బాల్ రచించిన, 'ప్రపంచమంతటిలో అందమైనది నా హిందూదేశం' (సారేజహాసే అచ్ఛా...) అనే పాట అత్యంత ప్రసిద్ధి చెందింది. ఇందులో హిందూ దేశమంటే ముస్లింలు, హిందువులు కలిసున్న హిందూదేశం అని అర్ధం. తమ బలమైన ప్రత్యర్ధి జాఫర్ మరణ వార్త బ్రిటిష్ వారికి ఎంతో ఉపశమనం కలిగించిదంటే, జాఫర్ చక్రవర్తి దేశ స్వతంత్రం కోసం ఎంతగా నిలిచారో అర్ధం చేసుకోవచ్చు.

అలాగే ముస్లిం రాజులైన హైదర్ అలీ, టిప్పుసుల్తాన్‌ల ఔన్నత్యాన్ని తక్కువ చేసి చూడలేం. భారతదేశ స్వాతంత్ర్యానికి వచ్చే ముప్పును మొదటిగా పూణెకు చెందిన నానా ఫెర్నావిస్, మైసూర్‌కి చెందిన హైదర్, తంజావూర్‌కి చెందిన గాది, మైసూర్‌కి చెందిన మాసనాడ్, రాజ్ ఘర్‌కి చెందిన సహాయాద్రి పసికట్టారు. తొలి స్వతంత్ర సంగ్రామానికి మతమే పునాది. అయినప్పటికీ, ఆనాడు మతం, సంస్కృతి రెండూ, దేశభక్తికి లోబడే ఉండేవి. పోరాటమంతటా జాతి సమైక్యత, భారత జాతీయతా నినాదాలే స్పష్టంగా ఉండేవి.

(రాజులు పాలించే క్రమంలో రాజ్యాలను విస్తరించుకోడానికి యుద్ధాలు చేసేవారు. సంపదలను దోచుకునే వారు. అయితే, అందుకు ప్రాతిపదిక మతం కాదు. ఈ పనులు హిందూ రాజులూ చేసేవారు. ముస్లిం రాజులూ చేసేవారు. హిందూ రాజులు కేవలం ముస్లిం రాజులపైనే దండెత్తలేదు. అలాగే ముస్లిం రాజులూ కేవలం

హిందూ రాజుల పైనే దండెత్తలేదు.) హిందువైనా బాజీ రావు కొడుకు నానాసాహెబ్‌కి, నమ్మకమైన దూతగా అజీముల్లా ఖాన్ ఉండేవాడు. నానాసాహెబ్, విదేశీయులైన బ్రిటిష్ వారిని పారద్రోలిన తరువాత భారతదేశం, అనేక హిందూ, ముస్లిం స్వతంత్ర రాజులు గల రాజ్యంగా ఉంటుందని భావించారు. ఇద్దరూ హిందుస్థాన్ గడ్డపై పుట్టినవారు; ఇద్దరూ ఒక తల్లి బిడ్డలే; మతాలు వేరైనా ఇద్దరి తల్లి భారతమాతే. అందువలనే ఆనాటి రాజులందరూ ఒకే స్వాతంత్ర్య పతాకం కింద కలిసి పోరాడారు. భారతదేశంలోని రాజులంతా యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియాగా పాలించుకుంటామని ఆనాడు భావించారు. సావర్కర్ కూడా, '1857 తిరుగుబాటు' అనే గ్రంథంలో ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు.

1911 జులై 4న సావర్కర్‌ను ఖైదు చేసి అండమాన్ జైలుకి తరలించారు. అప్పటి నుండి ఆయన దృక్పథంలో మార్పు వచ్చింది. జైలులో ఉండగానే సావర్కర్ హిందుత్వ బైబిల్‌గా పరిగణించబడే 'హిందుత్వ' అనే పుస్తకాన్ని రాసారు. అదే సంవత్సరంలో ఆయన క్షమాభిక్ష ప్రసాదించాలని విన్నవించుకున్నారు. 1923లో ఆయన విడుదలైన తరువాత ఆ పుస్తకం ప్రచురించబడింది. అప్పటికి హిందూ ముస్లింలిద్దరూ భారత జాతీయ కాంగ్రెస్‌లో రాజకీయ ఆధిపత్యం కోసం పోటీ పడుతున్నారు. లాలా లజపతి రాయ్ తీవ్రవాది కాదు; సమర్థుడు, విద్యావేత్త, సంస్కారి, వక్త. ఆతను సావర్కర్ లేదా ఇతర ఆర్ఎస్ఎస్ అధినాయకుల వంటి వాడు కాదు. ఆయనే మొదటిసారిగా రెండు రాజ్యాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. 'హిందువులకు తమకంటూ భిన్నమైన ఒక సంస్కృతి ఉన్నందువలన వారు భిన్నమైన జాతివారు' అని 1899 లోనే రాసారు. 1923 అఖిల భారత కాంగ్రెస్‌లో మాట్లాడుతూ 'భారత జాతీయ కాంగ్రెస్ పార్టీలో హిందువులు అధికంగా ఉన్నారన్న వాస్తవాన్ని దాచి ప్రయోజనం లేదని' అన్నారు.

కానీ, ఈనాటి హిందుత్వవాదులకు, ఆనాడు ఆయన వాడిన భాషకూ, ఆయన వైఖరికి ఏమాత్రం పొంతన లేదు. 1924లో ఆయన ప్రతిపాదించిన 'భారతదేశ విభజన' 1947లో మౌంట్ బాటన్ ప్రతిపాదన వంటిదే. ముస్లింలు అధికంగా గల 1. పఠాన్, 2. పశ్చిమ పంజాబ్, 3. సింధ్, 4. తూర్పు బెంగాల్‌లు కలిసి ఒక ప్రాంతంగా ఉంటుంది. మిగిలిన దేశంలో ఏ ఒక్క ప్రాంతంలోనైనా ముస్లింలు అధికంగా ఉంటే అది కూడా ఇందులో చేర్చవచ్చు అదంతా ఒక భాగం అవుతుంది. అయితే, ఇది దేశంలో ఒక భాగం కాదు. అంటే స్వతంత్ర భాగం అవుతుందని ప్రతిపాదించారు. అటువంటి ప్రతిపాదన ఆనాటి సావర్కర్ గాని ఈనాటి ఆర్ఎస్ఎస్ గాని చేయగలదా ? 'ఈ దేశంలో హిందూ రాజ్యం స్థాపించగలమని ఎవరైనా అనుకుంటే

వారిని తెలివితక్కువ వారు అనాలి; ఇంకా స్పష్టంగా చెప్పాలంటే పిచ్చివారు అనాలి. ఆ పిచ్చితనం ఈ దేశంతో పాటు హిందూమత వినాశనానికి కూడా దారితీస్తుంది' అని అన్నారు లాలా లజపతి రాయ్.

అనేక సంక్లిష్ట సమస్యల పరిష్కారానికి లజపతి రాయ్ హిందూ మహాసభను సంప్రదించినా, భారతదేశం వివిధ మతాల, వివిధ సంస్కృతుల సంగమమే అన్న తన నిబద్ధత నుండి ఎన్నడూ వైదొలగలేదు. హిందువుల ప్రయోజనాలు కాపాడే రాజకీయాలు ఉన్నంత మాత్రాన అవి 'నిరంకుశంగా' ఉండాల్సిన పనిలేదని మత - సాంస్కృతిక ఆధిపత్యాన్ని రుద్దాల్సిన పనిలేదని లజపతి రాయ్ నిరూపించారు.

లజపతి రాయ్, మొహమ్మద్ ఆలీ జిన్నా అరమరికలు లేని మంచి స్నేహితులు. 1917 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన ఒక సభలో జిన్నా 'భారతదేశంలోని ముస్లింలు హిందువులు మెజారిటీగా భారతదేశంలో ఉన్నంత మాత్రాన భయపడాల్సిన అవసరం లేదు. హిందువులే మెజారిటీగా ఉన్నా, ముస్లింల ప్రయోజనాలకు భారత ప్రభుత్వం నష్టం కలిగించలేదు. 'అటువంటి చర్యలు ఆచరణ సాధ్యం కాదు' అన్నారు.

హిందూ, ముస్లిం పండితులు ఒకరినొకరు గౌరవించుకుంటూ అభిప్రాయాలు తెలుసుకుంటూ ఉండేవారు. తిలక్‌కి విధేయుడైన మౌలానా హస్రత్ మోహిని ఒక సోషలిస్టు. ఆయన మథురను కీర్తిస్తూ ఓ పద్యాన్ని రాసారు. అలాగే, సిఎం నయిం, చికాగో విశ్వవిద్యాలయంలో దక్షిణ ఆసియా భాషా సంస్కృతుల విభాగంలో గౌరవ ప్రొఫెసర్‌గా ఉన్న కాలంలో, ఉర్దూ గజల్స్‌లో ప్రావీణ్యుడైన మౌలానా హస్రత్ మోహిని గురించి ఒక వ్యాసం రాసారు. మౌలానాలో ఉన్న సూఫీ సిద్ధాంతం అతనిని ఎన్నడూ మతతత్వ వాదిని కానివ్వలేదు. ఇటువంటి సత్సంప్రదాయాన్ని ఆర్ఎస్ఎస్ ఏనాటికీ ధ్వంసం చేయలేదు.

ఇటాలియన్ పండితురాలు మజిల్ కేసోలారీ ఇలా రాసారు: "మదన్ మోహన్ మాలవ్య 1916లో హిందూ విశ్వవిద్యాలయం స్థాపించి 1919-1939 మధ్యకాలం దాని వైస్ చైర్మన్‌గా పనిచేసారు. మాలవ్య ఆధ్వర్యంలో బెనారస్ విశ్వవిద్యాలయం రాజకీయ హిందూయిజానికి కార్యాలయంగా మారింది. హిందువుల గుర్తింపుకి చేస్తున్న కృషి బలపడింది. మాలవ్య రాజకీయ ఆలోచనలను ప్రజలలోకి తీసుకెళ్లడానికి బెనారస్ విశ్వవిద్యాలయం ఒక వేదికగా మారింది. దీని ఫలితంగా భారత సమాజంలోని హిందువులలో సైనికీకరణ జరగాలన్న ఆసక్తి పెరిగింది. మాలవ్య, ఆర్ఎస్ఎస్‌ల ఆలోచనలు చాలా వరకు ఒకేలాగ ఉంటాయి. బిహెచ్‌యు విద్యార్థులు, యూనివర్సిటీ ట్రైనింగ్ కాంప్స్‌లో కఠినమైన శిక్షణ తీసుకునే వారు. ఇందులో మాలవ్య సభ్యుడు కాకపోయినా ఆర్ఎస్ఎస్ చేసే ఇటువంటి కార్యకలాపాలకు పూర్తి సహాయ

సహకారాలను అందించేవారు. 1928 నుంచి బిఎచ్‌యులో ఆర్‌ఎస్‌ఎస్ శాఖ క్రియాశీలంగా పనిచేయడం మొదలు పెట్టింది. మాలవ్య చొరవ వల్లనే బిఎచ్‌యులో ఆర్‌ఎస్‌ఎస్ గట్టి పునాదులను ఏర్పరచుకుంది".

19వ శతాబ్దం నుండే హిందూ ముస్లింలనే వేర్పాటువాద సిద్ధాంతాలకు పునాదులు వేయబడ్డాయి. 1925లో ఆర్‌ఎస్‌ఎస్ అందులో బీజాలు నాటింది. హిందువులపై స్థానిక ముస్లింలు దాడులు చేసి ఆక్రమణలు చేసినవారని, ఇక్కడున్న హిందువులను ముస్లింలుగా మత మార్పిడులు చేశారనే భావన వ్యాపించడం సావర్కర్ ప్రతిపాదించిన హిందూత్వ పుస్తకం వెలుగు చూడక ముందే మొదలైంది.

మహమ్మద్ ఆలీ జిన్నా, వాయువ్య ప్రాంతంలోని ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాలను మాత్రమే తమ స్వంత ప్రాంతాలుగా పేర్కొన్నారు. బెంగాల్ గురించి ఏ రకమైన వివరణ ఇవ్వలేకపోయారు. నిజానికి ఇస్లాం భారతదేశానికి దక్షిణం వైపు నుండి వచ్చింది. కేరళలో మొదటిసారిగా ప్రవేశించినట్టు అనేక ఆధారాలు ఉన్నాయి. అయితే, రాజకీయ లక్ష్యాలను చేరుకోడానికి చరిత్రను వక్రీకరించడం ఇదే మొదటిసారి కాదు. చరిత్రను మతాల ప్రాతిపదికన జేమ్స్ మిల్ విభజించడాన్ని ప్రసిద్ధ చరిత్రకారిణి రొమిల్లా థాపర్ వ్యతిరేకించారు. 'క్రీస్తు పూర్వం 1000వ సంవత్సరం నుండి క్రీ॥శ॥ 1200 వరకు హిందూ రాజుల కాలం అనవచ్చు. ఎందుకంటే ఆ కాలంలో హిందూ రాజులు పాలించారు. అయితే, రాజుల వంశ క్రమాన్ని పరిశీలిస్తే, ఈ కాలంలోని రాజులలో ఎక్కువ మంది పూర్తిగా హిందూ మతస్థులు కాదు. మౌర్యులు, ఇండో గ్రీక్స్, శకులు, కుషాణులు ఉన్నారు. వీరిలో అనేకులు బౌద్ధులు; వారు హిందూ మతానికి పూర్తిగా వ్యతిరేకం. వారు తమని తాము బౌద్ధులుగానే చెప్పుకున్నారు. అంటే క్రీ॥పూ॥ 500 నుండి క్రీ॥శ॥ 300 వరకు మరో విభాగం ఉండాలికదా!

'ముస్లింలు దండెత్తారు' అనే దానికి కూడా ఇదే వర్తిస్తుంది. ఈ రోజు మనం దండెత్తారు అని చెబుతున్న ముస్లింలలో అరబ్బులు, తుర్కులు, పెర్షియన్లు కలిసి ఉన్నారు. వీరిని మతాల వారికన్నా ప్రాంతాల వారీగా చెప్పుకోవాలి. 13వ శతాబ్దం వరకు వీరినందరినీ కలిపి ముస్లింలని అనలేదు. అవి కేవలం రాజకీయంగా రాజ్యాల మీద దండెత్తడంగా చూడబడ్డాయి. ఋగ్వేద కాలంలో వీరందరిని మ్లేచ్ఛులు అని కూడా అనేవారు. దీనర్థం అనార్య భాష మాట్లాడేవారని; అంటే ఆర్య సంస్కృతి అంటే తెలియని వారని. అలాగే తుర్కులను తురుష్కులుగాను, అరబ్బులను యవనులుగాను పిలిచేవారు. సంప్రదాయంగా యవనులంటే ఆసియా, మధ్యధర సముద్ర ప్రాంతాల నుండి వచ్చినవారని అర్థం. వారు గ్రీక్, రోమన్ లేదా అరబ్బులు

– ఎవరైనా కావచ్చు.

'ముస్లిం పాలన' అన్నమాట కూడా భారతదేశంలో ఈ కాలంలో లేదు. ఆలయాలను ధ్వంసం చేసినవాడుగా చెప్పుకునే గజినీని గాని, హర్షుడిని గాని 'ముస్లిం'గా పిలవ లేదు. కాశ్మీర్‌ని 11 శతాబ్దంలో పాలించిన హర్షుడికి ఆలయాలను విధ్వంసం చేయడానికి ఒక ప్రత్యేక విభాగమే ఉండేది. దాని అధికారి పేరు, దేవోత్పరనాయకుడు. అతని పని ఆలయాలను దోచుకోవడం' అని రాజతరంగిణిలో కల్హణుడు రాసాడు.

రొమిల్లా థాపర్ 4వ కప్పన్ సంస్మరణోపన్యాసంలో ఇలా రాశారు: 'భారతదేశ గతాన్ని ఎవరైనా సునిసితంగా పరిశీలిస్తే ఇదో లౌకిక సమాజ ఆవిర్భావానికి అనుకూలమైన దేశంగా గుర్తిస్తారు. కొన్ని శతాబ్దాలకు పూర్వం హిందువులు ముస్లింలు అనే విభజన లేకుండా ఏక ఖండంగా ఉండేది. వాస్తవానికి వెయ్యేళ్ళు బౌద్ధమతమే భారతదేశ మతాలలో ప్రధానమైన మతంగా ఉండేది. బౌద్ధులపై అతి క్రూరంగా దాడి జరిగింది.'

15వ శతాబ్దం వరకు 'హిందూ' అనే పదాన్ని ఈ రోజు వాడుతున్న అర్థంలో వాడలేదు. అంతకు ముందు మతం కన్నా, కులాన్ని, తెగను ప్రధానంగా వాడేవారు. భారతదేశానికి వచ్చిన వారందరిని ముస్లింలుగా భారతీయులు గుర్తించలేదు. ఇతరత్రా గుర్తింపులు ఉండేవి. ఉదాహరణకి, సింధుని అరబ్బులు జయించిన తరువాత కూడా, వారికి వర్తకులుగా గుర్తింపు ఉండేది. వాస్తవానికి తుర్కులు, అరబ్బులు తమని తాము ముస్లింల దాడులలో భాగంగా భావించేవారు కాదు. టర్కీ–పర్షియన్ చరిత్రకారులు, భారత దేశంలో ఢిల్లీ సుల్తానేట్ పాలనను మహమ్మద్ గజని విజయాలుగా ప్రస్తావించారు. అంతకు ముందటి అరబ్బుల పరిచయాలు, దండెత్తడాలు కొంతమేరకు గజనికి ఉపయోగపడ్డా, అరబ్బుల పాత్రను వారు విస్మరిస్తారు.

ఆలయాలపై దాడులు మతాధిపత్యం కోసం జరగలేదు. సంపద కోసం జరిగాయి. సావర్కర్ రాసిన హిందుత్వను ప్రచురించిన ఎస్‌ఎస్ సావర్కర్, ముందు మాటలో ఇలా రాశారు: 'సావర్కర్ కొన్ని కొత్త పదాలను సృష్టించవలసి వచ్చింది – హిందుత్వ, హిందూతనం, హిందూ రాజ్యం వగైరా. ఇవన్నీ మతంతోపాటుగా సంస్కృతి, చరిత్ర మొదలైన జాతి అంశాలన్నిటిని కలిపి చెప్పేందుకు సృష్టించడం జరిగింది. ఇది హిందూ మతాన్నో, హిందూ ధర్మాన్నో సూచించడానికి ఉపయోగించింది కాదు. ఇది హిందూ రాష్ట్ర, హిందూ ప్రజలు అనే జాతి అవగాహన, దృక్పథం కోసం వాడినవి. ఇది మతానికి సంబంధించినది కాదు; రాజకీయాలకు సంబంధించినది.'

మతం, మతం విలువలు ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకుల ఊహకు కూడా

అందని విషయాలు. లక్షలాది ప్రజలు ఆరాధించే రాముడిని కూడా రాజకీయాలకు ఉపయోగించుకున్న వారు వీరు. 1989 జూన్ 11న పాలమూర్‌లో మసీదుపై తీర్మానాన్ని ఆమోదింపచేసుకున్న తరువాత అద్వానీ, 'రాముడిని ఉపయోగించుకోకుండా ఉండి ఉంటే నేను ఢిల్లీ నుండి గెలిచేవాడిని కాదు' అన్నారు. పదవి కోసం ఇంత రక్తపాతాన్ని సృష్టించినా కూడా వాజ్‌పాయ్ తరువాత 1995లో ఆయన ప్రధాని కాలేకపోయారు.

ఆర్‌ఎస్‌ఎస్ పత్రాలలో ఎక్కడా రాజీ పడడాలు ఉండవు. ముస్లింలు బేషరతుగా లొంగి ఉండాలన్నదే వారి వాదన. నలభై ఏళ్ల క్రితం జనతా పార్టీ ప్రభుత్వం మైనారిటీ కమిషన్‌ని ఏర్పరచినా, ఆర్‌ఎస్‌ఎస్ గాని, జనసంఘ్ గాని, బిజెపి గాని, మైనారిటీ కమిషన్ ఉండాలనే విషయాన్నే ఒప్పుకోడానికి ఇష్టపడడం లేదు. ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులను మైనారిటీలుగా అంగీకరించడానికి తిరస్కరిస్తున్నది. నిజానికి మెజారిటీ మతస్థుల నుండి మైనారిటీలైన ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతరుల హక్కులు రక్షించడానికి భారత రాజ్యాంగంలో 29, 30 అధికరణాలు చేయబడ్డాయి.

అనేక విషయాలలో లాగే ఆర్‌ఎస్‌ఎస్, ఆధునిక కాలానికి వ్యతిరేకంగా, ఆధునికతకు వ్యతిరేకంగా, చెప్పాలంటే భారత దేశ చరిత్రకి వ్యతిరేకంగా ఉంది.

అంతర్జాతీయంగా 1919 జూన్ 28న, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత మిత్ర పక్ష శక్తులకు పోలాండ్‌కి మధ్య మైనారిటీలను రక్షించేందుకు ఒక సంధి కుదిరింది. 1992 డిసెంబర్ 18న యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ 47/135 తీర్మానాన్ని ఆమోదించింది; అందులో జాతి, తెగ, భాష, మత విషయాలలో హక్కులను కాపాడడానికి అవసరమైన అనుబంధాన్ని చేర్చడం జరిగింది.

ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలకి వీటితో పనేం లేదు. సంఘ్ పరివారం తాననుకున్నది సాధించడానికి మంద బలం చాలనుకుంటున్నది. రాజకీయంగా మైనారిటీలను తక్కువ చేయడం, రాజ్యాంగంగా సంక్రమించిన హక్కులను కాలరాయడం, ముస్లింలను అలక్ష్యం చేసి, పార్టీ టిక్కెట్లు ఇవ్వకపోవడం ద్వారా వారికి ఎక్కడా ప్రాతినిధ్యం లేకుండా చేయాలనుకుంటున్నది. సుప్రీం కోర్టు కూడా అయోధ్య వివాదం విషయంలో మత ప్రాతిపదికన విభజించబడింది. జస్టిస్ వర్మ ఏకపక్షంగా అభిప్రాయాలను వ్యక్తం చేయడం వలన హిందువులు పదేపదే వాటినే ఉటంకిస్తూ వస్తున్నారు.

సుప్రీం కోర్టు కూడా హిందుత్వకి నిజమైన అర్థం, నిర్వచనం లౌకికతలో ఉందని చెప్పినట్టుగా బిజెపి తన 1999 ఎన్నికల మానిఫెస్టోలో అన్యాయంగా చెప్పుకుంది. 2017 జనవరి 2న సుప్రీం కోర్టుకు చెందిన ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం తీర్పునిచ్చే సందర్భంలో... ఎన్నికల ప్రచారంలో హిందుత్వాన్ని ప్రచారం

చేయడం సమర్థనీయమేనా? అనే అంశాన్ని బుద్ధిపూర్వకంగా పక్కకుపెట్టేసి, ఒక సమస్యకు పరిష్కారం చూపేందుకు అంది వచ్చిన అవకాశాన్ని జారవిడిచింది. ఇది దేశానికి జరిగిన పెద్ద అన్యాయం. బాధ్యత నుండి తప్పించుకోవడమే. హిందుత్వ, హిందూయిజం ఒకటి కాదని సావర్కర్ స్వయానా చెప్పారు. కానీ, జస్టిస్ వర్మ, 'సాధారణంగా హిందుత్వ అంటే ఒక జీవన విధానం దానిని హిందూ మతానికి సరిసమానంగా చూడకూడదు, హిందూ మతతత్వంగా అర్థం చేసుకోకూడదు' అని అన్నారు. నిజానికి జస్టిస్ వర్మ మౌలానా వాహిదుద్దిన్ ఖాన్ రాసిన, 'భారత ముస్లింలు – నిశ్చయమైన దృక్పథం ఆవశ్యకత,'లో ఉటంకిపును తప్పుగానే కాదు, పూర్తిగా విరుద్ధంగా కూడా వాడారు. భారతదేశంలో ముస్లింలు భారతదేశ సంస్కృతిని అలవరచుకోవాలి అన్నట్టు చెప్పుకొచ్చారు. వాస్తవానికి మౌలానా హిందూ, ముస్లింలిద్దరూ వారివారి సంస్కృతులను గౌరవించుకుంటూ సహజీవనం చేయాలని రాసారు. ఇది ఆర్ఎస్ఎస్ ప్రతిపాదనలకు పూర్తిగా విరుద్ధం. బిజెపి కేవలం ఇటువంటి సాంస్కృతిక సహజీవనాన్ని కోరుకునే ఇన్నేళ్లు ఇన్ని వ్యయ ప్రయాసలకు ఓర్చిందా? ఇంత ధనాన్ని వెచ్చించిందా?

ఇప్పుడున్న రాజ్యాంగ వ్యవస్థలో భారతదేశ రాజ్యాంగాన్ని ఒక హిందూ దేశ రాజ్యాంగంగా సవరించడం కుదరదని మోడీకి తెలుసు. అందుకనే ఏ రకమైన సవరణలు లేకుండానే ఒక హిందూ దేశంగా 2014 నుండి పరిపాలన సాగిస్తున్నారు.

అంబేద్కర్ ఎంతో విజ్ఞుడు, ముందు చూపున్నవాడు. అందుకనే 1948 నవంబర్ 4న ముసాయిదా రాజ్యాంగాన్ని ప్రవేశ పెడుతున్న సందర్భంలో రాజ్యాంగ శాసన సభను ఇలా హెచ్చరించాడు: 'రాజ్యాంగం ప్రజాతంత్రయుతంగా పనిచేయాలంటే రాజ్యాంగ నైతికత అందరిలోనూ ఇమిడి ఉండాలన్న విషయం అందరు గుర్తించినదే. ఇందులో సాధారణంగా గుర్తించని రెండు విషయాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి, పరిపాలనా రూపానికి, రాజ్యాంగ స్వరూపానికి ఉన్న దగ్గరి సంబంధం. పరిపాలనా విధానం, రాజ్యాంగ స్వరూపం ఒకే అవగాహనతో ఉండాలి. రెండోది, రాజ్యాంగాన్ని పూర్తిగా విరుద్ధంగా కూడా సమర్థవంతంగా అన్వయించవచ్చు. ఏమాత్రం దాని స్వరూపాన్ని మార్చకుండా కేవలం పరిపాలన వ్యవస్థను మార్చి రాజ్యాంగంతో సంబంధంలేని, వ్యతిరేకమైన పాలన చేయవచ్చు.

రాజ్యాంగ నైతికతను ప్రజలు పూర్తిగా ఒంట బట్టించుకున్నప్పుడే, చరిత్ర కారుడు గ్రోటే అన్నట్టు, 'రాజ్యాంగంలో పాలనా వ్యవస్థకు సంబంధించిన వివరాలు శాసన సభ నిర్ణయాలకు వదిలేయగలం. అయితే ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే, రాజ్యాంగ నైతికత ప్రజలలో పూర్తిగా జీర్ణమైందా? రాజ్యాంగ నైతికత ప్రకృతి సిద్ధంగా ఏర్పడే

భావన కాదు. దానిని ప్రజల్లో కల్పించాలి. మనదేశ ప్రజలు ఇంకా ఇటువంటి భావనను పెంపొందించుకోవలసి ఉంది. భారతదేశంలో ప్రజాస్వామ్యం పైనుండి ఏర్పాటు చేసినదే. కానీ, అంతర్గతంగా ఈ భూమిలో పుట్టింది కాదు. ఇక్కడున్నది అప్రజాస్వామ్య వ్యవస్థ. అందువలన ఇక్కడ ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రజలు ఒంటపట్టించుకోవాలి.

భారతదేశ రాజకీయాల్లో మతాన్ని జొప్పించడమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం. తన అంతిమ రాజకీయ గమ్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ మతాన్ని వాడుకోవాలని నిశ్చయించుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ విధేయుడిగా మోడీ ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాన్ని చేరేందుకు అనుగుణంగా తన కర్తవ్యాన్ని రూపొందించుకున్నారు. దాని అమలుకు పూనుకున్నారు. అందుకు స్పష్టమైన వ్యూహ రచనను చేసుకున్నారు.

మోడీ వ్యూహం స్పష్టం. అన్ని సంస్థలను హిందుత్వ మనుషులతో నింపేయడం. యోగి ఆదిత్యనాథ్ వంటి వారిని ముఖ్యమంత్రులుగా చేయడం. క్యాబినెట్ నడ్డి విరిచేయడం, పరిపాలనా వ్యవస్థని తన అధీనంలోకి తెచ్చుకోవడం, న్యాయ వ్యవస్థను ప్రభావితం చేయడం.

మోడీ ఒక్క మొఘలులతోనే పోరాడడం లేదు. భారతదేశ గతమంతటితోనూ పోరాడుతున్నారు. భారత దేశాన్ని నిర్మించిన ముగ్గురు మహా నాయకులను – బౌద్ధుడైన అశోకుని, ముస్లిం చక్రవర్తి అక్బర్‌ని, సంస్కారి, జ్ఞాని అయిన హిందువు నెహ్రూని – హీనంగా చూస్తున్నారు. వందల సంవత్సరాలుగా భారతదేశంలో కీర్తించబడిన విలువలకు తిలోదకాలిచ్చి, వాటి స్థానంలోభారతదేశంలోనూ విదేశాలలో అత్యధికులు వ్యతిరేకించే, తృణీకరించే, తన సంకుచిత, విచ్ఛిన్న సిద్ధాంతాన్ని దేశంలోనూ, దేశానికి వెలుపల కూడా నిలుపుతున్నది ఆర్‌ఎస్‌ఎస్. ఇది భారతీయులకు ఎటువంటి దేశాన్ని ఇస్తానని వాగ్దానం చేస్తున్నది?

ఒక గొప్ప భారతదేశాన్ని అందించగల శక్తి సామర్థ్యాలుగాని, విజ్ఞానం గాని ఆర్‌ఎస్‌ఎస్‌కి లేవు. 1963 లోనే డోనాల్డ్ యూజీన్ స్మిత్ తాను రాసిన 'లౌకిక రాజ్యంగా భారతదేశంలో' అనే పుస్తకంలో హిందూ మతతత్వం భారత దేశ ఫాసిజం రూపం అని పేర్కొన్నాడు. ఆర్‌ఎస్‌ఎస్‌కి ఫాసిజానికి పోలికలు ఇట్టె కనిపెట్టవచ్చు. నాయకుని సిద్ధాంతం, సైనికీకరణకి ప్రాధాన్యతనివ్వడం, జాతి–సంస్కృతుల ఆధిపత్య సిద్ధాంతం, మతతత్వ సిద్ధాంతం గల తీవ్ర జాతీయవాదం, గతకాల గొప్పదనాన్ని సూచించే గుర్తులకు ప్రాధాన్యం, జాతి సంఘీభావ ప్రాధాన్యత, మత, ప్రాంతీయ మైనారిటీలను దేశంలో భాగంగా పరిగణించకపోవడం... ఆర్‌ఎస్‌ఎస్‌లో ఉండే ఈ లక్షణాలన్నీ ఫాసిస్టు ఉద్యమాల్లో ఉండేవే. యూరోప్‌లోని ఫాసిజంలో రాజ్యాన్ని ఆరాధించడం ప్రధాన లక్షణం. ఇందులో వ్యక్తి తన ఉనికిని కోల్పోతాడు. రాజ్యారాధనే

అదే అతని జీవిత పరమావధి అవుతుంది. ఆర్ఎస్ఎస్ లక్ష్యం హిందూ సమాజ స్థాపన.

1948 నవంబర్ 2న గోల్వాల్కర్ ప్రకటనను గమనించండి:

'మనం హిందువులం. ఒక హిందువుకి రాజ్యమంటేనే లౌకిక తత్త్వం గలది. రాజ్యం దైవదత్తం కాదనే హిందువుల జీవన విధానానికి భిన్నమైన విధానం మొదటిసారిగా అశోకుని రాజ్యంలో అమలైంది.' చదువు లేని చదువంటే తెలియని ఆర్ఎస్ఎస్ సభ్యులు ఏమైనా చదువుతారా అని ఆశ్చర్యం కలుగుతుంది. మొదటి నుండి హిందూ ముస్లిం పండితులు ఒకర్నొకరు అర్థం చేసుకునే ప్రయత్నాలు చేసేవారు. పండిట్ సుందల్ లాల్ రాసిన గీత, ఖురాన్ పుస్తకాన్ని సయ్యద్ అసదుల్లా ఆంగ్లంలోకి అనువదించారు. అలాగే మహ్మద్ ప్రవక్త మానవాళిని స్వామి రంగనాథానంద ఎంతగా ప్రేమించారో 1995 ఫిబ్రవరి 28న, ది ఆసియన్ ఏజ్‌లో వివరించారు.

'హిందూ ముస్లింలు కలిసి సహజీవనం చేస్తూ 1100 ఏళ్లైంది. ఇప్పుడు భారతదేశం మీద హిందువులకు ఎంత హక్కుందో ముస్లింలకు అంతే హక్కు ఉంది' అని అబ్దుల్ కలాం ఆజాద్ ఒకసారి అన్నారు. 'భారతదేశంలో నివసించే హిందువులు ఎంత గర్వంగా తాము హిందువులమని చెప్పుకుంటారో ముస్లింలు కూడా అంతే గర్వంగా తాము ముస్లింలమని చెప్పుకోవచ్చు. ఇంకా చెప్పాలంటే ఇక్కడున్న క్రిస్టియన్లు కూడా అంతే గర్వంగా తాము క్రిస్టియన్లమని చెప్పుకోవచ్చు. పదకొండు వందల ఏళ్ళు కలిసిమెలిసి జీవించిన చరిత్ర, సమూహంగా మనం కలిసి సాధించిన విజయాలు భారత దేశాన్ని సుసంపన్నం చేసాయి. మన భాష, కవిత్వం, సాహిత్యం, సంస్కృతి, కళలు, ఆహార్యం, అలవాట్లు, సంప్రదాయాలు, రోజువారీ జరుగుతున్న అనేక సంఘటనలపై ఈ కలయిక ముద్ర ఉంటుంది. ఈ ముద్ర పడని జీవన పార్శ్వము లేదంటే ఆశ్చర్య పోనక్కరలేదు. మన భాషలు వేరు కావచ్చు. కానీ, మనం, మనంలో మనం మాట్లాడుకుంటూ ఒక సాధారణ భాషను రూపొందించుకున్నాం. మన సంప్రదాయాలు, అలవాట్లు వేరుగా ఉండి ఉండవచ్చు. కానీ, ఇన్నేళ్ల కలయికలో అవి కొత్త రూపాలను సంతరించుకున్నాయి. అలాగే మన ఆహార్యం కూడా. పురాతన కాలంలో వేసుకునే డ్రెస్ ఈనాడు వేసుకోంకదా! కొత్త పద్ధతులు నేర్చుకున్నాం. వీటిని వదిలి పెట్టి తిరిగి సనాతనత్వం వైపుకుపోం కదా!' అని అన్నారు.

నిజానికి హిందీ భాషలో చాలా సంస్కృత పదాలు ఇమడవు. సూరదాస్, తులసీదాస్ పద్యాలే ఇందుకు ఉదాహరణ. అదే ఉర్దూలో సులువుగా ఇమిడిపోతాయి.

హిందూ ఆలోచనలు, అలవాట్లు, సెంటిమెంట్లు ఉర్దూ సాహిత్యంలో సులువుగా వ్యక్తపరచగలం. ఇది ఇప్పటికే కొంత వరకు జరిగింది. కానీ, ఇప్పుడు పరిస్థితులలో మార్పు వచ్చింది. పశ్చిమ దేశాల ప్రభావం హిందూ సమాజం పై అమితంగా పడింది. క్రిషన్ చందర్, క్వాజా అహ్మద్ అబ్బాస్, ఇస్మత్ ఛుఘాట్ లాల్, రాజిందర్ సింగ్ బేడీ, కుఅత్ ఉల్ హైదర్ వంటి అనేక హిందూ ముస్లిం కవులు, హిందూ జీవన విధానాన్ని, హిందూ ముస్లిం సాంస్కృతిక జీవనాన్ని ప్రతిబింబిస్తూ సాహిత్యాన్ని పరిపుష్టం చేసారు. ఆధునిక కాలంలో పశ్చిమ దేశాల సంస్కృతి ప్రభావం వీరిపై ఎలా ఉందో ఈ సాహిత్యంలో తెలుస్తుంది. సాహిత్యాన్ని 'విదేశీ' సాహిత్యం అనలేం.

ఆధునిక భారతదేశ ప్రియపుత్రుడు గాలిబ్, పైపైకి ఎగబాకుతున్న ఈ భారతదేశాన్ని దర్శించారు. ఇది కేవలం హిందువులది కాదు; ముస్లింలది కాదు. వీరిద్దరి ఉమ్మడి విజయం. హకీమ్ అజ్మల్ ఖాన్, శిబిలి, మౌలానా అహ్మద్ మెదని, మౌలానా అబ్దుల్ ఆజాద్, మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ ఈ ఆధునిక భారత దేశానికి ప్రతినిధులు.

ముస్లింలు గనక కేవలం ముస్లిం శైలికి, ఉర్దూకి పరిమితమైతే వారు హిందూ జీవన విధానంలోని ఎన్నో పార్శ్వాలకు దూరమైనట్టే. ఉర్దూకి ఏమాత్రం హాని కలిగించకుండా ప్రేమ్ చంద్, దుర్గ సాయి సరూర్, నేను, ఉర్దూలో అంతర్గతంగా మార్పులు చేసాం; ఇది కేవలం అనుకరణలు చేసే ముస్లింలకు గాని, హిందువులకు గాని సాధ్యపడే విషయం కాదు. ఇది కేవలం ఉర్దూ పట్ల ఎంతో అభిమానం ఉన్నవారికే సాధ్యం. ఎంతోమంది కథలు రాసే ముస్లిం రచయితలు ప్రేమ్ చంద్‌ని అనుసరించిన వారు, పాకిస్తాన్ ఉర్దూ రచయితలలో ఈనాడు కూడా ఉన్నారు. భారతదేశంలో కూడా హిందూ రచయితలు ఉర్దూ రచయితలను అనుసరించేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, అధికారంలో ఉన్నవారు ప్రేమ్ చంద్ రచనలను ప్రోత్సహించనట్టు ఉర్దూ సాహిత్యాన్ని ప్రోత్సహించకపోవడం దురదృష్టం.

ఇటువంటి భారతదేశాన్ని ఆర్ఎస్ఎస్ ధ్వంసం చేయాలనుకుంటున్నది. ఫిరాఖ్ ముందుగానే దీనిని పసిగట్టారు. 'ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభలు వ్యాపింపచేస్తున్న విషప్రచారం నుండి మన ప్రజలను రక్షించుకోవాలి. భారతదేశంలోని ముస్లింలకు మనం ఒక వ్యక్తిత్వాన్ని, రూపాన్ని ఇవ్వాలి. ఇది ఇక్బాల్, జిన్నా, మతతత్వ ముస్లిం లీగ్, మరికొన్ని ముస్లిం దేశాలకంటే భిన్నమైనదిగా ఉండాలి. 40 కోట్ల హిందువులను సంకుచిత ప్రాచీన హిందుస్థాన్ బంధనాల నుండి రక్షించాలి' అన్నారు.

సంఘ్ పరివార్‌కి జాతీయ జెండా కన్నా తన కాషాయ జెండా అంటేనే ప్రీతి. అది భారత రాజ్యాంగాన్నే నిరాకరిస్తుంది. రాజ్యాంగాన్ని ఖండిస్తూ ఆర్ఎస్ఎస్ ఒక

శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. 1993 జనవరి 1వ తేదీన విడుదల చేసిన ఈ శ్వేత పత్రం, హిందూ వ్యతిరేకి ఎవరని, రెండు ప్రశ్నలు వేసింది. ఒకటి, హిందువుల సోదర భావాన్ని, ఐక్యతను, జాతుల మధ్య సౌహార్ధ్రతను చెడగొట్టింది ఎవరు? రెండోది, ఆకలి పెరగడానికి, నిరుద్యోగం పెరగడానికి, అవినీతి పెరగడానికి అనాచారాలు పెరగడానికి కారణం ఎవరు? ఆ పత్రంలో ఉన్న సమాధానం – 'ఈనాటి భారత రాజ్యాంగం'. 'ఇక్కడ వాడిన హిందూ అనే పదం ఒక ప్రయోజనంతో వాడబడింది. ఇక్కడ హిందూ అంటే భారత్ కాదు. హిందువులు. ప్రస్తుతం ఉన్న రాజ్యాంగాన్ని సమూలంగా నాశనం చేయడానికే ప్రాధాన్యత ఇవ్వాలన్నదే వారి వాదన. 'ప్రపంచ వ్యాప్తంగా మనం హిందువులుగా గుర్తించబడ్డాం. స్వాతంత్ర్యోద్యమంలో మనం హిందువులుగానే పోరాటం చేసాం. వందేమాతరం గీతాన్నే ఆలపించాం. కానీ, స్వతంత్రం వచ్చిన తరువాత వందేమాతరం ఎగిరిపోయి దాని స్థానంలో ఐదో జార్జిని ఆహ్వానించేందుకు రాసిన జనగణమన వచ్చి చేరింది. అదే జాతీయగీతం అయింది.'

ఈ ఆలోచనలు ఎక్కడి నుండో ఊడిపడ్డవి కావు. పథకం ప్రకారమే జరిగినవి. 1992లో డిసెంబర్ 25న బాబ్రీ మసీదు ధ్వంసమైన తరువాత స్వామి ముక్తానంద్ ఢిల్లీలో, బిజెపి పార్లమెంటు సభ్యుని ఇంట్లో, స్వామి వందేవ్ మహారాజ్‌తో కలిసి ఒక ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో, ఈ రాజ్యాంగం హిందూ వ్యతిరేకమైనదని, అందువలన మేమీ రాజ్యాంగాన్ని తిరస్కరిస్తున్నాం; మాకు ఈ చట్టాలలో నమ్మకం లేదు; ఇక్కడి చట్టాలకన్నా సాధువులు ఉన్నతులు అని పేర్కొన్నారు. 'భారతదేశ చట్టాల ప్రకారం ఈ గడ్డపై పుట్టిన వారందరు భారతీయులు అన్నది ఒట్టి బూటకం' అని అన్నారు. దీనికి ఆర్ఎస్ఎస్ వెంటనే స్పందించింది. 1993లో ఆర్ఎస్ఎస్ అధినేత రాజేందర్ సింగ్ ఈ విధంగా చెప్పారు: 'ఇప్పుడున్న సంఘర్షణలకు మూలకారణం వ్యవస్థలో భారతదేశ నిజమైన సంప్రదాయాలకు, విలువలకు, పద్ధతులకు చోటులేకపోవడమే. ఈ దేశ ప్రత్యేకతలు రాజ్యాంగంలో ప్రతిఫలించడం లేదు. 'ఇండియా స్థానంలో భారత' ఉండాలి. మనం భారత్ అంటే హిందుస్థాన్ అని పేర్కొని ఉండవలసింది. అధికారిక పత్రాలలో 'సమ్మిళిత సంస్కృతి అని ఉంది. కానీ, ఉండాల్సింది సమ్మిళిత సంస్కృతి అని కాదు. సంస్కృతి అంటే వస్త్రధారణ, భాష కాదు. అది మౌలికమైనది. ఈ దేశానికీ అసమానమైన ఏకశిలా సదృశ్య సంస్కృతి ఉన్నది. ఏ దేశమూ అరలుగా విభజించబడి ఎక్కువ కాలం మనలేదు. అంటే ఈ రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరం ఉందన్నమాట. రాజ్యాంగం దేశ జాతి లక్షణాలకు, ప్రతిభకు అనుకూలంగా ఉండేటట్టు భవిష్యత్తులో అయినా చూసుకోవాలి'.

1993 జనవరి 23న అనంతపురంలో బిజెపి అధ్యక్షుడు, ఎంఎం జోషి

మాట్లాడుతూ రాజ్యాంగాన్ని పునర్లిఖించుకోవలసిన అవసరం ఉందని అన్నారు. పరివార్ తనదైన పద్ధతిలో ముందుగా దొడ్డిదారిలో ప్రవేశిస్తుంది. ఆ తరువాత సందిగ్ధకర సూత్రీకరణలు చేస్తుంది. ఆ తరువాత బహిరంగంగా నిశ్చితాభిప్రాయంగా నొక్కి చెపుతుంది. చివరిగా వేటు వేస్తుంది.

ఆర్ఎస్ఎస్‌ని నిలవరించకుండా ఉంటే ఆ నష్టం ఒక్క ముస్లింలకే కాదు, క్రిస్టియన్లకు, సిక్కులకు కూడా వాటిల్లుతుంది. వాజ్‌పాయ్ ప్రభుత్వ కాలంలో మొదలైన ఈ విధానాలు మోడీ కాలంలో పెరిగి తొండ ముదిరి ఉసరవెల్లి అయినట్టు తయారయ్యాయి. సంఘ్ ముస్లింల వ్యతిరేకని అందరికి తెలిసిన విషయమే; కానీ, క్రిస్టియన్లపై అది చేసిన దాడులు అందరిని ఆశ్చర్యపరిచాయి. విశ్వహిందూ పరిషద్ కార్యదర్శి, గిరిరాజ్ కిషోర్ చండీఘర్‌లో మాట్లాడుతూ, 'ఈ రోజు ముస్లిం వేర్పాటు వాదులందరి కంటే క్రిస్టియన్ల వలన ఎక్కువ ఆపద పొంచివుంది.' అన్నారు. శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు జిఎస్ తోహ్రాను ఉద్దేశించి, ఈ 'వేర్పాటు వాదులు,' మైనారిటీలందరు, ముస్లింలు, క్రిస్టియన్లు, సిక్కులు తమ పూర్వీకులు 'హిందువులని ఒప్పుకోవాలి, వారందరూ తిరిగి తమ సొంత గూటికి చేరాలి' అన్నారు.

గోల్వాల్కర్ రచించిన 'పాంచజన్యం' హిందుత్వ సిద్ధాంతాన్ని బలపరిచింది. బిజెపి ఆ భయంకరమైన ఆయుధాన్ని ఉపయోగిస్తుంది. పాంచజన్యంలోని 11వ అధ్యాయంలో గోల్వాల్కర్, 'ముస్లింలు, క్రిస్టియన్లు, కమ్యూనిస్టులు అంతర్గత అపాయకారులుగా వర్ణించారు.' వారి నమ్మకాలు మారగానే, దేశంపట్ల వారికున్న ప్రేమ, విధేయత పోతాయి. అక్కడితో ఆగదు. దేశ శత్రువులను తమవారిగా చూసుకుంటారు. విదేశాల్లో తమ పవిత్ర స్థలాలను చూసుకుంటారు. వారందరు తిరిగి హిందువులుగా మారాలని కోరారు. తల్లిగర్భంలో ఉండగానే హిందువులు, హిందువులుగా ఉంటారు. పుట్టడమే హిందువులుగా పుడతారు. అందువలన వారికి ప్రత్యేకంగా మతం ఇప్పించవలసిన అవసరం ఉండదు. ఇతర మతాలలో మనుషులుగా పుడతారు. వారు మతాలు తీసుకోవలసిన అవసరం ఉంటుంది అన్నారు.

రామస్వరూప్, రాసిన 'హిందూయిజంకీ, క్రిస్టియానిటీ ఇస్లాంలకూ మధ్య అంతరాలు' అనే పుస్తకంలో స్థానికుల గురించి ఇలా రాసారు: "రెండు సిద్ధాంతాలు దేశాలలో ఉన్న అన్య మతస్థులను, సంస్కృతిని, మతాన్ని క్రియాశీలంగా మట్టుపెట్టాయి. ఓల్డ్ టెస్టమెంట్ అనే ఒక అనాగరిక రాగి యుగం నాటి గ్రంథం మూడు మతాలను – జుడాయిజం, క్రిస్టియానిటి, ఇస్లాంలను సృష్టించింది." రామస్వరూప్‌గారు ఈ మూడు మతాలను అత్యంత పీడనకు గురిచేసేవిగా దూషించారు. కానీ, హిందూ మతానికి వచ్చేసరికి ఎలా సమర్ధించుకున్నారో చూడండి. 'భారతదేశానికి 1947లో

స్వతంత్రం వచ్చింది. కానీ, దానిని పాలిస్తున్నది హిందూ మత వ్యతిరేకులు. అందువలన అది ఇంకా బానిసత్వంలోనే ఉంది. సాంస్కృతికంగా మేధోపరంగా స్వతంత్రం పొందవలసి ఉంది. స్వతంత్ర పోరాటంలో రెండో అంకానికి చేరుకుంది. ఇదే దాని హిందూ గుర్తింపు కోసం జరిగే పోరాటం. ఈ కొత్త పోరాటం ఇదివరకటి పోరాటం కంటే కఠినమైనది; ఎందుకంటే హిందువులంతా ఐకమత్యంగా లేరు. నైతికంగా సైద్ధాంతికంగా నిరాయుధులుగా ఉన్నారు. వారికి సరైన నాయకత్వం లేదు. హిందూ మేధావులు వారి ఆధ్యాత్మిక వారసత్వం, చరిత్ర పట్ల గుడ్డిగా ఉన్నారు; వారి మతం పట్ల విముఖతతో, శత్రుత్వంతో ఉన్నారు. ... భారతదేశ ఉన్నత విద్య, అధ్యయనాలు, ప్రచార సాధనాలు హిందూ విరోధ విద్యావంతుల అధీనంలో ఉన్నాయి.' కులాల గురించి రామస్వరూప్ ఏమన్నారో చూద్దాం. 'హిందూయిజం బలంగా ఉన్నప్పుడు కుల వ్యవస్థ సహజమైన ఆరోగ్యకరమైన వైవిధ్యంగా ఉండేది. కానీ, ఇప్పుడున్న పరిస్థితుల్లో దానిని స్వప్రయోజనాలకు వాడుకుంటున్నారు. పాతకాలపు అవకాశవాదులు కొత్తవారితో చేతులు కలిపారు; ఇద్దరూ కలిసి, కులాన్ని ఉపయోగించుకుని హిందువులను పెద్ద ఎత్తున అణచి ఉంచుతున్నారు. అలాగే హిందూ – సిక్కుల బాంధవ్యాలను గురించి కూడా ఆయన చాలా పక్షపాత బుద్ధితో రాసారు. సిక్కుల స్వర్ణ దేవాలయాన్ని చుట్టుముట్టడాన్ని సమర్థించారు; 'అది నేరస్థుల నిలయంగా మారిందన్నారు.' అలాగే ఇందిరా గాంధీ హత్య గావించబడితే, 'అహంకారపూరిత, ఆకలి రాజకీయాలు ఇటువంటి భయానక సంఘటనలకు కారణం' అన్నారు.

ఇటువంటి వాదనలు చేసిన మరో ప్రముఖుడు సీతారాం గోయల్. 1996లో తన 'హిందూ క్రిస్టియన్ ఘర్షణల చరిత్ర'ను పునర్ముద్రిస్తున్న సందర్భంలో రెండో ముద్రణకు ముందు మాట రాస్తూ,' 1984 ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకొనిపోవడంతో సంఘ్ పరివార్ హిందూ రూపాన్ని నవీకరించు కోవాలని నిర్ణయించుకుంది. దాని ఫలితమే రామజన్మ భూమి ఉద్యమం. ముస్లింలను అడ్డుకోవడం ఈ ఉద్యమ ప్రధాన లక్ష్యం. క్రిస్టియన్లను గాని, వారి మిషనరీలను గురించిన ప్రస్తావన ఎక్కడా లేదు. కానీ, క్రిస్టియన్లే ఎక్కువగా భయపడి స్పందించారు. పశ్చిమ దేశాలలోని ప్రచార సాధనాలు దుమ్మెత్తిపోశాయి; హిందువులు మైనారిటీలను ధ్వంసం చేయ పూనుకున్నారన్నాయి; నాజీ యిజం వచ్చిందన్నాయి. ఈ తుఫాను ఇంకా కొనసాగుతూనే ఉంది. ...'

గోయల్ రాసిన మరో పుస్తకం, 'క్రిస్టియానిటి దాడులకు ప్రతీక',లో ఆయన రాజకీయాలను గురించో, మిషనరీల గురించో చరిత్ర గురించో రాయలేదు. ఏకంగా క్రిస్టియన్ మతం మీదే రాసారు. 'ఎందుకంటేనట,' ఇప్పటివరకు ముస్లిం, క్రిస్టియన్ల

ఆచారవ్యవహారాలమీదే మేము శ్రద్ధ పెట్టాం; వాటికి మూలమైన నమ్మకాలను ప్రశ్నించలేదు. మేము క్రిస్టియన్ మిషనరీల గురించి చర్చించాం కానీ, క్రిస్టియానిటీని గాని వారి దైవం జీసస్‌ను గాని తిరస్కరించలేదు; మేము ఇస్లాం తీవ్రవాదాన్ని తిరస్కరించాం. కానీ, ప్రవక్త మహమ్మద్‌ను తిరస్కరించలేదు. హిందువుల ఈ తర్కంలో నాకు ఎటువంటి అర్థం కనిపించడం లేదు.' ఇంకా గోయల్ ఏమన్నారంటే 'జీసస్ క్రైస్ట్ చేసిన నేరాలకన్నా ముస్లిం ప్రవక్త మహమ్మద్ చేసిన నేరాలే కాస్త తక్కువ. జీసస్‌కి హిట్లరుకి అనేక పోలికలు ఉన్నాయి; హిట్లర్‌చే రూపొందించిన నాజీ యిజానికి జీసస్ రూపొందించిన క్రిస్టియన్ మతానికి ఏమిపెద్దగా తేడాలేదు. ఇద్దరు ప్రచారకులూ చెప్పినవి ఒకటే..' పశ్చిమ దేశాలలో నివసించే విద్యావంతులైన హిందువులే కాదు సన్యాసులు, మేధావులు, క్రిస్టియానిటీని అంగీకరిస్తున్నారు. మరీ ముఖ్యంగా గాంధీ క్రీస్తును ఆకాశానికి ఎత్తేస్తారు. క్రీస్తుకి ఏ రకమైన ఆధ్యాత్మిక శక్తి లేదు, నైతిక విలువలు లేవు; కేవలం అది సామ్రాజ్యవాద దాడులను న్యాయసమ్మతం చేయడాని ఏర్పడ్డ కళారూపం. ఈ రూపం దాడి చేసిన వారికి చాలా లాభదాయకంగా ఉంది. అందువలన హిందువులు క్రీస్తు అంటేనే తమ దేశ సంస్కృతి పై చేస్తున్న దాష్టికంగా గుర్తించాలి. పశ్చిమ దేశాలలో ఈనాడు ఆరాధిస్తున్న ఆ దేవుడు ఒకప్పుడు చెత్తకుప్పలో దొరికాడు. ఆ చెత్తకుప్ప నుండి ఏరుకున్న దానిని మనం నెత్తిన పెట్టుకోనవసరం లేదు. అది మన పరిసరాలను మరింత విషమయం చేస్తుంది.

గోయల్ ఉపయోగించిన భాష ఆ ఆలోచనలలో ఉన్న విషపు లోతులను తెలియ చేస్తుంది. దానినే భారతీయులు వ్యతిరేకించేది – రాజకీయ ప్రాపకం, అధికారుల అండదండలు ఉన్న ఒక శక్తివంతమైన సమూహం, కేవలం లౌకిక ఆనవాళ్లు లేకుండా చేయడమే కాక ప్రజాస్వామ్యం, మతసహనం, మత, సాంస్కృతిక వైవిధ్యం కూడా లేకుండా చేస్తున్నది. భారతదేశ మర్యాదనే మంటగలుపుతున్నది.

ఇటువంటి మైనారిటీలకు అభద్రత భావనలు కలిగించే విధానాలే ఈ నాటికీ కొనసాగుతున్నాయి. మెజారిటీ ఆయుధాన్ని అవసరమైనప్పుడల్లా ఉపయోగిస్తున్నారు. హిందూ ఎర రాజకీయంగా లబ్ధి చేకూరుస్తుంది. ఇటువంటి వాతావరణం, ప్రజలలో వైషమ్యాలు పెరగడానికి దారితీస్తున్నది. మన సిక్కు సోదరులు, తాము భిన్నమైన వారమని అనుకుంటారు. ఆ మనస్తత్వ ఒత్తిడిలో అనేక కష్ట నష్టాలు సృష్టించి; ఎంతటి తీవ్రమైన నినాదాలు ఇస్తారంటే సాధారణ పౌరులు సైతం ఆ ఉద్వేగాలలో కొట్టుకుపోవలసిందే. ఎక్కడ ఆగాలో తెలియక ఆ ప్రవాహంలో యువత కొట్టుకుపోతుంటారు. ఆలా ఏర్పడ్డవే సరిహద్దులలో కాంపులు; గొరిల్లా యుద్ధ శిక్షణలు. స్వర్ణ దేవాలయం ఆయుధాగారంగా మారడం; నేరస్తుల అడ్డా కావడం. ఆఖరికి

సైనిక జోక్యం కూడా తప్పలేదు. సాధారణ సిక్కు నాయకులు  కూడా ఆత్మశోధన చేసుకోలేదు.

దీని ఫలితంగానే ఇందిరా గాంధీ హతులయ్యారు. దీనిని కూడా మసకబార్చి రాజకీయవాదులకు పోలీసులకు మధ్య ఘర్షణగా చిత్రీకరించారు... కానీ, అంతటి దారుణమైన హింసకు కారణాన్ని ఇది చెప్పలేదు. ... అసలు కారణం అహంకారపూరిత అకాలీ రాజకీయాల పట్ల ప్రజలలో పెరుగుతున్న వ్యతిరేకత.

భారతదేశానికి విధేయులైన మిత్రులు, సుసానే హాబ్ రుడోల్ఫ్, లీవుడ్ రుడోల్ఫ్, 1993 మార్చ్ 22న ది న్యూ రిపబ్లిక్‌లో ప్రచురించిన 'ఆధునిక ద్వేషం'లో 'ద్వేషం ఆధునికమైనది. తప్పులు జరిగినట్టు చెప్పే ఊహలను బలపరచడానికి, దాడులు చేసినవారిపై ద్వేషాన్ని పెంచడానికి మద్దతుగా చరిత్రను వాడుకుంటున్నారు' అని రాసారు.

హిందుత్వ మీద కేంద్రీకరణ పెరుగుతున్నకొద్దీ దేశ జనాభాలో సగం మంది, కనీస అవసరాలు తీరని దుస్థితిలో ఉన్నారన్న విషయం పక్కకు పోయింది. దళితులకు ఆదివాసీలకు ఈ హక్కులు కల్పించాలన్నది పోయి మతమార్పిడులనే అసంబద్ధ సమస్య ముందుకొచ్చింది. ఎవరు భారతీయుడు ఎవరు విదేశీయుడు నిర్ణయించడానికి వారు ఈ దేశంలో పుట్టిన మతం అనుసరిస్తున్నారా లేక ఈ ఉపఖండంలోని పశ్చిమాసియాలో పుట్టిన మతాన్ని అనుసరిస్తున్నారా అనేదే ప్రధానంగా మారి, హిందూమతాన్ని రక్షిస్తున్నామన్న నెపంతో ముస్లింలపట్ల క్రిస్టియన్లపట్ల కొన్ని సమూహాలు అమానవీయంగా, అనైతికంగా ప్రవర్తిస్తున్నాయి.

సంఘ్ పరివార్ చేయగలిగింది ఇదే. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి, విహెచ్‌పిల తీర్మానాలు చదివితే, వాళ్ళ నాయకుల మాటలు వింటే, వారు ముస్లింలను, క్రిస్టియన్లను, సిక్కులను, బౌద్ధులను చిన్నచూపు చూసే తీరు, తిరస్కరించే తీరు, జాతి నాయకులైన అశోకుడు, అక్బర్, జవహర్‌లా నెహ్రూలను నీచంగా చూసే విధానం, పశ్చిమ దేశ మేధో సంప్రదాయాల పట్ల, అసలు ఏ ఆలోచనాత్మక వైఖరి పట్లనైనా ప్రదర్శించే ఏహ్యభావం విస్మయాన్ని కలిగిస్తుంది. పశ్చిమ దేశాల సంస్కృతి అంతా ఆధునికమైనదని ఇప్పుడెవరూ అనడంలేదు. అసలు పరీక్షించవలసినది వివేకంవంతమైనదా కదా అనే.

విల్‌ఫ్రెడ్ కాంట్వేల్ స్మిత్, 'సాంప్రదాయ సమాజాన్ని ఆధునీకరించడం' అనే ఉపన్యాసంలో, పశ్చిమ దేశాలు ఇతర నాగరికతలను కూడా తమ కొలమానాల కనుగుణంగానే ప్రారంభదశలో అంచనాలు వేయడం మొదలు పెట్టాయి... ఇది తగని పనే. ఉదాహరణకు నా విజ్ఞత, అనుభవంతో పరిశీలిస్తే, ఈ  ఆధునిక యుగంలో,

మేధో హద్దు విస్తృతపడింది. మన నాగరికత విశాలమైంది. అందువలన ఈ ఆధునిక కాలానికి అనుగుణంగా పశ్చిమ దేశ చరిత్ర ఆధునీకరించవలసిన అవసరం ఉన్న విషయాన్ని పురాలోచించవలసిన అవసరం ఉందని కచ్చితంగా నమ్ముతున్నాను. ఇప్పుడు ప్రపంచ చరిత్రను పశ్చిమ దేశాలు తన పరిధిలోకి తెచ్చుకుంటున్నాయి. అందువలన మనదేశంలో కానీ, మారే దేశంలో కానీ మానవుల అనుభవాలను, చరిత్ర, అర్థశాస్త్రం, కళలు, సాహిత్యం, లేదా మతం వంటి భాగాలుగా విజ్ఞానాన్ని, లేదా ప్రయోజనాలను విభజించడం సముచితమేనా అన్నది ఒక పెద్ద సమస్య. అందువలన ఇటువంటి విషయాలు పునరాలోచించే క్రమంలో, పశ్చిమ సంస్కృతిని అర్థం చేసుకున్న, మనతో సంభాషించగల, శక్తివంతులైన మేధావులు, నమ్మకమైనవారు, సృజనాత్మకంగా మనతో తిరిగి సంప్రదించగలవారు – విద్వేషపూరిత చర్చలు కాక, సుహృద్భావంగా చర్చలు చేయగల, పశ్చిమ, పశ్చిమేతర మేధావులు, కొత్త వైవిధ్యభరిత సంస్కృతుల ప్రపంచాన్ని పునర్నిర్మించడానికి, ఈ విభజనలు ఎలావుండాలో పునరాలోచించాలని భావిస్తున్నాను.' అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్, దాని రాజకీయ విభాగం బిజెపి ఇటువంటి సవాలును స్వీకరిస్తుందా? కచ్చితంగా ఒప్పుకోదు. మనం అంతటితో ఆగకూడదు. మన ప్రజలలో ఇటువంటి విషపు శక్తులు పెరగడానికి చరిత్రలో ఏం జరిగిందో తెలుసుకోవాలి. ఆధునికులతో సహా, హిందువులు ఎందుకు వీరికి మద్దతునిస్తున్నారు? వారి అక్కర లేమిటో తెలుసుకోకపోవడం తప్పవుతుంది. ఈ సమస్య మూలాలు తెలుసుకునేందుకు మన విజ్ఞతను ఉపయోగించాలి.

బిజెపి అవసరాలు మనం తెలుసుకోగలం. ఎన్నికల సమయంలో ఆర్‌ఎస్‌ఎస్ తన బలగాలను సమకూరుస్తుంది. దాని సైద్ధాంతిక ప్రవచనాలు కచ్చితమైన ఓదార్పునిస్తాయి. అందువలన ఈనాటి విద్వేషాలకు అసలు కారణాలు అన్వేషించాలి.

స్వతంత్రం రాకమునుపు, వచ్చిన తరువాత దీనిని పసిగట్టినది నెహ్రూ ఒక్కడే. యేజ్డి గుండెవియా, నెహ్రూ దగ్గర విదేశీ కార్యదర్శిగా పనిచేసేవారు. మంచి నిజాయితీ పరుడు. స్వతంత్రుడు. నిర్భయస్తుడు. ప్రతి శుక్రవారం పొద్దున్న 11 గంటలకు నెహ్రూ అండర్ సెక్రెటరీ స్థాయికి పై వారితో సమావేశం నిర్వహించేవారు. అటువంటి సమావేశంలో ఒక రోజు నెహ్రూని ఎవరూ ఏ ప్రశ్న వేయలేదు. అప్పుడు ఆయనే స్వయంగా నెహ్రూని ఒకే ప్రశ్న అడిగారు. 'ఈసారి ఎన్నికలలో కేరళలో కమ్యూనిస్టులు గెలిచారు. రేపు కేంద్రంలో కూడా కమ్యూనిస్టులు గెలుస్తారేమో. అప్పుడెలా?'

అందుకు నెహ్రూ, 'కమ్యూనిస్టులు! కమ్యూనిస్టులు! కమ్యూనిస్టులు! కమ్యూనిస్టుల మీద కమ్యూనిజం మీదే మీకెందుకు దృష్టి ఉంటుంది? కమ్యూనిస్టులు

కేంద్రంలో అధికారంలోకి వస్తారని మీరెందుకు అనుకుంటున్నారు? .... ఈ దేశానికి ప్రమాదం, గుర్తుంచుకోండి, కమ్యూనిజం కాదు. మతతత్వం. హిందూ మతోన్మాదం' అన్నారు.

ఈ సంభాషణ జరిగి 55 సంవత్సరాలైంది. నెహ్రూ ఎంతటి దార్శనికుడు! 55 సంవత్సరాల క్రితమే జరగబోయేది ఊహించగలిగారు.

ఆర్ఎస్ఎస్ పుట్టుకతోనే విషం వెదజల్లడం మొదలైంది. అయితే, ఈ విష ప్రచారకులు జయించలేనంతటి బలవంతులు కాదు. అన్ని స్థాయిలలోను వారిని ఎదిరించే వారు సిద్ధపడితే తప్పనిసరిగా వారిని ఓడించవచ్చు. సైద్ధాంతికంగా కూడా. దురదృష్టవశాత్తు దీనిని ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. యుద్ధభేరి మోగించేవారే, అస్పష్టంగా మోగిస్తే యుద్ధానికి సన్నద్ధం ఎలా జరుగుతుంది?

ఇప్పుడు ప్రమాదంలో పడింది భారతీయులు కన్న కలలే కాదు; భారత ఆత్మ కూడా.

# ఆర్‌ఎస్‌ఎస్ ఎందుకు స్థాపించబడింది?

**భా**రత దేశంలో ఈనాడు ఆర్‌ఎస్‌ఎస్ అత్యంత శక్తివంతమైన సంస్థ అని అనడంలో ఎటువంటి సందేహం లేదు; ఫాసిస్టు నాయకుల ఆదేశాలను ప్రశ్నించకుండా అమలు చేసే విధేయత గల సైన్యం దానికుంది.

ఒకప్పటి ఆ సంస్థ ప్రచారకుడు, నరేంద్రమోడీ నేటి భారతదేశ ప్రధాని. ఆ ముద్ర జాతి జీవనంలోని అణువణువూ కనిపిస్తుంది. 1951లో ఆర్‌ఎస్‌ఎస్ తన రాజకీయ అంగం, భారతీయ జనసంఘ్‌ని స్థాపించింది. 1977లో భారతీయ జనసంఘ్, జనతా పార్టీతో విలీనమైంది. కానీ, ఆ తరువాత 1980లో జనతా పార్టీ నుండి బయటకి వచ్చేసింది. ఆ వచ్చేయడానికి కారణం కూడా తన మాతృ సంస్థ, గురువు అయిన ఆర్‌ఎస్‌ఎస్‌కి తన విధేయతను ప్రకటించుకోడానికే. బయటికి వచ్చిన కొన్ని నెలల వ్యవధిలోనే జనసంఘ్ ఇప్పుడున్న పేరుతో (భారతీయ జనతా పార్టీ) ఆవిర్భవించింది. 1977 నవంబర్ 6న అటల్ బిహారీ వాజ్‌పాయ్ జనతాపార్టీలో కలవగానే "మా గతకాలపు నమ్మకాలను వాస్తవాలను వదిలేశాం. తిరిగి వెనక్కు పోయే ప్రసక్తే లేదు" అన్నారు; అంటే జనసంఘ్‌కి జనతా పార్టీకి మధ్యనున్న సైద్ధాంతిక అంతరాన్ని ఒప్పుకోకనే ఒప్పుకున్నట్టు. అదే పెద్ద మనిషి 1980లో "జనసంఘ్ నుంచి మేము ఎప్పుడు దూరమయ్యాము గనక" అని అన్నారు. మళ్ళీ 1985 జులైలో "మేము ప్రభుత్వం చేత మా కొత్త ఆలోచనలను అమలు చేయించాలనుకున్నాం. కానీ, ప్రభుత్వం అతి తక్కువ కాలంలో కూలిపోయింది. మేమే గనక ఇంకొన్నాళ్ళు అధికారంలో ఉండి ఉంటే ఆ కొత్త ఆలోచనలను భారతదేశ రాజకీయాలలో చొప్పించేవాళ్ళం" అన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ అంటేనే ద్వంద్వ నాల్కల ధోరణి. ఉదాహరణకి ఒకసారి తనదో 'సాంస్కృతిక సంస్థ' అంటుంది. 'రాజకీయాలతో సంబంధం లేదంటుంది'; 'జాతీయ

సంస్థ' అని 'మతతత్వ సంస్థకాదని' అంటుంది; భారతదేశంలో ఉన్నవారందరూ హిందువులే అంటుంది. అదే సమయంలో 'హిందువులు అంటే హిందూమతం అనుసరించేవారు' అంటుంది. జనసంఘ్ 'బిజెపి వ్యవహారాలలో, జోక్యం కలగచేసుకోం అని, వాటిని నియంత్రించం' అని అంటుంది. కానీ, బిజెపి అధ్యక్షుడు లాల్ కృష్ణ అద్వానీని, ఇద్దరు మాజీ జనసంఘ్ అధ్యక్షులను మౌళి చంద్ర శర్మ, బాలరాజ్ మాధోక్ ఇంటికి పంపించడంలో కీలక పాత్ర పోషించారన్నది జగద్విదితం.

కొంతమంది భారతదేశ, పశ్చిమదేశాల రచయితలు భావించినట్టు, బుద్ధిగల వారెవరూ 2018లో, బిజెపి ఆర్ఎస్ఎస్‌తో బంధాన్ని తెగతెంపులు చేసుకుని, హిందూత్వకు కేవలం మాట వరసకు సహాయం చేస్తూ, ఒక సాధారణ మితవాద పార్టీగా ఉంటుందని అనుకోలేదు. 1987లో, అంటే 30 ఏళ్ల కిందట పండితులు వారి మధ్య బంధాన్ని గురించి ఇలా వివరించారు:

'బిజెపి తనకుతాను జాతీయ రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నది; అయితే, ఆర్ఎస్ఎస్ నుండి వచ్చేవారే దాని సభ్యులైనందు వలన ఇది ఎంతవరకు సాధ్యమో చెప్పడం కష్టం. ప్రజలను సమీకరించగలిగి, ఆర్ఎస్ఎస్‌కి సంబంధం లేని నాయకులతో పనిచేయడానికి పార్టీ కార్యకర్తలు వెనకడుగు వేస్తున్నారు. ఆర్ఎస్ఎస్ శిక్షణలో, విస్తృత ప్రయోజనాల కోసం త్యాగం చేయడం, సైద్ధాంతికంగా రాజకీయాలకు దూరంగా ఉండడం ప్రధానంగా చెప్పబడుతుంటాయి. అటువంటి సమూహం నుండి వచ్చిన వారు రాజకీయంగా ఆకర్షణగల నాయకులుగా తయారవడం కష్టమే; పైగా ఆర్ఎస్ఎస్ కార్యకర్తల మద్దతు లేకుండా బిజెపి మన గలదా అన్నది సందేహమే. పైగా ఆర్ఎస్ఎస్ నాయకత్వం చేతిలో పగ్గాలు లేకుండా కార్యకర్తలు పనిచేయడానికి సిద్ధపడరు.'

గత రెండు దశాబ్దాల అనుభవం, ఈ విశ్లేషణ సరైనదే అని రుజువు చేసింది. బిజెపి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపైనే పూర్తిగా ఆధారపడుతుంది. హిమాచల్ ప్రదేశ్ ఒక చిన్న రాష్ట్రం. అక్కడ గత సంవత్సరం నవంబర్ 9న జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు 30,000 మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వచ్చి పనిచేసారు. ఆ రాష్ట్రంలో 700 ఆర్ఎస్ఎస్ శాఖలు, 25 సోదర సంఘాలు ఉన్నాయి. ఇక 2019లో లోక్ సభ ఎన్నికలలో జరిగే వినాశనాన్ని ఊహించండి.

ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, ఆ నాటికి మరింత కఠినంగా మారతారు. 2017 అక్టోబర్ 27న ఆర్ఎస్ఎస్ వలంటీర్లనుద్దేశించి "జర్మనీ ఎవరి దేశం? జెర్మన్లది. బ్రిటన్ ఎవరిది? బ్రిటిష్ వారిది; అమెరికా ఎవరిది? అమెరికన్లది. నిజానికి అమెరికాలోగాని జర్మనీలో గాని బ్రిటన్‌లోగాని ఒకే మతస్థులు లేరని

వారికెరికే. అలాగే భారతదేశం హిందువులది. దానర్థం హిందుస్థాన్ కేవలం హిందువుల దేశం అని... 'హిందూ' అంటేనే భరతమాత బిడ్డలు. హిందూదేశ వారసులు; హిందూ సంస్కృతికి అనుగుణంగా జీవించేవారు. ఈ వాక్యంలోనే అసలైన విషయం ఉంది. హిందూ అంటే 'భారతీయ' (అంటే హిందూ సంస్కృతిని అనుసరించేవారు.) ఆర్ఎస్ఎస్, బిజెపి కుటుంబాల సాంస్కృతిక జాతీయ వాదం అంటే ఇదే. దీనినే బిజెపి గత ఇరవై అయిదేళ్ళగా తన ఎన్నికల ప్రణాళికలో పెడుతున్నది. ఆర్ఎస్ఎస్ యొక్క ప్రత్యేకత, ప్రాముఖ్యత ఒక నిగూఢమైన ప్రశ్నలోకి తీసుకెళుతుంది. – అసలు ఇంతకీ ఆర్ఎస్ఎస్ ఎందుకేర్పడింది? భారత జాతి జీవనంలో దాని పాత్ర ఏమిటి? 1915లో అఖిల భారత హిందూ మహాసభ ఏర్పడింది. 1925 సెప్టెంబర్‌లో దసరా రోజు అయిదుగురు హిందూ మహాసభ సభ్యులు కలిసి ఆర్ఎస్ఎస్‌ను ఏర్పాటు చేసుకున్నారు. భారతదేశాన్ని బ్రిటిష్ పాలన నుండి విముక్తి చేయడానికి వారేం చేయదలుచుకున్నారు?

1925లో స్వాతంత్ర్యోద్యమం ఉచ్ఛస్థితిలో ఉంది. పండిట్ మదన్ మోహన్ మాలవ్య, లాలా లజపత్ రాయ్ వంటి హిందూ మహాసభ నాయకులు దానికి నాయకత్వం వహిస్తున్నారు. అటువంటి సమయంలో మరో సంస్థ అవసరం ఏమొచ్చిందనే విషయాలు తెలుసుకోవాలి.

డాక్టర్ అంబేద్కర్, బ్రిటిష్ వారు భారతదేశాన్ని పాలించిన కాలాన్ని మూడు దశలుగా విభజించారు.

మొదటి దశ, భారతదేశానికి అసలు స్వాతంత్ర్యం ఇవ్వాల్సిన అవసరం లేదని భావించిన దశ.

ఈ విషయాన్ని కలకత్తాలో ఉన్న లారెన్స్ విగ్రహం కింద రాసి ఉన్న వాక్యాలను చూస్తే అర్థం అవుతుంది; "భారతదేశాన్ని బ్రిటిష్ వారు కత్తితో జయించారు. వారు దానిని కత్తితోనే నిలుపుకుంటారు." కానీ, ఇటువంటి ఆలోచన ఆ తరువాతి కాలంలో లేదు. నిజానికి ఇప్పుడు ఇంగ్లీషువారు అటువంటి ఆలోచనచేసినందుకు సిగ్గుపడుతున్నారు కూడా. ఆ దశ తరువాతి దశలో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులకు పార్లమెంటు లాంటి ప్రజాస్వామ్య సంస్థలను నడుపుకోవడం చేతకాదని భావించింది. ఈ దశ లార్డ్ రిప్పన్‌తో ప్రారంభమైంది. అప్పుడు స్థానిక సంస్థల నిర్వహణకు శిక్షణ ఇవ్వడం మొదలుపెట్టారు. మాంటేగ్ చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు ప్రొవిన్షియల్ (ప్రాంతీయ) ప్రభుత్వాలు ఏర్పాటుకు సిద్ధపడ్డాయి. ఈ కాలంలో బ్రిటిష్ ప్రభుత్వం కత్తితో పాలిస్తామని అనలేదు; భారతీయులకు పాలించుకోడం రాదని అనలేదు. భారతీయులు కోరుకుంటే స్వతంత్రం పొందే హక్కుందని ఒప్పుకుంది. ఇందుకు ఉదాహరణ క్రిప్స్

ప్రతిపాదనలు. అందుకు చేయాల్సినదల్లా జాతీయ జీవనంలో ముఖ్యులందరూ అంగీకరించే రాజ్యాంగాన్ని రూపొందించుకోవడం. 1946కి మనం ఈ స్థితికి చేరుకున్నాం.

అప్పుడు ఆర్ఎస్ఎస్ నాయకులకు గాని, హిందూ మహాసభలోని ప్రముఖులకు గాని, లేదా వారి 19 శతాబ్దపు హిందూ పునరుజ్జీవ సిద్ధాంతకర్తలకు గాని, దేశ ప్రజలందరూ భుజం భుజం కలిపి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలని, స్వతంత్రం సంపాదించడానికి పూనుకోవాలనే కోరిక కలగలేదు. పైగా వారు ఆనాటి ఉద్యమాన్ని అడ్డుకున్నారు కూడా. బ్రిటిష్ వారితో చేతులు కలపడానికి ఏ మాత్రం సంశయించలేదు.

ఆ రోజు ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ రెండూ అహంకారంతో, తమ సంస్థలపై తమకే సర్వాధికారం ఉండాలన్న తపనతో, తీవ్రంగా ఘర్షణలు పడుతున్నాయి. రెండు సంస్థలూ 1925లో వినాయక్ దామోదర్ సావర్కర్ ప్రతిపాదించిన హిందుత్వ సిద్ధాంతాన్ని అంగీకరించాయి. గాంధీని చంపిన నాథురాం గాడ్సే సభ్యత్వం రెండు సంస్థలలో ఉంది. ఆర్ఎస్ఎస్ స్థాపించినది కేశవ్ బలిరాం హెగ్డేవార్. ఆయన రాజకీయ గురువు మూంజి, ప్రాలేయా కనుంగొ 'ఆర్ఎస్ఎస్ రాజకీయ సంయోగం: హెగ్డేవార్ నుండి సుదర్శన్ వరకు' అనే తన పుస్తకంలో "హిందూ మహాసభ, మెజారిటీ మతస్థులైన హిందువులకు సర్వ హక్కులు కలిగి ఉండేందుకు పరిమితమవాలనుకునే సంస్థగా ఉండాలనుకునేది; అయితే హెగ్డేవార్ ఈ దేశం కేవలం హిందూ రాజ్యంగా (హిందువులు పాలించే రాజ్యంగా) ఉండాలనుకునే ఆశయం నుంచి, ఈ దేశాన్ని 'హిందూ దేశం '(హిందువులు ఉండే దేశం) దిశగా మరల్చేందుకు తీవ్రంగా కృషి చేసారు. అందుకుగాను ముస్లింలను 'యవన సర్పాలుగా' చిత్రించి, ముస్లింలంటే ద్వేషాన్ని నూరిపోశారు. అంతేకాదు, ఒక ప్రైవేటు సైన్యాన్ని తయారు చేసారు" అని రాసారు. ఈ స్వయం సేవకుల ముసుగులో ఉన్న సైనికులే అనేక మతతత్వ దాడులకు కారకులని అనేక పరిశోధనా కమిషన్లు తెలియచేసాయి.

సిపి బిషికార్ రాసిన 'సంఘ్ వికాస్ కె బీజ్' అనే పుస్తకంలో, హెగ్డేవార్, హిందువులలో ప్రతీకార వాంఛను పాదుగొలిపేవారని రాసారు. అందులో 'లాఠీ దెబ్బలు తిని తిని వారి (ముస్లింలు) చేతులు విరిగిపోయాయి. ఇప్పుడిక వారు క్షమించమని వేడుకునే స్థితికి చేరుకున్నారు. ఈ దేశంలో ముస్లింలకు తోకముడిచి పారిపోడం తప్ప వేరే గత్యంతరం లేదు.' అని హెగ్డేవార్ అనేవారని రాసారు. హెగ్డేవార్ ఈ విధంగా హిందువులకు ఒక జాతి పై శత్రుత్వాన్ని నూరిపోసారు. ఆర్ఎస్ఎస్

రాజకీయాలలోకి ప్రవేశించాలనే శ్యాం ప్రసాద్ ముఖర్జీ ప్రతిపాదనను కూడా హెగ్డేవార్ తిరస్కరించారు. "ప్రపంచమంతటిలో కేవలం హిందూ దేశమొక్కటే చిరస్థాయిగా నిలిచిపోయే వరం పొందిందని" హెగ్డేవార్ భావన.

ఆర్ఎస్ఎస్ మూలాలు 19వ శతాబ్దపు హిందూ పునరుజ్జీవనంలోనే ఉన్నాయనేది, భిషికార్ వాదన.

పంతొమ్మిదో శతాబ్దపు చివరి రోజుల్లో, ఇరవైయ్యో శతాబ్దపు తొలి రోజుల్లో స్వామి దయానంద సరస్వతి, రామకృష్ణ పరమ హంస, వివేకానందుడు, రామతీర్థ, అరవిందో వంటి ప్రముఖ ఆధ్యాత్మిక గురువులు ఉదయించారు; వీరందరూ 'భారతదేశానికి పట్టిన దీన స్థితి' గురించి వాపోయారు. వారి కృషితో భారతజాతి జాగృతమైంది; జాతీయోద్యమం ప్రారంభమైంది; 'వందేమాతర గీతం' ఈ ఉద్యమానికి మహామంత్రం అయింది.

ఈ కాలంలోనే దేశంలో అనేక మంది మేధావులు ఉద్భవించారు. మేధోపర, ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సామాజిక అభిరుచి, రాజకీయం, పరిపాలన, శాస్త్రం వంటి అనేక రంగాలలో ఆనాడు అంతమంది మేధావులు కనిపించడం మనలను ఆశ్చర్య చకితులను చేస్తుంది. దేశంలోని ఇటువంటి పరిస్థితుల మధ్య హెగ్డేవార్ పుట్టారు.

'1500 సంవత్సరాలపాటు, హిందుస్థాన్ మాత్రమే కాదు చుట్టు పక్కల ఉన్న దేశాలు కూడా హిందువుల అధీనంలో ఉండేవి. కానీ, ఈనాడు హిందూదేశాన్నే హిందువులు హిందుస్థాన్‌గా పిలుచుకోలేకపోతున్నారు. ఈ రోజు హిందూ సమాజం పీకల్లోతు కష్టాలలో కూరుకుపోయి ఉంది. ఆ తప్పు మనదే. మనం జవజీవాలుడిగి బతుకుతున్నాం; నిద్రలో జోగుతున్నాం. ఒకవైపు విదేశీ పరిపాలకుల రాజకీయ ఆధిపత్యం; మరోవైపు ముస్లింల సాంస్కృతిక హింస. మనం అడకత్తెరలో పోక చెక్కలాగా నలిగిపోతున్నాం. ముస్లింలుగా మతం మార్చడానికి హిందువుల మీద జరుగుతున్న దాడుల గురించి గాని, మన ఇంటి కోడళ్లపై, ఆడబడుచులపై జరుగుతున్న అత్యాచారాలను గురించి గాని మాట్లాడుతుంటే నా రక్తం సలసలా కాగిపోతుంది. నన్ను నేను అదుపుచేసుకోలేను. అందుకే, ఇంతకు మించి మాట్లాడను. క్రిష్టియన్లదైనా ఇదే పరిస్థితి. మనం మన సమాజాన్ని ఈ దాడుల నుండి కాపాడుకోవాలనుకుంటే మనం సంఘటితం కావాలి. ఈ ఒక్క లక్ష్యంతోనే 1925లో ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేయబడింది'. ఈ విధంగా ఉండే హెగ్డేవార్ రచనలను భిషికార్ ఉటంకించారు.

ఇతర మతాల నుండి హిందూ మతానికి మారడం అనే 'ఘర్ వాపసీ' కార్యక్రమాన్ని రూపొందించింది ఆనాడే. అప్పుడప్పుడూ ఏర్పడ్డ సందిగ్ధతలు తప్ప, ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ కచ్చితమైన స్థిరమైన వైఖరితోనే ఉంది. కాంగ్రెస్ యొక్క

లౌకికతత్వాన్ని వ్యతిరేకించడానికే అది పుట్టింది. వందేళ్లు గడిచినా అదే పని చేస్తుంది. సంఘ్, పవిత్రమైన సనాతన హిందూ మతాన్ని, మన పురాతన హిందూ సంస్కృతిని, ప్రాచీన  కాషాయ జెండాలను ప్రస్తుత రూపంలో నిలిపింది. లౌకికత అంటేనే హిందూ వ్యతిరేకత అంటుంది. సంస్కృతిని మతంతో పెనవేసింది.

జాతి ఐక్యత కాపాడాలంటే మైనారిటీ కమిషన్లను రద్దుచేయాలి. కాశ్మీర్‌కి సంబంధించిన 370 అధికరణాన్ని రద్దుచేయాలి. విదేశీ క్రిస్టియన్ మిషనరీలను పారద్రోలాలి. ముస్లిం సంస్థలను మత మార్పిడులు చేయకుండా నిషేధించాలి. దేశంలోని ఏ  ప్రాంతంలో అయినా హిందువుల సంఖ్య తగ్గితే ఆ ప్రాంతం దేశం నుండి విడివడుతుంది. అందుకని బలవంతంగాకాని, మోసపూరితంగాకాని హిందువుల మతమార్పిడులు జరిగితే, వాటిని ఆపాలి.

భిషికార్ రాసిన ఈ 'మహాత్ముల' కథలు అసలైన చరిత్ర కాదు. మనదగ్గర అసలైన వాస్తవ సంఘటనలు నమోదు చేసిన చరిత్ర ఉంది. హెగ్డేవార్ నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యాలయం పెట్టడానికి నిర్ణయించుకోగానే అందుకు పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. 150000 ప్రజలున్న నాగపూర్‌లో 20000 మంది మాత్రమే ముస్లింలు ఉన్నారు. హెగ్డేవార్ నిర్ణయంతో ముస్లింలు అభద్రతకు లోనుకాలేదు. కానీ, 1,30,000 మందిగా ఉన్న హిందువులు మాత్రం అభద్రతకు లోనయ్యారు. అందువలన హెగ్డేవార్ ఆర్ ఎస్ ఎస్‌లో ఉన్న మేధావుల మూలాలను పరిపుష్టం చేయడం మొదలుపెట్టారు. అందుకు 'హిందువులంతా ఒకే జాతి', అనే వినాయక్ దామోదర్ సావర్కర్ ప్రతిపాదన యొక్క చేతి రాత ప్రతి ఎంతగానో ఉపయోగపడింది.

ఈ అభద్రతా భావం 19 శతాబ్దంలోని అనేక మంది మేధావులను వెన్నాడింది. లాలా లజపతి రాయ్ ఇలా అన్నారు:

'నిద్రలోను మెలుకువలోను మమ్మల్ని వెన్నాడుతున్న సమస్య ఒకటే. మనలో ఇంతమంది గొప్ప, బలమైన, ఉన్నతమైన నిజాయితీ గల భావనలు ఉన్నప్పటికీ మనం (హిందువులం) ఎందుకు యుగయుగాలుగా మనకన్నా భౌతికంగాకానీ, మేధోపరంగాకాని, తాత్వికంగాకాని ఉన్నతులు కాని కొందరికి అడుగులకు మడుగులొత్తుతూ జీవిస్తున్నాము?' (ది వన్ ప్రెస్సింగ్ నీడ్ ఆఫ్ ఇండియా).

ఈ కట్టు కథే నేటికీ కొనసాగుతున్నది. ఆ భూతమే ఈ నాటికీ ప్రజలను వెన్నాడుతున్నది.

ఆర్ఎస్ఎస్ విజయదశమి రోజు హెగ్డేవార్ ఇంట్లో స్థాపించబడింది. హెగ్డేవార్‌తో పాటు బిఎస్ మూంజి, బాబురావు సావర్కర్, ఎల్‌వి పరాంజపే, బిబి థక్కర్ అప్పుడక్కడ ఉన్నారు. హెగ్డేవార్‌కి సభ్యులను చేర్చుకునే బాధ్యత

అప్పగించబడింది. కానీ, ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో వ్యవస్థాపకులు పేర్లు భిన్నంగా ఉన్నాయి – పండరినాథ్ బాలకృష్ణ, గోపాల్ ముకుంద్, ప్రభాకర్ బల్వాన్ట్, ఎల్ వి పరాంజపే, గోవింద్ సీతారాం, అనంత్ గణేష్, విట్టల్ గోవింద్, కృష్ణాజీ నీలకాంత్ మొఘ్రీల్. మొదటి సమావేశంలో వీరు కాక నారాయణ్ యశ్వంత్, రఘునాథ్ బండే, అన్నా వైద్య, నార్హార్ పాలేకర్, అన్నాజీ గైక్వాడ్, దేవఘర్, బాపూరావు తెలాంగ్, బాలాసాహెబ్ అథయే పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న అడ్వకేట్ విశ్వనాథ్, వినాయక్ కేల్కర్, బాబురావు సొనార్కర్ల పేర్లు ప్రచురణలో లేవు.

1926 మే నుండి ఆర్ఎస్ఎస్ శారీరక వ్యాయామం, సైనిక కవాతులు, సైద్ధాంతిక బోధన చేయడం, ఆయుధ శిక్షణ ఇవ్వడం, 'మాతృభూమి, పవిత్ర భూమి'కి, ఆర్ఎస్ఎస్ కాషాయ జెండాకి, హిందూ జాతీయ ప్రార్థనలు చేయడం మొదలుపెట్టారు. ఆర్ఎస్ఎస్ శాఖలలో కర్రసాము, కత్తిసాము, సుశిక్షిత కవాతు, యోగా మొదలైనవి నేర్పించేవారు. ఈ రోజు అనేక హిందుయేతర యుద్ధ విద్యలను కూడా శిక్షణలో భాగం చేసారు. వారి జెండా వందనం 1930లలో యూరప్ దేశాల జెండా వందనాన్ని తలపిస్తుంది.

మొదట్లో ఆర్ఎస్ఎస్ జెండా వందనం మరాఠీ, హిందీ భాషలలో ఉండేది. 1939లో దానిని సంస్కృతంలోకి మార్చారు. వారి ప్రధానమైన గీతాలు ఎన్ఎన్ భిందే అనే ఓ స్కూల్ టీచర్ రాసినవి. అందులో 'హిందూ భూమి', 'హిందూ రాష్ట్రం', 'హిందూ వీరత్వం' వంటివి ఉన్నాయి. ఆ తరువాత వాటికి అదనంగా ఆర్ఎస్ఎస్ ఏకతా మంత్రం, ఏకతా స్తోత్రం చేర్చబడ్డాయి. 'హిందూ ఐక్యతని' పెంచే గీతాలు, స్తోత్రాలు అందులో భాగం చేయబడ్డాయి. 1926 నుంచి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు, స్వయం సేవకులకు యూనిఫామ్‌ను తప్పనిసరిగా ధరించి తీరాలనే నియమం విధించబడింది. 1928లో మొదటిసారిగా పెద్ద ఎత్తున జీవితమంతా హిందూజాతి పురోగతి కోసం పాటు పడతామని – భౌతికంగా, మానసికంగా, సంపద పరంగా – జీవితాన్ని త్యాగం చేస్తామని ప్రమాణం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జెండానే 'గురువుగా' భావించి, స్వయం సేవకులు ధనం విరాళాలుగా ఇవ్వడం మొదలైంది. హిందువుల సంప్రదాయమైన, గురువును జీవితాంతం అనుసరించడం అనే పద్ధతిని ఆర్ఎస్ఎస్ అనుసరించి, గురువుగా హిందూ జాతీయ జెండాను స్వయం సేవకుల ముందు నిలిపింది.

1928లో హెగ్డేవార్ రాసిన పత్రాన్ని 99 మంది స్వయం సేవకులచేత చదివించారు. "నేను నా పూర్వీకులను, దైవాన్ని తలుచుకుంటూ ఈ విధంగా ప్రతిజ్ఞ చేస్తున్నాను. నేను హిందూ ధర్మాన్ని, హిందూ సంస్కృతిని, హిందూ సమాజాన్ని

రక్షించడానికి, స్వతంత్ర హిందూ రాష్ట్రాన్ని స్థాపించడానికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘంలో సభ్యుడినయ్యాను. సంఘం పని ఎంతో నమ్మకంగా, నిస్వార్థంగా, శారీరక, మానసిక, ఆర్థిక బలంతో చేస్తాను. ఈ మాటకు జీవితాంతం కట్టుబడి ఉంటాను" అని వారిచేత ప్రమాణం చేయించారు.

1929 ఆర్ఎస్ఎస్, సర్వసంఘచాలక్ కార్యాలయాన్ని ప్రారంభించింది; సర్వసంఘచాలక్‌ని పరమపూజ్యునిగా కొలవడం మొదలైంది. నాయకుడిని అనుసరించాలన్న సూత్రం అమలైంది. అప్పాజీ జోషి హెగ్డేవార్ పేరును జీవితకాలం దిశానిర్ధేశం చేసే అధినాయకుడిగా ప్రతిపాదించారు. అంటే, ఆయనే సర్వసంఘచాలక్. సంస్థలన్నిటి పై పూర్తి అధికారాన్ని కలిగి ఉంటారు. స్వయం సేవకులు సర్వసంఘచాలక్ ఆజ్ఞలను ఎల్లప్పుడూ, అన్ని స్థాయిలలోను, ఎట్టి పరిస్థితులలో అయినా ఏమాత్రం ఉగిసలాటలు లేకుండా పాటించాలని హెగ్డేవార్ స్పష్టం చేసారు.

యువకులకు సైద్ధాంతిక బోధన చేసేవారిని 'భౌదిక్' అన్నారు. నాథురాం గాడ్సే అటువంటి బోధకులతో ఒకరు.

1930ల నుండి ఆర్ఎస్ఎస్ ప్రచారకుల వ్యవస్థను మొదలు పెట్టింది. దీనితో స్వయం సేవకులను శాఖలను నడిపేందుకు ఇతర ప్రాంతాలకు కూడా పంపడం, సైద్ధాంతిక ప్రచారం మొదలైంది. 1940 కల్లా వంద మంది క్రియాశీల ప్రచారకులను తయారు చేసుకుంది. ఆర్ఎస్ఎస్ యంత్రాంగం పెరుగుతూ వచ్చింది. మదన్ మోహన్ మాలవ్య గారి ఆధ్వర్యంలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో కూడా ఒకశాఖ మొదలైంది. అక్కడే మాధవ్ సదాశివ గోల్వాల్కర్ బోధకునిగా పనిచేసేవారు. ఆయన 1940లో సర్వసంఘ చాలక్‌గా బాధ్యతలు తీసుకుని, ఆ తరువాతి కాలంలో ఆర్ఎస్ఎస్ సర్వకార్య వాహకుడయ్యారు.

1925లో హెగ్డేవార్ ఆధ్వర్యంలో కేవలం 5 గురితో నాగపూర్‌లో ప్రారంభించబడిన ఆర్ఎస్ఎస్, 1931కి నాగపూర్ హద్దులు దాటి వార్ధా నుండి విదర్భకి, ఆ తరువాత హిందీ మాట్లాడే మధ్య భారతదేశానికి విస్తరించింది. సంఘ్ చాలామంది ప్రముఖ హిందువుల మద్దతును పొందగలిగింది; రాజా లక్ష్మణరావు భోంస్లే, రాజా రఘోజీరావు భోంస్లే, సర్ చిట్నీవిస్, హాన్. తాంబే, సర్ మోర్యాంట్ జోషి, రావు బహదూర్ కేల్కర్ వగైరా ఈ సంస్థకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 1937కి ఆర్ ఎస్ ఎస్ సభ్యత్వం 30000కి చేరింది.

హిందూ మహాసభతో కలిసి పనిచేసే క్రమంలో ఆర్ఎస్ఎస్‌కి, హిందూ మహాసభకు మధ్య కొన్ని విభేదాలు ఏర్పడ్డాయి. హెగ్డేవార్, సావర్కర్ గారి హిందుత్వ సిద్ధాంతంతో బాగా ప్రభావితుడయ్యారు. 1925లో ఆర్ఎస్ఎస్ స్థాపించక ముందు

ఆయన సావర్కర్‌తో కలిసి రెండు రోజులు చర్చలు జరిపారు. మహాసభ నాయకుడు మూంజి హెగ్డేవార్ గురువు. హెగ్డేవార్ హిందూ మహాసభకు సహకారం అందిస్తున్నప్పటికీ, ఆర్ఎస్ఎస్ నాయకత్వంలో వారికి స్థానం కల్పించలేదు. కానీ, ఇద్దరూ స్నేహితులుగానే ఉన్నారు.

కరాచీలో జరిగే హింద్ యువ పరిషద్‌కి భాయ్ పరమానంద్ పంపిన ఆహ్వానం, తన విస్తృతిని పెంచుకోవాలనుకుంటున్న ఆర్ఎస్ఎస్‌కి, పంజాబ్ సింధ్ ప్రాంతాలలో విస్తరణకు మంచి అవకాశం కలిగించింది. బాబురావు సావర్కర్ ఢిల్లీ బెనారస్‌లలో ఉన్న మహాసభలోని చురుకైన కార్యకర్తలను ఆర్ఎస్ఎస్‌కి పరిచయం చేసారు. సంస్థాగతంగా ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ రెండూ స్వతంత్ర సంస్థలు. నిజానికి ఆర్ఎస్ఎస్, మహాసభ అనుబంధ సంస్థ కాలేదని మహాసభకు అసంతృప్తిగానే ఉండేది. బాబురావు సావర్కర్, హెగ్డేవార్ మంచి మిత్రుడిగానే ఉండేవారు. 1931లో ఆయన 'తరుణ్ హిందూ సభను' ఆర్ఎస్ఎస్‌తో కలిపేశారు. పంజాబ్, యుపి, బీహార్ దక్షిణ భారతదేశంలో ఉన్న వారి ప్రచారకులు ఆర్ఎస్ఎస్‌తో కలిసిపోయారు. ఫలితంగా 1931లో కేవలం 60 శాఖలున్న ఆర్ఎస్ఎస్ 1936కి 200 శాఖలు 25,000 సభ్యులు గల సంస్థగా అవతరించింది. 1939కి 500 శాఖలు 40,000 సభ్యత్వం, 1940కి 700 శాఖలు 80,000 సభ్యత్వంకి పెరిగింది. హెగ్డేవార్, సంస్థని ఆర్థికంగా కూడా బలంగా నిలపగలిగారు. స్వచ్ఛంద దానాలు, మద్దతుదారుల అభిమానుల నుండి గురు పూర్ణిమ రోజు అందుకునే దక్షిణలు నిధులను సమకూర్చిపెట్టాయి. 1939 రిపోర్ట్ ప్రకారం చిట్నావిస్, ఘటాడే అనే వడ్డీ వ్యాపారుల దగ్గర రూ. 20,000/– నిధి ఉండేది. ఆర్ఎస్ఎస్ తన శాఖల దగ్గర రూ. 200 కన్నా ఎక్కువ ఉండనిచ్చేది కాదు. జమా ఖర్చుల పై కచ్చితమైన నియంత్రణ ఉండేది.

మొదట్లో ఉత్తర భారత దేశంలో ఆర్ఎస్ఎస్ అంతగా ప్రభావం చూపగలిగేది కాదు. అక్కడంతా ఆర్య సమాజం యొక్క ప్రభావం ఉండేది. అందుకనే హెగ్డేవార్ అక్కడ నిర్మాణంలో కొన్ని మార్పులు చేసారు. ప్రతిజ్ఞ హిందీలో కాదు, సంస్కృతంలో తీసుకోవాలి; హనుమంతుడిని పూజించనక్కర లేదు; హిందూ క్రతువులు ఆచరించవలసిన అవసరం లేదని కొన్ని సడలింపులు చేసారు. ఆ రకంగా హెగ్డేవార్ నిర్మాణ నైపుణ్యం, నిబద్ధత, అంకితభావం ఆర్ ఎస్ ఎస్ పెరగడానికి ఎంతగానో తోడ్పడ్డాయి. 1940లో హెగ్డేవార్ చనిపోయే నాటికి ఒరిస్సా, అస్సాం, కాశ్మీర్ మినహా మిగిలిన భారతదేశమంతా ఆర్ఎస్ఎస్ విస్తరించింది. 1940లో ఆఫీసర్స్ ట్రైనింగ్ కాంప్‌లో ఇచ్చిన ఆయన చివరి సందేశంలో, 'హిందూ రాష్ట్ర సూక్ష్మ దృశ్యం నా కళ్ళకు కనిపిస్తున్నదని' సంతృప్తిని వ్యక్తం చేసారు. ఆఫీసర్స్ ట్రైనింగ్ కాంప్ గురించి

ఒక విషయం చెప్పుకోవాలి. 1927లో ఇది ప్రారంభమైంది. గోల్వాల్కర్ దానిని తన ఆధీనంలో తెచ్చుకున్న నాటికి 50 శాఖలు 1,00,000 మంది స్వయం సేవకులు ఉండేవారు. 1973లో అయన మరణించే నాటికి 10000 శాఖలు, పది లక్షల మంది స్వయం సేవకులు ఉన్నారు. ఈ విస్తృతి గొప్పదే. అయితే, అది సాధించిన వారెవరు? ఎలా సాధించారు? అంటే, విషాన్ని వెదజల్లి సాధించారనే చెప్పుకోవాలి.

1926 డిసెంబర్ 2న మోతీలాల్ నెహ్రూ జవహర్ లాల్ నెహ్రూకి లేఖ రాస్తూ, "జాతి వైషమ్యాలు, అవినీతితో ఓటర్లను ప్రభావితం చేయడం సర్వ సాధారణమైన విషయంగా మారిపోయింది. ఇది నన్ను తీవ్రమైన అసంతృప్తికి గురి చేసింది. రాజకీయాల నుండి వైదొలగాలని అనిపిస్తున్నది. మాలవ్య–లాలాలు, బిర్లాలు పంపిన డబ్బు సంచులతో కాంగ్రెస్‌ను కూల్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని" రాసారు. డబ్బు పంపింది ఒక్క బిర్లాలే కాకపోయి ఉండవచ్చు. అది కేవలం ఆర్ఎస్ఎస్‌కి మాత్రమే పంపి ఉండకపోయి ఉండవచ్చు అని రాశారు.

అప్పటికే, ధన ప్రభావం ఉండేదని మాత్రం కచ్చితంగా తెలుస్తున్నది. 1926 లోనే ధన ప్రభావం ఇలా ఉంటే 2018కి దాని ప్రభావం ఇంకెన్ని రెట్లు పెరిగి ఉంటుందో ! ఇక మత విద్వేషాలకు అంతెక్కడ? ఆనాడే బడా పెట్టుబడిదారులు మతతత్వ రాజకీయాలకు మద్దతు పలకడం మొదలైంది. ఎన్నికలలో అవినీతి, లౌకిక శక్తుల బలహీనత దీనికి తోడైంది.

ఆర్ ఎస్ ఎస్ 19 శతాబ్దంలోని హిందూ మత పునరుజ్జీవనాన్ని వారసత్వంగా పొంది, బ్రిటిష్ పాలకులకు సహకారం అందించి లాభపడింది.

◆

# ఆర్ ఎస్ ఎస్ 19 శతాబ్దపు వారసత్వం

1870–1920 మధ్యకాలంలో హిందూ జాతీయవాదం ఒక సిద్ధాంతంగా రూపుదిద్దుకుంది. 19వ శతాబ్దం చివరిలో ఇదే రకమైన పూర్వాపరాలు ఉన్నందు వలన ఆ జాడలు తెలుసుకోవలసిన అవసరం ఉంది. **–క్రిస్టోఫర్ జఫర్లాట్**

చేతన్ భట్ అనే పండితుడు మరో ముఖ్యమైన పార్శ్వాన్ని ఎత్తిచూపారు. ఆర్య సమాజ్, భారతజాతీయ కాంగ్రెస్, హిందూ సంఘటన ఉద్యమం, హిందూ మహాసభ తొలి దశ, మరెన్నో విప్లవాత్మక జాతీయ గ్రూపులు, హిందూ మత సంస్థలను కలిపి హిందూ జాతీయవాదులు అని నిజమైన అర్థంలో అనగలం. అయితే, వారు భారత జాతీయవాదులే గాని హిందూత్వం వైపు మొగ్గు చూపేవారని అనలేం. ... **– భట్**, హిందూ నేషనలిజం నుంచి.

దయానంద సరస్వతి (1824–1883) పశ్చిమ దేశాలలో లూథర్‌కింగ్ లాగా (కేవలం మత గ్రంథాలనే అనుసరించాలిగాని సంప్రదాయాలను కాదని యూరప్‌లో ఉద్యమం లేవనెత్తినవారు) ఇక్కడ ఒక ఉద్యమాన్ని ప్రారంభించారు. విగ్రహారాధన, పురోహితులను దూషించడం, అస్పృశ్యత వంటివి పాటించడం అంటే నాలుగు వేదాల నుండి వైదొలగడం అని, అటువంటి వాటిని వ్యతిరేకించారు. దయానంద్ 1875లో ఆర్య సమాజాన్ని స్థాపించి, మిలిటెంట్ హిందూ జాతీయవాద పునరుజ్జీవనానికి తీవ్రంగా కృషి చేసారు. ఈయన పంజాబ్‌లో ఉద్యమం మొదలు పెట్టారు. లాహోర్‌లో 1886లో దయానంద్ ఆంగ్లో వేదిక్ కాలేజ్‌ని స్థాపించారు. సంఘటన, (అంటే సంఘాలను ఏర్పాటు) శుద్ధి అనే రెండు హానికరమైన ఉద్యమాలు నిర్మించారు. శుద్ధి (శుద్ధి అంటే హిందువులు కానివారిని పవిత్రులుగా చేయడానికి హిందువులుగా మార్చడం) అంటే ఈనాటి ఘర్ వాపసీ కార్యక్రమమే. హిందువులను జాగృతులను చేయాలన్న అయన ఆలోచనల వలన హిందూ జాతి, హిందూ జాతీయవాదం అనే సిద్ధాంతం పుట్టింది.

1923లో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో అఖిల భారత 'శుద్ధి' సభ జరిగింది. ఈ కార్యక్రమాల వలన లాభపడ్డవారు ఇరవైయ్యో శతాబ్దపు హిందూ పునరుజ్జీవన కార్యకర్తలే. ఈయన ప్రారంభించిన శుద్ధి కార్యక్రమం ఇప్పటికీ కొనసాగుతున్నది.

బంకించంద్ర ఛటర్జీ (1838–1894) ఏ మాత్రం తక్కువ పలుకుబడి ఉన్న వ్యక్తి కాదు. వందేమాతరం అనే గీతాన్ని ఆయన 1875లో రాసి 1882లో ప్రచురించిన ఆనందమఠ్ అనే తన నవలలో చేర్చారు. ఇందులో మాతృ భూమిని హిందూ దేవతలతో పోల్చారు. ఈ గేయం అత్యంత వివాదాస్పద గేయం. ఇది సంస్కృతంలో మొదలై, బెంగాలీలో కొనసాగి తిరిగి సంస్కృతంలో ముగుస్తుంది. ఇందులో భారతదేశం హిందూ దేవతగా కొలవబడుతుంది. మాతృమూర్తిగా కొనియాడబడుతుంది. మొదట రాక్షస సంహారి అయిన దుర్గగా, ఆ తరువాత కోపిష్టి, విధ్వంసకర శక్తి అయిన ఆదిశక్తిగా పూజించబడుతుంది.

ఈ గీతం ఇలా ఉంది

వందే మాతరం
సుజలాం సుఫలాం
మలయజ శీతలాం
సస్యశ్యామలాం
మాతరం వందే మాతరం
సుభ్రబ్హ జ్యోత్స్నా పులకిత యామినీ
పుల్ల కుసుమిత ద్రుమదలశోభినీం
సుభాషిణీం
సుమధుర భాషినీమ్
సుఖదాం వరదాం
మాతరం వందే మాతరం
కోటి కోటి కాంత కళకళ నినాద కరాలే
కోటి కోటి భుజైర్ ధృత కర కరవాలాలే
బహుబల ధారిణీం నమామి తారిణీం
రిపుదలవారిణీం మాతరం "వందే"
కమలా కమలదళ విహారిణీ
వాణీ విద్యాదాయినీ
నమామి త్వం
నమామి కమలాం అమలాం అతులాం

సుజలాం సుఫలాం మాతరం "వందే"
శ్యామలాం సరళామ్ సుస్మిత భూషితాం
ధరణీం భరణీం మాతరం

హృదయం నీవే ఊపిరి నీవే, ఆత్మనీవే
ప్రేమమయవి నీవే అమృతమూర్తివి నీవే
హృదయ మరణాన్ని జయించింది నీవే.
ముప్పిరిగొలిపే భుజబలం
నీ దివ్య మంగళ రూపం.
మది మందిరాలలోని వెలుగులు.
దుర్గవి నీవే, పట్టపు దేవివి నీవే, దుహితవి నీవే
మదోన్మాదుల మట్టుపెట్టే కరవాలాలు నీవే
పద్మాసనివి నీవే.
శత సహస్రకోటి నాదాలు
లయతో స్వచ్ఛంగా పరిపూర్ణంగా పలికించగల ఆది దేవతవు నీవే.
మొర ఆలకించు తల్లి!
గలగల పారే సెలయేళ్ళు
పరవశింపచేసే ప్రకృతి
నిశీధి నీలికాంతులు
దాచినా దాగని అద్భుతాలు
నీ సిగ పూలు.
నీ దరహాసం అత్యంత ప్రేమాన్వితం
కురిపించు మాపై తరగని సంపద
తల్లి,నా తల్లి!
శిరసువంచి పాదాభివందనం చేస్తున్నా.

ఈ పాట రాసిన సందర్భం – ముస్లిం బ్రిటిష్ అధికార గణం పై సత్యానంద అనే సన్యాసుల నాయకుడు యుద్ధంలో విజయం సాధించడం. ఆతనికి ఆకాశవాణి ఈ పాటను వినిపించి యుద్ధాన్ని ఆపమంటుంది.

**సత్యానందం :** నా ముందున్న అడ్డులన్నీ తొలగించుకున్న ఈ సమయంలో నేనేందుకు యుద్ధం ఆపాలి?

**ఆకాశవాణి :** ఎందుకంటే నీ కర్తవ్యము పూర్తయింది. ముస్లింల శక్తి నాశనం అయింది. ఇక చేయాల్సినదేమీలేదు. హననాల వలన ఇక ఏ ప్రయోజనం చేకూరదు.

**స:** ముస్లింల శక్తి నాశనం అయింది. కానీ, హిందూ రాజ్యం స్థాపించబడలేదు కదా. బ్రిటిష్ వారు కలకత్తాను ఇంకా పాలిస్తూనే ఉన్నారు.

**ఆ:** హిందువుల అధికారం ఇప్పుడప్పుడే ఏర్పడదు. నీవింకా పోరుచేస్తూనే ఉంటే మరింత మంది అనవసరంగా ప్రాణాలు కోల్పోతారు. అందువలన యుద్ధం ఆపేయి.

**స:** (బాధతో) దేవా! హిందూ రాజ్యం ఏర్పడకపోతే ఎవరు పాలిస్తారు? మళ్ళీ ముస్లింలు కాదు కదా?

**ఆ:** ముస్లింలు కాదు. ఆంగ్లేయులు పాలిస్తారు.

**ఆ:** నీ ఆన పూర్తయింది కదా. నీవు నీ తల్లికి సంపద చేకూర్చావు. బ్రిటిష్ ప్రభుత్వాన్ని నెలకొల్పావు. ఇప్పుడిక యుద్ధం ఆపేయి. ప్రజలను హలాలు పట్టనియ్యి. భూమాత సిరులు కురిపించనీ. ప్రజలు సంపదలతో తులతూగనీ.

**స:** (కన్నీరు కారుస్తూ) నేను నా తల్లిని శత్రు రుధిరంతో పండించిన పంటల సిరులలో ముంచెత్తుతాను.

**ఆ:** ఎవరు శత్రువు? ఇప్పుడిక శత్రువులెవరూ లేరు. ఇంగ్లీష్ వారే పాలకులు, స్నేహితులు. వారిని ధరిత్రిలో జయించేవారే లేరు.

ఇటువంటి గీతాన్ని హిందువులు కాని వారిపై జాతీయగీతంగా ఎలా రుద్దగలరు? అనేది ఆశ్చర్యాన్ని కలిగించే ప్రశ్న. 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఈ గీతం పై ఒక అస్పష్టమైన వైఖరి తీసుకుంది. గీతంలోని మొదటి రెండు చరణాలు జాతీయగీతంగా పాడాలని నిర్ణయించింది. కత్తిరింపులకు గురైన గీతాన్ని జాతీయ గీతంగా ఒప్పుకోకపోవడం ఎంత సమంజసం! బిజెపి దీనిని అన్ని రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నం చేస్తున్నది.

బంకించంద్ర గురించి తనికా సర్కార్, తన పుస్తకం హిందూ రాష్ట్రం, భావనలు: బంకిం ఛటర్జీ రచనలలో హిందూ ముస్లిములు గురించి ఇలా రాసారు.

బంకిం చంద్ర బెంగాల్‌లో ముస్లింల పాలనను గురించి కొన్ని చారిత్రాత్మక తీర్పులు ఇచ్చారు:' మనలను ముస్లిం పాలకులు ఎలా పాలిస్తారు? మనం మన మతాన్ని, మన కులాన్ని, మన గౌరవాన్ని, ఇప్పుడు ఏకంగా మన జీవితాలను కోల్పోయాం. ఈ గుంటనక్కలను తరిమేయకుండా మనమెలా బతుకుతాం? '(ఆనందమ బంకిం పేజి 727) ఇటువంటి సైద్ధాంతిక పత్రాలకు ఎటువంటి చారిత్రిక ఆధారాలు అవసరంలేదు. ఎందుకంటే అవి ఒక నవలలో పాత్ర అన్న మాటలు. కానీ, ఈ మిథ్యా చారిత్రిక వ్యాఖ్యానాలు ఎందరినో నమ్మించగలుగుతాయి. ముఖ్యంగా చారిత్రిక వాద ప్రతివాదనలలో దిట్ట అయిన బంకిం చేసినప్పుడు వీటి ప్రాధాన్యత

మరింత ఎక్కువగా ఉంటుంది. అందువలన, అవాస్తవాలను ముందు అధికారికంగా చిత్రించడం ఆ తరువాత వాటిని రాజకీయంగా సమ్మతింప చేసి ప్రచారాన్ని తీవ్రతరం చేయడం క్రమ పద్ధతిలో జరిగాయి. భారతదేశ సంపద దేశం నుండి తరలిపోవడాన్ని బంకిం ప్రస్తావించలేదు. కానీ, బెంగాల్ సంపద ఢిల్లీకి తరలిపోయిందని వాపోయారు.

పంతొమ్మిదో శతాబ్దపు హిందూ పునరుజ్జీవనానికి ముస్లిం వ్యతిరేకతకు మధ్య శక్తివంతమైన మతతత్వ హింసకు అలౌకిక పవిత్ర యుద్ధ రూపాన్నిచ్చి, బంకిం ఒక వారధి వేశారు. హింస, ప్రతీకారాన్ని స్త్రీ మూర్తిలోకి జొప్పించి మతతత్వ రాజకీయాలకు చెరగని ముద్ర వేశారు.

లాలా లజపతి రాయ్ (1865–1928) మహోన్నత నాయకుడు. విద్యావేత్త. ఈ దేశంలో ద్విజాతి సిద్ధాంతాన్ని మొదటిసారిగా లేవనెత్తింది ఆయనే. భారతదేశాన్ని విభజించాలని ప్రతిపాదించింది ఆయనే. 1899లో ఆయన, 'హిందువులు ఒక ప్రత్యేక జాతి, ఎందుకంటే, వారికి తమదైన సంస్కృతి ఉంది.' అన్నారు. దాంతో జరగాల్సిన వినాశనం జరిగిపోయింది. 1924 డిసెంబర్ 14 ట్రిబ్యూన్ పత్రికలో ఆయన ఒక వ్యాసం రాసారు.

'పంజాబ్‌ని రెండుగా విభజించాలి. ముస్లింలు అధికంగా ఉన్న పశ్చిమ పంజాబ్, ఇతరులు, ముఖ్యంగా సిక్కులు, హిందువుల ఎక్కువగా ఉన్న ఉత్తర పంజాబ్....'

మౌలానా హస్రత్ మొహాని కూడా ఇటువంటి ప్రతిపాదనలు చేసారు. 'నా అంచనా ప్రకారం ముస్లింలకు నాలుగు రాష్ట్రాలు ఉండాలి. 1. వాయువ్య ప్రాంతంలో పఠాన్. 2. పశ్చిమ ప్రాంతంలో పంజాబ్. 3. సింధు. 4. ఈశాన్య ప్రాంతంలో బెంగాల్. అలాగే ఇతర ప్రాంతాలలో ముస్లింలు చెప్పుకోదగ్గ సంఖ్యలో ఉంటే ఆ ప్రాంతాలు కూడా ఇవ్వాలి. మనముండేది ఒకే భారతదేశం కాదు. ముస్లింలు, ముస్లిమేతరులు ఉన్న రెండు దేశాలు. స్థూలంగా ఇవి హిందువుల ముస్లింల భావనలు.

ఇక హర్ దయాల్ లాంటి విప్లవకారుల భావనలు చూద్దాం: 'ప్రతాప్' అనే పత్రికలో తన రాజకీయ వీలునామాలో 'భారతజాతి భవిష్యత్తు నాలుగు స్తంభాలపై ఆధారపడి ఉంటుంది. 1. హిందూ సంఘటన. 2. హిందూ రాజ్యం. 3. ముస్లింల నుండి శుద్ధి చేయబడటం. 4. ఆఫ్ఘనిస్తాన్ ఇతర సరిహద్దులను గెలుచుకోవడం లేదా శుద్ధి చేయబడటం. ఈ నాలుగు పనులు చేయకపోతే మన, మన పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో ఉంటుంది. హిందూ జాతికి ఒకే చరిత్ర ఉంది. ఒకే రకమైన సంస్థలు ఉన్నాయి. కానీ ముస్లింలు, క్రిస్టియన్లు అలా కాదు. వారి మతాలు భిన్నమైనవి; వారికి పర్షియన్, అరబ్, యూరప్‌కు చెందిన సంస్థలంటే మక్కువ. హిందువులు

గనక తమని తాము రక్షించుకోవాలనుకుంటే వారు ఆఫ్ఘనిస్తాన్‌ని, సరిహద్దులను గెలిచి, అక్కడున్న గిరిజనులందరి మతం మార్చాలి.' అని రాసారు.

1925కి ముందటి హిందూ మహాసభ పూర్వాపరాలను చూస్తే లాలా లజపతి రాయ్, మదన్ మోహన్ మాలవ్య లాంటి రాజకీయవేత్తలు, బలమైన హిందూ మద్దతుదారులు మహాసభలో ఉండగా, ఆర్ఎస్ఎస్ ఎందుకేర్పడిందో అర్థం అవుతుంది. ఈ విషయం పై అధికారికంగా జివి కేట్కర్, మహ్రాట్ట పత్రిక సంపాదకుడు, అఖిల భాతర హిందూ మహాసభ కార్యదర్శి వివరాలు సేకరించారు.

1907లో మొదటిసారిగా పంజాబ్‌లో హిందూ మహాసభ ఏర్పడింది. హిందువుల ప్రయోజనాలు కాపాడడం, పెంపొందించడం లక్ష్యంగా ఏర్పడింది. 1909లో లాహెూర్‌లో హిందూ మహాసభ మొదటి మహాసభ జరిగింది. దానికి లాలా లజపతి రాయ్ వెళ్లారు. 1914లో హరిద్వార్‌లో మొదటి అఖిల భారత మహాసభ జరిగింది.

1928 వరకు లాలా లజపతి రాయ్, మదన్ మోహన్ మాలవ్య మహాసభకు నాయకత్వం వహించారు. వీరిద్దరూ భారత జాతీయ కాంగ్రెస్‌లో చురుకుగా పనిచేసేవారు. వి.డి. సావర్కర్ చేతులలోకి వెళ్లిన తరువాత ఆయన ద్విజాతి సిద్ధాంతానికి లజపతి రాయ్ 1909లో జరిగిన మహాసభలో మద్దతు పలికారు. 'హిందువులకు ప్రత్యేకమైన సంస్కృతి ఉన్నందు వలన వారు ఒక ప్రత్యేకమైన జాతి. భారతదేశంలో తాను మొదట హిందువును, తరువాత భారతీయుడిని, భారతదేశం వెలుపల, ముందు భారతీయుడిని ఆ తరువాత హిందువుని' అనేవారు.

'హిందూ ఉద్యమం హిందూ పతాకం కింద ఉండే వారెవరినీ దేశం నుండి బయటకి పంపించే ఆలోచనలో లేదు.' అని అన్నారు.

మాలవ్య నేతృత్వంలో మహాసభ సభ్యులు కాంగ్రెస్‌లోకి బాగానే చొచ్చుకుపోయారు. వారు గాంధీ సిద్ధాంతాలను, స్వరాజ్యం కోరుకునే భాగాన్ని కూడా వ్యతిరేకించారు. 1926లో జరిగిన స్థానిక ఎన్నికలలో మహాసభ తన సభ్యులను నిలబెట్టడమే కాక తన హిందూ ప్రయోజనాలను కాపాడుకోవాలనుకున్న చోట కాంగ్రెస్ అభ్యర్థులు లేకుండా కూడా నిలవరించింది. 1920లలో ప్రారంభమైన హిందూ మహాసభను శ్రద్ధానంద స్వామి పునరుత్తేజపరిచారు. శ్రద్ధానంద బ్రాహ్మణులను, కులాల మధ్య అంతరాలను విడిచిపెట్టాలని వేడుకున్నాడు. హిందువులలో ఉన్న రాజపుత్రులు, క్షత్రియులు, జాట్లు, గుజ్జర్లు, ఇతరులు కలిసి హిందువులుగా వ్యవహరించాలని కోరారు. అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేయాలనీ, అయితే ముస్లింల మాదిరి ఒకే కంచంలో తినడం కాక ఎవరి కంచాలలో వారు కలిసి భోజనాలు చేయాలని

నిర్ణయించారు. హిందీని, దేవనాగరి లిపిని భారత దేశమంతా అమలు చేయాలని, ఇది హిందూ జాతి సంఘటనకు, సమైక్యతకు మొదటి అడుగు అవుతుందని, హిందూ రాష్ట్ర మందిరాన్ని ప్రతి పట్టణంలో, పెద్ద నగరంలో నిర్మించాలనీ పిలుపునిచ్చారు. హిందూరాష్ట్ర మందిరంలో గోవు మాతగా కొలవబడుతుంది, జ్ఞానానికి, మాతృత్వానికి చిహ్నంగా ఉంటుంది. 1925 కల్లా హిందూ మహాసభ ఆర్ఎస్ఎస్ భావజాలం గల శక్తివంతమైన సంస్థగా ఎదిగింది. ఆర్ఎస్ఎస్‌కి హిందూ మహాసభకు రెండు విషయాలలో తేడాలున్నాయి. 1. మహాసభ నాయకులు రాజకీయవేత్తలు; వారు ఎన్నికలలో పాల్గొంటారు. మాలవ్య, లజపతి రాయ్ కూడా కాంగ్రెస్ కేంద్ర కమిటీ సభ్యులు. రెండోది వారిరువురికి హింస అంటే గిట్టదు. 19వ శతాబ్దపు హిందూ పునరుజ్జీవ మహామహులు గౌరవప్రదమైనవారు, పండితులు, నాగరికులు. కానీ, హెగ్డేవార్, గోల్వాల్కర్ నుంచి నేటి వరకు ఆర్ఎస్ఎస్ నాయకులు అందుకు పూర్తిగా భిన్నమైనవారు. వారు విద్యావంతులు కారు; మోటు మనుషులు; నిరంకుశులు. విద్వేషాలను, హింసను విస్తరించేవారు.

ఆర్ఎస్ఎస్‌కి ఎన్నికల రాజకీయాలంటే గిట్టవు; సంఘ నిర్మాణానికి హింసని వినియోగించేవారు. నాగ్‌పూర్‌లో మత అల్లర్లు చెలరేగగానే 'శత్రువును గెలవడమే' ధ్యేయంగా పెట్టుకున్నారు. వారి చేతిలోని లాఠీ ఒక అలంకారం కాదు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమంలో అదొక భాగం. హెగ్డేవార్ గురువు, మూంజ యే దాని వాడకాన్ని ఆమోదింపచేసుకున్నారు. దసరా నాడు స్వయం సేవకులు లాఠీని వినియోగించడంలో వారి నైపుణ్యాన్ని ప్రదర్శించేవారు.

2007 డిసెంబర్ 20న జరిగిన 'ఢిల్లీ విజ్ఞానవేత్తలలో' మొహన్ భగత్ ఇలా ప్రకటించారు.

'మీరు గనక పోలీస్ శిక్షణను పరిశీలించినట్లైతే, వారి శిక్షణలో 25% మాత్రమే ఆయుధంతో కూడి ఉంటుంది. మిగిలిన 75% శిక్షణ స్వయం సేవకులకు ఇచ్చే శిక్షణే. ప్రజానీకానికి ఆయుధాలలో శిక్షణ ఇవ్వడానికి 4-5 నెలలు పడుతుంది కానీ, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు 3-4 రోజులు శిక్షణ ఇస్తే సరిహద్దులో యుద్ధానికి తీసుకుని వెళ్ళవచ్చు. అందువలన లాఠీ చేతిలో ఉండడం వారికి ప్రధానం. అందువలన ఆర్ఎస్ఎస్ శిక్షణలో కర్ర ఒక భాగంగా ఎప్పటికీ ఉండిపోతుంది.

ఈ ముక్తాయింపుకు తిరుగు లేదు, కంటికి స్పష్టంగా కనిపిస్తున్నది. హిందూ జాతీయవాదానికి ఆర్ఎస్ఎస్ ఒక సాయుధ, సైనిక అంగం. అధికారం హస్తగతం చేసుకోడానికి, భారతదేశంలో భారత జాతీయతను తుడిచిపెట్టడానికి ఏర్పడింది.

◆

# భారత జాతీయవాద నిబద్ధత

**భా**రతదేశం రెండుగా విభజించబడిన చీకటి రోజుల్లో, ఆదర్శవంతమైన లౌకికవాద నిబద్ధతకు జాతి కచ్చితంగా కట్టుబడి ఉండేందుకు జవహర్‌లాల్ నెహ్రూ చేసిన కృషి, చూపిన నైతిక స్థైర్యం అమోఘం. వాటి గురించి ఎంత గొప్పగా చెప్పుకున్నా తక్కువే అవుతుంది. ఆయనే ఆ విలువలను కాపాడేందుకు స్పష్టమైన స్థిరమైన ప్రయత్నాలు చేసిన ఏకైక వ్యక్తి. అయితే నెహ్రూ 'లౌకిక' అనే పదాన్ని కనుగొనలేదు. అది కాంగ్రెస్ ఆలోచనలో భాగమే. అలాగే మైనారిటీల హక్కులు, రాజ్యం వివిధ మత నమ్మకాలలో కల్పించుకోకపోవడం కూడా; హిందూ రాజ్య భావన సంపూర్ణంగా కచ్చితంగా వ్యతిరేకించబడింది. ఈ విషయం 1885 నుండి భారతజాతీయ కాంగ్రెస్ చరిత్రను అధ్యయనం చేసినపుడు ఈ విషయం అర్థం అవుతుంది.

1885 డిసెంబర్ 28వ తేదీ కాంగ్రెస్ మొదటి మహాసభలో మొదటి అధ్యక్షుడు అయిన డబ్ల్యూ సి బెనర్జీ, కాంగ్రెస్ లక్ష్యాలను ప్రతిపాదించారు. 'అందులో ఒకటి ... 'వీలయినంత వరకు జాతి, మత ప్రాంత విభేదాలను తొలగించాలి, ... పరిపూర్ణ. జాతి అభివృద్ధికి ఏకీకరణకి కృషి చేయాలి... జాతి ఐక్యమనే భావనని కల్పించాలి' ...సూక్ష్మంగా చెప్పుకోవాలంటే అందరినీ కలుపుకుపోయే జాతీయత. 1885, 1934 మధ్య కాలంలో జరిగిన కాంగ్రెస్ మహాసభల తీర్మానాలను జి ఏ గణేశన్, కాంగ్రెస్ రెసొల్యూషన్స్ అండ్ ప్రెసిడెన్షియల్ అడ్రెస్సెస్ అనే పుస్తకాన్ని ప్రచురించారు. అందులో 1886లో జరిగిన రెండో కాంగ్రెస్ మహాసభలో 'కాంగ్రెస్ భౌతిక ప్రయోజనాలను కాపాడుతుంది కాని ఆధ్యాత్మికాంశాలు కాదు. దేశ ప్రజల ప్రయోజనాలు, హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలు ఎవరైనా వారి వారి సమిష్టి లౌకిక ప్రయోజనాలను గురించి చర్చించవచ్చు..' అని వ్రాసారు.

'1895లో సురేంద్రనాథ్ బెనర్జీ, 'కాంగ్రెస్ మాత్రమే భారతదేశాన్ని ఐక్య మత్యంగా నిలిపింది. హిందువులు ముస్లింలు, క్రిస్టియన్లు, పార్సీలు, సిక్కులు ఒకే వేదిక మీద నుండి – మన మధ్య ఎన్ని మత, సామాజిక విభేదాలున్నప్పటికీ .. మన ఉమ్మడి హక్కుల కోసం, ఉమ్మడి సమస్యలను పరిష్కరించుకోడం కోసం  మన దేశ పౌరులలో ఒక నూతనోత్సాహాన్ని నింపాలి... ఇదే భారత జాతీయత.. భారత జాతీయ కాంగ్రెస్, ఈ కొత్త భారత జాతీయతకే కట్టుబడి ఉంది.' అన్నారు.

1896లో ముంబైకి చెందిన ఒక ముస్లిం, ఆర్ఎం సయాని ఐక్య భారతదేశం పై ఇచ్చిన అధ్యక్షోపన్యాసంలో "భారత జాతీయత ఆధారంగా 'ఐక్య భారత దేశం' ఉండాలని" అన్నారు.

1909లో హిందువులలో, మొహమ్మదీయులలో, క్రిస్టియన్లలో, పార్సీలలో దేశభక్తి పొంగి పొర్లి అన్నదమ్ముల భావన పెంపొంది అన్ని మతాల ప్రజలు అన్ని నదుల పాయలు, నదిలో కలిసినట్టుగా కలిసి ఒక మహోన్నత ఐక్య దేశాన్ని ఏర్పరచుకోవాలి అని మాలవ్యా అన్నారు.

1923లో మౌలానా మొహమ్మద్ ఆలీ, 'నేను అమెరికా సమాఖ్య కన్నా అద్భుతమైన, ఎన్నోరెట్లు ఆధ్యాత్మికమైన గొప్ప భారతదేశాన్ని గురించి కలలు కంటున్నాను' అన్నారు.

1926లో ఎస్ శ్రీనివాస అయ్యంగార్ తన అధ్యక్షోపన్యాసంలోని పలుకులు ఈనాడు వంద సంవత్సరాల తరువాత మరింతగా గుర్తుచేసుకోవలసినవి. ఆయన, 'కాంగ్రెస్ ఆదర్శవంతంగా భావిస్తున్న జాతీయత, ఐకమత్యం, సమన్యాయం అనుసరించదగ్గవి. మతతత్వం నేటికీ జాతీయతకు విరుద్ధం, స్వరాజ్యానికి అడ్డుకట్ట' అన్నారు. ఇంకా .. హిందువులకు ముస్లింలకు లేదా బ్రాహ్మణులకు బ్రాహ్మణేతరులకు ఉన్న భేదాలు వారు ఒకే జాతిగా ఉండేందుకు అడ్డంకి కావు. వారి ఉమ్మడి ప్రయోజనాలు కాపాడుకోడానికి, జాతి పురోగతికి, స్వయం పరిపాలిత సంస్థలు ఏర్పాటు చేసుకోడానికి ఈ భేదాలు అడ్డురావు.'

సిద్ధాంతాలు, సంస్థలు సామాజిక ప్రయోజనాలు, పర్సనల్ లాలు ఆయా మతాలకు, వారి వారి సంస్కృతులపై ఆధారపడి వేరుగా ఉండవచ్చు.  అందువలన స్వరాజ్యమనే ప్రాథమిక చట్టానికి లోబడి, విచక్షణ స్వేచ్ఛ, మత క్రతువుల నాచరించే స్వేచ్ఛ, సంఘటితపడే స్వేచ్ఛ, ఆయా మత బోధనా స్వేచ్ఛ, పర్సనల్ లా కలిగి ఉండేందుకు స్వేచ్ఛలను భారత రాజ్యాంగం చేసే చట్టాలు రక్షించేవిగా ఉండాలి.' అన్నారు.

పైగా ఈ రోజు ఏ ఒక్క జాతి లౌకిక విధానంలో వెనుకబడినా దేశం ముందుకు పోలేదు. మతతత్వంతో ఇతర మతాలను అనుసరించే వారిని ధ్వంసం చేసి తద్వారా తాము మరింత ఎక్కువ ప్రయోజనం పొందాలనుకునే ఆలోచన సానుకూల దృక్పథం కాదు.

'మతం, రాజకీయాలలో చొరబడడాన్ని, ముఖ్యంగా సర్వసాధారణమైన మతపిడివాదం వైపుకు మరలడాన్ని అడ్డుకోవాలి. మతానికి రాజకీయాలపై అజమాయిషీ కలిగి ఉండడం అనేది ఆదిమ, మధ్యయుగాలనాటి ఆలోచన; పురోహిత పాలన నుండి పుట్టినది; ఈ ఆలోచన రాజకీయాలకు, మతానికి కూడా వినాశకరమైనది.'... హిందూ మతం గాని ఇస్లాం మతం గాని ఇతర మతం అనుసరించడం వలన నాశనమవుతుందని భయపడవలసిన అవసరం లేదని స్పష్టంగా అర్థంచేసుకోవాలి. రెండూ ఉన్నతమైన మతాలు; ప్రాచీనమతాలు; రెండు మతాలను అనుసరించే ప్రజలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

'హిందూ ముస్లిం మతాలవారు దేశభక్తిగల పౌరులుగా, నమ్మకమైన దృఢమైన స్నేహితులుగా కలసిమెలిసి గతంలో నివసించారు. భవిష్యత్తులో కూడా నివసిస్తారు. ప్రజాజీవితంలో, రాజకీయాలలో, దేశ సమస్యలపై వారు భారతీయులుగా సునాయాసంగా ఉంటారు. ఉండాలి కూడా.'

1927లో భారతదేశంలో మతసామరస్య వాతావరణంలో కొంత క్షీణత కనిపించిన సందర్భంలో, ఎంఏ అన్సారీ ఇలా అన్నారు 'హిందూ ముస్లింల మధ్య సమస్యలను పరిష్కరించుకుంటున్నప్పుడు ఏర్పడ్డ రోగ లక్షణాలను రోగంగా భావించకూడదు. రెండు మతాల మధ్య రాజకీయ మతపరమైన విభేదాలు, మరింత లోతుగా ఉండే విభేదాల బాహ్య వ్యక్తీకరణలు. ఇవి భారతదేశానికే పరిమితం కావు; చరిత్రలో కొత్త కూడా కాదు. ఇవి ఎవరికి వారికే ప్రత్యేకంగా గల రెండు విభిన్న సంస్కృతులు. ఒకదానికొకటి కలిసినప్పుడు ఏర్పడే సమస్యలు. దీనికి ఉన్నతమైన పరిష్కారం రెండు సంస్కృతులను గుర్తించడం, సహనశీల భావాన్ని పెంపొందించుకోవడం, గౌరవాన్ని పెంచుకోవడం, సాంస్కృతికంగా పరస్పర అనుబంధాలను పెంచుకోవడం, అభివృద్ధి చేసుకోవడం. ఇది రెండు మతాల యువకులు ఒక చోటికి చేరే జాతీయ సంస్థలను ప్రారంభించడం ద్వారా సాధ్యపడుతుంది. అప్పుడు యువకులు ఒకరితో ఒకరు కలిసే అవకాశం ఉంటుంది; ఆలోచనలను అర్థం చేసుకుంటారు; ఆ ఆలోచనల వెనకున్న నాగరికతలు తెలుసుకుంటారు.

దురదృష్టవశాత్తు దేశంలో ఏర్పడ్డ విభజన, పైన పెద్దలు చెప్పిన అంశాలను మరుగుపరచకూడదు. 1931 కరాచీ కాంగ్రెస్‌లో, మౌలానా మహమ్మద్ అలీ దేశభక్తికి నివాళులర్పిస్తూ, వల్లభాయ్ పటేల్, 'దేశం రెండు వందల ఏళ్లుగా దోపిడీకి గురవుతున్నది – నరేంద్రమోడీ లాగా లేదా ఆర్‌ఎస్‌ఎస్ లాగా 1000 ఏళ్ళనలేదు– మతాల సమస్యకి పరిష్కారం చూపించని ఏ రాజ్యాంగ వ్యవస్థలో అయినా కాంగ్రెస్ భాగస్వామి కాదు; రాజ్యాంగం భాగస్వాములనందరిని సంతృప్తి పరచగలగాలి. నేను నా ముందు పనిచేసిన వారి సూత్రాన్నే అనుసరిస్తాను. మైనారిటీలకు స్వదేశంలో తయారైన పెన్ను, కాగితం బహుమతిగా ఇస్తాను. అందులో వారి డిమాండ్లను రాయనివ్వండి. వాటిని నేను ధ్రువపరుస్తాను. ఇది చాలా సులువైన పద్ధతి. ఇందుకు హిందువులకు ధైర్యం కావాలి. కానీ, మేము కోరుకునేది కేవలం కాగితాలపై ఐక్యత కాదు. అతుకులేసిన ఐక్యత కొద్దిపాటి రాపిడికే  చెదిరిపోతుంది; మనసుల కలయిక మెజారిటీగా ఉన్న హిందువులు ధైర్యంగా తమ రెండు చేతులతో మైనారిటీలను అక్కున చేర్చుకుంటేనే సాధ్యపడుతుంది. ఇదే విజ్ఞతకు పరాకాష్ట' అని అన్నారు.

1940లో మౌలానా రాంగడ్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభలో అధ్యక్షోపన్యాసం చేయడానికి వెళ్లిన మూడు రోజుల ముందు, లాహోర్‌లో ముస్లిం లీగ్, పాకిస్తాన్ ఏర్పడాలన్న తీర్మానం ఆమోదించింది. పరిస్థితులు వేగంగా మారిపోయాయి. మారిన పరిస్థితులలో మౌలానా, 'ఒక ముసల్మాన్‌గా ఇస్లాం మతం, సంస్కృతి అంటే ప్రత్యేకంగా నాకు ఇష్టం. వాటిలో జోక్యం చేసుకోడాన్ని నేను సహించలేను. అయితే, వీటికి తోడుగా నాకు పుట్టుకతో సంక్రమించిన, నా జీవితానికి సంబంధించిన కొన్ని వాస్తవాలు కూడా ఉన్నాయి. ఈ సెంటిమెంట్లకి ఇస్లాం ఏమాత్రం అడ్డుకాదు. పైగా అది నన్ను ముందుకు నడిపిస్తుంది కూడా. నేను భారతీయునిగా గర్విస్తున్నాను. నేను అఖండ భారత దేశంలో, భారత జాతిలో ఒక భాగం. ఈ అసంపూర్ణ భారతదేశ నిర్మాణంలో నాకు కూడా భాగస్వామ్యం ఉంది. నా ఈ హక్కును నేనెన్నడూ వదులుకోను. భారతదేశంలోకి అనేక మానవ జాతులు, సంస్కృతులు, మతాలు వచ్చి చేరుతూనే ఉండేవి. చరిత్ర ప్రారంభానికి ముందు నుండి ఇది జరుగుతున్నదే. ఈ సస్యశ్యామల భూమి అందరిని ఆహ్వానించింది. అక్కున చేర్చుకుంది. అలా వచ్చి చేరిన చివరి మూడు జాతులలో ముస్లింలు ఒకరు. అలా వచ్చి చేరిన తరువాత హిందూ ముస్లిం సాంస్కృతిక స్రవంతులు గంగ యమునలలాగా ఈ దేశ భూమి పై వేర్వేరుగా స్రవించి సంగమంగా కలిసిపోయాయి. ఈ కలయికకు చారిత్రక ప్రాధాన్యం ఉంది. ప్రాచీన భారత దేశం కొత్త రూపు సంతరించుకుంది. మేము మాతో పాటు సంపదను తెచ్చాము; భారతదేశానికి ఎంతో అవసరమైన విలువైన ఇస్లామిక్ కానుకలు,

ప్రజాతంత్రం, సమానత్వం తెచ్చాం. పదకొండు శతాబ్దాలు గతించాయి. ఇప్పుడిక ఇస్లాంకి కూడా హిందూమతానికున్నట్టుగానే భారత దేశ గడ్డ పై పూర్తి హక్కు ఉంది. 1930ల మధ్యకి వచ్చేసరికి మతసామరస్యం మరింత దిగజారింది. ఎన్నికైన కాంగ్రెస్ కమిటీలలో మతతత్వ పార్టీలలో సభ్యత్వం ఉన్న సభ్యులు ఉండకూడదని కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసింది. అంతేకాదు, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ జాతి వ్యతిరేకి, పార్టీ ప్రయోజనాలకు భంగం అని భావించబడినవారు ఏ కమిటీలోనూ ఎన్నికకావడానికి వీలు లేదు. సభ్యుడు, రాజకీయ కార్యక్రమాలు లక్ష్యంగా ఉన్న ఏ మతతత్వ సంస్థలలో సభ్యునిగా ఉండకూడదు.' అని తీర్మానించింది. కేవలం 1938లో మాత్రమే హిందూ మహాసభ, ముస్లిం లీగ్‌లను మతతత్వ పార్టీలుగా గుర్తిస్తున్నట్టు ప్రకటించింది.

దీనిని ఎంతవరకు అమలు చేశారన్నది వేరే విషయం. కార్యదర్శి జెబి కృపలాని ఆర్టికల్ 5(సి) ప్రకారం 'మతతత్వ పార్టీ ప్రాథమిక సభ్యత్వం కాదు ఎన్నికైన సంఘ కమిటీలో ఉండకూడదని' అర్థం చెప్పారు. అంటే, మతతత్వ సంస్థలలోని సామాన్య సభ్యుడు కాంగ్రెస్‌లో ఆఫీస్ బేరర్‌గా ఉండవచ్చు.

భారతదేశ విభజన కాంగ్రెస్ నాయకుల సంకల్పాన్ని మార్చలేదు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు భారతదేశం లౌకిక రాజ్యంగానే ఉంటుందని భావించారు. సభ్యులు రాజ్యాంగ పరిషత్‌లో ఈ అవగాహనతోనే ఈ విషయం చర్చించవలసిన అవసరం ఉంటుందనుకోలేదు. దానిని స్పష్టంగా రాయాల్సి ఉంటుందనుకోలేదు. సుప్రీం కోర్టు లౌకికత రాజ్యాంగంలోని 'సవరణ' చేయలేని మౌలిక అంశంగానే పరిగణించింది. 42వ సవరణ ద్వారా అంతర్గతంగా ఉన్నదానిని బహిర్గతపరచడం మాత్రమే జరిగిందని సుప్రీం కోర్టు అభిప్రాయపడింది.

1948 డిసెంబర్ 3వ తేదీ ప్రొఫెసర్. కె టి షా ఈ సవరణను ప్రతిపాదించారు. 'భారత రాజ్యం లౌకిక రాజ్యం అయినందువలన రాజ్యానికి ఏ మతంతో అయినా, నమ్మకంతో అయినా, ఎటువంటి సంబంధం ఉండకూడదు. రాజ్యం ఏ తరగతి వ్యక్తి అయినా, రాజ్యవాసియైనా మతానికి సంబంధించిన అన్ని విషయాలలోనూ తటస్థంగా ఉండాలి.' అనే ఈ ప్రతిపాదనను సభ్యులు ఆమోదించారు. మనం భారతదేశం లౌకిక రాజ్యం అని పదే పదే చెప్తున్నాం. స్పష్టంగా ఉన్నదానిని గురించి రాసుకోవలసిన అవసరం లేదు. అయితే, ఈ సవరణ ఎందుకూ పనికి రాకుండా పోయింది.

అదే రోజు లోకనాథ్ మిశ్రా, హెచ్ వి కామత్, పండిట్ లక్ష్మి కాంత మిశ్రా కూడా ఇదే మాట చెప్పారు.

'లౌకిక రాజ్యం అంటే రాజ్యం ఒక వ్యక్తి ఒక మతాన్ని విశ్వసిస్తునందుకు వివక్షతకు గురికాకూడదు. అంటే, రాజ్యం ఏ మతానికి ప్రత్యేకంగా ప్రాపకం

ఇవ్వకూడదు. రాజ్యం ఏ మతాన్ని నిర్మించదు. పోషించదు. ప్రోత్సహించదు. ఏ పౌరుడూ మత ప్రాతిపదికన వివక్షతకు గురికాడు. అంటే, రాజ్యానికి సంబంధించినంత వరకు వ్యక్తి మతం పరిశీలించబడదు.'

తరువాతి కాలంలో లోక్ సభ స్పీకర్‌గా ఉన్న ఎం. అనంతశయనం అయ్యంగార్ 1948 డిసెంబర్ 7వ తేదీన, 'రాజ్యాన్ని లౌకిక రాజ్యంగా ఉంచాలని మేము ప్రమాణం తీసుకున్నామని' తెలియజేసారు.

1994లో సుప్రీం కోర్టు 'లౌకికత' రాజ్యాంగంలో సవరించడానికి వీలుకాని మౌలిక అంశమని తీర్పునిచ్చింది.

కానీ, ఈ చట్టాలను ఉల్లంఘించకుండా ప్రభుత్వాలను ఏ పరిపాలనా విధానాలూ ఆపలేకపోయాయి. చారిత్రక నివేదికలు నాలుగు వాస్తవాలను నమోదు చేసాయి. మొదటిగా 1885లోనే దేశం ఆదర్శవంతమైన లౌకికవాదాన్ని స్వీకరించింది. రెండోది, అదే సమయంలో హిందూమత పునరుజ్జీవంతో హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్‌లు ఆవిర్భవించాయి. మూడోది, ఇవన్నీ భారత లౌకిక జాతీయవాదంపై యుద్ధం ప్రకటించాయి. చివరిగా, వారెవరూ భారత జాతీయోద్యమంలో భాగస్వాములు కారు. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీని తుడిచిపెట్టడానికి లేదా అణచివేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదంతో చేతులు కలిపినవారు.

◆

# బ్రిటిష్ వారితో కుమ్మక్కు
# ఆండర్సన్, డాల్మేల నమోదు

**సాం**ప్రదాయక అర్థంలో చూస్తే గోల్వాల్కరిని ఒక తిరుగుబాటుదారుడని అనలేం. బ్రిటిష్ వారికి ఈ విషయం బాగా అర్థమైంది. 1943లో గృహ విభాగం అధికారికంగా సమర్పించిన ఒక రిపోర్ట్‌లో, 'ఆర్ఎస్ఎస్ చట్టానికి తక్షణం కీడు కలిగిస్తుందని వాదించడం కష్టం. అని, అలాగే 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమం సందర్భంలో జరిగిన హింస విషయంలో స్పందిస్తూ, 'సంఘ్ చట్ట పరిధిలోనే పూర్తిగా పని చేస్తున్నది, ముఖ్యంగా 1942 ఆగస్టు అల్లర్లలో పాల్గొనలేదు...' అని ఉంది.

1939 సెప్టెంబర్‌లో రెండో ప్రపంచ యుద్ధం మొదలైన వెంటనే కాంగ్రెస్ ప్రాంతీయ పాలనాధికారులు రాజీనామాలు చేసారు. కానీ, సావర్కర్ వైస్రాయ్‌ని కలిసి బ్రిటిష్ పాలకులకు తన సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. ఈ విషయం లింలిత్గో, భారత కార్యదర్శి లార్డ్ జైట్లాండ్‌కి ఈ విధంగా రిపోర్ట్ చేశారు.

...' ఇప్పుడు ప్రభువులు తమ పాలనకు హిందువుల మద్దతు తీసుకోవాలి. గతంలో హిందువులకు బ్రిటిషువారితో, ఫ్రెంచ్ వారితో, రష్యన్‌లతో, జెర్మన్‌లతో కూడా సమస్యలుండేవి. కానీ, ఇప్పుడు ఉన్న పరిస్థితి వేరు. అయితే, మన ఇద్దరి ప్రయోజనాలు ఒకటే; కాబట్టి మనం ఇద్దరం కలిసి పనిచేయాలి. ఒకప్పుడు నేను తిరుగుబాటుదారునిగా ఉన్న మాట వాస్తవమే కానీ, ప్రస్తుతం మన ప్రయోజనాలు కలుస్తాయి. కాబట్టి హిందువులతో బ్రిటీషువారు స్నేహంగా ఉండడం అత్యవసరం. పాత కక్షలు ఉండాల్సిన పని లేదు.'

1911 జులై 4 అండమాన్ జైలుకు చేరిన తరువాత సావర్కర్ రాసిన లేఖలో భాగమిది. స్వతంత్రం పొందిన తరువాత ఈ రికార్డులు బయటపడ్డాయి. అందువలనే

వాజ్‌పాయ్ ప్రభుత్వ హయాంలో అప్పటి మానవ వనరుల మంత్రి, మురళి మనోహర్ జోషి పాత పత్రాల ప్రతుల ప్రచురణను నిలిపివేశారు.

అయినా, ప్రొఫెసర్ బిపిన్ చంద్ర లాంటి పరిశోధకులు, 'ఆధునిక భారతదేశంలో మతతత్వం' అనే గ్రంథంలో, "1880లలో మొదలైన గో రక్షకోద్యమం ముస్లింలకు వ్యతిరేకంగా మలచబడింది; అయినా బ్రిటిష్ వారి శిబిరాలలో మాత్రం యథేచ్ఛగా పెద్ద ఎత్తున గోవులు వధించబడేవి", అనే విషయాలను గ్రంథస్తం చేసారు.

జనసంఘ్ వ్యవస్థాపకుడు, హిందూ మహాసభ సభ్యుడు, శ్యాం ప్రసాద్ ముఖర్జీ కూడా తన నాయకుడిని అనుసరించడంలో ఏ మాత్రం వెనక పడలేదు. ఆయన, ఏకె ఫజల్ హాక్ నాయకత్వంలోని బెంగాల్ మంత్రి వర్గంలో ఉన్నప్పుడు, 'పాకిస్తాన్ తీర్మానం' ప్రవేశపెట్టారు.

ఆయనప్పుడు హిందూ మహాసభ సభ్యుడు. అయినప్పటికీ, సింధు అసెంబ్లీలో భారతదేశంతో విడిపోవడానికి మద్దతునిచ్చారు అన్న విషయం గమనించాలి. 1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని ఆర్ఎస్ఎస్ వ్యతిరేకించడమే కాదు, ఎస్‌పి ముఖర్జీ బెంగాల్ గవర్నర్, సర్ జోన్. హెర్బర్ట్‌కి ఒక లేఖ కూడా రాసారు. '... కాంగ్రెస్, దేశం క్లిష్ట కాలంలో ఉండగా ఉద్యమం లేవదీసింది. యుద్ధ కాలంలో ఎవరైనా ప్రజల మనోభావాలు రెచ్చగొట్టి, దేశంలో అశాంతి, అభద్రతను సృష్టిస్తే ప్రభుత్వం దానిని ప్రతిఘటించాలి... మీకు, మాకు గత కాలంలో విభేదాలున్న మాట నిజమే. కాని వాటిని ఇప్పుడు తవ్వుకోవద్దు. ఈనాటి సమస్య, భారత దేశంతో సహా జర్మనులు మానవ స్వేచ్ఛపై చేస్తున్న దాడి. మీరెలాగూ భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. కాబట్టి, మీకు మాకు ఇక శత్రుత్వం లేదు. అందువలన ఇప్పుడు సమస్యల్లా బెంగాల్‌లో చెలరేగుతున్న ఉద్యమాన్ని ఎలా అణచాలన్నదే. బెంగాల్‌లో ఈ ఉద్యమం వేళ్లూనుకోలేదు. బాధ్యతగల మా మంత్రులు, ఇప్పటికే ప్రజా ప్రతినిధులకు మీరు అధికారాలు ఇచ్చారని. అత్యవసర పరిస్థితి ముగియగానే బ్రిటిష్ ప్రభుత్వం మరికొన్ని అధికారాలను ఇస్తుందని, బ్రిటిష్ వారిని భారతీయులు నమ్మాలని ప్రజలలో ప్రచారం చేస్తారు...' అన్నది ఆ లేఖలోని ముఖ్యాంశం.

'ఇప్పుడు మీరు బెంగాల్ సేనలు, వాయు, సముద్రసేనలు తమను తాము కాపాడుకోవాలని ఆదేశాలివ్వండి...' అనికూడా లేఖలో జోడించారు.

'దేశ పరిస్థితులు ఎలా మారబోతున్నాయో ఎవరూ ఊహించలేరు. మీ మంత్రులలో ఒకడిగా నేను ఈ దేశాన్ని పరిపాలించడానికి ఈ సంక్షోభ కాలంలో పూర్తి సహకారాన్ని అందిస్తాను.' అని ఇలా కొనసాగిందా లేఖ.

ముఖర్జీ జిన్నాను ముంబైలో కలిసి మూడు గంటల పాటు చర్చలు నడిపారు. శ్యాంప్రసాద్ ముఖర్జీకి హిందూ రాజ్యం అంటే స్పష్టమైన అవగాహన

ఉన్నది. '75% హిందువులున్న దేశంలో భారతదేశం ప్రజాస్వామ్యాన్ని అనుసరిస్తే, రాజ్యాంగం ఎలా ఉన్నా హిందువులే ఎక్కువగా ఉండడం వలన వారే పరిపాలనలో ప్రముఖ పాత్ర పోషించగలరు. అందువలన ఏ రకమైన విభజన ప్రతిపాదనను మేము అంగీకరించం. ఇదొక మెజారిటీ ప్రజల రాజ్యం. మెజారిటీ ప్రజలు చేసిందే ఇక్కడ చట్టం అవుతుంది. మైనారిటీలకు ఇందులో స్థానం లేదు.' ముఖర్జీ చేసిన ఇటువంటి వ్యాఖ్యలు విభజనకు దారి తీశాయి.

హిందువులు తాము కోల్పోయిన ప్రాచీన ప్రభావాన్ని తిరిగి చేకూర్చి పెట్టాలన్నదే తన సంకల్పంగా చెప్పుకున్నారు. బెంగాల్‌లో 54, శాతం ముస్లింలున్నా అందులో అత్యధికులు చదువు లేని వారు, పేదలు అయినందువలన, ఆర్థికంగా, చదువులోనూ ఇతర అనేక విధాలుగా హిందువులకన్నా నీచ స్థాయిలో ఉన్నప్పటికీ, 'హిందువులే మైనారిటీలని, వారే మతతత్వ హింసకు బలి అవుతున్నారని' ప్రచారం చేసారు. సావర్కర్ 1939లో బెంగాల్ వచ్చినపుడు ఆయన సమక్షంలో మహాసభలో చేరారు. 1943లో సావర్కర్ తరువాత అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఏడేళ్ల తరువాత తన ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి భారతీయ జనతా పార్టీని స్థాపించారు.

ఈ ఆలోచనలే ఈనాడు నరేంద్రమోడీ మాటలలో, చేతలలో కనిపిస్తాయి. – 'హిందువులు వారి జాతి చైతన్యాన్ని అభివృద్ధి చేసుకోవాలి. ఏదో హ్రస్వదృష్టితో కాదు; ప్రపంచవ్యాప్త మానవ అభ్యున్నతికి కంకణం కట్టుకోవాలి. శతాబ్దాల బానిసత్వం మనల్ని చైతన్యహీనులను చేసింది. మనం స్వేచ్ఛాయుత, గర్వించదగ్గ జాతి వారసులమన్న విషయాన్ని మరిచిపోయాం; విదేశీయుల సంస్కృతి ఆలోచనలు మనలను ప్రభావితం చేస్తున్నాయి.'

మతతత్వం జాతీయతతో పెనవేయబడింది. ఈ వాస్తవం సాధారణంగా మరుగునపడిపోతున్నది. జాతీయ సైన్యాన్ని నిర్మించడం హిందూ మహాసభ లక్ష్యాలలో ఒకటి... అత్యవసర కాలంలో అది అణచివేయబడుతున్న గౌరవాన్ని స్వేచ్ఛను రక్షించేందుకు సిద్ధంగా ఉండాలి. హిందూ మహాసభకు అహింస అంటేనే పొసగదు. దశాబ్దాల రాజకీయ బానిసత్వం హిందూ పౌరుషాన్ని అణచివేసిందని, ప్రజల నడ్డి విరిచిందని వారి నమ్మకం. అందువలన మఠాలు, గుడులు చొరవ తీసుకుని హిందువులను చైతన్యవంతులను చేయాలనీ శ్యాంప్రసాద్ ముఖర్జీ భావించారు.

బ్రిటిష్ వారితో కుమ్మక్కైన వారి విధానం, 1941 నవంబర్‌లో వారికి బాగా ఉపయోగపడింది. మహాసభ హిందువులను సైన్యంలో చేరాలని పిలుపునిచ్చింది; బ్రిటిష్ ప్రభుత్వం అందించిన అన్ని వసతులను సంపూర్ణంగా వారి ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారు; ఆయన తర్కం సామాన్యం. దేశంలో అధికంగా ఉండే హిందువుల ప్రయోజనాలే దేశ ప్రయోజనాలు అయినప్పుడు వారి హక్కుల

కోసం నిలబడడంలో తప్పేంటి అనేది వారి వాదన. ఆ సమయంలో గాంధీజీ, అంటే 1921 డిసెంబర్ 31న, భారతదేశం సంపూర్ణ స్వరాజ్యం కోరుకుంటున్నదని ప్రకటించినట్టు ఆరోపించారు. అది అబద్ధం. ఆ సంవత్సరం గాంధీజీ హస్రత్ మోహిని ప్రవేశపెట్టిన సంపూర్ణ స్వరాజ్య తీర్మానాన్ని వ్యతిరేకించారు. సంపూర్ణ స్వరాజ్యానికి ఇంకా సరైన సమయం రాలేదని ప్రకటించారు. చుట్టూ జరుగుతున్న వాస్తవ సంఘటనలతో ఆయన ఏ మాత్రం సంబంధం పెట్టుకోదలుచుకోలేదు.

మరోవైపు ముఖర్జీ ఆర్ఎస్ఎస్ తో మహాసభ సంబంధాలను బలపరుచుకునే ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 1940లో హెగ్డేవార్‌ను కలిశారు. ఆర్ఎస్ఎస్ వ్యూహం ఫలించింది. 1942 అక్టోబర్ 25న సంఘ్ 1500 శాఖలను, రెండు లక్షల సభ్యత్వాన్ని ఏర్పాటు చేసుకుందని గోల్వాల్కర్ ప్రకటించారు. వారి సభ్యులు అన్ని కీలక స్థానాలలోను, సైన్యంలోను, పరిపాలనలోను చేరిపోయారు. ప్రభుత్వ కార్యాలయాలలో, ఉపాధ్యాయులతో, జబల్పూర్‌లోని గన్ క్యారేజ్ పరిశ్రమలో, ఖమారియా ఆర్డినెన్సు ఫ్యాక్టరీలో అధికారులకు ఈ విషయాలు తెలియకపోలేదు.

ఆర్ఎస్ఎస్ ఈ 'రహస్యాన్ని' గట్టిగా తొక్కిపెట్టింది. అధికారుల దృష్టికి దూరంగా ఉంచింది. 'హిందువులచే పాలించబడే రాజ్యమే' వారి అంతిమ లక్ష్యం అయినందు వలన అందుకోసం పటాటోపాలు లేకుండా పనిచేసుకుపోతున్నది. 1944 జనవరి 21వ తేదీ పంజాబ్ గవర్నర్ 'ఆర్ఎస్ఎస్ మతతత్వం హిందువులలో రాను రాను ప్రాచుర్యం పొందుతున్నదని హెచ్చరించారు.

1944కి ఆర్ఎస్ఎస్ శిక్షణా శిబిరాల సంగతి అధికారికంగా వెలువడింది. 1946–47లో జరిగిన అల్లర్లలో ఆర్ఎస్ఎస్ చురుకుగా పాల్గొంది. మతతత్వ ఉద్రిక్తతలు పెంచడం దాని ప్రచారానికి పనికివచ్చాయి. బ్రిటిష్ వారితో కుమ్మక్కు అవడం, కాంగ్రెస్‌ని వ్యతిరేకించడం దాని వ్యూహంలోని రెండు పార్శ్వాలు. బ్రిటిష్ వారు ఎటుతిరిగి వెళ్లిపోతున్నారు; ముస్లింలతో మంతనాలు జరుపుతున్నారు.

గోల్వాల్కర్, ప్రభుత్వ ఆదేశాలు పాటిస్తానని బహిరంగంగా చెప్పినా, తెరవెనుక వారి పనులు ఆగలేదు. రహస్యంగానా, బహిరంగంగానా అనేదే తేడా. ప్రభుత్వ రిపోర్ట్ ప్రకారం, 'పూర్తిగా సన్నద్ధం అయ్యే వరకు వేచి చూడడం వారి విధానం; సంఘ్ ఇప్పటికిప్పుడు అపాయం కాకపోయినా తరువాతి కాలంలో మతతత్వ అల్లర్లు సృష్టించి సమాజానికి కీడు చేసే అవకాశం ఉంది.' అనేది అధికారికంగా అంగీకరించిన విషయం.

ఈ వ్యూహం ఎస్‌పి ముఖర్జీ దృక్పథాన్ని తెలియచేస్తుంది. ముస్లింలు అంటేనే ఆయనకి అసహ్యం. వారు 'హిందూ సమాజంలోని మకిలి నుండి ఏర్పడ్డ ఒక సమూహం' అని ఆయన భావన.

◆

# యూరప్ ఫాసిజం అంటే మోజు

**అ**ధినాయకుడే సర్వాధికారి అనే సిద్ధాంతం ఆర్ఎస్ఎస్ నిర్మాణంలోనే ఉంది. వారి 12వ అధికరణంలో ఇలా రాసుకున్నారు:

స్వర్గీయ కేశవ్ బలిరాం భగత్, సంఘ మూలపురుషులలో ఒకరు. సర్ సంఘ చాలక్ ఆద్యుడు. శ్రీ మాధవ సదాశివ గోల్వాల్కర్‌ని ఆయనే అప్పుడున్న కేంద్ర కార్యవాహక మండలిని సంప్రదించి నియమించారు. అప్పటినుండి ఆయనే సర్ సంఘ్ చాలక్ తన వారసుడి అవసరం కలిగినప్పుడు కేంద్ర కార్యకారి మండలిని సంప్రదించి నియమించుకుంటుంది.

సర్ సంఘ్ చాలకుడే ఆర్ఎస్ఎస్ మార్గదర్శకుడు, తత్వవేత్త. ఆయన స్వయం సేవకులను పిలవొచ్చు. వారిని ఉద్దేశించి ప్రసంగించవచ్చు; ప్రతినిధి సభలు, కార్యకారి మండలను సమావేశపరచవచ్చు.

**13వ అధికరణం:**

**అ.** అఖిల భారతీయ ప్రతినిధి సభకి ఎన్నికైన సభ్యులు, సర్ కార్యవాహకుడిని ఎన్నుకుంటారు.

**ఆ.** సర్ కార్యవాహకుడు సర్ సంఘ్ చాలక్‌తో సంప్రదించి పనిచేస్తాడు.

**14వ అధికరణం:**

**అ.** సర్ కార్యవాహకులతో కలిసి కేంద్రీయ కార్యకారి మండలి ఏర్పడుతుంది. మండలిలో ఈ కింది అధికారులు ఉంటారు, 1. సర్ కార్యవాహక్ 2. ఒకరు లేక అంతకంటే ఎక్కువ సహా సర్ కార్యవాహకులు, 3. మహిళా భారతీయ శారీరక శిక్షణ ప్రముఖులు 4. అఖిల భారతీయ భౌదిక్ శిక్షణ ప్రముఖులు 5. అఖిల భారతీయ ప్రచార ప్రముఖ్ 6. అఖిల భారతీయ నిధి ప్రముఖ్.

**ఆ.** కేంద్రీయ కార్యకారి మండలిలో ప్రాంతీయ కార్యకారి మండలాల నుంచి

కనీసం 5 గురు సభ్యులుంటారు. అధినేత కనుసన్నలలోనే నిర్వహణ అంతా ఉంటుంది.

2011లో మార్జియా కాసాలరీ పరిశోధన చేసి, "హిందూ జాతీయవాదానికి నాజీ ఫాసిజానికి ఉన్న అస్పష్ట సంబంధం" అనే ఒక పుస్తకాన్ని ప్రచురించారు– "ఆర్ఎస్ఎస్‌కి యూరప్‌లోని ఫాసిజంతో ఉన్న సంబంధం కేవలం వ్యూహాత్మకమైంది కాదు. అది హిందూ జాతీయవాదానికి సహజసిద్ధంగానే ఉంది. అందుకనే ఫాసిజం, నాజీయిజం అంత  ఆకర్షణీయంగా కనిపించాయి. 'ఆ ప్రభావం మితవాద హిందూ సంస్థ నిర్మాణంలోనూ, సామాజిక నిర్మాణంలోనూ, సిద్ధాంతంలోనూ, జాతులపై వారు చేసే చర్చలలోను కనిపిస్తుంటుంది. వారు బెణితో ముస్సోలిని ఆరాధించే తీరు, అడాల్ఫ్ హిట్లర్‌ను ఒక వీరునిగా చూసే స్థితికి తీసుకెళ్లింది. ముఖ్యంగా సావర్కర్‌కి బెంగాల్, ముంబైలు అందుకు తగిన ప్రాంతాలుగా కనిపించాయి. బిఎస్ మూంజి 1931లో చేసిన ఇటలీ పర్యటన ఒక ముఖ్యమైన మూల మలుపు. 'మిలిటరీకరణ, జాతి విద్వేషం, బంధాన్ని గట్టిపరిచేందుకు అవసరమైన ముడిసరుకును అందించాయి. ముస్లింలే లక్ష్యంగా హిందుత్వ విధానం రూపొందించబడింది; వారే బ్రిటీష్ వారికన్నా భయంకరమైన పరిపాలకులుగా చూడడం మొదలైంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదం ఒక మిత్రునిగా చూసినప్పుడు, ఇటాలియన్ ఫాసిజం గాని జర్మన్ నాజీయిజం గాని ఎందుకు మిత్రులు కాకూడదు? అందుకని, తమతో సహకరించేందుకు సిద్ధంగా ఉన్న కలకత్తా, ముంబైలలోని ఇటలీ అధికారుల పేర్లు సేకరించారు. 'బెంగాల్‌లో రాజకీయంగా ఏకాభిప్రాయాలు గల మేధావులతో సంబంధాలు ఏర్పరచుకున్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ వంటి ప్రముఖులు, మేధావులు జత చేరారు. హిందూ జాతీయవాద ప్రముఖులు, జనసంఘ్ వ్యవస్థాపకుడు అయిన ముఖర్జీ, కలకత్తా విశ్వవిద్యాలయ (1934–1938) కులపతి; గియోవన్నీ జెంట్లే ఒక ఫాసిస్టు తత్వవేత్త. కలకత్తా విశ్వవిద్యాలయంలో ప్రముఖ బోధకుడు; సురేంద్ర నాథ్ దాస్ గుప్తా ఫాసిస్టు పరిపాలనకు సాంస్కృతిక రంగంలో మద్దతుదారుడు; గ్లుసెప్పె తుకేసి రవీంద్రనాథ్‌కి పరిచయస్తుడు; ప్రాన్ నాథ్ రాయ్, తుకేసి శిష్యుడు. ఆయన బనారస్, కలకత్తాలోని ఇటాలియన్ సాహిత్యాన్ని బోధించేవారు. రోమ్ విదేశీ కార్యాలయం నుండి ఆయనకి నెలకి 700 లీరాల భారీ మొత్తం భారతదేశంలోని పత్రికలలో ఫాసిస్టు పరిపాలన గురించి గొప్పగా ప్రచారం చేస్తున్నందుకు అందేది. అదంతా బీర పీచు బంధుత్వంతో ముడిపడి ఉండేది. శ్యాం ప్రసాద్ ముఖర్జీకి వీరందరితో విలువైన బంధం ఉండేది. "ఇటలీలోని బలిల్లా యువ సంఘంలో సభ్యత్వం లాగానే ఆర్ఎస్ఎస్ సభ్యత్వ నమోదు

ఉండేది. శాఖ సభ్యులు, వయసుల వారీ విభజించిన వారు (6–7 నుండి 10, 10 నుండి 14, 14 నుండి 28, ఆ తరువాత...).

మొదట్లో ఆర్ఎస్ఎస్‌కి కలకత్తాలోని మల్లయుద్ధ శాలలతో, మహారాష్ట్రలో ఏర్పడిన రహస్య సొసైటీలతో సంబంధాలు ఉండి ఉండాలి; ఇక్కడే సావర్కర్ అన్నదమ్ములతో సహా తిలక్‌కి దగ్గరి సంబంధం గల యువకులు ఆర్ఎస్ఎస్‌కి దగ్గరయ్యారు.

1931 లండన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగిన తరువాత మూంజి ఇటలీ, జర్మనీ వెళ్లారు. అక్కడ ఎదురైన అనుభవాల్ని.. 'ఫాసిజం ప్రజలలో ఐక్యతను పెంచుతుంది. భారతదేశం, ముఖ్యంగా హిందూ భారతదేశానికి సైనికీకరణను పునర్ స్థాపించగల సంస్థల అవసరం ఎంతైనా ఉంది. నేను నా జీవితంలో మిగిలిన భాగాన్ని హెగ్డేవార్ నాగ్‌పూర్‌లో నిర్మించిన ఆర్ఎస్ఎస్ సంస్థ అభివృద్ధికే కృషి చేస్తాను.' అని డైరీలో రాసుకున్నారు.

ఆ సిద్ధాంతంతో పాటు సంస్థను సైనికీకరించడం ఆయనను అమితంగా ఆకట్టుకుంది; ఇటాలియన్లకు కూడా భారతీయులకులాగానే ప్రేమకాముకులు; వీరత్వం పట్టనివారు. అందువలన వారిలో వీరత్వాన్ని పెంచి పోషించవలసివచ్చింది. ముసోలినీ ఆ దేశ బలహీనతను తెలుసుకుని దానిని అధిగమించేందుకు బలిల్లా సంస్థలను స్థాపించారు. 1931 మార్చ్ 19 ముసోలినీని కలిసినప్పుడు 'తాను భారతదేశంలోనూ, ఇంగ్లండ్‌లో కూడా, ప్రజా వేదికల నుండి తన గళాన్ని వినిపించడానికి నిశ్చయించుకున్నట్టు తెలియచేసారు. ఆర్ఎస్ఎస్‌ని హిందూ జాతీయవాద సైనిక విభాగంగానే భావించారు. ముసోలినీని 'యూరప్‌లో ఉన్న మహోన్నతులలో ఒక్కరిగా' గుర్తించారు. భారతదేశానికి తిరిగి రాగానే ఆర్ఎస్ఎస్‌ని బలపరిచే కార్యక్రమాలలో నిమగ్నమైనారు; యుద్ధ విద్యలను నేర్పే సంస్థని స్థాపించారు; ఆర్ఎస్ఎస్‌కి హిందూ మహాసభకు మధ్య వారధిగా ఉండేవారు; హెగ్డేవార్ అతని అనుయాయుడిగానే ఉండేవారు. అయితే, ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ దాటవేస్తుంటుంది. 1934లో భోంసాల మిలిటరీ స్కూల్ ప్రారంభించబడింది. హిందువులను సైనికీకరించడమే దీని లక్ష్యం; మాతృదేశాన్ని రక్షించే బృహత్తర బాధ్యతను హిందూ యువకులు తీసుకోవాలని భావించింది. మిగిలిన మతాలవారికి, అంటే ముస్లింలు, సిక్కులు, క్రిస్టియన్లు, బౌద్ధులు, జైనులు వగైరాలకు ఈ బాధ్యతలో భాగస్వామ్యం లేదు. 'ఇటలీలో ఫాసిస్టులు, జర్మనీలో నాజీలు చేసిన పనులే భారతదేశంలో భవిష్యత్తులో హిందువులు చేయాలన్నదే వీరి సంకల్పం' అని ఆనాటి ఇంటెలిజెంట్ బ్యూరో హెచ్చరించింది. వి.డి సావర్కర్‌ది కూడా ఇదే పంథా. మూంజి, కాశ్మీర్, ఇండోర్, ట్రావెన్కోర్, బికనీర్,

ఉదయపూర్, జైపూర్, ఇంకా ఇతర రాజుల నుండి మద్దతు కూడగట్టారు; 'ఆస్ట్రియన్లను, సుడేటనీయులను, జర్మనులను ఒక జర్మన్ పతాకం కిందికి తేవడం సమర్థనీయం. ప్రజాస్వామ్యం అంటేనే ప్రజలకు నచ్చిన ప్రభుత్వం. జర్మనీ ప్లెబిసైట్‌ని డిమాండ్ చేసింది. జర్మనీలోని చెక్ నాయకత్వంలోని జర్మన్లు వారి బంధువులను కలుసుకోవాలని అనుకుంటున్నారు,' అన్నవి సావర్కర్ అభిప్రాయాలు.

1937లోనే భారతదేశం జర్మనీని అనుసరించి 'ముస్లిం సమస్యను' పరిష్కరించుకోవలసి ఉంటుంది' అని రాసారు. 1939 జులై 29న 'జాతీయత అనేది, ఆలోచన, మతము, భాష సంస్కృతులపై ఆధారపడినంతగా భౌతిక సరిహద్దులపై ఆధారపడదు. ఈ కారణం చేతే జర్మన్లు, చెక్స్ ఒక జాతిగా పరిగణలోకి రారు.' అని వి.డి సావర్కర్ 1938 ఆగస్టు 1వ తేదీన అన్నారు.

జర్మనులంతా ఒక జర్మను జాతి. చెక్స్ ఒక సమూహం. సావర్కర్‌కి జర్మనీ, ఇటలీ, జపాన్ కాన్సులేట్‌లతో మంచి సంబంధాలు ఉండేవి. అలాగే కిశోర్ బిర్లా, గాంధీ అనుయాయుడు జిడి బిర్లా అన్నగారు; హిందూ మహాసభ సానుభూతిపరులు.

సావర్కర్‌కి ఇటలీ అధికారులతో ఉన్న సంబంధాల గురించి ఎటువంటి ఆధారాలు లేవు. కాని జర్మనీ అధికారులతో ఉన్న సంబంధాలకు కావలసినన్ని ఆధారాలు ఉన్నాయి. 1938 నవంబర్ నుండి సావర్కర్ ఇద్దరు జర్మను ఏజెంట్లతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపేవారు. ఒకరు, జర్మన్ న్యూస్ ఏజెన్సీ ప్రతినిధి–జి.ఎల్. లెజిన్స్కి. రెండో ఆయన పి. పజ్జ్, వారి పని జర్మన్ కాన్సులేట్ కార్యక్రమాలను ప్రచారం చేయడం. ఈ ఇద్దరు, సావర్కర్ రాసిన ఉపన్యాసాలను ప్రచురించేవారు. ప్రచురించే ముందు, 'హిందూ మహాసభకు దేశంలో ఎంత పరపతి ఉందో, ఎంత సభ్యత్వం ఉందో తెలుసుకున్నారు. నవంబర్ 22న లెజిన్స్కి తన అధికారులకు రాసిన లేఖలో 'హిందూ మహాసభ ఒక అఖిల భారత సంస్థ. ముస్లింలకు లీగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నట్టే మహాసభ హిందువులకు ప్రాతినిధ్యం వహిస్తున్నది. దాని సభ్యత్వం వేలల్లోనే ఉంది' అని రాసారు.

ఆ తరువాతి కొన్ని నెలలలోనే జర్మనీకి హిందూ మహాసభకి మధ్య సంబంధాలు బలపడ్డాయి. డిసెంబర్ మొదట్లో జ్యూయిష్ సమస్య పై జర్మనీ తీసుకున్న వైఖరి సరైనదే అని ప్రముఖ మరాఠీ దిన పత్రికలో ఒక వ్యాసం అచ్చు అయింది. మలేకర్ ఆ వ్యాసం కాపీని లేజెన్స్కికి పంపారు. రెండు రోజుల తరువాత సావర్కర్‌కి లేజెన్స్కి మెయిన్ కేంఫ్ ప్రతిని బహుమతిగా పంపారు.

యూరప్‌లో జర్మనుల విజయాలు పెరుగుతుండడంతో సావర్కర్ సిద్ధాంతం పట్ల, హిందుత్వం పట్ల గౌరవం కూడా పెరుగుతూ వచ్చింది. 1939 మార్చ్ 25న

యుద్ధం ముంగిట్లో ఉండగా మహాసభ ప్రతినిధి ఈ విధంగా చెప్పాడు. "జర్మనులు ఆర్య సంస్కృతిని పునరుజ్జీవింప చేసుకోవటాన్ని, స్వస్తిక గుర్తును పొగడడాన్ని, వేద విద్యాభ్యాసాన్ని ప్రోత్సహించడాన్ని, ఇండో జర్మన్ నాగరికత సంప్రదాయాలను సమున్నతమైనవిగా సమర్థించడాన్ని, ధార్మికులు, భారతదేశంలోని వివేచనాపరులు సంతోషంగా అహ్వానిస్తున్నారు. కేవలం జవహర్‌లాల్ నెహ్రూ వంటి కొంతమంది సోషలిస్టులు మాత్రమే ప్రస్తుత జర్మన్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు. అయితే, వారి సంఖ్య తక్కువే. జర్మనీ బల పరాక్రమాలు, అంతర్గత వ్యవహారాల గురించి మహాత్మా గాంధీ శాపనార్థాలు పెడుతూనే ఉన్నారు. ఒక ఊహా ప్రపంచంలో మసులుతూ, దేశానికి ద్రోహం చేస్తూ, నిరంతరం గందరగోళాలలో పడేస్తున్న వారి శాపనార్థాలు పట్టించుకోనవసరం లేదు. ఆర్య సంస్కృతిని వ్యతిరేకిస్తున్న వారిపై జర్మనీ చేస్తున్న యుద్ధం, భారతదేశంలోని హిందువులను తాము కోల్పోయిన ఉచ్ఛస్థానాన్ని తిరిగి పొందేందుకు మేల్కొల్పుతుందని, వారిని స్పృహలోకి తెస్తుందని ఆశిస్తున్నాను."

యుద్ధం మొదలవగానే వైస్రాయ్ లార్డ్ లైన్‌లిత్‌గౌకి పూర్తి మద్దతు తెలుపుతూ సావర్కర్ ఒక ఉత్తరం రాసారు. మూంజీ ముస్లింలకు వ్యతిరేక సైన్య సేకరణలో మునిగిపోయారు. ఆర్‌ఎస్‌ఎస్ ఇందులో ప్రముఖ పాత్రపోషించింది.

1940 ఆగస్టు 19న సావర్కర్, లార్డ్ లైన్‌లిత్‌గౌకి, ముందు ముందు ఏర్పడబోయే ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చేర్చుకునేందుకు హిందూ మహాసభ సభ్యుల పేర్లను పంపించారు. ఇందులో మూంజి, శ్యాంప్రసాద్ ముఖర్జీ పేర్లు కూడా ఉన్నాయి. సెప్టెంబర్ 26న రాసిన ఉత్తరంలో, భారత దేశ రక్షణ సైనికావసరాలకు హిందువులు ముస్లింల కన్నా ఎక్కువ సహకారాన్ని, ఆధునిక సాంకేతికతను, మానవ వనరులను అందివ్వగలరని, ఆ విధంగా హిందూస్థాన్, బ్రిటన్‌తో గట్టి సంబంధాన్ని కలిగి ఉండి, రాబోయే కాలంలో కలిసి పనిచేయగలరని ఆశిస్తున్నట్టు' రాసారు. ముఖర్జీ అనుమతి లేకుండా సావర్కర్ ఇలా రాసి ఉండరు.

ఆర్‌ఎస్‌ఎస్‌కి గాని మహాసభకి గాని ఒక నియంతని సమర్ధించడానికి ఎటువంటి అభ్యంతరం లేదు. 1942 ఏప్రిల్–మే లలో జరిగిన ఆఫీసర్స్ ట్రైనింగ్ క్యాంప్‌లో జరిగిన సంఘటనలు ఈ విషయాన్ని తెలియచేస్తున్నాయి.

1942 మే 4వ తేదీ డాక్టర్. పిసి. జోషి వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడుతూ, సంఘ్ నియంతృత్వాన్ని సమర్థిస్తుందని చెప్పారు. ప్రజాతంత్ర విధానంలో ప్రభుత్వ పని విధానాన్ని నిందించారు. ఫ్రాన్సుని, జర్మనీని, ఇటలీని, రష్యాని ఇందుకు ఉదాహరణగా చూపారు.

ముఖ్యంగా జర్మనీలోని నియంతను ఇష్టపడ్డారు. 21.5.1942న, రష్యా,

జర్మన్‌లను ఉదాహరణలుగా చూపి 'ప్రచారం యొక్క ప్రాముఖ్యతను' వివరించారు. ముసోలినీని ఉదాహరణగా చూపుతూ నాయకత్వ గొప్పదాన్ని తెగ పొగిడారు.

ఈ విషయాలలో మజిత్ కాసాలరీ, నిజాలు వెలికి తీసేందుకు ఎంతో కష్టపడి పరిశోధన చేసి మహోపకారం చేసారు. ఆమె పరిశోధన పరిపూర్ణమైనది. నిర్ధారణలు సమగ్రమైనవి.

'1940లలో ఆర్ఎస్ఎస్ బలపడి విస్తరించడం మొదలైన దగ్గరి నుండి గమనించదగిన రెండు ముఖ్యమైన అంశాలు ఉన్నాయి. ఒకటి, ఆర్ఎస్ఎస్ నిరంతరం పెరుగుతూనే ఉంది. అందుకు కారణం మూలాల నుండి క్రమబద్ధంగా పనిచేయడం. ఇదివరకే చూసినట్టు 1936-41 మధ్యకాలంలో ఆర్ఎస్ఎస్ శాఖల విస్తరణలో నాలుగురెట్లు, సభ్యత్వంలో ఆరు రెట్లు పెరిగింది. రెండో అంశం, ఈ పెరిగిన సైన్యం ఎవరికి వ్యతిరేకంగా పనిచేసింది? దురదృష్టవశాత్తు, విభజన సమయంలో ఈ పెరిగిన సైన్యం భారతదేశంలోని ఒక జాతికి వ్యతిరేకంగా సమర్థవంతంగా పనిచేసింది.

సంఘ్ పరివార్ శక్తులు ఇతరులుగా భావించబడుతున్న జాతిని సంహరించింది, ఈ 'శత్రుత్వ వైఖరే' భారత జాతీయవాదానికి, హిందూ జాతీయవాదానికి ఉన్న తేడా...

◆

# సావర్కర్ మహాసభ ఆక్రమణ

1937లో సావర్కర్ హిందూ మహాసభ అధ్యక్షుడయ్యారు. ఆ పదవిలో 7 పర్యాయాలు కొనసాగారు. దానిని తన శిష్యుడు శ్యాంప్రసాద్ ముఖర్జీకి అప్పజెప్పారు. సావర్కర్ తనతో పాటు హిందుత్వ సిద్ధాంతాన్ని కూడా వెంటపెట్టుకొచ్చారు. ఆర్ఎస్ఎస్, మహాసభల బంధాన్ని గట్టిపరిచారు. అంతేకాదు, దానికి ఒక కొత్త ఊపునిచ్చారు. దిశానిర్దేశాన్ని చేసారు. అంతకు ముందున్న లాలా లజపతి రాయ్ వంటి అధ్యక్షులు పండితులు, గౌరవం, వ్యక్తిత్వం ఉన్నవారు. సావర్కరుకి అవేవిలేవు. అతను జగమొండి; నిలువెల్లా విషం కలవాడు; మోసగాడు. అతనికో 'గతం' ఉంది.

అతను ఇదివరకే ముగ్గురిని చంపడానికి ప్రోత్సహించిన వాడు; ప్రేరేపించాడు. కానీ, కేవలం నాసిక్ కలెక్టర్ ఏటిఎం జాక్సన్ విషయంలోనే శిక్ష పడింది. భారతీయ ఆఫీస్‌లో పనిచేసే కర్జన్ విల్లీ హత్య నుండి తప్పించుకున్నాడు; ముంబై గవర్నర్ ఎర్నెస్ట్ హెూస్న్, బులెట్ ప్రూఫ్ జాకెట్ తొడుగుకోవడం వలన తప్పించుకున్నాడు. 1948, జనవరి 30న జరిగిన గాంధీ హత్య కేసులో ముద్దాయి. హత్యలన్నిటిలోను ట్రిగ్గర్ నొక్కింది మాత్రం మరొకరు. దర్శకత్వం మాత్రమే సావర్కర్ చేసాడు. నాథురాం గాడ్సే తమ్ముడు దత్తాత్రేయ స్వయంగా ఈ విషయాలన్నీ చెప్పారు. 'మేం ముగ్గురు అన్నదమ్ములం మా ఇంట్లోకంటే ఆర్ఎస్ఎస్ ఆఫీస్‌లోనే ఎక్కువ పెరిగాం.' ఇందుకు నిదర్శనం కింద ఇవ్వబడింది.

1. 1911 జులై 4వ తేదీ సావర్కర్ అండమాన్స్‌లోని సెల్లులార్ జైలుకు తరలించబడ్డాడు. ఆరు నెలల్లోనే క్షమాభిక్షనర్థిస్తూ లేఖ రాసారు. 1913 నవంబర్ 14న మరో ఉత్తరం రాసారు. అందులో 'భారతదేశంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో ప్రభుత్వం రాజీవిధానంతో మరోసారి ముందుకొచ్చింది. మానవత్వం ఉన్న ప్రపంచంలోని ఏ మనిషీ, 1906-07లలో ఉన్నటువంటి నిరాశాజనకమైన

ముళ్ళదారిని కోరుకోడు. అందువలన ప్రభుత్వం నన్ను దయదలచి విడుదల చేయడం ఉభయులకూ లాభదాయకంగా ఉంటుంది. నేను బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయుడిని; రాజ్యాంగ పురోగతికి అదే కదా మూలం.

2. 1913 అక్టోబర్‌లో వైస్రాయ్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ గృహ మంత్రి అయిన సర్ రెజినాల్డ్ క్రద్దోక్, సావర్కర్‌ని జైలులో కలుసుకున్నట్టు తన నోట్స్‌లో రాసుకున్నారు. అందులో, 1913 నవంబర్ 14న సావర్కర్ పెట్టిన రెండో క్షమాభిక్ష పిటిషన్‌లో 'నేను మీకు అవసరమైన ఏ పదవినిచ్చినా ప్రభుత్వానికి సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నాను... అంత దుబారా ఖర్చులతో తిరిగి అదే గూటికి కాక మరెక్కడికి చేరతాడు..' అని రాసినట్టు ఉంది.

3. 1920 మార్చి 2న సర్ విలియం విన్సన్ట్, 'వినాయక్ దామోదర్ సావర్కర్ నుండి పోర్ట్ బ్లెర్ సూపరింటెండెంట్ ద్వారా రెండు పిటిషన్లు వచ్చాయి. –1914లో ఒకరి, 1917లో ఒకటి. మొదటి దానిలో ప్రభుత్వంలో ఏ బాధ్యతలోనైనా పనిచేయడానికి సిద్ధమని, రాజకీయ ఖైదీలకిచ్చే క్షమాభిక్ష ఇవ్వాలని అర్థించారు. కానీ, రెండో పిటిషన్‌లో కేవలం రెండో అంశానికి పరిమితమయ్యారు.' అని రాసారు.

1920 మార్చ్ 30న మరోసారి 'మరీ సమయం మించిపోకుండా క్షమాభిక్షను పరిశీలించవలసిందిగా' వేడుకున్నారు. అరబిందో ఘోష్ అన్న బారిన్ తదితరులను ఉదాహరణలుగా చూపుతూ, తనను తాను మరింతగా దిగజార్చుకున్నారు: 'వారు పోర్ట్ బ్లెర్‌లో కూడా చంపే తీవ్రమైన ప్రయత్నం చేసారు. నేనేమో పూర్తి నమ్మకస్తుడను ...' అని రాసారు.

'విప్లవ భావాలను నమ్మకపోవడమేకాక నేను శాంతిని కోరుకునే వాడిని. ఇక నా పూర్వ విప్లవ ధోరణులను గురించి చెప్పాలంటే, ఇప్పుడు క్షమాభిక్ష అడుగుతున్నందు వలన కాదు. అసలు ఇదివరకు చేసిన విన్నపాలలో కూడా, నేను మాంటేగ్ చే రూపొందించబడే రాజ్యాంగానికి బద్ధుడిగా ఉంటానని విన్నవించుకున్నాను. మీ సంస్కరణలు, ఆ తరువాత వచ్చిన ప్రకటనలు నన్ను కట్టి పడేశాయి. నేనీమధ్యే బహిరంగంగా నా అభిప్రాయాలను చెప్పాను; రాజ్యాభివృద్ధికి, క్రమబద్ధ పాలనకు తోడ్పడతానని మాటిచ్చాను.'

ఎందుకైనా మంచిదని ఈ వాక్యాన్ని కూడా జత చేశారు. 'నేను రాజ్యాంగ బద్ధుడినై ఉంటానని, బ్రిటిష్ ఆధిపత్యంతో ప్రేమ బంధం, గౌరవం, పరస్పర సహకారం కలిగి ఉంటానని...' ఇటువంటి 'జాతీయతకు' ఇంతకంటే ఉదాహరణలు అవసరమా!

ముగింపులో, నేను నా అన్న, ప్రభుత్వం న్యాయబద్ధంగా సూచించినంత కాలం రాజకీయాలకు దూరంగా ఉండడానికి కూడా సిద్ధంగా ఉన్నాం. ఇదే, లేదా

వేరేదైనా, ఉదాహరణకి ఒకే ప్రాంతంలో ఉండాలనో, పోలీసులకు మా విడుదల తరువాత కొంత కాలం వరకు మా అనుపానాలు తెలియచేస్తుండాలనో మరేవైనా ఇటువంటి నిబంధనలు, రాజ్యం సురక్షితంగా ఉండడానికి అవసరమైనవాటిని అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నాం.

4. 1948 ఫిబ్రవరి 22న గాంధీ హత్యకు సంబంధించిన విచారణను ఎదుర్కొంటున్న సందర్భంగా 'నేను ఏ విధమైన రాజకీయ మతతత్వ ప్రజా కార్య క్రమాలలో ప్రభుత్వం నిర్దేశించినన్ని రోజులు పాల్గొననని' రాసి ఇచ్చారు.

5. 1950 జులై 13వ తేదీ ముంబై హై కోర్టు ప్రధాన న్యాయమూర్తులు, ఎం.సి ఛగ్లా, జె పి గజేంద్ర గడ్కర్‌లకి 'నేను ఏ రాజకీయ కార్యక్రమాలలో పాల్గొనని ముంబైలో ఉన్న తన ఇంట్లోనే ఏడాదిపాటు ఉంటానని,' పోలీస్ కమిషనర్‌కి లేఖ రాసారు. హిందూ మహాసభ అధ్యక్ష పదవికి రాజీనామా చేసారు.

1924లో ఆయన విడుదలకు ఆవసరమైన రెండు షరతులను అంగీకరించారు. 1. అతను రత్నగిరి జిల్లాలోనే ఉండాలి. అనుమతి లేకుండా జిల్లా బయటకు వెళ్ళకూడదు.; కౌన్సిల్ పాలించే ప్రాంతంలోనే ఉండాలి. 2. ఐదేళ్ళ వరకు ప్రభుత్వ అనుమతి లేని రాజకీయ కార్యకలాపాలలో పాలుపంచుకోకూడదు. ఈ నిర్బంధాల కాలపరిమితి పూర్తయిన తరువాత ప్రభుత్వ విజ్ఞత మేరకు దానిని పునరుద్ధరించవచ్చు.

సావర్కర్ ఇదివరకే ఇటువంటి నిబంధనలను అంగీకరిస్తానని రాతపూర్వకంగా ఇచ్చినందువలన 'నాకు సరైన న్యాయం జరిగిందని, తీర్పు వెలువడిందని అంగీకరిస్తున్నాను. .. మనస్ఫూర్తిగా గతకాలంలో చేసిన హింసను విడనాడి చట్టాన్ని అనుసరిస్తానని, నా శాయశక్తులా రాజ్యాంగాన్ని అనుసరిస్తానని భవిష్యత్తులో సంస్కరణలు జయప్రదంగా అమలు చేయడానికి నా శాయశక్తులా కృషి చేస్తానని అంగీకరిస్తున్నాను.' అని రాసిచ్చారు.

ఇంతకన్నా దిగజారుడు మరొకటి వుంటుందా ?

ఈ ప్రకటన సావర్కర్ రాజకీయ జీవితంలో అత్యంత అపఖ్యాతిని తెచ్చిపెట్టిన చర్య. ఏ దేశభక్తుడూ దీనిని క్షమించలేడు. సావర్కర్ క్షమించబడడమే కాదు. గాంధీని చంపేందుకు కుట్ర పన్నిన ఆ మనిషి చిత్రపటం భారతదేశ పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో వేళ్ళాడదీయబడింది. కారణం సావర్కర్ ఒక కరుడుగట్టిన హిందుత్వ సమూహానికి అవసరమైన హిందూ జాతీయవాదాన్ని ప్రతిపాదించారు.

సావర్కర్, 'హిందుత్వ: హిందువు ఎవరు?' అనే వ్యాసాన్ని ఒక మరాఠా పేరుమీద (అప్పటికి అతను ఖైదుగా ఉన్నారు కాబట్టి) రాసారు. డాక్టర్. అంబేద్కర్

ఆ వ్యాసం గురించి, ఆయన ‘హిందూ’ ను చాలా జాగ్రత్తగా శ్రద్ధగా నిర్వచించారు (హిందుత్వకి అదే పునాది). భారతదేశంలో ఉంటూ భారతదేశాన్ని (పితృ దేశం) మాతృదేశంగాను, పవిత్ర దేశంగాను భావించేవాడే హిందువు. ఇది రెండు ప్రయోజనాలను కలిగించింది, మొదటిది ముస్లింలు, క్రిష్టియన్లు పార్సీలు జ్యూస్‌కి భారతదేశం, పవిత్ర దేశం కాదు; అందువలన వారందరూ భారతీయులు కారు. రెండోది బౌద్ధులు, జైనులు, సిక్కులు, వగైరా వేదాలలో వారికి నమ్మకం లేకపోయినా ఈ దేశస్థులవుతారు. సావర్కర్ రాజకీయంగా విఫలమయ్యారు. ఆయన, హిందూ మహాసభ, భారతదేశ రాజకీయాలలో 1940ల నుంచి ఎటువంటి పాత్రను పోషించడం లేదు. కానీ, ఆర్ ఎస్ ఎస్ ఆయన సిద్ధాంతాన్ని ఆమోదించగానే దానికి ఒక కొత్త జీవం వచ్చింది. దాని ప్రభావం గోల్వాల్కర్ పుస్తకం ‘మనం, మన జాతీయత (1938)’ పై బాగా ఉంది. 2002 మే 6న వాజ్‌పాయ్ రాజ్యసభలో ‘ఆ పుస్తకంలో ఉన్నది అయన వ్యక్తిగత అభిప్రాయాలనడం’ తప్పుడు ప్రకటన. ఎందుకంటే 1963లో గోల్వాల్కర్ జాతీయతకు నిర్వచనం శాస్త్రీయంగా, తన గొప్ప పరిశోధనా గ్రంథం ‘హిందుత్వ’లో ఇచ్చానని, సావర్కర్ రాసుకున్నారు. గోల్వాల్కర్ రాసిన బంచ్ ఆఫ్ థాట్స్ (పాంచజన్యం) లో కూడా ‘హిందుత్వ’ సూత్రాలు కనిపిస్తాయి. అందులో ఒక భాగమంతా భౌతిక సరిహద్దులు చూపే జాతీయవాదం పైనే ఉంది. గోల్వాల్కర్ స్వయంగా, ‘హిందూత్వ అనే పేరుతో వీర్ సావర్కర్ ఒక అందమైన పుస్తకాన్ని రాసారు అని అంగీకరించారు; అదే హిందుత్వపై , హిందూ మహాసభ హిందూ జాతీయవాదం పూర్తిగా ఆధారపడి ఉందని రాసారు. సావర్కరే ఒక చోట, హిందుత్వకి హిందూయిజంకి తేడా ఉందని’ వివరించారు. హిందుత్వ అంటే విస్తృతంగా వాడే హిందూయిజం కాదు.‘యిజం’ ని సర్వ సాధారణంగా ఒక సిద్ధాంతం మతానికి సంబంధించినదో మరే విధానానికి సంబంధించిన దాని గురించో అంటాం. కానీ, హిందుత్వను పరిశోధించే ప్రయత్నం చేసేటప్పుడు, ప్రత్యేకమైన మత సిద్ధాంతం, విశ్వాసం గురించి అని ప్రాథమికంగా అనుకోం. హిందుత్వ అంటే హిందూ సనాతన ధర్మం ఒకటే కాదు; హిందుత్వమంటే హిందూ ధర్మం కాదు. హిందూ ధర్మం అంటే హిందుత్వం కాదు. హిందూయిజం ఒక ప్రాచీన మతం. హిందుత్వ ఒక ఆధునిక నిర్మాణం. సాంస్కృతిక జాతీయవాదం యొక్క వ్యక్తీకరణ. ఈ తేడాని గమనించడం చాలా అవసరం. మౌలికంగా హిందూ అంటే దాని సహెూదరి హిందూ అన్నట్టు తయారైంది. మనం ఒక మహమ్మదీయుడిని కూడా హిందూ అంటాం; ఎందుకంటే అతను హిందూ దేశంలో ఉన్నాడు కాబట్టి. హిందుయిజం ఘనమైనది. హిందుత్వం మాత్రం విద్వేష సిద్ధాంతం.

లాలా లజపతి రాయ్ రెండుదేశాల సిద్ధాంతాన్ని గట్టిగా బలపరిచారు. 'హిందువులందరికి ఒక మాతృదేశం ఉండడమే కాదు; వారందరు ఒక జాతి కూడా'. ఇదే జాతి విద్వేషాలకు పరాకాష్ట.

సంతాల్ నుండి సాధువు వరకు ప్రతి హిందువుకి భారత భూమి ఒక పితృభూమి కాదు; పవిత్ర భూమి కూడా. అందుకనే ఈ దేశంలోని మహమ్మదీయులు, క్రిస్టియన్లు బలవంతంగా మత మార్పిడులకు గురైయ్యారు. దేశ భౌతిక సరిహద్దులలో భాగస్వామ్యం ఉన్నా, వారు ఈ దేశ భాష, చట్టం, సంప్రదాయం, చరిత్ర, జానపద కళలలో భాగస్వాములు కారు. అందువలన వారు హిందువులు కారు. వారికి హిందూ దేశం పితృభూమే అయినా పుణ్యభూమి కాదు. వారి పవిత్రభూమి ఏ అరేబియానో పాలస్తీనానో అయి ఉంటుంది. వారు తిరిగి 'స్వగృహానికి' ఆహ్వానితులే..

భారతదేశస్తులు, వారసత్వంగా, సాంప్రదాయసిద్ధంగా, సాంస్కృతికంగా, జాతిపరంగా హిందుత్వ లక్షణాలు కలిగి ఉండి బలవంతంగా ఇతర మతాలలోకి మార్పుచెంది ఉంటే వారిని మనస్ఫూర్తిగా మాతృభూమిలోకి ఆహ్వానించాలి; ఈ దేశాన్నే వారి పితృభూమిగాను పవిత్ర భూమిగాను పొందేందుకు స్వాగతించాలి. వారిని హిందువులుగా మార్చుకోవాలి.

ఆర్ఎస్ఎస్ ఈనాడు చేప్పేదిదే, ముస్లింలు ఈ జాతివారు కాదు. కావాలనుకుంటే వారికి తిరిగివచ్చే అవకాశం ఉంది. వారు భారతదేశానికి ఆవల ఉన్నవారు కాబట్టి, వారికి భారతదేశ పూర్తి పౌరసత్వం పొందే అర్హత లేదు. భౌతిక జాతీయవాదాన్ని పూర్తిగా వ్యతిరేకించి భారతీయులుగా పూర్తిగా ఉండాలని కోరుకుంటే హిందువులుగా మారడం మినహా మరో గత్యంతరం లేదు. అదే ఘర్ వాపసీ.

హిందుత్వానికి మూడు తప్పనిసరి అంశాలు ఉన్నాయి. 1. ఒకే దేశం. (రాజ్యం) 2. ఒకే జాతి (రేస్) 3. ఒకే సంస్కృతి. సంస్కృతి అంటే – క్రతువులు, పూజలు, ఉత్సవాలు, పండగలు వగైరా. ఇవన్నీ కలిస్తే పుణ్య భూమి అవుతుంది.

ఇందులో ఎటువంటి మినహాయింపులు లేవు. మిశ్రమ సంస్కృతి పూర్తిగా తిరస్కరించబడింది. 1937లో అహమ్మదాబాద్‌లో జరిగిన మహాసభలో సావర్కర్ తన అధ్యక్షోపన్యాసంలో దీని ప్రస్థావన ప్రతిధ్వనింపచేసారు. ఆ తరువాత ఆయన 7 అధ్యక్షోపన్యాసాలు చేసారు. తానే హిందుత్వ పదాన్ని కనుగొన్నానని సావర్కర్ గర్వంగా చెప్పుకుంటారు. అందుకు పరీక్ష పవిత్ర భూమే. పవిత్ర భూమి కాదు కాబట్టి ముస్లింలు, క్రిస్టియన్లు, యూధులు, పార్సీలు ఈ దేశస్థులు కారు; అలాగే పవిత్ర భూమి ఇదే అయినా పితృభూమి కాదు కాబట్టి జపనీయులు, చైనా వారు, ఇతర దేశస్థులు ఈ దేశస్థులు కాదు. సావర్కారే 1937లో భారతదేశం ఐక్య మతస్థులు గల దేశంగా

ఉండలేదు. అందువలన రెండు జాతుల సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నానన్నారు– హిందువులు, ముస్లింలు. ఆ తరువాత నాగ్‌పూర్‌లో ఈ సిద్ధాంతం మరింత బలపడింది.

అవును హిందువులంతా ఒకే దేశస్థులం ఈ దేశం మనదే. మనందరిది ఒకే మతం, ఒకే 'జాతి', ఒకే సంస్కృతి. చారిత్రిక బంధాలు మనలను ఒకే దేశంగా పెనవేశాయి. పైగా మనం భౌతికంగా కూడా కలిసి ఉండడం మన అదృష్టం. మన జాతి గుర్తింపు భారతదేశం. – ఇదే మన పితృదేశం. పుణ్య దేశం కూడా. ఇది హిందువులు మెజారిటీగా ఉన్న దేశం. ఇక్కడ ముస్లింలు మైనారిటీలుగా ఉంటారు. 1939లో జరిగిన కలకత్తా మహాసభలలో దీనినే తిరిగి ప్రస్తావించారు.

1947 డిసెంబర్ 19న సావర్కర్ యుఎన్ సర్వ సభ్య సమావేశంలో పాలస్తీనాను విడదీయడం, ఇజ్రాయిల్ దేశాన్ని స్థాపించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. 'నిజానికి పాలస్తీనానంతటిని ఇజ్రాయిల్‌కి అప్పచెప్పి ఉండవలసింది' అని అన్నారు.

బాధ్యతారాహిత్యంగా నిందలుమోపడం ఆర్ఎస్ఎస్ రక్తంలోనే ఉంది. 1947లో సావర్కర్, 'గాంధీజీ, పఠాన్‌లతో భారతదేశంపై దండయాత్ర చేయించి ఆఫ్ఘనిస్థాన్ రాజైన అమీర్‌ని భారతదేశ చక్రవర్తిగా గద్దెనెక్కించేందుకు ఆలీ సోదరులతో కుమ్మక్కు కాలేదా? 1940లో బ్రిటిష్ వారి స్థానంలో నిజాం గనక హిందూ రాజులను అణచిపెట్టి, సరిహద్దులలో గిరిజనులను అదుపు చేసి, ఢిల్లీని ఆక్రమించుకోగలిగి భారత దేశాన్ని పాలించగలిగి ఉంటే అదే కచ్చితమైన స్వయం పాలన అయి ఉండేది. అదే సంపూర్ణ స్వరాజ్యం అయి ఉండేది. అంటే గాంధీ దృష్టిలో ఒక పఠాన్‌కి చెందిన వాడు, ఒక ముస్లిం రాజు, పాలిస్తే భారతదేశానికి స్వతంత్రం వచ్చినట్టా? ఇక హిందువుల మాటేమిటి? అయ్య బాబోయ్ పనికిరాదు!'

మజిల్ కసాలరీ గ్రంథస్థం చేసినట్టు, సావర్కర్, ఆర్ఎస్ఎస్‌తో సన్నిహిత సంబంధాలు పెట్టుకున్నందుకు పెద్దగా బాధపడవలసిన అవసరం లేదు. కానీ, ఆర్ఎస్ఎస్ చేతులు ముడుచుకుని లేదు; అంతకంతకూ పెరుగుతూనే ఉంది. అయితే, సావర్కర్‌ని గాలికి వదిలేసింది. మహాసభకు స్వస్తి చెప్పించి, బ్రిటిష్ ప్రభుత్వం ప్రభావం వెలిగిపోతుండగానే ఇల్లు చక్కపెట్టేసుకుంది. సంస్థాగతంగా అభివృద్ధి చెందింది; ఒక ముఖ్యమైన భూమికను పోషించడానికి సిద్ధమైంది. విభజనానంతరం జరిగిన విధ్వంసం, ఊచకోతలు దానికి సదవకాశాన్ని కల్పించాయి. గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్ పై పూర్తి ఆధిపత్యాన్ని సంపాదించారు.

◆

# ఆర్‌ఎస్‌ఎస్ చేతిలోకి ఓ బైబిల్

**హె**గ్డేవార్ అధినాయకుడిగా ఉన్నకాలంలోనే మాధవ్ సదాశివ గోల్వాల్కర్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. 1940 జూన్ 21న హెగ్డేవార్ చనిపోయిన తరువాత 1940 జులై 3న సర్ సంఘచాలక్ పగ్గాలు పట్టారు. అయన మరణం తరువాత ఆ పదవిలోకి 1973లో మధుకర్ దత్తాత్రేయ దేవరస్ వచ్చే వరకు ఆయనే కొనసాగారు. గోల్వాల్కర్, ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకునిగా అందరికంటే ఎక్కువ రోజులు ఉన్నారు. 1940లో పదవిలోకి రాకముందే, గోల్వాల్కర్ సంస్థపై తనదైన ముద్రను వేశారు. ఆయన తాను రాసిన పుస్తకం 'మనము మన జాతీయత'కి 1939 మార్చి 22న ముందుమాట రాస్తూ, 'వి.డి సావర్కర్ అన్న గణేష్ డి సర్కార్ రాసిన, రాష్ట్ర మీమాంస అనే మరాఠీ పుస్తకమే నాకు ప్రేరణ' అన్నారు. ...

ఆర్‌ఎస్‌ఎస్‌కి ఒక కరదీపికను అందించాలని పుస్తక రచయిత భావించారనడంలో ఎటువంటి సందేహం లేదు. సావర్కర్ లాగే గోల్వాల్కర్ కూడా హిందూ దేశాన్ని సూత్రీకరించాలనుకున్నారు:

ఈ పుస్తకం అంతటిలో నేను 'దేశం' అనే ఒక్క ఆలోచనకు కచ్చితంగా కట్టుబడి ఉన్నాను. ఏంతో అవసరమైతే తప్ప విదేశీ ఆలోచనైన 'రాజ్యం' అన్న పదం వాడకూడదనుకున్నాను. 'దేశం' ఒక సాంస్కృతిక ప్రమాణం. రాజ్యం అన్నది రాజకీయమైనది. రెండిటికి భేదం ఉన్నది. కొంత ఒకదానిపై ఇంకొకటి ఆధారపడి ఉండి ఉండవచ్చుకూడా. ఇక హిందూ రాజ్యం గురించి చెప్పుకుంటే, లేదా ఇప్పుడు ప్రజలు దీనిని పిలుస్తున్న 'ఇండియన్ స్టేట్' విషయం ఇంకా లోతుగా పరిశీలించవలసి ఉంది. అది మరో పుస్తకం అవుతుంది.

హిందూ రాష్ట్రం అంటూ ఒకసారి ఏర్పడితే ఆ తరువాత హిందూ రాజ్యం దానంతట అదే ఏర్పడుతుంది. 'ఈ దేశంలో 'మన దేశం' అంటే హిందూ దేశమే

అయి ఉండాలి. ఇంకేదీ కాకూడదు' అన్నారు ముఖర్జీ గారు. పుస్తకానికి ముందు మాట రాస్తూ, ఎంఎస్ అనే, 'ప్రజాస్వామిక రాజ్యంలో, రాజ్యం అత్యధిక ప్రజలు జాతీయతకు లొంగి ఉండాలి. అది అత్యధికుల అధీనంలోనే ఉండాలి. హిందూ రాష్ట్రం, హిందూ రాజ్యాం కొనసాగేలా చూస్తుంది,' అని ప్రకటించారు.

ఈ పుస్తకం చదవడం అంటే దాని ప్రాముఖ్యతను తెలుసుకోడం. ఇది సావర్కర్ సిద్ధాంతాన్ని సూక్ష్మంగా అందరికీ అర్థమయ్యేలా వివరిస్తుంది. దానికి ఆర్ఎస్ఎస్ ఆమోదం ఉంది. ఈ పుస్తకంలో హిందుత్వ గురించి ఎంత బాహాటంగా వివరించి ఉందంటే వాజ్‌పాయ్ దానిని ఆమోదించలేదు. అయితే, అదేమంత పరిగణనలోనికి తీసుకోబడలేదన్నది వేరే విషయం. 1966లో గోల్వాల్కర్ దీనినే బంచ్ అఫ్ థాట్స్‌లో విశదీకరించారు.

ఇందులో జాతీయత గురించి చెపుతూ 'హిందుస్థాన్, హిందువుల దేశం, అతి విశాలమైనది, ఇదే వారి ఆవాసం, తరతరాలుగా వస్తున్న వారసత్వం, నిర్దిష్టమైన భౌతిక సరిహద్దులు కలది; హిమాలయాలతో ఉత్తరంలో సరిహద్దు విభజించబడి ఉంది. మిగిలిన అన్ని దిక్కులూ సముద్రముంది. ఈ భూమి మా దేశమని గౌరవంగా చెప్పుకునేందుకు వీలైన భూమి. దేశమంటే ఉండాల్సిన లక్షణాలన్నీ ఉన్న దేశం. ఈ దేశంలో అనాది నుండి ఉన్న జాతి హిందూ జాతి–ఒకే భాష, ఒకే రకమైన సంప్రదాయాలు, ఒకే రకమైన ఆశలు. ఈ గొప్ప హిందూ జాతి అద్భుతమైన మతాన్ని, అదే హిందూమతాన్ని కలిగి ఉంది. ఈ మతం ఇప్పటికీ సజీవమైంది; అన్ని స్థాయిలలోని వారందరి ఆశలు, సామర్థ్యాలను పెంచగలది; జీవన తాత్విక చింతనతో మరింత సుసంపన్నం చేయబడింది. ఏ అవరోధాలు అడ్డుగోడలు లేకుండా నిరంతరంగా కొనసాగుతున్నది. ఈ మతం అనుసరిస్తున్నందుకు మనం గర్వించడం న్యాయమే. ఆర్ఎస్ఎస్ జాతి వివక్షతను పట్టించుకోలేదు.

'వ్యక్తిగత, సామాజిక, రాజకీయ జీవితాలలోని అన్ని కోణాలలో మతం ప్రభావంతో ముడిపడిన జాతి, ముస్లింలు, క్రిస్టియన్లు యూరప్ నుండి వచ్చినా చెక్కు చెదరలేదు. గత పది శతాబ్దాలుగా ఇదే అత్యంతఘనమైన జాతి... దానగుణం. సహనం., నిజాయితీ, జీవితమంటే ప్రేమ, త్యాగం సాధారణ హిందువుల స్వభావం. వీటిని పాశ్చాత్య ప్రభావాలు ఏ మాత్రం నిలువరించలేదు. ఇదే హిందూ సంస్కృతి యొక్క గొప్పతనాన్ని సూచిస్తున్నది. పశ్చిమ దేశాల ప్రభావాలకులోనైన వారు కూడా రెంటిని పోల్చి చూసుకుని అత్యున్నత మతం వైపే ఆకర్షితులవుతున్నారు. ఈ సంస్కృతి మనిషిని ఈశ్వరుని రూపంలోకి తీర్చిదిద్దుతుంది. చదువులలో కూడా. (చదువు జ్ఞానం ఒకటికాదు) ఇది జాతికి అఖండ గౌరవాన్ని చిరస్థాయిగా తెచ్చిపెడుతుంది. వివేచనలో

దిగ్గజాలను, ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ఆరితేరిన శాస్త్రజ్ఞులను అందిస్తుంది. భాస్కరాచార్యుడనే శాస్త్రవేత్త, చరక సంహితుడనే భౌతిక శాస్త్రవేత్త, భావ ప్రకాష్, సుశ్రుతుడనే మహా కళాకారులూ, తాజమహల్‌ను, అజంతా, ఎల్లోరా గుహల శిల్పాలను చెక్కిన శిల్పులు ప్రపంచ ప్రజల మన్ననలు పొందారు. వారికి కనువిందు కలిగించారు...' ఇలా రాసిన రచయితే, రిలయెన్స్ హర్‌కిషన్ దాస్ హాస్పిటల్‌లో ప్రాచీన భారత దేశంలో గణేశుడికి ప్లాస్టిక్ సర్జరీ చేసినట్టు మోడీని మాట్లాడేటట్టు చేసారు. గోల్వాల్కర్ ప్రచురించిన ఈ అనంతమైన చిట్టాలో ఒక్క ముస్లిం పేరు కూడా లేదు. అందువలననే వాజ్‌పాయ్ దీనిని అంగీకరించలేదు.

**మేము మళ్ళీ చెప్పదలుచుకున్నాము:** హిందువుల భూమి హిందుస్థాన్, గతంలో హిందూ దేశంగానే ఉంది. భవిష్యత్తులో కూడా ఉంటుంది. – శాస్త్రీయ, ఆధునిక ప్రపంచంలో అవసరమైన 5 శాస్త్రీయ ప్రాథమిక అంశాలు హిందూ దేశం కలిగి ఉంటుంది. అందువలన 'జాతి'ని పునర్నిర్మించే, పునరుజ్జీవింప చేసే, ప్రస్తుతం దిగజారిన హిందూ జాతి నుండి విముక్తి చేసే వారిదే అసలైన హిందూ దేశం. 'హిందూ' అంటూ పొగుడుకుంటూ, దేశభక్తులుగా చూపించుకుంటూ, హిందూ దేశం, జాతి, వారికి ప్రాణప్రదమని చెప్పుకుంటున్న వారు, ఆ దిశగా తమ కార్యకలాపాలు ఉండేటట్టు చూసుకోవాలి. మిగిలిన వారందరూ దేశద్రోహులు, దేశ శత్రువులు; ఉదారంగా చెప్పుకోవాలంటే తెలివి తక్కువవారు.

సావర్కర్‌కి, గోల్వాల్కర్‌కి ఉన్న పోలికలను చూడండి. సావర్కర్ లాగే గోల్వాల్కర్ కూడా ప్రజలకు తమ దేశాన్ని ఎంపిక చేసుకునే అవకాశమిచ్చారు.

విదేశీయులకి రెండే దారులు ఉన్నాయి. వారు ఈ దేశ సంస్కృతితో మమేకం కావచ్చు. హిందూ దేశంలో రెండో శ్రేణి పౌరులుగా ఏ హక్కులు లేకుండా ఉండవచ్చు. లేదా ఈ జాతి అనుమతించినంత వరకు ఇక్కడ ఉండవచ్చు. లేకపోతే వారి జాతి దేశానికి తరలిపోవచ్చు. అదే మైనారిటీ సమస్యకు పరిష్కారం. అదే దేశ జీవనాన్ని ఆరోగ్యవంతంగా, ఒడిదుడుకులు లేకుండా నిలుపుతుంది. రాజకీయంగా రాజ్యంలో మరో రాజ్యాన్ని ఏర్పాటు చేయకుండా నిలవరిస్తుంది.

'తార్కికంగానే భౌగోళిక జాతీయవాదాన్ని తిరస్కరించింది. భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడగానే, 'జాతి అంటే ఒక భౌగోళిక ప్రాంతంలో ఏ కారణం వల అయినా, ఉన్నవారందరూ అనడం ఒక ఆశ్చర్యకరమైన విషయం. ఇది యూరోపియన్ దుందుడుకుతనానికి దారితీస్తుంది. ఎవరైనా వారి వారి స్వార్థ ప్రయోజనాల కోసం ఈ ప్రాంతానికి వచ్చి ఉండవచ్చు. ఆనాడున్న పరిస్థితుల రీత్యా జాతీయ విధాన

నిర్ణయాలలో స్థానం సంపాదించారు. వారి వలన దేశం ఇప్పుడు ఇక అనేక దారులున్న అంచుకు చేరింది.

నిజానికి 'యూరప్‌కి చెందినవారు' అన్నారుగాని, గోల్వాల్కర్ ఉద్దేశం ముస్లింలే. వారే ఆ ఇతరులు. ఇటువంటి ప్రతిపాదనను అత్యధిక హిందువులు తిరస్కరిస్తారని గోల్వాల్కర్‌కి తెలుసు. అందుకే ఆయన వారిపై దాడికి దిగారు.

ఈ 'చదువుకున్న' హిందూ తరగతి, డాక్టర్. ఎస్‌వి కేట్కర్ అన్నట్టు ఆంగ్లేయులకు వారి బానిసలూ తయారయ్యారు. జాతి చరిత్రలో వారి జాడలనే నరుక్కున్నారు; సంస్కృతికి దూరమయ్యారు; దేశమంటూ లేకుండాపోయారు. కానీ 'కాంగ్రెస్'లో వారే అధికులు. ...వేల సంవత్సరాల నుంచి హిందువులు హిందుస్థాన్‌లో జాతీయ జీవనంలో పూర్తిగా మమేకమై ఉన్నారు. అటువంటిది మనం 'మతతత్వ' వాదులం ఎలా అవుతాం? మనకి మన దేశ, మన జాతి ప్రయోజనాలు తప్ప మరే ఇతర అంశం పై ఆసక్తి లేదు.

అందువలనే ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు వారు మతతత్వ వాదులని అనుకోరు. కేవలం హిందూ జాతీయవాదులమని, దేశ భక్తులమని అనుకుంటారు.

'బంచ్ ఆఫ్ థాట్స్' 439 పేజీల పుస్తకం. ఇది వారి సిద్ధాంతానికి ఆమోద ముద్ర వేస్తుంది. దానిని ఆమోదించకుండా ఉండడం సాధ్యపడదు. ఆర్‌ఎస్‌ఎస్‌కి విస్తృత ప్రపంచ దృక్పథం ఉంది. అది ప్రపంచానికే గురువు!

'మా చేతులు, ఒక వైపు అమెరికా – కొలంబస్ అమెరికాను కనుక్కోక ముందే – మరో వైపు చైనా, జపాన్, కంబోడియా, మలయా, సీఎం, ఇండోనేషియా, మంగోలియా వరకు ఉన్న ఇతర నైరుతి ఆసియా దేశాల వరకు చాపి ఉన్నాయి. మా శక్తివంతమైన రాజకీయ సామ్రాజ్యం ఆగ్నేయ దేశాలకు కూడా వ్యాపించి 1400 ఏళ్ళు పాలించింది. ఒక్క శైలేంద్ర రాజ్యమే 700 సంవత్సరాలు పాలించింది – చైనా విస్తరణను ఆపేందుకు శక్తివంతమైన రక్షణ గోడగా నిలిచింది... ఎక్కడా ప్రజల నుంచి వ్యతిరేకతలేదు. కానీ, ఇస్లాం, క్రిస్టియన్, ఇప్పుడు కమ్యూనిజంల రాకతో రక్తం ఏరులై పారుతోంది.

'ప్రజాస్వామ్యం ఒక ఊహ'. వ్యక్తిగత స్వేచ్ఛ అంటే వెక్కిరింత. ఆర్‌ఎస్‌ఎస్ కేవలం ముస్లింలనే లక్ష్యంగా చేసుకోలేదు. ప్రజాస్వామ్యాన్ని కూడా లక్ష్యంగా చేసుకుంది. జాతి దురభిమాన ఆలోచనలే మెదడులో నిండి ఉన్నాయి. "ఒక దేశంలోని సాధారణ పౌరుడు మరో దేశం నుండి వచ్చిన సాధారణ పౌరుని కన్నా ఎప్పుడైనా గొప్పవాడే.' ఆర్‌ఎస్‌ఎస్ జాతి పునరుజ్జీవనం పుక్కిటి పురాణాల ఆధారంగా, జాతి దురభిమానానికి మద్దతుగా నిలిచింది. 'దేశభక్తి అంటే ఒక పరిష్కరించబడిన సమస్య

అయితే మేము దానిని మళ్ళీ ముందుకు తెస్తాం'. 'ఈ భూమి మనది. భారత దేశ జాతీయ జీవితం హిందూ ప్రజలది. అంటే, ఇది హిందూ దేశానిది.' అంటుంది ఆర్ఎస్ఎస్.

'ఇతర మతస్తుల పట్ల అసహనం వ్యక్తం చేసినవాడు హిందువు కాదు. కానీ, మనముందున్న సమస్య ఇస్లాం క్రిస్టియన్ మతంలోకి మారిన వారి గురించే. వారీ దేశంలోనే పుట్టినవారు. ఇక్కడి ఉప్పే తిన్నారు. కానీ, వారు వారికి జీవితాన్నిచ్చిన దేశం పట్ల రుణపడి ఉన్నారా అన్నదే సమస్య. వారు, తాము ఈ భూమి పుత్రులుమని భావిస్తున్నారా? ఈ దేశ సంస్కృతిని సంప్రదాయాలను తమవిగా భావిస్తున్నారా? ఈ దేశానికి సేవ చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నారా? లేదు. వారి మత నమ్మకం మారిపోవడంతోనే, దేశంపట్ల వారికున్న ప్రేమ, భక్తి భావం మారిపోయాయి. అంతటితో ఆగలేదు. వారు దేశ శత్రువులతో తమని తాము గుర్తించుకోవడం మొదలైంది. వారి పవిత్రభూమి మరో దేశంలో ఉంది.

1923లోని సావర్కర్ ప్రతిపాదన 45 సంవత్సరాల తరువాత అంగీకారం వచ్చింది. హిందూ వలయంలోకి తిరిగిరావడం కూడా అంతే.

కేవలం కొంతమంది ముస్లింలే ఇక్కడికి శత్రువులుగా వచ్చి దేశం పై దండెత్తారన్న విషయం అందరికి తెలుసు. అలాగే కేవలం కొంత మందే క్రిస్టియన్లు ఇక్కడికి విదేశాల నుండి వచ్చారు. ఇప్పుడు ముస్లింలు క్రిష్టియన్లు బాగా పెరిగిపోయారు. వారు స్థానిక ప్రజలతో మమేకమయ్యారు. వారి మూలాలు కూడా ఒకటే. కొందరు ముస్లింలుగా మారితే కొందరు క్రిస్టియన్లుగా మారారు. మారకూడదనుకున్నవారు హిందువులుగా మిగిలిపోయారు. అందువలన ఈ మత దాస్యంలో వేల సంవత్సరాలు ఉన్నవారిని, అలాగే విడిచిపెట్టకుండా ఉండడం మా బాధ్యత అని మేము భావిస్తున్నాం. వారిని వారి పూర్వీకుల గృహానికి తీసుకురావాలనుకుంటున్నాం. నిజాయితీగా స్వేచ్ఛను కోరుకునే మనుషులుగా అన్నిరకాల బానిస బంధాలను వదిలించుకోమనండి. పూర్వీకుల జాతి జీవనాన్ని, అంకితభావాన్ని అనుసరించనియ్యండి. అన్నిరకాల బానిసత్వాలు హేయమైనవి. వదిలించుకోవలసినవి. జాతి జీవనంలో నిజమైన స్థానాన్ని నిలుపుకోవాలని అన్నదమ్ములందరికి విజ్ఞప్తి.'

'కొందరు ఇప్పటికే హిందు, ముస్లిం క్రిస్టియన్ల ఐక్యతని రాజకీయ, ఆర్థిక రంగాలలో సాధించామని అంటున్నారు. అయితే, ఆ ఐక్యతని అక్కడితో ఎందుకాపేయాలి? దానిని మరింత విస్తృతపరచి హిందూ జీవన విధానం, ధర్మానికి విస్తరించి మన అన్నదమ్ములను మళ్ళీ మనలోకి ఐక్యం చేయాలి. రాజకీయ ఆర్థికాంశాలను గురించే మాట్లాడుతున్నారు. కానీ, మేము సాంస్కృతిక మత ఐక్యతను

కూడా కోరుకుంటున్నాం. 'సాంస్కృతిక ఐక్యత' రూపంలో ఆర్ఎస్ఎస్ కోరుకునే మత ఐక్యత అసాధ్యం. ఈ పుస్తకంలో పది, పదకొండు విభాగాలు, భౌతిక జాతీయవాదం గురించి, పన్నెండో విభాగం అంతర్గత బెదిరింపుల గురించి రాసి ఉంది. ఆనాటి నుండి ఈనాటి వరకు ఆర్ఎస్ఎస్ బిజెపిలు ఏ మాత్రం మారలేదు. 'ఇక్కడ పూర్తి స్థాయిలో అనాదిగా ఉన్న హిందువులు ఉన్నారు. అనేక ఇతర జాతులు కూడా అతిధులుగా ఉన్నారు. – యూధులు పార్శీలు వగైరా. లేదా దాడి చేసి వచ్చిన ముస్లింలు, క్రిస్టియన్లు కూడా ఉన్నారు. అందరూ ప్రమాదవశాత్తు ఒక ప్రాంతంలో ఉన్నంత మాత్రాన వారందరు ఈ భూమి పుత్రులని ఎలా అంటాం? ...బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం అంతా జాతీయోద్యమంగా మారింది. దేశభక్తితో జాతీయతతో సమానంగా చూడబడింది. ఇటువంటి మితవాద భావాలు స్వతంత్ర పోరాటం అంతా కొనసాగడంతో వాటి పరిణామాలు తీవ్రంగా ఉన్నాయి.

'భారత దేశ స్వతంత్ర పోరాటం అంతా భౌగోళిక జాతీయవాదం ఆధారంగానే జరిగింది. ఏ కులమైనా, మతమైనా మనం అందరం భారతీయులం. ఈ చట్రంలోనే ముస్లింలను నిందించారు. చారిత్రకంగా చూస్తే, రాజకీయంగా మాత్రమే ఈ వైరం లేదు. అదే నిజమైతే చాలా  కొద్ది సమయంలోనే దానిని అధిగమించేవారు. ఇది చాలా లోతులకి పాకింది. ముస్లింలు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నారు. మనం గుడులలో ప్రదక్షణాలు చేస్తాం. వారు వాటిని పాడు చేస్తారు. మనం చేసే భజనలు వారికి చికాకు కలిగిస్తాయి. మనం గోవులను పూజిస్తాం; వారు తింటారు. మహిళలను మనం తల్లిగా గౌరవిస్తే వారు ఆమెను లైంగికంగా అనుభవిస్తారు. మన జీవనానికి వారి జీవనానికి పోలికే లేదు. మతపరంగానే కాదు; సాంస్కృతికంగా, సామాజికంగా కూడా.' వారు ఈ విద్వేషాన్ని మూలాలలోకి తీసుకువెళ్లారు. గోల్వాల్కర్ భావాలలో కొన్ని ముఖ్యాంశాలు ఇవి.

**గోల్వాల్కర్ సారాంశానికి  వివరణ :**

'హిందువులకు పౌరుషం లేదు; వెన్నెముక లేదు. వారి కాళ్లపై వారు నిలబడలేరు. వారి మాతృభూమి కోసం పోరాడేందుకు వారికి ముస్లిం రక్తం ఎక్కించవలసి ఉంది! ఎంతటి అవమానం? ఎంతటి దురదృష్టం. మన నాయకులే ప్రజలకు మనపై మనకు ఉన్న నమ్మకాన్ని, స్వయం ప్రతిపత్తిని నిర్వీర్యం చేసారు. హిందూ ముస్లింలు కలవకుండా స్వరాజ్యం సాధించలేమని చెప్పినవారు నిజమైన దేశద్రోహులు. వారు సమాజానికి తీరని ద్రోహం చేశారు. ప్రాచీన ప్రజల, మహాత్ముల ఆత్మను చంపి అత్యంత హేయమైన నేరానికి పాల్పడ్డారు.

మన మగసిరిని అమ్మేసిన నాయకులు మనకున్నారు. ఇదేదో చారిత్రికంగా

పొరపాటున జరిగింది కాదు. గతించిన 1200 సంవత్సరాలలో అనేక సార్లు మన దేశ మాన ప్రాణాలను విదేశీయులకు పణంగా పెట్టారు. విదేశీయుల నుండి విముక్తి పేరు మీద శత్రువులతో చేతులు కలుపుతున్నారు. వారి స్వార్థం కోసం, వ్యక్తిగత వైరం కోసం, అహం కోసం మన మతస్థుల గొంతులు కోసిన వారితో చేతులు కలుపుతున్నారు...' ఇదంతా మహాత్మా గాంధీని గురించేనని వేరుగా చెప్పనక్కర లేదు. 1966లో కూడా గోల్వాల్కర్ మహాత్మాగాంధీ అంటే అయనకున్న ఏహ్యాభావాన్ని వ్యక్తపరిచారు. ఆనాటి మదన్ మోహన్ మాలవ్య నుంచి, సావర్కర్ యొక్క హిందుత్వమైనా, గోల్వాల్కర్ రచనలైనా ప్రస్తుత ఆర్ఎస్ఎస్ అధినాయకుని ప్రకటనలైనా అన్నిటిలోనూ పూసలో దారంలాగా ఉండేది ఒకటే. ముస్లింల పట్ల ఏహ్యాభావం.

బిజెపి సాంస్కృతిక జాతీయవాదాన్ని ప్రాతిపాదించిన దగ్గరి నుండి వారి ఎన్నికల మ్యానిఫెస్టోలో నిరంతరం ఉండేది 'సాంస్కృతిక జాతీయవాదం'. దానిని క్లుప్తంగా ఇలా చెప్పుకోవచ్చు.. హిందువులందరు ఒక జాతి. ఇండియా వారికే చెందుతుంది. కేవలం భౌగోళికంగానే కాదు, సాంస్కృతికంగా కూడా వారు ఐక్యంగా ఉన్నారు. 2. మైనారిటీలైన ముస్లింలు గాని క్రిస్టియన్లుగాని ఈ దేశంలోని వారు కాదు. వారు ఎన్నటికీ హిందువులతో సరి సమానంగా నిలవలేరు. వారు హిందూ జీవిత విధానానికి కట్టుబడి ఉండానికి ఒప్పుకోవాలి. 3. అయితే, వారు హిందూ మతాన్ని తిరిగి తీసుకోవచ్చు. మెజారిటీతో కలిసిపోవచ్చు. 4. ఆలా జరిగే వరకు హిందువులు వారికిష్టమైనట్టు పాలించుకుంటారు.

ఎల్కె అద్వానీ గర్వంగా 1990 నవంబర్ 19న ప్రకటించినట్టు, 'ఇకపై హిందువుల ప్రయోజనాలు కాపాడే వారే అధికారంలో ఉంటారు.' అంతకు కొన్ని రోజుల క్రితమే, అక్టోబర్ 2న, 'లౌకిక విధానం హిందువుల ఆశలపై అనవసరంగా నీళ్లు జల్లుతున్నది అని ఫిర్యాదు చేసారు. ఇది భారతదేశ రాజ్యాంగం స్థానంలో ఆయన ఎటువంటి విధానాలను అమలు చేయాలనుకుంటున్నారో తెలియచేస్తుంది.

నరేంద్రమోడీ ఈ భావాలతో ఏ మాత్రం విభేదించిన వారు కాదు. గోల్వాల్కర్ కేవలం సాహిత్య ప్రక్రియలకు పరిమితమై రచనలు చేసే మనిషికాదు; ఆయన ముఖ్యంగా ఒక క్రియాశీలి.

◆

# ఆర్ఎస్ఎస్ - స్వాతంత్ర్యం

దేశమంతా ఉత్సాహంగా స్వాతంత్ర్య సంబరాలలో మునిగిపోయి ఉంది. గతకాలంలోని విభేదాలు చాలామటుకు మరిచిపోయారు. డాక్టర్.అంబేద్కర్ యూనియన్ క్యాబినెట్ మంత్రిగా నియమితులయ్యేందుకు వచ్చిన వాదాన్ని అందరూ స్వాగతించారు. తదనంతర కాలంలో ఆయన ఎంపిక సరైనదే అని ఆయన నిరూపించుకున్నారు. హిందూ మహాసభ నాయకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీకి నెహ్రూ క్యాబినెట్‌లో స్థానం కల్పించబడడం ఆశ్చర్యకరమైన విషయం. ఈ చర్యకు కారణం ఇప్పటికీ అంతుపట్టడంలేదు. ఆయన మహాసభ ప్రతినిధిగా, ఆరెస్సెస్ ఛాంపియన్‌గానే క్యాబినెట్‌లో మసిలేవారు.

అలా ఉంటూ నెహ్రూకి, ఆయన సహాయకుడు సర్దార్ వల్ల భాయ్ పటేల్‌కి మధ్య విభేదాలు సృష్టించే వారు. దీనితో క్యాబినెట్‌లో ఇద్దరి మద్దతుదారుల మధ్య విబేధాలు పెరిగేవి.

'పటేల్, ఆర్ఎస్ఎస్ లాగా హిందూ రాజ్యస్థాపనకు మద్దతుదారుడు కాదు. 1947 జూన్ 10న బిఎం బిర్లా, మన రాజ్యం యొక్క మతం హిందూ మతం అయి ఉండాలని' రాసిన ఉత్తరానికి, ఏ మాత్రం సంశయించకుండా నిర్దిష్టమైన జవాబిచ్చారు. 'హిందుస్థాన్‌ని ఒక హిందూ రాజ్యాంగా నిర్మించి హిందూయిజంని దేశ మతంగా ఉండాలనటం సరైనది అని నేననుకోను. ఇక్కడున్న ఇతర మైనారిటీల రక్షణకూడా మన ప్రాథమిక కర్తవ్యమన్న విషయం మనం గుర్తు పెట్టుకోవాలి. కుల మతాలకతీతంగా రాజ్యం ఉండాలి'.

అప్పుడు ప్రధాన ప్రతిపక్షం కమ్యూనిస్టు పార్టీ. ఆర్ఎస్ఎస్ ఏ మాత్రం సమయం వృధా చేయకుండా విద్వేష రచనకు పూనుకుంది. మత ప్రాతిపదికన దేశాన్ని విభజించడాన్ని తూర్పార పట్టింది. విభజన మూలలను పక్కన పెట్టి, నరమేధంలో

పాలుపంచుకుంది. 1947 ఆగష్టు 14న వెలువడిన ఆర్గనైజర్ పత్రిక, మొదటి సంచిక సంపాదకీయంలో, 'మహోన్నత హిందూ దేశంలో జుగుప్సాకర సూచికలు' అని రాసింది. 'భవిష్యత్తు గురించి మనం భయపడవలసిన పనేం లేదు. మన రాజ్యాన్ని తిరిగి పొందేందుకు చేయవలసినదల్లా, నిజమైన జాతి ఆత్మను, జాతి చైతన్యాన్ని జాగృతం చేయడం. మన యోగిపుంగవులు ఇచ్చిన పిలుపులను అనుసరించడానికి మనమంతా నడుంబిగించాలి. ఇప్పుడు మన జాతి ఆత్మ ఘోషిస్తున్నది. మన ఆదర్శవంతమైన లక్ష్యాల సాధనకు, మన పిల్లల భవిష్యత్తులో వెలుగులు విరజిమ్మడానికి వేదపండితుల పిలుపులు వినండి. అవి అటు ఇటు ఉన్న సముద్రాల మధ్య భూభాగం అంతా మారుమోగుతున్నాయి – ఒకే దేశం, ఒకే మహోన్నత, శోభాయమానమైన దేశం, హిందూ దేశం. ప్రపంచవ్యాప్తంగా శాంతిని సంపదను పంచుతున్న దేశం.'

విభజన గురించి ఒక్క మాట కూడా ఎక్కడా ప్రస్తావించలేదు. అంతా 19వ శతాబ్దం నుండి చేస్తున్న సిద్ధాంత ప్రతిపాదనే; భారతదేశ జాతీయవాదం జాతి, మతం మీదే ఆధారపడి ఉంటుంది; ప్రపంచమంతా వ్యాపించడమే లక్ష్యం.

ముస్లింల మీద జరిపిన పాశవిక దాడికి హద్దేలేదు. 1947 సెప్టెంబర్ 30న నెహ్రూ, గృహ మంత్రి పటేల్‌కి రాసిన ఉత్తరంలో 'ఆర్ఎస్ఎస్‌కి విధేయంగా ఉండే హిందూ కూటములు ఢిల్లీలోనే కాదు అమృత్‌సర్‌లో కూడా గందరగోళాలు సృష్టిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్‌కి చెందిన ప్రముఖ నాయకులు ప్రత్యేక మెజిస్ట్రేట్లగాను, ప్రత్యేక పోలీస్ ఆఫీసర్లగాను నియమించబడ్డారు.' అని రాసారు.

1947 డిసెంబర్ 30 మరో లేఖ రాస్తూ, జమ్మూ కాశ్మీర్ మహారాజు హరి సింగ్, అతని ప్రధాన మంత్రి మెహెర్ చాంద్ మహాజన్, 'మనం దేశానికి పంపించిన ఆయుధాలు మన సైనికులకు చేరలేదు. అవి ఆర్ఎస్ఎస్ కార్యకర్తల చేతుల్లోకి వెళ్లాయి. నాకు, మహాజన్‌కి వీరి కార్యక్రమాల పట్ల సానుభూతి ఉందని, వారికి సహాయం చేస్తున్నాడని అనిపిస్తున్నది... 'నెహ్రూ ఎంత ఆవేదనతో ఉన్నారంటే ఆ రోజే మరో లేఖను కూడా రాసారు' ఆర్ఎస్ఎస్ జమ్మూలో ముస్లింలను చంపే పనిలో ఉన్నట్టు ఆరోపణలు వస్తున్నాయి' అప్పటి కాశ్మీర్ ప్రధాని, షైక్ మొహమ్మద్ అబ్దుల్లాహ్ తన ఆత్మ కథలో దీనిని ధృవీకరించారు.' జమ్మూలోని ముస్లింలంతా ఆర్ఎస్ఎస్ దయాదాక్షిణ్యాల పైనే బతికారు', వారి కనుసన్నలలోనే ముస్లిం మహిళలు కాంప్ నుండి బయటకు పంపబడ్డారు.'

1947 అక్టోబర్ 26న కాశ్మీర్ భారతదేశంలో విలీనం కాగానే, ఆర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను ప్రారంభించింది. 'తూర్పు పంజాబ్ నుంచి ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేయడానికి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను కాశ్మీర్‌కి పంపినట్టు నాకు

సమాచారం ఉంది. ఇదే జరిగితే కాశ్మీర్, తన నిర్ణయాన్ని మార్చుకునే అవకాశం ఉంది.' అని నెహ్రూ పటేల్‌కి రాసారు. ఆర్ఎస్ఎస్‌ని ఒక భయంకరమైన, పరిపూర్ణ ఫాసిస్టు శక్తిగా నెహ్రూ భావించారు. 1947 డిసెంబర్ 29న నెహ్రూ, ఉత్తర ప్రదేశ్ ముఖ్య మంత్రి, గోవింద్ వల్లభ పంత్‌కి 'నీవు ఆర్ఎస్ఎస్ పై చర్యలు తీసుకుంటానని అన్నావుకదా! ఇదెప్పుడు జరుగుతుంది అని ప్రశ్నిస్తూ ఉత్తరం రాసారు. అప్పటికే ఒక ట్రక్ నిండా ఆయుధాలను తరలిస్తున్నందుకు పంత్, గోల్వాల్కర్‌ని ఖైదు చేసారు. అంతకు ముందు డిసెంబర్ 17 పంత్‌కి నెహ్రూ మరో లేఖ రాసారు '... మీరు పదిహేను రోజులలోగా ఆర్ఎస్ఎస్ పై చర్యలు తీసుకుంటామ'ని చెప్పారు. అందుకు మొదటి మెట్టుగా ఆర్ఎస్ఎస్ నాయకులకి మీవద్ద ఉన్న సమాచారాన్ని చూపించండి. ...ఆర్ఎస్ఎస్ ఒక భయంకరమైన అభ్యంతరకరమైన సంస్థ. ... ఇది జర్మనీలోని నాజీలను అనుసరిస్తుంది. నాజీలు జర్మనీని అధోగతి పాలు చేసారు. ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న అనేక ఇబ్బందులకు కారణం అదే. అజ్మీర్‌లో జరిగిన వాటికి కూడా ఆర్ఎస్ఎస్ సంస్థే కారణం. ఇటువంటి అల్లర్లను ఇంకా కొనసాగనీయకూడదు. 1947 డిసెంబర్ 7న ప్రాంతీయ ప్రధానులు రాసిన లేఖలో 'ఆర్ఎస్ఎస్ సంస్థకి ప్రైవేటు సైన్యం ఉందని, అది నాజీల మార్గంలో పయనిస్తున్నదని మన దగ్గర అనేక ఆధారాలు ఉన్నాయి. కానీ పౌర స్వేచ్ఛకి భంగం కలిగించడం నా అభిమతం కాదు. కానీ, పెద్ద ఎత్తున ఆయుధాలు కలిగి ఉండడం వాటిని ఉపయోగించాలనే ఉద్దేశం కలిగి ఉండడాన్ని మనం ప్రోత్సహించలేం.' అని రాసారు.

అయితే, క్యాబినెట్‌లో ఉన్న మదగజం శ్యాంప్రసాద్ ముఖర్జీ మాటేమిటి? 1947 సెప్టెంబర్ 28న నెహ్రూ తనకి అందిన ఒక లేఖను శ్యాంప్రసాద్ ముఖర్జీకి చూపించారు. అందులో ఎల్‌బి భోపాట్కర్, అఖిల భారత హిందూ మహాసభ అధ్యక్షుడు 'డాక్టర్.శ్యాం ప్రసాద్ ముఖర్జీ, భారతదేశ క్యాబినెట్‌లో హిందూ మహాసభ ప్రతినిధిగా ఉంటారు. హిందూ మహాసభ అక్కడ ఉండమన్నన్ని రోజులు ఉంటారు. హిందూ మహాసభకు, కాషాయ జెండాకి అయన విధేయత అలాగే ఉంటుంది'. ఈ విషయం స్పష్టంగా చెప్పే ఆయన క్యాబినెట్‌లో చేరారు. ముఖర్జీ ఇంటి మీద కూడా కాషాయ జెండానే ఎగురుతుంది కానీ, మువ్వన్నెల జెండా కాదు. అది చూసి 'నెహ్రూ ముఖర్జీని పిలిచి, మీకు మహాసభ ఎడల విధేయత ఉండవచ్చు. కానీ, మీరు మహాసభ ప్రతినిధిగా క్యాబినెట్‌లో ఉంటున్నట్టు నాకు చెప్పలేదు. మీ ఇంటి పై కాషాయ జెండా ఎగురుతున్నదని కూడా నాకు తెలియదు. ఇది విచిత్రంగా ఉంది. ఒక మంత్రి ఇంటి పై జాతీయ జెండా కాక ఇతర జెండా ఎగరడమేంటి?' అని నిలదీశారు.

1947 సెప్టెంబర్ 30న ముఖర్జీ ఇందుకు సమాధానం ఇస్తూ.. 'నేను ఏ

సంస్థ నియమితునిగానూ క్యాబినెట్‌లో లేను. మహాసభ ఆదేశాలను అనుసరించవలసిన నిర్బంధం ఏమి నాకు లేదు. నా ఇంటి మీద 1947 ఆగస్టు 15 నుండి జాతీయ జెండా ఎగురుతుంది. అప్పుడప్పుడు కాషాయ జెండా కూడా ఎగురుతుంటుంది. ఎంతటి అతి తెలివి ప్రదర్శన! నిజానికి భోపాట్కర్ సాక్ష్యాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి.

నెహ్రూ ముఖర్జీలకు ఒకరితో ఒకరికి పొత్తు కుదిరేది కాదు. గాంధీ హత్యకు రెండు రోజుల ముందు నెహ్రూ పటేల్‌కి రెండు లేఖలు రాసారు. '...యుపి మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి, భారతపూర్‌లో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్నారని, శిక్షణ పూర్తయిన వారు ఆయుధాలతో తిరిగి వస్తున్నారని వార్తలు అందుతున్నాయి' అని రాసారు. ఇది వరకు కేసులలో ఇటువంటి ఆరోపణలు ఉన్నాయి. ఇది అందోళన కలిగించే అంశం. ముఖర్జీకి ఈ విషయాలు తెలియపరచడం జరిగింది. '... హిందూ మహాసభ కేవలం కాంగ్రెస్‌కి ప్రభుత్వానికి ప్రతిపక్షంగా వ్యవహరించడం లేదు. ఆయుధాలను ఉపయోగించి హింసను ప్రేరేపిస్తుంది. ...ఆర్ఎస్ఎస్ ఇంతకన్నా హీనంగా ఉంది. అభ్యంతరకర కార్యకలాపాలలో పాల్గొంటూ, తిరుగుబాట్లను అల్లర్లను సృష్టిస్తూ పోతున్నది.'

అంతకన్నా ఘోరం .. హిందూ మహాసభ వేదికల నుండి చేస్తున్న వికృత, అసభ్యకర ప్రసంగాలు. 'గాంధీ మురాదాబాద్' అందులో ఒకటి. ఇది వారి ప్రత్యేక నినాదం. ఈ మధ్యనే ఒక ప్రముఖ నాయకుడు నెహ్రూను, సర్దార్ పటేల్‌ని, మౌలానా ఆజాద్‌ని ఉరితీయాలని తన ప్రసంగంలో కోరారు . '...మీకు హిందూ మహాసభతో ఉన్న దగ్గరి బంధం వల్ల నేను మీకు రాస్తున్నాను. హిందూ మహాసభ పట్ల, రాజ్యాంగ సభ పట్ల మీ వైఖరి గురించి పదేపదే నన్ను ప్రశ్నిస్తున్నారు. అందువలన మీ వైఖరి నాకు స్పష్టం చేయండి. .. ఈ పరిస్థితిలో మీరెలా వ్యవహరిస్తారో తెలియచేస్తే నేను మీకు రుణపడి ఉంటాను.' అని రాసారు.

గాంధీ హత్యతో నెహ్రూ ముఖర్జీని పిలిచి గతంలో తాను రాసిన ఉత్తరాల గురించి ప్రస్తావించారు. '....రాజకీయాలలో మతతత్వ సంస్థలకు స్థానంలేదని నేను పూర్తిగా విశ్వసిస్తున్నాను. వాటిని ఎట్టి పరిస్థితులలోను ప్రోత్సహించకూడదు. హిందూ మహాసభలాంటి మతతత్వ సంస్థతో ఒక మంత్రి వ్యక్తిగతంగా సంబంధాలు కలిగి ఉండడం మంత్రులందరికీ ఇబ్బంది కలిగించే అంశం. సంబంధం వ్యక్తిగతమే అయినా కూడా అది మన సాధారణ విధానానికి వ్యతిరేకం, ప్రభుత్వానికి కూడా వ్యతిరేకం. ..హిందూ మహాసభతో సహా అన్ని మతతత్వ సంస్థలకు వ్యతిరేకంగా మీరు కూడా గొంతు కలపాల్సిన సమయం, దానితో తెగతెంపులు చేసుకోవలసిన సమయం

ఆసన్నమైంది.' కానీ, ముఖర్జీ అలా చేయలేదు. అందుకు భిన్నంగా పటేల్‌కి మహాసభ నుంచి సావర్కర్ తరఫున ఉత్తరాలు రాయడం మొదలుపెట్టారు.

కానీ, నెహ్రూ పట్టు వదల లేదు. 1948 ఆగస్టు 24న, కొద్దీ రోజుల క్రితం హిందూ మహాసభ రాజకీయాలలోకి ప్రవేశిస్తుంది అని పత్రికలలో చూసాను. మతతత్వానికి వ్యతిరేకంగా మన తీర్మానాలు ఉండడం వలన దీనిని మేము అనుమతించలేము. '...ప్రభుత్వం తన తీర్మానాలకనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటుంది.' అని రాసారు.

సావర్కర్ స్వయంగా ముద్దాయి అవడం వలన పరిస్థితి మరింత దిగజారింది. తీర్పు ఏదైనప్పటికీ, సావర్కర్ దోషి కాదని నిరూపించబడ లేదు. అనేక ప్రాంతాలలో ఆర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను ముమ్మరం చేసిందన్న వార్తలు వస్తున్నాయి. ఈ కార్యకలాపాలు బయటికి శాంతియుతంగా కనిపిస్తున్నప్పటికీ, గతంలో లాగే ఇవి ప్రభుత్వాన్ని కూలదోసేవిగా రూపొందించబడ్డాయి.

'అందువల్ల ప్రజలకు మీ పైన ఉన్న అభిప్రాయాన్ని చెరిపేయవలసిన బాధ్యత మీపై ఉంది. మీకున్న సంబంధాల గురించి పత్రికలలో అనేకరకాల వార్తలు వస్తున్నాయి. అందువలన ప్రజలకి, కాంగ్రెస్ పార్టీ శాసన సభ్యులకి ఉన్న అనుమానాలను బహిరంగంగా నివృత్తి చేయండి. లేకపోతే పుకార్లు చెలరేగి అల్లర్లకు దారితీస్తాయి. నేను కూడా మీకు హిందూ మహాసభతో సంబంధాలు ఉన్నాయో లేదో తెలుసుకోవాలనుకుంటున్నాను.' అని రాసారు.

అందుకు సమాధానంగా ముఖర్జీ 'నేను మిమ్మల్ని ఇరుకులో పెట్టదలుచుకోలేదు. నాకు ప్రభుత్వంతో ఉన్న బంధానికి ముగింపు పలకాలనుకుంటే, ఒక మాట చెబితే చాలు. మీ కోరిక మేరకు తప్పుకుంటాను.' అని సమాధానం ఇచ్చారు.

నెహ్రూ కేబినెట్‌లో విభజనను పెంచేందుకు ఇష్టపడరని ముఖర్జీకి తెలుసు. అందుకే నిర్ణయం నెహ్రూకు వదిలివేశారు. నెహ్రూ మహాసభని, ఆర్ఎస్ఎస్‌ని మతతత్వ సంస్థలు అన్న విషయం ఈనాటి బిజెపికి, ముఖర్జీ స్థాపించిన జన సంఘ్‌కి కూడా వర్తిస్తుంది. 1947కి ఆర్ఎస్ఎస్‌కి ఉన్న పారా మిలిటరీ సంస్థ మరే ఇతర సంస్థలకి లేదు. 1925 నుండి దాని కార్యకలాపాలకు హద్దే లేదు. పాలనా వ్యవస్థలోని అధికారుల మద్దతు దానికుంది. 'ఢిల్లీ పోలీస్‌లో అభిమానులున్నారు; కేంద్ర ప్రాంతాలలో కూడా దాని మద్దతుదారులు ఉన్నారు'.

1948 జనవరి 5 నాటికి ప్రాంతీయ ప్రధానులందరికి హెచ్చరికలు జారీ చేశారు. ఆర్ఎస్ఎస్ పాల్గొంటున్న అనేక ఘోరమైన కార్యక్రమాల ఆధారాలు

బయటపడుతున్నాయి. ఆర్ఎస్ఎస్ నాయకులు బహిరంగంగా, తమది రాజకీయ సంస్థకాదు అని అంటున్నారు. కానీ, దాని విధానాలు, కార్యక్రమాలు రాజకీయమైనవే అని అనడంలో ఎటువంటి సందేహం ఉండాల్సిన పని లేదు. మతతత్వంతో నిండిన వారి కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అదుపులో పెట్టవలసిందే. వారు చెప్పే నీతులకి చేసే పనులకు పొంతన ఉండడం లేదు.

ఆర్ఎస్ఎస్ పురోగతి రెండు సందర్భాలలో మాత్రమే వెనకపట్టు పట్టింది. ఒకటి గాంధీ హత్య. రెండోది దాని పర్యవసానంగా ఆర్ఎస్ఎస్ నిషేధానికి గురవడం. అయితే దాని నుండి తిరిగి పుంజుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి బలమైన సంస్థాగత వ్యవస్థ ఉండడం. రెండోది, ప్రజల జీవితాలలోని వివిధ రంగాలలో వారు లోతుగా మమేకం కాగలగడం, వారి మద్దతుపొందడం. పైగా అధికారుల అండదండలు కూడా పుష్కలంగా లభించడం.

◆

# ఆర్ఎస్ఎస్ - గాంధీ

ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఉండి ఉంటే, 1948 జనవరి 30వ తేదీ గాంధీ, నాథురాం చేత హత్య గావించబడే వాడు కాదు; హత్య చేసే వారి పథకం కూడా బయట పడేది. హత్య చేయించడంలో సావర్కర్ ప్రమేయం దేశానికీ తెలిసేది. ఆర్ఎస్ఎస్ అధినేత గోల్వాల్కర్ ప్రమేయం కూడా మొత్తం ఉత్తర భారతదేశానికి తెలిసేది. దాని ప్రభావం ఆర్ఎస్ఎస్ మీద తీవ్రంగా ఉండేది; నిర్లక్ష్యం వహించిన ఆ నాయకులలో ఒకరు, గోవింద వల్లభ పంత్, మొరార్జీ దేశాయ్. పంత్ ఉత్తర్ ప్రదేశ్ ముఖ్య మంత్రి అయితే, రెండోవారు మొరార్జీ దేశాయ్, ముంబై ప్రాంతీయ గృహ మంత్రి.

మతతత్వ అల్లర్లలో గోల్వాల్కర్ పాత్రను అప్పటి ఉత్తర్ ప్రదేశ్ హోమ్ కార్యదర్శి, రాజేశ్వర్ దయాల్ ఐసిఎస్, బట్టబయలు చేసారు. అతను చెప్పిన విషయాలు దేశంలో దుమారాన్నే రేపాయి. వారి రిపోర్టు :

'యుపి క్యాబినెట్ ఉగిసలాటలు, నిర్ణయం తీసుకోలేకపోవడం తీవ్ర పరిణామాలకు దారితీసిందని నేను నమోదు చేయదలుచుకున్నాను. మతతత్వ ఉద్రిక్తతలు ఇంకా చల్లారక ముందే ఎంతో అనుభవజ్ఞుడైన బిబిఐ జైట్లీ డెప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్, పటమట విభాగం మా ఇంటికి వచ్చారు. అతనితో పాటు ఇద్దరు అధికారులు ఒక పెద్ద ట్రంకు పెట్టె మోసుకుని వచ్చారు. ట్రంక్ తాళం వేసి ఉంది. ట్రంక్ తెరవంగానే పశ్చిమ ప్రాంతమంతా మతతత్వ అల్లకల్లోలాలు సృష్టించడానికి చేసిన కుట్రలు బయటపడ్డాయి. ట్రంక్ నిండా బ్లు ప్రింట్స్ కుక్కి ఉన్నాయి. అవన్నీ ఎంతో నైపుణ్యంతో చేసినవే. ముస్లింలు ఉండే ప్రాంతాలు, స్థలాలు గుర్తించబడి ఉన్నాయి. ఏ ప్రాంతానికి ఎలా వెళ్లాలో విశదీకరించి ఉంది. అవన్నీ భయంకరమైన వారి పన్నాగాలు తెలియచేశాయి.

'అవి చూడగానే నేను వాటిని పంత్ ఇంటికి పోలీసులను వెంటపెట్టుకుని తీసుకెళ్ళాను. అక్కడకు చేరగానే జైట్లీ విషయాన్ని క్షుణ్ణంగా వివరించారు. సరైన సమయంలో ఆర్ఎస్ఎస్ ఆఫీస్ మీద దాడి చేయడం వలన మొత్తం పథక రచన చేసింది, పర్యవేక్షించింది ఆర్ఎస్ఎస్ అధినాయకుడే అని బయటపడింది. అప్పటికింకా గోల్వాల్కర్ పారిపోలేదు. ఆ చుట్టుపక్కలే గోల్వాల్కర్ తిరుగుతున్నారు. అయితే తప్పించుకునే ప్రయత్నంలోనే ఉన్నారు. అతనిని బంధించాలని నేను జైట్లీ కూడా ఎంతో పట్టుబట్టాం. పంత్ ఎంతో ఆందోళన చెందారు. కానీ, వెంటనే అరెస్టు చేయడానికి అనుమతినిచ్చేబదులు ఈ విషయాన్ని వచ్చే క్యాబినెట్ సమావేశంలో చర్చకు పెడతానని చెప్పారు. నిజానికి అదో రాజకీయ నిర్ణయం తీసుకోవలసిన విషయమే. ఎందుకంటే అప్పటికే ఆర్ఎస్ఎస్ రాజకీయాలలో వేళ్లూనుకుంది. మరో విషయం ఆర్ఎస్ఎస్ అభిమానులు కాంగ్రెస్‌లో బహిరంగంగానో అంతర్గతంగానో నిండి ఉన్నారు. క్యాబినెట్‌లో కూడా. పెద్దల సభ అధ్యక్షుడు ఆత్మ గోవింద్ ఖేర్, ఆర్ఎస్ఎస్ అభిమాని, అతని ఇద్దరు కొడుకులు ఆర్ఎస్ఎస్ సభ్యులే.

అయితే, సభ జరిగినప్పుడు కూడా చర్చ సజావుగా జరగలేదు. అసందర్భంగా జరిగింది. పోలీసులు ఆ ప్రాంతాన్నంతటిని అల్లకల్లోలం చేయగల ఒక తీవ్రమైన విషయాన్ని పరిశోధించి క్యాబినెట్ ముందుకు పెట్టినందుకు వారిని అభినందించే పరిస్థితి ఆ చర్చలలో కనిపించలేదు. సభలో ఆఖరికి గోల్వాల్కర్ నుండి సంజాయిషీ కోరుతూ ఒక ఉత్తరం మాత్రం రాయాలని తీర్మానించారు. అది మరింత బలంగా ఉండేందుకు పంత్ సంతకంతో ఇవ్వాలని నేను పట్టుబట్టిన తరువాతే ఒప్పుకున్నారు. ఆ ఉత్తరాన్ని గోల్వాల్కర్‌కి అందించేందుకు ఇద్దరు పోలీస్ ఆఫీసర్లు పంపబడ్డారు. అయితే, గోల్వాల్కర్‌కి ఈ విషయం ముందే చేరిపోయింది. ఆ ప్రాంతం నుండి మాయమయ్యారు. వారాలు గడుస్తున్నా ఉత్తరం గోల్వాల్కర్‌కి చేరలేదు. జనవరి 30 రానేవచ్చింది. మహాత్ముడు ఒక ఆర్ఎస్ఎస్ ఉగ్రవాది చేతిలో హతుడయ్యాడు. నాకు ఈ ఉదంతం తీవ్రమైన మనస్తాపాన్ని మిగిల్చింది'.

ఆర్ఎస్ఎస్ గనక సాక్ష్యాలతో దొరికి ఉంటే ఘోరంగా దెబ్బతిని ఉండేది. అలా జరగనందువలన ఆర్ఎస్ఎస్, నాథురాం గాడ్సేకి తనకి ఎటువంటి సంబంధం లేదని ఊరూ వాడా అరిచి గగ్గోలు పెట్టగలిగింది. ఆర్ఎస్ఎస్ కేంద్ర కార్యకారి మండలం ఈ ఘోరానికి ఆమోదముద్ర వేసిందన్న ఆరోపణ చేయడానికి కూడా ఎవరూ సాహసించలేదు. వ్యక్తిగతంగా ఈ హేయమైన చర్యకు పాల్పడిన నాథురాం గాడ్సే ఆర్ఎస్ఎస్ సభ్యుడన్న విషయం దాని పరువుకు భంగం కలిగించేది. కానీ, ఆర్ఎస్ఎస్ గాడ్సే తమ సభ్యుడన్న విషయాన్ని కూడా ఒప్పుకోలేదు. అందుకు భిన్నంగా

గోపాల్ గాడ్సే, నాథురాం అన్న, 'మేము ముగ్గురు అన్నదమ్ములం ఆర్ఎస్ఎస్ కార్యాలయంలోనే మా ఇళ్ళలోకన్నా ఎక్కువసేపు గడిపాం. అక్కడే పెరిగాం' అని ప్రకటించారు.

ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభ, రెండు మహాత్మా గాంధీ పట్ల ద్వేషాన్ని బహిరంగంగా ప్రకటించాయి. అప్పటి గృహ మంత్రి, ప్రఖ్యాత క్రిమినల్ న్యాయవాది, వల్లభాయ్ పటేల్ రాసిన మూడు ఉత్తరాలు అప్పటి పరిస్థితిని క్షుణ్ణంగా తెలియచేస్తాయి:

1948 జనవరి 27న, జవహర్‌లాల్ నెహ్రూకి రాసిన ఉత్తరంలో' నేను ప్రతిరోజూ పరిశోధన పురోగతిని పరిశీలిస్తూనే ఉన్నాను... స్టేట్మెంట్స్ అందరి దగ్గరి నుండి తీసుకుంటూనే ఉన్నాం. ఈ సంఘటన ఢిల్లీలోనే జరిగినా కుట్ర మాత్రం పూణె, ముంబై, అహమ్మదాబాద్, గ్వాలియర్‌లలో జరిగినట్టు ఆధారాలు నిరూపిస్తున్నాయి. కుట్రదారులు ఒకటి రెండు రోజులకు మించి ఢిల్లీలో గడపలేదు. ఇందులో ఆర్ఎస్ఎస్ ప్రమేయం లేదు, హిందూ మహాసభ తీవ్రవాది సావర్కర్ నేతృత్వంలో ఈ కుట్రకు పథక రచన చేసినట్టు తెలుస్తున్నది. .. ఆర్ఎస్ఎస్ గాంధీ హత్యను ఆహ్వానించినా పథక రచన చేసిన అధారాలు లేవు.' అని రాసారు.

పటేల్ క్యాబినెట్ సహచరుడైన ఎస్‌పి ముఖర్జీ సావర్కర్‌కి సహాయం చేసేందుకు క్యాబినెట్‌లో ఉండనే ఉన్నాడు. అయన సావర్కర్‌ని కేసు నుండి తప్పించేందుకు సదా ప్రయత్నాలు చేసారు. ఆయన వయసు, త్యాగాలు, బాధలు ముందుకుతెచ్చారు. కానీ, పటేల్ సావర్కర్‌కి కుట్రలో సంబంధం ఉన్నట్టు కచ్చితంగా నమ్మడం వలనే ఆయనను నిందితుల జాబితాలో చేర్చారు. చట్టప్రకారం సావర్కర్‌ని నిందితునిగా రుజువు చేయడానికి తగిన ఆధారాలు లేకపోయినా 'నైతికంగా' సావర్కర్ బాధ్యుడిని చేయడానికి సందేహ పడనవసరం లేదు. ముఖర్జీ పదే పదే వెంటపడడం వలన 1948 జులై 18న పటేల్ మరో ఉత్తరం రాసారు' గాంధీ హత్యకి సంబంధించిన కేసు కోర్టులో ఉండడం వలన నేను ఆర్ఎస్ఎస్ హిందూ మహాసభ గురించి మాట్లాడ దలుచుకోలేదు. కానీ, వచ్చిన సమాచారం ప్రకారం, ఈ రెండు సంస్థలు, (ముఖ్యంగా మొదటిది) దేశంలోనే ఇంతటి ఘాతుకం జరిగేందుకు ఒక వాతావరణాన్ని సృష్టించడానికి తోడ్పడ్డాయి అనడంలో సందేహం లేదు. హిందూ మహాసభలోని తీవ్రవాదులు ఈ కుట్రలో భాగస్వాములన్న దానిలో కూడా నాకెటువంటి సందేహం లేదు. ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలు రాజ్యం, ప్రభుత్వాల మనుగడకు ముప్పు కలిగిస్తున్నాయని స్పష్టంగా చెప్పవచ్చు. నిషేధం ఉన్నప్పటికి ఈ రెండు సంస్థల కార్యక్రమాలు ఆగలేదు. మరింతగా పెరుగుతున్నాయి.' గోల్వాల్కర్ లక్నో నుండి

పారిపోయారన్న విషయం ఇంటెలిజెన్స్ బ్యూరో పటేల్‌కి తెలియనివ్వలేదన్నది ఊహకందని విషయం.

ఇక సావర్కర్‌ని గాంధీ హత్యకి ముందు అరెస్టు చేయబోయిన నాగర్వాల్‌ని మొరార్జీ అడ్డుకున్న తీరు, ట్రయిల్ కోర్టులో ఆయన ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి. కోర్టులో క్రాస్ ఎగ్జామినేషన్ చేసేటప్పుడు నిందితుని న్యాయవాది, మొరార్జి దేశాయ్‌ని గాంధీ హత్య గురించి ప్రొఫెసర్ జైన్ స్టేట్‌మెంట్‌కి అదనంగా మీరేమైనా చెప్తారా అని అడిగితే, మొరార్జీ దేశాయ్, 'సావర్కర్ గురించి అంతా చెప్పడానికి నేను సిద్ధంగా ఉన్నాను. సావర్కర్ అనుమతిస్తే చెప్తాను.' అనగానే కుట్రదారుని న్యాయవాది ప్రశ్నను ఉపసంహరిచుకున్నారు. దీనిని న్యాయాధికారి ఎందుకనుమతించారో తెలియదు. సావర్కర్ దోషులలో ఒకరైనప్పటికీ శిక్ష నుండి తప్పించుకున్నారు. నిజానికి స్వతంత్ర వ్యక్తి సాక్ష్యం అవసరమైనప్పటికీ అప్రూవర్ సాక్ష్యమే సరిపెట్టబడింది. ఉన్న సాక్ష్యాలను కనుక పరిగణిస్తే సావర్కర్ నిర్దోషిగా పరిగణించనక్కరలేదు. అయినా 'వి.డి సావర్కర్‌కి 1948 జనవరి 20, 30 తేదీలలో జరిగిన ఢిల్లీ ఘటనకు సంబంధం ఉన్నట్టు అనుకోవలసిన అవసరం కనిపించలేదని' న్యాయాధిపతి నిర్ధారణకు వచ్చారు! ఆ తరువాత తెలిసిన విషయం, జడ్జి ఆత్మాచరణ్ సావర్కర్ పట్ల మృదువుగా ఉండడానికి కారణం ఆయన హిందూ మహాసభకు విధేయుడు. ఈ కేసు వాదించిన పి ఎల్ ఇనాందార్ తన జ్ఞాపకాలలో 'సావర్కర్ విడుదల తనని ఆశ్చర్యపరిచిందని రాసారు. 'ఆశ్చర్యంగా, ఈ రోజుకి ఆత్మ చరణ్ తన 'విడుదల' తీర్పులో అమలు చేయాల్సిన భాగాన్ని ఎలా చదివారో గుర్తుచేసుకోలేకపోతున్నాను. ఒకనాడు 'నన్ను నమ్ము, నువ్వు ఇంత సమర్ధవంతంగా ప్రవేశపెట్టిన కేసుకు నేను పూర్తి న్యాయం చేస్తాను' అన్న ఆత్మ చరణ్ ఇతనేనా అని నేను అతని కళ్ళలోకి చూసాను. కోపంతో నాకు నేనే 'అవును, ఈ ఆత్మ చరణ్ కేసును ముగిస్తూ తన చివరి పేరాలో నా ప్రశ్నకు సమాధానం చెప్పారు. నాథురాం వాదనలను ఎంతో శ్రద్ధతో పూర్తిగా దృష్టి కేంద్రీకరించి విన్నాను. ఒక దశలో నాకు కళ్ళు నీళ్లతో నిండిపోయాయి.'

ఒక న్యాయాధికారి స్థానంలో ఉన్న వ్యక్తి, ఓపికతో హత్య కేసు వింటూ చలించిపోయి కన్నీరు పెట్టుకోవడం ఎప్పుడూ జరిగి ఉండదు! అదీ ఒకవైపు హంతకుడి పై రాజకీయ దుమారం లేస్తున్న సందర్భంలో. పైగా గాడ్సేకి వ్యతిరేకంగా వచ్చిన సాక్ష్యాలపై మాత్రమే దృష్టిపెట్టారు.

అప్రూవరుగా మారిన వారి సాక్ష్యాలేకాదు స్వతంత్ర సాక్ష్యాలు అవసరమని న్యాయశాస్త్రం ఘోషిస్తున్నది. టేపులు లేకపోయి ఉంటే, రిచర్డ్ నిక్సన్ దొరికి ఉండేవాడా? బెకెట్ హత్య కేసులో కింగ్ హేన్రి II ప్రోద్బలం స్పష్టంగా ఉన్నా దొరికేవారే

కాదు కదా. 1949 ఫిబ్రవరి 10న ఇచ్చిన తీర్పులో జడ్జి ఆత్మ చరణ్ సావర్కర్‌ని విడుదల చేస్తూ అప్రూవర్ బాగ్డే సాక్ష్యం నిజాయితీగా ఉందని నేను భావిస్తున్నాను. ఈ పరిస్థితులలో నిందితుడిని దోషిగా తీర్పునివ్వడం 'సురక్షితంకాదని' అభిప్రాయపడుతున్నాను' అన్నారు. ఆ తరువాత ఇరవై ఏళ్ళకి 1969 సెప్టెంబర్ 30న సుప్రీం 'కోర్టు న్యాయవాది జస్టిస్ జీవన్ లాల్ కపూర్ తన రిపోర్టులో 'సాక్ష్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన మీదట, వాస్తవాలను పరిగణలోనికి తీసుకున్న తరువాత ఇది, సావర్కర్ అతని గ్రూప్ కుట్ర అని అనడంలో సందేహం లేదు' అన్నారు.

ఈ కమిషన్ ముందుంచిన అనేక సాక్ష్యాలు ట్రయల్ కోర్టుకు సమర్పించలేదు. సావర్కర్ చనిపోయిన తరువాత ఆయన సహాయకులు ఇచ్చిన వాజ్మూలాలు ఇందులో చేర్చబడ్డాయి. వారు గాడ్సే, నారాయణ్ ఆప్టే సావర్కారును కలవడానికి వస్తూ, పోతుండేవారని సాక్ష్యాలను సమర్పించారు. ఇవే కనుక ట్రయల్ కోర్టుకి సమర్పించి ఉంటే సావర్కర్ శిక్షను తప్పించుకోను వీలయేది కాదు.

1948లో దొరికిన రెండు తిరుగులేని సాక్ష్యాలు న్యాయంగా ఆలోచించే వారికి సావర్కర్ అంటే అసహ్యం కలిగేటట్టు చేస్తాయి. ఏ కుట్ర కేసులో అయినా నేరస్థుడితో ఉన్న సంబంధం అత్యంత కీలకం. అలాగే దోషి ప్రవర్తన కూడా. 1947లో గాడ్సే 'మా మనసు లోతులలో వీర్ సావర్కర్‌తో బంధాన్ని తెంపుకోవలసిన సమయం వచ్చిందని మేము భావించాం. భవిష్యత్తు కార్యక్రమాలలో ఆయనను సంప్రదించకూడదు' అన్నట్టు పదే పదే ప్రచారం చేసారు. ఇదంతా కేవలం అబద్ధాన్ని బలపరచడానికి వేసిన ఎత్తుగడే.

సావర్కర్ చనిపోయిన తరువాత కపూర్ కమిషన్ ముందు మాత్రమే అసలు విషయాలు వెలుగు చూసాయి.

సావర్కర్‌ని ఎప్పుడైనా కలవగల అవకాశాలు గాడ్సేకి, ఆప్టేకి పుష్కలంగా ఉండేవి. 1948 మార్చి 4న ముంబై పోలీసులు, వి.డి సావర్కర్ అంగ రక్షకుడైన అప్ప రామచంద్ర కసర్ రెకార్డ్ ఇచ్చిన సాక్ష్యంలో, '1946 నుంచే ఆప్టే, గోడ్సే సావర్కర్ దగ్గరికి సర్వసాధారణంగా వచ్చిపోతుండే వారు. కర్కరే కూడా వచ్చేవారు. 1947 ఆగష్టులో సావర్కర్ ఒక సమావేశానికని పూణె వెళ్లిన సమయంలో గాడ్సే, ఆప్టేలు అతనితోనే ఉన్నారు. వారు ఎప్పుడూ సావర్కర్‌తోనే ఉండేవాడు, హిందూ మహాసభ భవిష్యత్తు విధానాల గురించి మాట్లాడుతుండేవాడు, ...'

సావర్కర్ కార్యదర్శి, గజానన విష్ణుదాంలే 1948లో ముంబై పోలీసులు ప్రశ్నించినపుడు' ఆప్టే సర్వసాధారణంగా సావర్కర్‌ని కలుసుకోడానికి వచ్చేవాడని, కొన్నిసార్లు గాడ్సేతో కూడా కలిసి వచ్చేవాడని చెప్పాడు. అగ్రణి పత్రిక

ప్రారంభించినపుడు డిపాజిట్ చేయాల్సివస్తే సావర్కర్ ఆప్టేకి, గాడ్సేలకి రూ 15000/– అప్పు కూడా ఇచ్చారు. ....కొన్నాళ్ళకి అగ్రణి పత్రిక నిలిచిపోయి దానికి బదులుగా 'హిందూ రాష్ట్ర' పత్రిక ప్రారంభమైంది సావర్కర్ దాని ఎడిటర్, ఆప్టే, గాడ్సేలు మేనేజింగ్ ఏజెంట్స్.

మొత్తానికి గాంధీని హత్యచేసిన కేసులో నిందితులైన వారు, గాడ్సే, ఆప్టే, కర్కరే, డాక్టర్ పర్చూరు. వీరందరూ సావర్కర్ ఇల్లు, 'సావర్కర్ నిలయానికి' పదేపదే వచ్చేవారని రుజువైంది.

అసలు సావర్కర్ సహాయకులిద్దరిని ట్రయల్ కోర్టులో సాక్షులుగా ఎందుకు ప్రవేశపెట్టలేదో ఇప్పటికీ ప్రశ్నార్థకమే. జస్టిస్ కపూర్ పరిశీలనలో స్పష్టంగా విషయాలు తేలిపోయాయి. 'దొరికిన అన్ని సమాచారాల ఆధారంగా సావర్కర్, ఆయన గ్రూప్ కుట్రలో భాగస్వాములని కచ్చితంగా తేలిపోయింది.'

'ఆర్ఎస్ఎస్ సభ్యులు హిందూ మహాసభలో కూడా సభ్యులు. ఆర్ఎస్ఎస్ పటిష్టమైన నిర్మాణం గల సంస్థ; అది భారతదేశంలో ప్రధానమైన మిలిటెంట్ హిందూ సంస్థ; అది హిందూ మహాసభకు అనుబంధ సంస్థ కాకపోయినా, అందులోని ప్రముఖులంతా హిందూ మహాసభ సిద్ధాంతానికి కట్టుబడినవారే,' అని జస్టిస్ కపూర్, తన తీర్పులో ఉటంకించారు.

1950 జులై 20 వతేదీన అండమాన్ జైలులో అధికారులకి దాసోహమంటూ, ఒక నికృష్టమైన లేఖ, దేనికైనా 'కట్టుబడి' ఉండేందుకు సిద్ధమని రాసి సమర్పించిన తరువాత ఖిన్నుడిగా, విఫలమైన రాజకీయవేత్తగా, అనామకుడిగా ఉండి, సావర్కర్ 1966 కన్నుమూశారు.

1937లో ఆయన అధ్యక్షుడయ్యే నాటికే మహాసభ పతనావస్థలో ఉంది. దానిని ఉత్తేజపరచలేకపోయారు. కానీ, ఆయన దగ్గరైన నాటికి ఆర్ఎస్ఎస్ ఉచ్ఛస్థితిలో ఉంది. అయితే, ఆర్ఎస్ఎస్ని, దాని రాజకీయ అంగమైన బిజెపిని పూర్తి విషమయం చేసి వెళ్లారు. 1966లో సావర్కర్ కన్నుమూశారు.

1963 మే 15న సావర్కర్ 80వ పుట్టినరోజు సందర్భంగా గోల్వాల్కర్, సావర్కర్, 'హిందుత్వ సిద్ధాంతానికి,' తాను రుణపడి ఉన్నట్టుగా ప్రకటించారు.

◆

# ఆర్ఎస్ఎస్ పై నిషేధం

1948 ఫిబ్రవరి 1వ తేదీ గోల్వాల్కర్ నిర్బంధించబడ్డారు. గాంధీ చనిపోయిన 3 రోజులకి ఆర్ఎస్ఎస్ నిషేధించబడింది. 1948 ఆగస్టు 6వ తేది గోల్వాల్కర్ విడుదల చేయబడ్డారు. 1949 జులై 11వ తేదీ నిషేధం ఎత్తివేయబడింది. గోల్వాల్కరికి నెహ్రూ పటేళ్లకు మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఆర్ఎస్ఎస్ ప్రచురించి షరతులతో గోల్వాల్కర్ని విడుదల చేయడం అసత్యమని ప్రచారం చేసుకుంది. 1976లో కూడా ఇదే తంతు పునరావృతం అయింది. ఎమర్జెన్సీ కాలంలో చరణ్ సింగ్కి, ఓ. పి మాథుర్, ఎమర్జెన్సీ ముగియగానే ఆర్ఎస్ఎస్ ని రద్దు చేస్తామని మాటిచ్చారు. ఇప్పుడు జరుగుతున్నది కూడా అదే.

ఆర్ఎస్ఎస్ పదే పదే కోరడంతో, దయతో కొన్ని షరతులను విధించి క్షమాభిక్ష ఇచ్చింది. ఒకసారి నిషిద్ధాన్ని ఎత్తివేయగానే ఆర్ఎస్ఎస్ షరతులను గాలికి వదిలేసింది. ఏమీ జరగనట్టే ముందుకు పోసాగింది. 1958 డిసెంబర్లో 'విచారణ తరువాత న్యాయం' అంటూ ఆర్ఎస్ఎస్ ఒక ప్రచురణ చేసుకుంది. అందులో ఏ షరతులు లేకుండా, ఏ అవమానకరమైన నిబంధనలు లేకుండా గోల్వాల్కర్ విడుదల అయ్యారని రాసుకుంది. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ ఇచ్చిన మాట నిలుపుకున్న దాఖలాలు లేవు. ఆర్ఎస్ఎస్ సభ్యులు చెప్పే ఆదర్శాలను ఏ మాత్రం పాటించలేదని ప్రభుత్వాలు గమనించాయి; సభ్యులు అవాంఛనీయమైన, భయంకరమైన కార్యక్రమాలలో పాల్గొంటారు. హింసలో ఉన్మాదంగా పాల్గొంటారు. హింసలు, దోపిడీలలో పాల్గొంటారు. హత్యలు చేస్తారు; ఆయుధాల అక్రమ రవాణాకు పాల్పడతారు.

ప్రజల దగ్గరి నుండి డబ్బులు వసూలు చేసి ఆయుధాలు చేరవేసుకుని, ప్రభుత్వం, పోలీసులు సైనికులపట్ల అసంతృప్తిని ప్రజలలో కలిగిస్తారు. ఇవన్నీ రహస్యమనే ముసుగులో జరుగుతాయి. ప్రభుత్వాలు ఆర్ఎస్ఎస్ని ఒక కార్పొరేట్

సంస్థగా చూసుకుని ఈ కార్యకలాపాల వలన తమ అధికారానికి ఎంతవరకు నష్టం కలుగుతుందో అంచనా వేసుకుంటుంటాయి. అలాంటి ఒక సమావేశంలో సంఘ్‌ని పూర్తిగా ఇందుకు బాధ్యుడిని చేసే సమయం ఇంకా రాలేదని ఏకగ్రీవంగా తీర్మానించబడింది. వ్యక్తులుగా చేసే ఇటువంటి చేష్టలకు వారినే బాధ్యులను చేసి చర్యలు తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. అయితే సంఘ్ చేసే అభ్యంతరకర, హానికర చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి; సంఘ్ ప్రేరేపిస్తున్న హింస ఎన్నో ప్రాణాలను బలిగొంది. అందువలన ఆఖరికి సంఘ్‌ని నిషేధించాలని నిర్ణయం తీసుకొంది.

ఫిబ్రవరి 6న గోల్వాల్కర్, సంఘ్‌పై నిషేధం ఉన్నన్ని రోజులు, సంఘ్‌ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. గోల్వాల్కర్‌పై 4 నిబంధనలు విధించబడ్డాయి. 1. జిల్లా మేజిస్ట్రేట్ రాతపూర్వక అనుమతినిస్తే గాని నాగ్‌పూర్‌ని దాటి వెళ్ళడానికి అనుమతి లేదు. 2. ఏ సభలలో పాల్గొనకూడదు, 3.జిల్లా మేజిస్ట్రేట్ అనుమతి లేకుండా వార్తా పత్రికలలో, వార మాస పత్రికలలో ఎటువంటి రచనలు ప్రచురించకూడదు. 4. కేంద్ర, ప్రాంతీయ ప్రభుత్వాలకు ఇబ్బంది కలిగించే విధంగా, ఇండియా డొమినియన్‌లో నివసించే వేర్వేరు తరగతుల ప్రజల మధ్య శత్రుత్వం పెరిగే విధంగా, ప్రత్యక్షంగాకాని, పరోక్షంగాకాని విద్వేషాన్ని రెచ్చగొట్టే ఎటువంటి కార్యక్రమాలలో వ్యక్తులుగా పాల్గొనకూడదు; అటువంటి మూకలలో భాగస్వాములు కాకూడదు. ప్రజలలో అల్లకల్లోలాలు రెచ్చగొట్టకూడదు.

గోల్వాల్కర్ ఈ అవమానకరమైన నిబంధనలను ఎప్పుడూ ఉల్లంఘించలేదు. నిరంతరంగా నెహ్రూతోను, పటేల్‌తోనూ సంప్రదింపులు జరుపుతూనే ఉన్నారు. ఉత్తర ప్రత్యుత్తరాలు నడుపుతూనే ఉన్నారు. జిడి బిర్లాతో సహా అనేక మంది ఆయనకి అనుకూలంగా మధ్యవర్తిత్వం జరుపుతూనే ఉన్నారు. కానీ, నెహ్రూ కరగలేదు. ఆర్ఎస్ఎస్ నిజమైన లక్ష్యాలు వాళ్ళ ప్రకటిత లక్ష్యాలకన్నా భిన్నమైనవిగా కనిపిస్తున్నాయి. అవి రాజ్యాంగానికి విరుద్ధమైనవి; వారి కార్యకలాపాలు దేశానికీ వ్యతిరేకమైనవి, తరచూ అడ్డంకులు సృష్టించేవి, హింసాత్మకమైనవి.

నెహ్రూ రాజ్యాంగ సభ 3వ తీర్మానాన్ని దృష్టిలో పెట్టుకున్నారు: కొత్తగా ఏర్పరచుకున్న రాజ్యాగంలో ప్రజాతంత్ర పనివిధానం సమర్థవంతంగా పనిచేయడం అత్యంత కీలకం; దేశ ఐక్యత సౌభ్రాతృత్వం అభివృద్ధి చెందాలి; భారత జీవనం నుండి మతతత్వాన్ని సంపూర్ణంగా పారదోలాలి; తన రాజ్యాంగం ప్రకారం కానీ, అధికారుల విచక్షణ ప్రకారంగాని మతం, జాతి, కులం, లేదా ఇందులో ఏ కొన్నిటిని అయినా అనుసరించి పనిచేసే మతతత్వ సంస్థలను పనిచేయనివ్వకూడదని ఈ శాసన సభ భావిస్తున్నది; పూర్తిగా స్వచ్ఛమైన మతపర, సంస్కృతిక, సామాజిక విద్యాపరమైన

అవసరాల ఆధారంగా జాతి అభివృద్ధికి దోహదపడే సంస్థలనే అనుమతించాలి. ఇందుకు భిన్నంగా పనిచేసే సంస్థల కార్యకలాపాలను శాసనం ద్వారా, అధికారిక ప్రక్రియల ద్వారా అడ్డుకునేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. ముఖర్జీకి ఇవన్నీ తెలుసు.

ఆగస్టు 11వ తేది పటేల్ గోల్వాల్కర్‌కి ఉత్తరం రాస్తూ, అందులో 'ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు తమ దేశభక్తియుత కార్యక్రమాలు కాంగ్రెస్‌లో కలిసిపోయి మాత్రమే పనిచేయగలరని ఆశిస్తున్నాను' అని అందుకు గోల్వాల్కర్ 'ప్రస్తుతం కాంగ్రెస్ రాజకీయంగా సమర్థవంతమైనది, ప్రభుత్వంలో ఉన్నది. ఆర్ఎస్ఎస్ సాంస్కృతిక రంగంలో, దేశభక్తిలో, సౌభ్రాతృత్వంలో, త్యాగనిరతిలో తిరుగులేనిది; ఇద్దరి మధ్య ప్రేమ కొనసాగుతూనే ఉంటుంది. ఒకరికొకరి అనుబంధం కొనసాగుతుంది; ఒకరి లోటును మరొకరు పూడుస్తుంటారు. రెండింటిది పవిత్ర సంగమం అని రాసారు.'

ఆర్ఎస్ఎస్ ముఖ్యులు ఎకనాథ్ రానిడే, పిబి దాని, ఎండి దేవరస్‌లు ఒక ముసాయిదా ఆర్ఎస్ఎస్ రాజ్యాంగాన్ని ప్రతిపాదించారు. ప్రభుత్వం దాన్ని సంపూర్ణంగా తిరస్కరించింది.

నాల్గవ అధికరణంలో, 'చట్ట ప్రకారం ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగానికి విధేయత కలిగి ఉండాలని ఒక ప్రత్యేక ప్రకటన చేయబడింది. 5వ అధికరణంలో జాతి జెండా (ఆర్ఎస్ఎస్ కాషాయ జెండా తిరస్కరించబడింది) దేశం అవసరాలు తీర్చే విధంగా ఉంటుంది, దేశ విధేయతలో ఎటువంటి మినహాయింపులు లేవు.' అని చేర్చబడ్డాయి.

1949 నవంబర్‌లో చర్చలు విఫలమయ్యాయి. మధ్యవర్తిత్వాలు మొదలయ్యాయి. అందులో ప్రముఖులు చెన్నైకి చెందిన న్యాయవాది టిఆర్‌వి శాస్త్రి. అనేక చర్చల తరువాత 1949 జులై 3న అయన హిందూ పత్రికలో ఆర్ఎస్ఎస్ రాజ్యాంగ ముసాయిదాను ప్రచురించారు. అది గోల్వాల్కర్ జైలు నుండి ఆమోదించిన ముసాయిదా; గోల్వాల్కర్ తిరిగి అరెస్టు చేసి నిషేధాన్ని వ్యతిరేకించాలని నిర్ణయం తీసుకున్న తరువాత వెలువడింది. అందులో జాతీయ జెండాను ఆమోదిస్తున్నట్టు, మతోన్మాదం గురించి ప్రభుత్వానికి సమాధానం ఇస్తూ, 'ఆర్ఎస్ఎస్ సంస్థ హిందువులనందరిని చేర్చుకుంటుంది – వారందరినీ తమ కార్యకలాపాలలో వివక్షత లేకుండా భాగస్వాములను చేసుకుంటుంది. ఈ సంస్థ స్థాపించిన లక్ష్యం వలన ఇది హిందుయేతరులను చేర్చుకోలేదు. భారతదేశ స్వపరిపాలన మొదలైన నేపథ్యంలో మారిన పరిస్థితులకనుగుణంగా వారి పనికూడా మారుతుంది..' అని ప్రభుత్వం నిషేధాన్ని ఎత్తివేసిన సందర్భంగా జవాబు ఇచ్చింది. అదే సంవత్సరం మార్చిలో

ప్రభుత్వం, రాజ్యంపై తమ అభిప్రాయాలను ఆర్ఎస్ఎస్ తెలియచేసింది. గోల్వాల్కర్ ప్రభుత్వం సూచించిన మార్పులను అంగీకరించారు.

ఆయన ప్రభుత్వానికిచ్చిన సమాధానం, ప్రభుత్వ భావనలకనుగుణంగా వారి రాజ్యాంగంలో మార్పులు చేసే ఉద్దేశంతో ఉన్నారని తెలియవచ్చింది.

ఆర్ఎస్ఎస్ నాయకుడు భారత రాజ్యాంగానికి విధేయులుగా ఉండడానికి, జాతి పతాకాన్ని గౌరవించడానికి ఒప్పుకున్నట్టు, ఆర్ఎస్ఎస్ రాజ్యాంగంలో మరింత స్పష్టంగా పేర్కొనాలని చెప్పింది. హింసకు, రహస్య కార్యకలాపాలకు పాల్పడిన వ్యక్తులకు ఆర్.ఎస్.ఎస్‌లలో స్థానం ఉండకూడదు. ఆర్ఎస్ఎస్ రాజ్యాంగం కూడా ప్రజాతంత్రయుతంగా ఉండాలని, సర్ సంఘ్ చాలక్ ఎన్నుకోబడాలని, కార్యకారి మండలి అనుమతితో సర్ సంఘ్ చాలక్ వారసుడు నియమించబడాలి. సంఘ్‌లోని ఏ సభ్యుడైనా ఆ పదవికి అర్హుడే. ఏ సభ్యుడైనా సంఘ్ నుండి తనకిష్టమైనప్పుడు, చేసిన ప్రమాణానికి భంగం కలిగించకుండా, వదిలి వెళ్ళవచ్చు. చిన్నపిల్లలను తల్లిదండ్రుల రాతపూర్వక అనుమతితో చేర్చుకోవచ్చు; విడిచివెళ్లవచ్చు.

పై వివరణలు ఇచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ సంస్థకి సాంస్కృతిక ప్రజాస్వామ్య సంస్థగా పనిచేయడానికి మరో అవకాశం ఇవ్వొచ్చని భారత ప్రభుత్వం భావించింది– ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగానికి విధేయంగా ఉంటానని; జాతీయ పతాకాన్ని గౌరవిస్తానని; రహస్యాలను, హింసను విడిచి సాంస్కృతిక రంగంలో పనిచేయడానికి సిద్ధపడింది – ఈ బహిరంగ ప్రకటనల తరువాతే నిషేదాన్ని ఎత్తివేసినా జులై 31న గోల్వాల్కర్ 'ఏ షరతులు లేవని' ప్రకటించుకున్నారు. 1949 అక్టోబర్ 7న నెహ్రూ విదేశీ పర్యటనలో ఉండగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఆర్ఎస్ఎస్ సభ్యులకు కాంగ్రెస్‌లో ప్రాథమిక సభ్యత్వం ఇవ్వొచ్చని తీర్మానించింది. ఈ నిర్ణయం సహజంగానే కాంగ్రెస్ కమిటీలో చీలికలు తెచ్చింది. నెహ్రూ మద్దతుదారులు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తే పటేల్ మద్దతుదారులు సమర్థించారు. ఆర్ఎస్ఎస్ ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరకుండా రాజకీయాలలో పనిచేయలేదు. కాంగ్రెస్‌లో గనక అనుమతించకపోతే వారు కాంగ్రెస్ ప్రతిపక్ష పార్టీలలో చేరే అవసరం ఏర్పడుతుంది. అందువలన 1947 నవంబర్ 17న నెహ్రూ విదేశీ పర్యటన నుండి తిరిగి వచ్చిన తరువాత ఆర్ఎస్ఎస్ సభ్యత్వాన్ని గనక వదులుకుంటే కాంగ్రెస్‌లో చేర్చుకోవచ్చని వర్కింగ్ కమిటీ నిర్ణయించింది. అప్పుడు ఆర్ఎస్ఎస్ కూడా రాజకీయాలలో కొంత పాత్రని నిర్వహించవచ్చు.

రోజురోజుకి పతనమవుతున్న పరిస్థితులలో ముఖర్జీ వేరే దారులు వెతుక్కోవడం ఆరంభించారు. ఈ నిర్ణయం తనకు నచ్చలేదంటూ, 1949 నవంబర్ 23న ముఖర్జీ రాజీనామా చేసారు. 'ఆర్ఎస్ఎస్ కేవలం సామాజిక, సాంస్కృతిక మత సమస్యలపైనే

పనిచేయాలి లేదా తన మతతత్వ కూర్పును పూర్తిగా వొదులుకుని దేశంలోని ఆర్థిక రాజకీయ కార్యక్రమాన్ని అంగీకరించిన ప్రతి వ్యక్తికీ కులమతాలతో సంబంధం లేకుండా సభ్యత్వం ఇవ్వాలి.' అనే ముఖర్జీ ప్రతిపాదన అంగీకారం వచ్చింది. దాని ఫలితంగానే 1951లో జనసంఘ్ స్థాపించబడింది.

నిషేధ కాలంలో ఆర్ఎస్ఎస్ చేతులుకట్టుకుని కూర్చోలేదు. తన కార్యక్రమాలు తనకున్నాయి. క్రియాశీల కార్యకర్తలకు మరో వేదికను మొదలుపెట్టారు. విద్యార్థులను పోగు చేసారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో మొదటి గ్రూప్ స్థాపించబడింది. ఆ తరువాత మిగిలిన చోట్లకు విస్తరించింది. ఇవి కమ్యూనిస్టుల ఆధిపత్యంలో ఉన్న విద్యార్థి సంఘాలకు వ్యతిరేకంగా పనిచేస్తాయి.

2017 అక్టోబర్ సంచికలో అత్యంత ప్రతిష్టాత్మక పత్రిక కేరవాన్‌లో, ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల గురించి ప్రియాంక దూబే, 'గాంధీ హత్య తరువాత ఆర్ఎస్ఎస్ నిషేధానికి గురైంది. అప్పుడు సంస్థలో అత్యధికులు యువకులే. సంఘ్ కార్యక్రమాలను కొనసాగించాలని, సమావేశాలు నిర్వహించాలని భావించింది. అందువలన అది అఖిల భారతీయ విద్యార్థి పరిషద్ పేరుతో కార్యక్రమాలు నిర్వహించడం ప్రారంభించింది.' అని రాసారు.

ఎబివిపి అధికారికంగా, ఆ తరువాతి సంవత్సరం జులై నెలలో రిజిస్టర్ అయింది. ఆ తరువాత కొద్ది రోజులకే ఆర్ఎస్ఎస్ పై నిషేధం ఎత్తివేయబడింది. 'వెంటనే ఎబివిపి అవసరం కనిపించలేదు. దానిని పక్కన పెట్టామని' గోవిందాచార్య అన్నారు.

◆

# జనసంఘ్, గోల్వాల్కర్ ముఖర్జీల ఒప్పందం

**గో**ల్వాల్కర్ ముఖర్జీల మధ్య కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయడంపై ఓ నీతిమాలిన ఒప్పందం కుదిరింది. అందుకు ఎవరి కారణాలు వారికున్నాయి. గోల్వాల్కర్‌కి యువ నాయకుల నుండి ఒత్తిడి ఉంది. 1949 ఆగస్టులో కూడా గోల్వాల్కరిని 'మీరు ఒక రాజకీయ పార్టీ ఏర్పాటు చేయబోతున్నారటకదా..!' అని అడిగితే, 'మాకు భగవద్గీతలోని కృష్ణుడే ఆదర్శం. కృష్ణుడి అధీనంలో ఒక పెద్ద రాజ్యమే ఉంది కానీ, అతనేప్పుడూ రాజు కాలేదు' అని బదులిచ్చారు.

ఆర్ఎస్ఎస్ పంథానే ఇది. ఆర్ఎస్ఎస్ ఇద్దరు జనసంఘ్ అధ్యక్షులను ఇంటికి పంపించేసింది – మౌళి చంద్ర శర్మ, బాలరాజ్ మాధోక్. భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడి గతి అంతే – 2005లో అద్వానీ పరిస్థితి కూడా అదే. గోల్వాల్కర్ 'బంచ్ ఆఫ్ థాట్స్' (పాంచజన్యం) 1951 ప్రాంతాలకు ఎంత వర్తిస్తుందో 2018లోనూ అంతే వర్తిస్తుంది. అది ఒకప్పుడు సావర్కర్ స్థాయిని పెంచడాన్ని ఒప్పుకోలేదు. సావర్కర్ స్థాయి పెరగకుండా ఆగిపోయింది. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ తానే ఆధిపత్య శక్తిగా ఉండాలని కోరుకుంటుంది. 'మన దేశంలో రాజకీయ నాయకులెప్పుడూ మన సమాజానికి ప్రామాణికతను నిర్ధేశించే వారు కాదు. వారు జాతి జీవనాధారం కాదు. తమ జీవితాల సర్వస్వాన్ని త్యాగం చేసి, ఆకర్షణలకు అతీతంగా నిలిచి, దేశాన్ని సమగ్రంగా ఉంచి, సంతోషాన్ని, ధర్మాన్ని నిలబెట్టిన సాధువులు సన్యాసులు నిజమైన దీపధారులు. రాజు కర్తవ్యం కేవలం తన కంటే నైతికంగా ఉన్నతంగా ఉన్నటువంటి వారిని అనుసరించడమే...' – ఇదే ఆర్ఎస్ఎస్ ఆదర్శం!

మనం మన సమాజంలోని ప్రాచీన సంప్రదాయాలలో ఉన్న ఆదర్శాలు వెలుగులు చిమ్మాలనుకుంటాం.– సూర్యుని నుంచి సర్వ శక్తి వ్యాపిస్తున్నట్టు–

రాజకీయం తన శక్తిని ప్రజల నుండి పొందుతుంది. అందువలన ఆ శక్తి అంతా తిరిగి వారికే చెందేట్టు చూడాలి.

నెహ్రూ, లైకత్‌ల మధ్య మైనారిటీలకు సంబంధించి జరిగిన ఒప్పందం కారణంగా ముఖర్జీ, నెహ్రూ క్యాబినెట్‌కి రాజీనామా చేయలేదు. ఆయన 1950 ఏప్రిల్ 1వ తేదీ క్యాబినెట్‌లో విభజన గురించిన చర్చలు ఇంకా లోతుగా జరుగుతుండగా రాజీనామా చేసారు. 8న ముసాయిదాలో మరింత సడలింపులు జరిగిన తరువాత మాత్రమే సంతకం చేయబడింది. అయితే, తూర్పు పాకిస్తాన్ శరణార్థులని, పాకిస్తాన్‌ని బుజ్జగించడం అని అర్థం లేని ఆరోపణలు మొదలుపెట్టారు. అసలు విషయం క్యాబినెట్‌లో అత్యధికులు నెహ్రూకి మద్దతుపలికారు, ముఖర్జీ వెనుకబడ్డారు. రాజీనామాకు అసలు కారణం అదే.

1940లో ముఖర్జీ మొదటిసారిగా గోల్వాల్కరిని కలుసుకొన్నారు. గోల్వాల్కర్‌కి ముఖర్జీకి మధ్య ఒడంబడిక కుదర్చడానికి, వసంతరావు ఓక్ కొంత చొరవ తీసుకున్నారు. ఆయన ఆర్ఎస్ఎస్ నాయకుడు. 1949 నాటికి ముఖర్జీ ఇంకా నెహ్రూ క్యాబినెట్‌లో కొనసాగుతూనే ఉన్నారు. కానీ, కొత్త పార్టీ స్థాపన గురించి ఓక్‌తో సంప్రదింపులు జరుపుతున్నారు. 'ముఖర్జీ గనక నెహ్రూ క్యాబినెట్ పదవిని వదులుకుని కొత్త పార్టీ పెట్టుకుంటే, ఆర్ఎస్ఎస్ అందుకు సహకరిస్తుంది' అని భరోసా ఇచ్చినట్టు, ఓక్, మీరొం వెయినేర్ అనే పండితునితో చెప్పారు:

'అతని రాజకీయ చరిత్ర చూస్తే, అతను ఒక సంస్థ నుండి మరో సంస్థకు మారగల సమర్థుడని, అవసరమైతే స్వతంత్రంగా ఉండగలడని సూచిస్తుందని' ముఖర్జీ గురించి మీరొం వెయినేర్ వేసిన అంచనాలు సరైనవి. ముఖర్జీ 1920ల చివరి వరకు కాంగ్రెస్‌లో ఉన్నారు. మౌల్వి ఫజల్ హాక్ సారథ్యంలోని బెంగాల్ క్యాబినెట్‌లో సభ్యుడుగా ఉన్నారు. ఆ తరువాత సావర్కర్ నాయకత్వంలో మహాసభలో, నెహ్రూ క్యాబినెట్‌లో కూడా పనిచేసారు. 1949లో అతనికి కొత్త పార్టీ పెట్టాలని ఆలోచన వచ్చింది. 1940-49 మధ్య అనేక పర్యాయాలు నాగపూర్ వెళ్లారు. 1950లో గోల్వాల్కర్‌ని కలుసుకున్నారు. ఈ విషయాలన్నిటికీ సంబంధించిన రహస్య సమాచారం నెహ్రూకి, పటేల్‌కి అందే ఉంటుంది.

1956, జూన్ 25 ఆర్గనైజర్ పత్రికలో గోల్వాల్కర్, 'నా పురాతన సహచరుడు ఓక్ చాలా కాలంగా డాక్టర్ ముఖర్జీతో సంప్రదింపులు జరుపుతున్నాడు. తానొక పార్టీ పెడితే నా సహాయం కావాలని కోరుకుంటున్నాడు. కానీ, ...రాజకీయ పార్టీలతో బంధించబడితే ఒక దేశం సాంస్కృతిక జీవితం పునర్వికాసం పొందలేదని నేను

గట్టిగానే హెచ్చరించాను' అని తమ మధ్య జరిగిన సంభాషణను బహిర్గతపర్చారు.

1950లలో నెహ్రూకి టాండన్ మధ్య విభేదాలు పెరిగే నాటికి, ముఖర్జీ ఒక గ్రూపును తనకు మద్దతుగా తయారు చేసుకున్నారు. అందులో స్వయం సేవకులే కాదు (వి ఆర్ ఓక్, ; మాదొౌక, భాయ్ మహావీర్) సాంప్రదాయ హిందూ రాజకీయ వాదులు (ఎం సి శర్మ, ఇతర ఆర్య సమాజానికి చెందినవారు పంజాబ్ నేషనల్ బ్యాంకు అధ్యక్షుడు లాలా యోధ రాజ్, అతని అన్న బాలరాజ్ భల్ల, ప్రతాప్ పత్రిక ముఖ్య సంపాదకుడు, మహేషే కృష్ణన్) కూడా ఉన్నారు. వీరికి తోడుగా హన్స్ రాజ్ గుప్త, ధర్మవీర్ ఉన్నారు. 1951 జనవరి 16న అఖిల భారత ప్రజా పార్టీ (భారతీయ జనసంఘ్) రాజ్యాంగాన్ని రూపొందించారు. దీనిని సన్నిహితులతో పంచుకున్నారు. (జెఫర్సన్ రాసిన పుస్తంలో ఓక్ని ఒకే గా రాసారు)

ఆర్ఎస్ఎస్ ప్రతిస్పందన లేకపోయినా 1951 ఏప్రిల్ 23న ముఖర్జీ పశ్చిమ బెంగాల్లో 'ప్రజా పార్టీ'ని స్థాపించారు. మే 27న మాధోక్ ప్రోద్బలంతో జలంధర్లో ఒక సమావేశం ఏర్పాటు చేసి, పంజాబ్, ఢిల్లీలకు ప్రాతినిధ్యంవహించే విధంగా 'జన సంఘ్' ఏర్పాటు చేసింది.

ఒప్పందం ముగిసింది. ఆర్ఎస్ఎస్కి, ముఖర్జీకి కూడా సంతృప్తికరంగా ఒప్పందం జరిగింది. ఆర్ఎస్ఎస్కి తమ సిద్ధాంతం చెప్పుకునే ఒక రాజకీయ వేదిక దొరికింది. అదే సమయంలో ముఖర్జీకి 1952 సాధారణ ఎన్నికలలో పోటీచేసి తన రాజకీయ ఆశయ పురోగమన సాధనకి వేదిక దొరికింది. కానీ, ముఖర్జీ ఒక ముఖ్యమైన విషయాన్ని విస్మరించారు. ఆర్ఎస్ఎస్ తన మనుషలను, కార్యకర్తలను, నాయకులనే కాదు ధనాన్ని కూడా సమకూరుస్తుంది.

చర్చలలో పాల్గొన్న మధోక్ నుంచి ఇందుకు సంబంధించిన అధికారిక సమాచారం ఉంది.

'వారు (ఆర్ఎస్ఎస్ సభ్యులు) తమ సిద్ధాంతాలను, ఆలోచనలను ప్రతిబింబించే రాజకీయ సంస్థ ఆవశ్యకత అత్యవసరమని భావించారు... ఈ అవసరం సార్వజనీన ఓటు హక్కు వచ్చిన తరువాత మరింత ఎక్కువవుతుంది....

'ముఖర్జీకి కూడా ఆర్ఎస్ఎస్లోని కొందరు సభ్యుల ఈ ఆలోచనా ధోరణి తెలుసు... కింది మధ్య తరగతి, కార్మికవర్గం ఆర్ఏస్ఎస్ బలం; సామాజిక ఆర్థిక సమస్యల పట్ల వారికున్న ప్రతిఘాత ఆలోచనలు కూడా ముఖర్జీకి బాగా తెలుసు. ఆర్ఎస్ఎస్ యొక్క సంస్కృతి, జాతీయవాదం, దేశవిభజన పట్ల వారి దృక్పథం మొదలైన విషయాలకు ముఖర్జీ ఆమోదముంది. కమ్యూనిస్టేతర, కాంగ్రెసేతర ప్రత్యామ్నాయ

రాజకీయ శక్తి ఉండాలని, ఆర్ఎస్ఎస్ నమ్మినది, ప్రోత్సహించినది, విధేయత కలిగినదైతే, దేశ రాజకీయాలలో బలమైన శక్తిగా ఉండి జన సమీకరణ తప్పనిసరిగా చేయగలుగుతుంది...

సిద్ధాంతపరంగా ఏ రకమైన భేదాభిప్రాయం లేదు. 'స్వతంత్ర భారతదేశంలో ముస్లింల పట్ల హిందూ సంప్రదాయం ప్రకారం సహనం పాటించడం జరుగుతుంది, వారి ప్రార్థనలు వారు చేసుకోవచ్చు.. ఈ అంశాన్ని మోసపూరితంగానే విడిచిపెట్టారు. అయితే 'హిందూ రాష్ట్రాన్ని' వ్యూహాత్మకంగా అంగీకరించలేదు.

హిందూ రాష్ట్రం గురించి వివరణ ఇస్తూ 'హిందూ రాష్ట్రమంటే బ్రిటీషువారు సూచించినట్టు ఒక మతానికి చెందింది కాదు. సామ్రాజ్యవాదులు తమ స్వార్థం కోసం ఆ అర్థాన్నిచ్చారు. అలాగే కాంగ్రెస్ నాయకులు హిందూకి సంబంధించిన ప్రతిదీ మతతత్వంగా చూపి ఆటాడుకున్నారు. ఈ కొత్త పార్టీ 'హిందూ రాష్ట్రం' అంటే భౌగోళిక సరిహద్దులకు సంబంధించినదిగా చూస్తుంది. హిందూ దేశంలో ఉన్నవారందరూ మౌలికంగా హిందువులే, వ్యక్తులుగా వారే మతాన్నైనా అనుసరించవచ్చు. అందువలన ఇది పరిమితమైన అర్థంలో ఉపయోగించబడలేదు. హిందూ అంటేనే భయపడేవారి మీద దేశ సాంస్కృతిక భౌగోళిక వారసత్వం కాపాడే బాధ్యతను పెట్టలేం.... అయితే హిందూ అన్నా భారతీయత అన్నా ఒకే అర్థం కాబట్టి పశ్చిమ దేశాల ప్రభావం నుండి ఈ దేశ ప్రజలు బయటపడకుండా ఉన్నంతకాలం, తమ పేరును, సంప్రదాయాలను గర్వంగా చెప్పుకోలేనంత కాలం హిందూ బదులుగా భారతీయ అనే పదం వాడవచ్చు.

ఈ విషయంలో బ్రూస్ గ్రహం రూప చిత్రణ సరైనదే. 'నిజానికి జనసంఘ్ పేరుతో ఆర్ఎస్ఎస్ చేసింది రాజకీయ ప్రవేశమే'.

1954 నవంబర్‌లో జనసంఘ్ వ్యవస్థాపకులలో ఒకరైన మౌళి చంద్ర శర్మ, ఆర్ఎస్ఎస్ జోక్యాన్ని భరించలేక రాజీనామా చేయవలసి వచ్చింది. ఆ తర్వాత మధోక్‌లను ఆర్ఎస్ఎస్ బహిష్కరించింది.

గోల్వాల్కర్-ముఖర్జీ ఒప్పందం జరిగిన తరువాత పరిణామాలను జాగ్రత్తగా పరిశీలించిన డాక్టర్ బిడి గ్రహం '1951-52లలో పార్టీని నిర్మించినది, ఎన్నికలకు సమాయత్తం చేసింది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలే. వారి కర్తవ్యం రాజ్యాంగ ప్రజాతంత్ర అవసరాలకు వినియోగపడడం కన్నా నిర్మాణం పైన దృష్టి పెట్టడమే. అందుకనే వారు సంస్థాగతమైన అన్ని కీలక స్థానాలలోను ఉన్నారు. అఖిల భారత, రాష్ట్ర వర్కింగ్ కమిటీలలో, అధ్యక్షులుగా, ట్రెజరర్లగా కీలక స్థానాలను ఆక్రమించారు. రోజువారీ

పార్టీ పనులను తమ గుప్పెట్లో పెట్టుకున్నారు. వారి ఆధిపత్యం ఎంతో, 1954లో సంస్థ వ్యవస్థాపకులలో ఒకరైన మౌళి చంద్ర శర్మ, ఆర్ఎస్ఎస్ ప్రభావం భరించలేనిదిగా తయారవడంతో, పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించడంతో బహిర్గతమైంది. ఆ తరువాతి కొద్ది రోజులకే అదే కారణంతో మరోపార్టీ వ్యవస్థాపకుడు, ఢిల్లీ రాష్ట్ర జన సంఘ్ అధ్యక్షుడు, గురుదత్ రాజీనామా చేసారు.

అడుగడుగునా ఆర్ఎస్ఎస్ జోక్యం చేసుకోవడం డాక్టర్ ముఖర్జీని కలవర పరిచింది. ఆఫీస్ బేరర్స్‌ని నియమించడంలో, సభ్యులను, అభ్యర్థులను ఎంపిక చేయడంలో, విధానపర నిర్ణయాలలో ఆర్ఎస్ఎస్‌దే తుది నిర్ణయం కావాలి. అయితే ఆర్ఎస్ఎస్ సభ్యులు ప్రజాతంత్ర జనస్రవంతిలోకి వస్తారని ముఖర్జీ ఆశించారు.

జనసంఘ్‌ని ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థగా మార్చే ప్రయత్నాలు ముమ్మరంగా సాగాయి. కేంద్రం నుండి వచ్చే నిధుల ద్వారా పనులు పురమాయించబడేవి. జనసంఘ్ వాటిని అమలు చేయవలసిందే. అనేక కార్మికులు గ్రూపులు దీనిని వ్యతిరేకించాయి. ఢిల్లీ జనసంఘ్ మొత్తంగానే దీనిని తిరస్కరించింది.

1961 జులైలో మరో గ్రూప్ 'ఉదారవాదులు' పార్టీని విడిపోయారు. 'జనసంఘ్ ఆర్ఎస్ఎస్ యొక్క రాజకీయ అంగమే; ముఖర్జీగారి సంఘ నిర్మాణం చేసే వారిలో ఎక్కువమంది ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వారే. వారి సేవలు లేనిదే సంఘం లేదు; పార్టీ కార్యదర్శి, దీన్ దయాల్ ఉపాధ్యాయ ఉత్తరప్రదేశ్ గ్రామంలో పనిచేసిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త; అఖిల భారత కార్యదర్శులలో ఒకరైన అటల్ బిహారి వాజ్ పాయ్, అఖిల భారత కార్యదర్శి, విద్యార్థి దశలోనే ఆర్ఎస్ఎస్‌లో చేరారు, అనేక జాతీయ హిందీ ప్రచురణలకి సంపాదకునిగా ఉండేవారు. న్యూ ఢిల్లీ క్యాంప్ కార్యాలయంలో చరిత్రను బోధించే అధ్యాపకునిగా ఉన్న మహావీర్, ఆర్ఎస్ఎస్ కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటి సభ్యుడు; బాలరాజ్ మధోక్ పంజాన్ జనసంఘ్ వ్యవస్థాపకుడు, ఒక ఆర్ఎస్ఎస్ పూర్తికాలం కార్యకర్త; బాపూ సాహెబ్ సోహినీ 1936లో ఆఫీస్ బేరర్‌లో ఆర్ఎస్ఎస్ నిర్మించడానికి నియమించబడ్డారు. ఆ తర్వాత జనసంఘ్ అఖిల భారత వర్కింగ్ కమిటీలో అత్యంత పరపతి గల వ్యక్తిగా ఎదిగారు. గోల్వాల్కర్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు ముఖ్యమైన స్థానాలను ఆక్రమించాలని చెప్పారని, జనసంఘ్ ఆఫీస్ బేరర్స్‌ని ఎంపిక చేయడంలో ఆర్ఎస్ఎస్ చురుకుగా వ్యవహరిస్తున్నదని, గోల్వాల్కర్‌ని అతని సహాయకులను, పై నాయకత్వ ఎంపికకు సంప్రదిస్తున్నారని, విధాన నిర్ణయాలు వారినడిగే తీసుకుంటున్నారనే కారణాలతో ఉదారవాదులు పార్టీని వీడిపోయారు.

నిజానికి ఆర్ఎస్ఎస్ పై పెట్టిన నిషేదం గోల్వాల్కరిని రాజకీయ వేదికవైపు ఆలోచింపచేసింది. మొదటి నుంచి ఆర్ఎస్ఎస్ కోరికలని శర్మ తీర్చవలసివచ్చేది. ఆఖరికి వర్కింగ్ కమిటీని నిర్ణయించడంలో కూడా ఆర్ఎస్ఎస్ దే తుది నిర్ణయం. అందుకాయన వ్యతిరేకించగానే రాజీనామా చేయవలసివచ్చింది. ఇప్పటికి అప్పటికి అదే పద్ధతి నడుస్తున్నది. ముఖర్జీ వారసత్వం ఇది. నిజానికి పార్టీని స్థాపించినది అతను కాదు. ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ పార్టీ కావాలనుకుని జనసంఘ్ను స్థాపించుకుంది. ముఖర్జీ ఒక నిర్ణయాత్మక శక్తి కాదు. దేశ ప్రజల రాజకీయ జీవితాలలో అతనొక మాయని మచ్చగా నిలిచాడు. ఆయన చనిపోయిన అరవై అయిదు సంవత్సరాల తరువాత ఆ మచ్చ మరింత శక్తివంతమైంది. మరింత వికృతరూపం దాల్చింది.

నెహ్రూ, ఆర్ఎస్ఎస్ పై మోపిన నింద నిజమని చరిత్ర నిరూపించింది. 'జనసంఘ్ ఆర్ఎస్ఎస్ అక్రమ సంతానం'.

◆

# ముఖర్జీ ఆర్ఎస్ఎస్, జనసంఘ్

**ఒ**క రాజకీయ పార్టీని స్థాపించడం సులభం. దానిని నడిపించడమే కష్టం. ఆర్ ఎస్ ఎస్, జనసంఘ్ పై పూర్తి పట్టును కోరుకుంటున్నదని శ్యాంప్రసాద్ ముఖర్జీకి అర్థమైంది, అందుకు కోపం వచ్చినా ఆయన చేయగలిగిందేమీ లేదు. ఆర్.ఎస్.ఎస్. ముఖర్జీని జనసంఘ్ నాయకునిగా ఎదిగేందుకు ఏరకంగానూ సహకరించలేదు. అతను హిండెన్ బర్గ్‌గా మిగిలాడు. గోల్వాకర్ హిట్లర్. నిజమైన అధికారమంతా అతని చేతుల్లోనే ఉంది. ఆర్ఎస్ఎస్‌కి ఒక రాజకీయు ముఖం కావాలి. ముఖర్జీకి ఒక రాజకీయ వేదిక కావాలి. అందుకే ముఖర్జీకి ఆర్ఎస్ఎస్‌ని భరించకతప్పలేదు.

1951 అక్టోబర్ 29న జనసంఘ్ తన మానిఫెస్టోని ప్రకటించింది. అది ఆర్ఎస్ఎస్ నమూనాలోనే ఉంది. 'భారతీయ జనతా పార్టీ భారతీయ సంస్కృతి సాంప్రదాయాల ఆధారంగా రాజకీయ, సామాజిక ఆర్థిక విధానాలను రూపొందించే పార్టీ. సమాన అవకాశాలు మంజూరు చేసే ప్రజాస్వామిక పార్టీ; వ్యక్తులకు స్వేచ్ఛనిచ్చి వారి పురోగతికి తోడ్పడుతుంది; శక్తివంతమైన, ఐక్యతగల దేశాన్ని, ఆధునికంగా ఉండే, విజ్ఞానవంతమైన దేశాన్ని నిర్మిస్తుంది; ఇతర దేశాలు చేసే దాడులను తిప్పికొట్టి, ప్రపంచ శాంతి కోసం తన శక్తి యుక్తులను వినియోగిస్తుంది.

1951 అక్టోబర్‌లో జరిగిన మొదటి జనసంఘ్ మహాసభలో ఆర్ఎస్ఎస్ ప్రభావం ఎంత ఎక్కువగా ఉందంటే, ముఖర్జీ, ప్రవేశపెట్టిన అధ్యక్షోపన్యాసానికి చేసిన సవరణలు, నొక్కిచెప్పవలసిన అంశాలు కలిపి మొత్తంగా 11 అచ్చు చేయబడిన పేజీలయ్యాయి. ఐక్యరాజ్యసమితి నుండి కాశ్మీర్ అంశాన్ని ఉపసంహరించుకోవాలని, ప్లెబిసైట్ అనుమతించకూడదని, పాకిస్తాన్‌లో చేర్చబడిన కాశ్మీరులోని భాగాన్ని తిరిగి పొందాలనే అంశాలు, కేవలం 9 లైన్లు మాత్రమే కాశ్మీర్‌కి సంబంధించి అందులో చేర్చబడ్డాయి. నెహ్రూను తూర్పారపట్టారు:' భారత జాతీయవాదాన్ని ముస్లిం

మతతత్వానికి పదేపదే పాదాక్రాంతం చేస్తున్నారని, విభజన అనంతరం కూడా నెహ్రూ పాకిస్తాన్ డిమాండ్‌లకే తలోగ్గుతున్నారని; ఇతరులపైనే మతతత్వవాదులుగా విమర్శలు గుప్పిస్తున్నారని. నెహ్రూ, అతని మిత్రులు ఓట్ల కోసం ముస్లింలను బుజ్జగిస్తున్నారు తప్ప ఇప్పుడు భారత దేశంలో మతతత్వం అన్నది లేనేలేదు అనే ప్రచారాలు ఊపందుకున్నాయి. పచ్చి ఫాసిస్టు అయిన నెహ్రూ, ఇతరులను ఫాసిస్టులుగా నిందిస్తున్నారని నెహ్రూ పై అభియోగాలు చేసారు.

1952 మే లో అప్పటి జమ్మూ ప్రాంతీయ ప్రజాపరిషద్ అధ్యక్షుడు, ఒకప్పటి జమ్మూ ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడైన పండిట్ ప్రేమ్‌నాథ్ డోగ్రా, ముఖర్జీని కలుసుకున్నారు; ఆ కలయిక 'చరిత్రాత్మకం' అన్నారు మాధోక్. నిజమే. ముఖర్జీకి మతతత్వ, జాతీయవాదాన్ని రెచ్చగొట్టేందుకు 'సాకు' దొరికింది. జనసంఘ్‌ని ఒక్కసారిగా పెద్ద ఊపు ఊపే అవకాశం దొరికింది. డోగ్రా కోరిక, అప్పటి కాశ్మీర్ ప్రధాని షైక్ మహమ్మద్ అబ్దుల్లాను పదవి నుండి తొలగించడం; ఆతను వామపక్ష భావాలను విస్తరిస్తున్నాడు. అందువల్ల అతనిని పదవి నుండి తొలగించాలి. అబ్దుల్లా, దున్నేవానికే భూమి అన్న నినాదాన్ని, అంటే ఏ పరిహారం ఇవ్వకుండా భూమిని స్వాధీనం చేసుకోవడం కూడా కార్యక్రమంగా తీసుకున్నాడు. అది డోగ్రాకి కంటగింపుగా ఉంది.

ఈ విషయమై గ్రహం రాస్తూ 'డోగ్రా భూస్వాములు. 1951 బడా భూ ఎస్టేట్ల రద్దు చట్టం వలన ఆర్థికంగా దెబ్బతిన్నారు. వారి భూములను భూములు దున్నుకుంటున్న పేదలకు అందజేశారు. పైగా షేక్ అబ్దుల్లా రాష్ట్ర రాజ్యాంగాన్ని మరింత పటిష్టపరిచేందుకు, భారతదేశ సంవిధానంలోనే జమ్మూ కాశ్మీర్ స్వయం ప్రతిపత్తిని కాపాడుకునేందుకు నెహ్రూతో సంప్రదింపులు జరుపుతున్నారు. జమ్మూ కాశ్మీర్‌లలో జనసంఘ్‌కి పార్టీ యూనిట్లు లేవు. ప్రజా పరిషద్‌తో మాత్రమే సంబంధాలు ఉన్నాయి. 1952 కాన్పూర్ మహాసభలో జనసంఘ్ డోగ్రా సమస్యను లేవనెత్తింది. వారు గుర్తింపబడిన నాయకులతో (అందులో ముఖర్జీ కూడా ఉన్నారు) ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని డిమాండ్ చేసారు. 1952 డిసెంబర్ 26న డోగ్రా అరెస్టు అయ్యారు. మూడు నెలల తరువాత జనసంఘ్ పూర్తి స్థాయిలో నిరసనలు మొదలు పెట్టింది. ఆర్‌ఎస్‌ఎస్ దానికి పూర్తి స్థాయిలో మద్దతునిచ్చింది. ముఖర్జీకి ఇది జీవన్మరణ సమస్య. ఎప్పటిలాగే ఉత్తర ప్రత్యుత్తరాలు మొదలయ్యాయి. 1953 జనవరిలో జమ్మూ కాశ్మీర్‌లను, జమ్మూ, కాశ్మీర్, లడక్‌లను మూడు భాగాలుగా విభజించాలని డిమాండ్ చేసారు. 'మతతత్వానికి ప్రాంతీయ తత్వం జోడించడం జరిగింది.' ముస్లింలు అధికంగా ఉన్నందువల్ల ప్లెబిసైట్ నిర్వహిస్తే, ముస్లింలు గనక భారతదేశానికి వ్యతిరేకంగా

ఓటుచేస్తే, జమ్మూలోని హిందువుల పరిస్థితి ఏమిటి? అందువలన 370 అధికారణాన్ని రద్దు చేయాలని డిమాండ్‌ను ముందుకుతెచ్చారు.

నెహ్రూ జనవరి 10న ఈ వాదనకు సమాధానం ఇచ్చినా, మళ్ళీ ఫిబ్రవరి 3న ఇదే విషయాన్నీ లేవనెత్తారు. 'జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర సమస్యను ఎలా పరిష్కరించాలని అనుకుంటున్నారు?' అని ప్రశ్నించారు. పార్లమెంటులో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు.

షేక్ అబ్దుల్లా హృద్యంగా ఒక లేఖ రాసారు, 'జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర ప్రజలు లౌకిక భారతదేశంతో కలవాలని కోరుకున్నారు. పాకిస్తాన్ నాయకత్వం చేసిన దాడులను విజయవంతంగా ఎదుర్కొన్నారు; వారి ప్రలోభాలను, బెదిరింపులను లెక్కచేయలేదు. ఆఖరికి 1947 యుద్ధాన్ని కూడా ఎదుర్కొన్నారు. పాకిస్తాన్, శ్రీనగర్ తలుపులు తట్టినపుడు ముస్లింలు తమ రక్తాన్ని ధారపోసి నిలువరించారు. లౌకికతత్వం, మానవతావాదమనే మహత్తర ఆశయాల కోసం ప్రాణాలొడ్డారు. కానీ, ఈనాడు జరుగుతున్నదేంటి? వారి చుట్టూ చీకటి ముసిరింది; తోటి మతస్థులు దారుణంగా హత్య గావించబడుతున్నా ఈ రోజు, లౌకిక వాదులమని చెప్పుకుంటున్న ప్రజా పరిషద్‌ల జాడ ఎక్కడా కనిపించలేదు.'

ఈ భావనలు వ్యక్తీకరించిన ఆరు నెలల తరువాత, ఆ మనిషి (షేక్ అబ్దుల్లా) పదవిలో లేరు. జమ్మూ కాశ్మీర్ ప్రభుత్వం రద్దు చేయబడింది. ఆర్ఎస్ఎస్ దాని రాజకీయ ముఖమైన జనసంఘ్ అక్కడున్న సుహృద్భావ వాతావరణాన్ని పూర్తిగా కలుషితం చేసింది. ఆనాడు ముఖర్జీ, నెహ్రూను అడిగిన ప్రశ్న ఈనాటికీ ప్రాసంగికమే. 'ప్రజాతంత్రమంటే మెజారిటీ గల బలమైన శక్తి, బలహీనులపై బలప్రయోగం చేయడమేనా?' డోగ్రాస్ తరతరాలుగా పాలిస్తున్నారని, వారి భూములను తీసుకోవడంతో వారు శక్తిహీనులవడం తమను కలచివేసిందని ముఖర్జీ వాదన. ఇది పూర్తిగా అబద్ధం. గులాబీ చాంద్ అనే డోగ్రా నాయకుడు 1846లో ఈస్ట్ ఇండియా కంపెనీకి 75 లక్షలు చెల్లించి, అమృత్‌సర్ ఒప్పందం చేసుకున్నారు; అప్పటి తన యజమానులైన లాహోర్‌లోని సిఖ్ దర్బార్‌ని మోసం చేసి లావాదేలు, జరిపారు. తనని గవెర్నర్ జనరల్ బంగారంతో కొనుక్కున్నట్టు గానూ, వారి బానిసగా కూడా తనను తాను అభివర్ణించుకున్నారు.

ముఖర్జీకి రాసిన ఒక ఉత్తరంలో షేక్ అబ్దుల్లా, ఇలా అన్నారు. 'కాషాయ జాతీయ పతాకం ఉండడం వలన తప్పేమి లేదని మీరంటున్నారు; మిలిటెంట్ హిందుత్వ విజయం సాధిస్తే అదే జరగవచ్చు. ... ఆ దురదృష్టకరమైన కాలంలో కూడా కాశ్మీరీలు గాంధీ సిద్ధాంతాన్నే అనుసరిస్తారు... జాతి పిత చేసిన ప్రాణత్యాగం ఊరికే పోదు. ఆ

మహత్తర ప్రాణత్యాగం ఎప్పటికి ఉత్తేజపూరితంగానే ఉంటుంది. 1947 లాంటి కీలక దినాలలో మమ్మల్ని నిలబెట్టింది అదే'.

'... 1947లో ఆర్ఎస్ఎస్ పోషించిన పాత్ర జగమెరుగును. అప్పుడు కాశ్మీర్ ప్రజలు కాశ్మీర్‌లో ముస్లిం మతోన్మాదాన్ని ఎదుర్కొంటున్నారు.

'పాకిస్తాన్ నుండి కాశ్మీర్ పై దాడి జరిగింది. అప్పటి మహారాజు, ముందు నిలబడి శత్రువులనెదుర్కొని, ప్రజలను కాపాడే బదులు, తాను సురక్షితంగా ఉండేందుకు జమ్మూకి పారిపోయారు. అక్కడి మిలిటెంట్ హిందూ మతతత్వ వాదులతో చేతులు కలిపారు. ఉన్న సంక్లిష్ట పరిస్థితులను మరింత సంక్లిష్టం చేసారు. మీరు ఏ రాజు గురించి తహతహలాడుతున్నారో ఆ రాజు చేసింది దేశ ద్రోహం; ఇది ముమ్మాటికీ జాతి వ్యతిరేకం.'

రాజు కుమారుడు కరణ్ సింగ్ ఈ అభిప్రాయంతో ఈ నాటికీ ఏకీభవిస్తారు.

ముఖర్జీ అబ్దుల్లాని కమ్యూనిస్టు జెండా చేతపట్టుకున్నావని దూషించడానికి కారణం ఆయన వామపక్ష భావాలే.

1950 ఏప్రిల్‌లో ముఖర్జీ తన క్యాబినెట్ పదవికి రాజీనామ చేసారు. ఆ తరువాత ఆర్ఎస్ఎస్ మతతత్వ కార్యక్రమాలన్నిటికి పెట్టిన ముసుగులను పూర్తిగా తొలగించింది. 1952 ఏప్రిల్‌లో అబ్దుల్లా తన ప్రముఖమైన 'రన్‌బీర్‌సింగ్‌పురా ఉపన్యాసం చేసారు. 'భారతదేశంలో మతతత్వ శక్తులకు స్థానం ఉన్నంతవరకు కాశ్మీర్ భారతదేశంలో కలవడానికి పరిమితులు ఉండవలసిందే. నెహ్రూ చనిపోయిన, తరువాత తమ పరిస్థితి ఏమిటని ఎంతో మంది కాశ్మీరీలు ఆందోళన పడుతున్నారు.

ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల పట్ల నెహ్రూ కూడా ఆందోళన చెందుతూవచ్చారు. 1952 కలకత్తాలో జరిగిన కొత్త సంవత్సర వేడుకలలో మాట్లాడుతూ, 'మతతత్వ పార్టీలు జనసంఘ్, ఆర్ఎస్ఎస్‌లు ఇప్పుడు కొత్తగా ఏర్పడిన ప్రజా పరిషద్ జమ్మూలో అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారు. వారు తిరిగి రాచరికాన్ని నెలకొల్పాలని ప్రతిపాదిస్తున్నారు. అంటే మీరు అర్థం చేసుకోగలరని అనుకుంటాను. షేక్ అబ్దుల్లా కాశ్మీర్ ప్రజల నాయకుడు. గొప్ప నాయకుడు. పాకిస్తాన్‌కి వ్యతిరేకంగా ఈనాడు ఉన్నాడు. రేపు షైక్ అబ్దుల్లా గనక ఇతరులతో కలవాలనుకుంటే నేనుగానీ, భారత సైన్యంగానీ, మరెవరు గాని ఆపలేరు. అది జరిగి తీరుతుంది. పాకిస్తాన్ కూడా అబ్దుల్లా ప్రభుత్వం పడిపోవాలనే కోరుకుంటున్నది. ఆర్ఎస్ఎస్ కోరిక కూడా అదే. జనసంఘ్ అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో ఊహించండి. కాశ్మీర్ ప్రజలు తాము మతతత్వవాదులతో విసిగిపోయామని అంటున్నారు. జనసంఘ్ ఆర్ఎస్ఎస్‌లు

వేధిస్తున్న రాజ్యంలో ఉండాలని వారెందుకు కోరుకుంటారు? వారు మనతో కలిసి ఉండరు. తమ దారి తాము చూసుకుంటారు.

1953 మార్చి 10న ముఖర్జీ జమ్మూ కాశ్మీర్‌లో అడుగుపెట్టారు. నిప్పు రవ్వ రాజుకుంది. ప్రజా పరిషద్ కార్యక్రమాల రీత్యా ఆయనను మధోపురలో, జమ్మూ కాశ్మీర్‌లో అడుగుపెట్టడానికి వీలులేదని అరెస్ట్ చేసారు. శ్రీనగర్‌లో ని ఒక చిన్న బంగళాలో నిర్బంధించారు. జులై 23న గుండెపోటుతో ఆయన మృతి చెందారు. కాశ్మీరుని భారతదేశానికి దగ్గరచేయాలన్న ఉద్దేశంతో ఆరంభమైన ప్రజా పరిషద్ వాస్తవంలో కాశ్మీరుని భారతదేశానికి మరింత దూరం చేసింది. మానసికంగా అది కాశ్మీర్ ప్రజలను భారతదేశానికి ఎంత దూరం చేసిందంటే వారిని తిరిగి పొందడం చాల కష్టం. కాశ్మీర్‌ని మనం పొందాలంటే ఆ ప్రజల హృదయాలను గెలుచుకోవాలి. తుపాకులను వారిపై ఎక్కుపెట్టికాదు. మొదటిసారిగా భారత సైన్యం కాశ్మీర్‌ని విడిచిపోవాలని ప్రజలు బహిరంగంగా ఆందోళన చేస్తున్నారు. మన శత్రువులు కూడా మనకింత అపకారం చేయగలిగే వారు కాదు.'

కాశ్మీర్‌కి సంబంధించిన అన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటున్నప్పుడు ముఖర్జీగారు నెహ్రూ క్యాబినెట్‌లోనే ఉన్నారు.

1. 1947 అక్టోబర్ 26న రాజు హరి సింగ్ భారతదేశంలో కలిపేందుకు సిద్ధపడినప్పుడు, గవర్నర్ జనరల్ మౌంట్ బాటన్ కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయాన్ని సేకరణ నిర్వహించాలన్నప్పుడు.
2. 1948లో యునైటెడ్ నేషన్స్ రక్షణ కౌన్సిల్‌లో కాశ్మీర్ అంశం ఆర్టికల్ 35 కింద లేవనెత్తినపుడు – వివాదాలను శాంతియుతంగా పరిష్కరించుకోవాలి అన్నప్పుడు.
3. 1948 సెక్యూరిటీ కౌన్సిల్‌లో ఎం గోపాలస్వామి కాశ్మీర్ ప్రజాభిప్రాయాన్ని సేకరణ ద్వారా తన నిర్ణయాన్ని స్వేచ్ఛగా తీసుకోవచ్చని ప్రకటించినప్పుడు
4. 1949 జనవరి 1న పాకిస్తాన్‌కి భారతదేశానికి మధ్య ఒప్పందం కుదిరి కాశ్మీర్‌లో ఒక పెద్ద భాగం వదులుకున్నప్పుడు.
5. 1948 ఆగష్టు 13 న, 1949 జనవరి 6న యునైటెడ్ నేషన్స్ కమిషన్ ఫర్ ఇండియా అండ్ పాకిస్తాన్ ప్రతిపాదించిన రెండు తీర్మానాలను భారతదేశం అంగీకరించనప్పుడు.
6. 1949 జులై 27 న రెండు రాజ్యాల మధ్య నిరాయుధ సంధి కుదిరినప్పుడు.
7. సెక్యూరిటీ కౌన్సిల్ తరఫున కెనడాకి చెందిన ఏ.జి మాక్ నౌటన్ రాజీ ప్రయత్నాలు చేసినప్పుడు

8. 1951లో ముఖర్జీ అంగీకరించిన అంశాల నుండి వైదొలగారు. నెహ్రూ క్యాబినెట్ నుండి వైదొలగిన తరువాత కాశ్మీర్ అంశం ఐక్యరాజ్యసమితి నుంచి ఉపసంహరించాలని, ప్రజాభిప్రాయాన్ని సేకరించకూడదని, పాకిస్తాన్ ఆక్రమించిన కాశ్మీర్ తిరిగి బలవంతంగానైనా పొందాలని డిమాండ్ చేసారు.
9. జమ్మూ కాశ్మీర్‌కి భారత్ రాజ్యాంగానికి 370 అధికరణం ఒక లింక్. 1949 మే నుండి అక్టోబర్ వరకు దానికోసం నెహ్రూ, పటేల్, షేక్ అబ్దుల్లా, మీర్జా అఫ్జల్ బేగ్‌ల మధ్య చర్చలు జరిగాయి. ప్రభుత్వం 370 అధికరణాన్ని భారత్ రాజ్యాంగానికి చేర్చాలని ప్రతిపాదించింది. ఇవన్నీ ముఖర్జీకి తెలుసు.

ముఖర్జీ రాజకీయంగా ఓటమిపాలై మరణించారు. కానీ, కాశ్మీర్‌కి ఆయన చేసిన ద్రోహం అంతా ఇంతాకాదు. ఆర్ఎస్ఎస్ ప్రోత్సహించిన ఆందోళనలన్నీ కలిసి 2002 జూన్ 29న, కురుక్షేత్రలో జరిగిన అఖిల భారతీయ కార్యకారి మండల్‌లో, 'జమ్ముకు కొత్త రాష్ట్ర ప్రతిపత్తి' కల్పించాలని, కాశ్మీర్ లడక్‌లను కేంద్రపాలిత ప్రాంతంగా గుర్తించాలని, కాశ్మీర్‌ని సంపూర్ణంగా భారతదేశంలో విలీనం చేయాలనీ తీర్మానం చేసే స్థాయికి చేరాయి. కాశ్మీర్ ప్రజాభిప్రాయ సేకరణ గాలికి కొట్టుకుపోయింది.

◆

# ముఖర్జీ తదనంతర కాలంలో ఆర్ఎస్ఎస్

**ము**ఖర్జీ చనిపోయినంత మాత్రాన జనసంఘ్ మూతపడుతుందన్న భయమేమీ లేదు. జనసంఘ్ నడుస్తున్నది ఆర్ఎస్ఎస్ బలంతోనే. నిర్మాణంలో ఆర్ఎస్ఎస్‌కి కాంగ్రెస్‌కి మధ్య పోలికే లేదు. పెద్ద అగాధముంది. దీనిని జనసంఘ్ 1978-79లో కనిపెట్టింది. అది 2018కి కూడా కొనసాగుతూనే ఉంది.

1947లో నెహ్రూ దూరదృష్టితో భారతదేశం ఐక్యరాజ్యసమితిలో కేసు గెలిచింది. అంతర్జాతీయ చట్టాల ప్రకారం భారతదేశ సభ్యత్వం కొనసాగింది. పాకిస్తాన్ కొత్తగా సభ్యత్వం కోసం అనుమతి పొందవలసివచ్చింది. 1947 నాటి భారతదేశం, భారత జాతీయ కాంగ్రెస్ కలలు కన్న లౌకిక ప్రజాస్వామ్య దేశం. ఆర్ఎస్ఎస్ ఇందుకు పూర్తిగా భిన్నమైన భావన గలది. 1924లోనే సావర్కర్ రెండు రాష్ట్రాల సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆర్ఎస్ఎస్ కోరిక హిందూ రాష్ట్రం. దేశ విభజన దానికి అవకాశాన్ని కల్పించింది. 1950 జనవరి 21న ఆర్ఎస్ఎస్ 'మాతృభూమిని భౌగోళికత ఆధారంగా విభజించడమనే సిద్ధాంతం అవాస్తవం, మోసపూరితం; దీని పరిణామాలు ఘోరంగా ఉంటాయి కాబట్టి ఇటువంటి ఆలోచనను వదులుకోవాలి.' అని నాగ్‌పూర్‌లో జరిగిన కేంద్రీయ కార్యకారి మండలి ప్రకటించింది.

నిజానికి వారి లక్ష్యం భారత దేశం లౌకిక రాజ్యంగా ఉండకూడదనేదే. మాతృభూమి భౌగోళికంగా విభజించకూడదన్నారుగాని తమ ప్రత్యామ్నాయ ఆలోచనను బయటపెట్టలేదు. గోల్వాల్కర్, సావర్కర్ల రచనలు స్పష్టంగా ఉన్నాయి. భారత రాజ్యాంగం, జాతీయ జెండా వారికి అంగీకారం కాదు. స్వతంత్రం వచ్చిన తరువాత కూడా ఆర్ఎస్ఎస్ మువ్వన్నెల జెండాను అంగీకరించలేదు. వారి రాజ్యాంగంలోని సవరించబడిన మూడో అధికరణలో తన సొంత జెండాకి అధికారికంగా గుర్తింపును

ఇచ్చింది. ‘ ప్రతి దేశ పౌరుడు తన దేశానికి విధేయుడిగా ఉండాలి. అంటే, ఆ దేశ జాతి పతాకానికి కాదు. సంఘ్‌కి ప్రత్యేకమైన జెండా ఉంది. – కాషాయ జెండా – యుగయుగాల హిందూ సంస్కృతికి ప్రతిరూపం,’ ఈ వాక్యాన్ని గమనిస్తే వాక్యం రెండో భాగం ఎక్కువగా నొక్కి చెప్పినట్టు గమనించవచ్చు. ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు కాషాయ జెండాకే విధేయులుగా ఉంటారు గాని జాతీయ జెండాకి కాదు. ఇది వారికి చాలా లాభదాయకంగా ఉండడం ఆ తరువాతి కాలంలో మనం గమనిస్తాం. వారు వారి ఆదాయాలపై పన్ను మినహాయింపు పొందడానికి ఇది ఉపయోగపడింది. గోల్వాల్కర్ దృక్పథంలో ఏమాత్రం మార్పు లేదు. 1946 జులై 14న నాగ్‌పూర్‌లో ‘కాషాయ జెండానే భారత సంస్కృతిని పరిపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. అది దైవ స్వరూపం. చివరికి దేశమంతా ఈ కాషాయ జెండాకే మోకరిల్లుతుందని మేము విశ్వసిస్తున్నాం’ అని అన్నారు.

1947 ఆగస్టు 14న రాజ్యాంగ శాసనసభ రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంలో, ఆర్‌ఎస్‌ఎస్ తన పత్రిక, ఆర్గనైజర్‌లో, ‘అదృష్టం కొద్దీ అధికారంలోకి వచ్చిన వారు మన చేతిలో మూడు రంగుల జెండాను పెట్టారు. అయితే అదెన్నటికి హిందువుల మన్ననను పొందలేదు. మూడన్నదే దుష్ట సంఖ్య. మూడు రంగుల జాతీయ జెండా తప్పనిసరిగా చెడు మానసిక ప్రభావాన్ని చూపుతుంది; దేశానికి అరిష్టాన్ని తెచ్చిపెడుతుంది.’ అని రాసారు.

గోల్వాల్కర్ బంచ్ ఆఫ్ థాట్స్ (పాంచజన్యం)లో ‘... మనది ప్రాచీన, మహత్తర దేశం; బ్రహ్మాండమైన గతం మనకుంది. అయితే మనకెందుకు ఒక జాతీయ జెండా లేదు? ఉంది. అయితే మన చుట్టూ శూన్యం ఎందుకు నిండి ఉంది.?? ఎందుకంటే మన మెదళ్లను పూర్తిగా శూన్యం ఆవరించి ఉంది గనక.’ అన్నారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీ బతికి ఉన్నన్ని రోజులలో ఉన్న కొద్దిపాటి అడ్డంకి ఆయన మరణం తరువాత పూర్తిగా తొలగిపోయింది. ఆయన ఉనికి లేకపోవడంతో జనసంఘ్‌కి ఇక ఏమాత్రం నిగ్రహం వహించవలసిన అవసరం లేకుండాపోయింది. పాలనాపరంగా సైద్ధాంతిక నిబద్ధత లేని వారిని చేర్చుకోవడం మాత్రం ముఖర్జీ వారసత్వంగా కొనసాగింది. అందువలనే ముఖర్జీ మరణం తరువాత ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు కాని మౌళి శర్మ, ఇద్దరు ముఖ్య కార్యదర్శులలో ఒకరు నియమించబడ్డారు. కానీ, అసలైన అధికారమంతా ఆర్‌ఎస్‌ఎస్‌కి నమ్మినబంటుగా ఉన్న దీన్ దయాల్ ఉపాధ్యాయ చేతిలోనే ఉండేది. కొద్దీ రోజుల్లోనే దీన్‌దయాళ్ ఉపాధ్యాయకి శర్మకి మధ్య ఏర్పడ్డ వైరుధ్యాలు బయటపడ్డాయి. ఉపాధ్యాయకి ఆర్‌ఎస్‌ఎస్ సంస్థ అండదండలు ఉండేవి. ఆయన పరివార్ సిద్ధాంతకర్తగా ఎదిగారు. శర్మ, ఉపాధ్యాయ

వర్కింగ్ కమిటీకి ఎంపిక చేసిన జాబితాలో ఎక్కువ భాగాన్ని తిరస్కరించి, తనకు అనుకూలమైనవారిని నియమించేవారు. పార్టీ రాజ్యాంగం రీత్యా అతనికే అధికారం ఉంది. ఆయన అంగీకరించి కమిటీలో చేర్చుకున్న వారు – అటల్ బిహారి వాజ్ పాయ్, బాలరాజ్ మధోక్, నానా దేశ్ ముఖ్, భైరాన్ సింగ్ షెకావత్, సుందర్ సింగ్ భండారి వంటి వారు.

శర్మ క్రియాశీలంగా పనిచేయడం ఆర్ ఎస్ ఎస్‌కి నచ్చలేదు. ఉపాధ్యాయ పాత్రని ప్రశ్నించడం అంటే ఆర్‌ఎస్‌ఎస్ పాత్రని ప్రశ్నించడమే. అందువలనే 1954 నవంబర్‌లో శర్మ రాజీనామా చేయవలసివచ్చింది. తాత్కాలికంగా బాపుసాహెబు సోని అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. డిసెంబర్ 1954లో జమ్మూ కాశ్మీర్లో ప్రముఖుడిగా ఉన్న ప్రేమ్‌నాథ్ డోగ్రాని జన సంఘ్ అధ్యక్షునిగా నియమించారు.

1967 వరకు ఉపాధ్యాయ జనసంఘ్ పార్టీ కార్యదర్శిగా కొనసాగారు. అంటే ఆర్‌ఎస్‌ఎస్ అనుయాయులే జనసంఘ్‌లో కీలక పాత్రలలో కొనసాగగలరని అర్థం అవుతున్నది.

గోల్వాల్కర్ యొక్క సాంస్కృతిక జాతీయవాదాన్ని అనుసరించడమే కాదు, దానిని దీన్ దయాల్ ఉపాధ్యాయ మరింత పరిపుష్టపరిచారు. హిందూ రాష్ట్రం అనే ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతానికి ఈ కొత్త సిద్ధాంతం మానవీయతను జోడించింది. ఉపాధ్యాయ గోల్వాల్కర్ మోటు, దూకుడు, అమానుష విధానాలను పక్కన పెట్టి సంస్కృతికి, జాతికి కొంత మెరుగులు దిద్దారు. దేశాన్ని ప్రపంచంతో జోడించే పని చేసారు. అయితే ఆ జోడించడం తాత్వికంగానే గాని రాజకీయంగా కాదు. 'భారతదేశ ఆత్మ దాని సంస్కృతిలో ఉంది. మన దేశానికి మూలం కేవలం 'భారత' కాదు. భరతమాత. మాతను తీసేస్తే కేవలం ఒక భూభాగంగా మిగిలిపోతుంది. భారతీయ సంస్కృతి, జీవితాన్ని మొత్తంలో ఒక భాగంగా చూస్తుంది. అయితే ఈ దేశంలో ఉండవలసింది ఒకే ఒక సంస్కృతి. విభిన్నమైన సంస్కృతుల కలయిక ఈ దేశాన్ని ఛిన్నాభిన్నం చేస్తాయి.' అన్నది గోల్వాల్కర్ ఆలోచన.

కాంగ్రెస్‌లో కమ్యూనిస్టులు, కాంగ్రెస్ సోషలిస్టులతో సహా అనేకమంది మేధావులు ఉన్నారు. ఇప్పుడు జనసంఘ్ కూడా తమలో మేధావులున్నారని గర్వపడవచ్చు. అందుకనే ఉపాధ్యాయ 1967 వరకు అత్యంత శక్తివంతమైన నాయకునిగా ఉన్నారు.

1967లో కాంగ్రెస్ పంజాబ్ నుంచి బెంగాల్ వరకు పూర్తిగా పరాజయం పాలయింది. బీహార్, హర్యానా, ఉత్తర్ ప్రదేశ్, పంజాబ్, మధ్యప్రదేశ్‌లో ప్రతిపక్షాలు సంయుక్త విధాయక దళ్ పేరు మీద ప్రభుత్వాలు నడిపాయి. జనసంఘ్ ఈ

ప్రభుత్వాలలో భాగస్వామి. పంజాబ్‌లో అకాలిదళ్ పెద్ద శక్తిగా అవతరించింది. కొన్ని చోట్ల జనసంఘ్ కమ్యూనిస్టులతో కూడా సంకీర్ణ భాగస్వామి అయింది. ఈ విషయంలో మాధోక్ వాజ్‌పాయ్‌ని తీవ్రంగా విమర్శించారు. కానీ, వాజ్‌పాయే గెలిచారు. ఆర్‌ఎస్‌ఎస్ అంగీకారాన్ని, గౌరవాన్ని పొందింది. ఉపాధ్యాయ ఈ విధానాన్నే కేంద్రంలో కూడా అనుసరించాలనుకున్నారు. కానీ, అకస్మాత్తుగా 1968 ఫెబ్రవరి 11వ తేదీ సియాల్దా ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా, మొగుల్సారై స్టేషన్ దగ్గర్లో రైలుపట్టాలపై పడి మరణించారు. ఇది కేవలం చిన్న దొంగతనం చేసి అతనిని రైలు నుండి తోసేసినట్టు నిర్ధారణ అయింది.

1957 జనవరి 7 ఆర్గనైసర్ పత్రిక భారతీయ సంస్కృతి గురించి ఇలా రాసింది. 'భారత జాతీయత ఒకే సంస్కృతి పై ఆధారపడి ఉండాలన్నది దేశస్థులందరిలోను పాదుగొల్పాలి. ఈ కర్తవ్యం నెరవేర్చడానికి సమాజం, ప్రభుత్వం ఈ కింది చర్యలు చేపట్టాలి. 1. విద్య జాతి సంస్కృతి ఆధారంగా ఉండాలి. 2. దేశంలోని పుణ్య పురుషుల జన్మదినాలు, ఇతర దినాలే ఉత్సవాలుగా జరగాలి. 3. భారతదేశ ఉత్సవాలంటే భారతదేశ ప్రముఖ పండగలు కావాలి. 4. ప్రభుత్వం సమాజం కూడా దేశ సంప్రదాయాల మూలాలపైనే భారత సమాజాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలి. 5. సంస్కృతాన్ని పునరుద్ధరించాలి. ముఖ్యంగా పాండిత్యానికి పునాదిగా. 6. భారతదేశ చరిత్ర పునర్ రచింపచేయాలి. అది దాడి చేసినవారి అణచివేత చరిత్రగా ఉండకూడదు. 7. జనసంఘ్ హిందూ సమాజంలోని సాంఘిక దురాచారాలు, బలహీనతలు తొలగించుకోవాలని బుద్ధిచెపుతుంది. జాతి నుండి వేరుబడి ఉత్తేజం పొందడానికి కోసం ఇతర దేశాల వైపు చూస్తున్న ఈ తరగతులనన్నిటిని భారతదేశంలో భాగస్వాములుగా చేసే బాధ్యత హిందూ సమాజానిది. హిందూ సమాజం వారినందరిని తనలో ఇముడ్చుకోవాలి. ఈ విధంగా చేయడం వలననే మతతత్వాన్ని పారదోలగలం. దేశ ఐక్యతని సంఘీభావాన్ని సాధించగలం.

ఈ ఎజెండానే ఇప్పుడు నరేంద్రమోడీ అనుసరిస్తున్నారు. భారత రాజ్యాంగాన్ని ఒప్పుకున్నప్పటికీ మౌలికంగా బిజెపి గాని అంతకు దాని ముందున్న జనసంఘ్ గాని మైనారిటీలన్న భావనను అంగీకరించవు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతమే దీనికి కారణం. 1979లో జనతాపార్టీ సభ్యులుగా వాజ్‌పాయ్, అద్వానీలు భిన్న సంస్కృతులను ఆమోదించినప్పటికీ కొద్ది కాలంలోనే దానిని తిరస్కరించారు.

1953–73 మధ్యకాలంలో చాలా మార్పులు జరిగాయి. 1964 మేలో నెహ్రూ, 1966 జనవరిలో లాల్ బహదూర్ శాస్త్రి చనిపోయారు. 1965 సెప్టెంబర్‌లో పాకిస్తాన్‌తో యుద్ధం జరిగింది; తరువాత విశ్వ హిందూ పరిషద్ ఆవిష్కరించబడింది;

1971 బంగ్లాదేశ్ యుద్ధం జరిగింది. 1972లో ఇందిరా గాంధీ సంపూర్ణ అధికారాన్ని సాధించింది. గోల్వాల్కర్‌కి ఆమెతో ఒప్పందం చేసుకోడానికి ఎప్పుడూ అభ్యంతరం లేదు. అందుకాయన జనసంఘ్‌ని ఆయుధంగా వాడుకున్నారు. జనసంఘ్ భారతీయత ఉద్యమాన్ని ప్రారంభించడం ఒక ముఖ్యమైన సంఘటన. 1990లలోని హిందుత్వ ఉద్యమానికి ఇది మచ్చుతునక. 1969లో ఒక ప్రముఖ పాత్రికేయుడు 'హిందూ మతతత్వ పార్టీల బలం నానాటికీ ఆందోళన కలిగించే స్థాయికి పెరిగిపోతున్నాయి' అని రాసారు. 1970 నూతన సంవత్సరం సందర్భంగా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ స్వదేశంలో పెరుగుతున్న మతతత్వ దాడులు, వాటితోపాటు ఆర్ఎస్ఎస్ పెరుగుదలను ఎత్తిచూపింది.

1966లో ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్రలలో మతతత్వ దాడులు పెరిగిపోయాయి. ముఖ్యంగా 1967లో రాంచీలో జరిగిన అల్లర్లలో 155 మంది ప్రాణాలు కోల్పోయారు. జమ్మూ కాశ్మీర్లలో కూడా అల్లర్లు పెరిగిపోయాయి. ఆ తరువాతి కాలంలో ఆర్ఎస్ఎస్ అనేక చోట్ల మత ఘర్షణలు రేపింది.

నెహ్రూ కాలం నాటి సమతుల్య ప్రశాంత వాతావరణం కనుమరుగైంది. ఆర్ ఎస్ ఎస్ విదేశాంగ విధానం, అమెరికాకి అనుకూలం; ఇజ్రాయిల్ జియోనిస్ట్ మిలటరీ విధానం దానికి ఆమోదయోగ్యం. 1968లో మైనారిటీల పట్ల అనుసరించిన వైఖరే ఈనాటికీ వర్తిస్తుంది.

అసహనం, ద్వేషం ఈ దేశాన్ని ముక్కలు చేసాయి. ఎన్నో నేరాలు చేయించాయి. అయినా అవి ఆగలేదు. మరింత ఎక్కువగా కొనసాగుతూనే ఉన్నాయి. 1966లో విశ్వహిందూ పరిషద్‌ని నెలకొల్పి ఆర్ ఎస్ ఎస్ దేశంలో మతతత్వ విషాన్ని వెదజల్లింది. ఆర్ ఎస్ ఎస్ తలపెట్టిన బాబ్రీ మసీదు కూల్చివేతకు నాయకత్వం వహించింది వి హెచ్ పినే. 1984లో అదే బజరంగ్ దళ్ అనే మరో సంస్థను స్థాపించింది. హెగ్డేవార్ గాని గోల్వాల్కర్ కానీ, హింసను విడనాడతామని అనలేదు. భారతీయత ఉద్యమాన్ని గోల్వాల్కర్ ఊరూరా తిరిగి ప్రచారం చేసారు. గోల్వాల్కరికి ఇస్లాం గురించి తెల్సినవి అహేతుకమైనవి. ఒక సందర్భంలో ఆయన 'ముస్లిం మహిళలు విడాకులు తీసుకున్న రెండేళ్లలోగా పిల్లలను గనక కంటే ఆ పిల్లలు మొదటి భర్తకే చెందుతారని ఉన్నట్టు చెప్పారు'. నిజానికి ముస్లిం మత గ్రంథంలో అటువంటిది ఏది లేనే లేదు. అలాగే అనేక సందర్భాలలో తప్పుడు ప్రకటనలు ఇవ్వడానికి ఏమాత్రం వెనుకాడే వారు కాదు.

◆

# ఆర్ఎస్ఎస్ – అత్యవసర పరిస్థితి, జనతా పార్టీ

1974–79 మధ్యకాలంలో ఏర్పడ్డ గందరగోళ పరిస్థితులు, భారతదేశ రాజకీయాలలో ఆర్ఎస్ఎస్‌కి, మిగిలిన ప్రముఖమైన రాజకీయపార్టీలకి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించాయి; దాని అనుబంధ సంస్థ జనసంఘ్‌కి చరమగీతం పాడాల్సిన పరిస్థితులు కల్పించాయి. అవి రెండూ రెండు 'మితవాద సంస్థ'లే అయినప్పటికీ వాటికి 'లౌకిక సంస్థలు'గా చలామణీ అయ్యే అవకాశాలు ఇబ్బడి ముబ్బిడిగా వచ్చిపడ్డాయి. అయితే, ఆ వచ్చిన అవకాశాలను అవి సద్వినియోగం చేసుకోలేదు.

1974లో జయప్రకాశ్ నారాయణ్ ఉద్యమం మొదలు పెట్టగానే ఆర్ఎస్ఎస్ అందులో చేరింది. అదే సమయంలో, నియంతృత్వాన్ని విధించి, ప్రతిపక్ష నాయకులను ఖైదు చేసి, పత్రికలపై పూర్వ (సెన్సార్) పరిశీలనను ప్రవేశపెట్టడమే కాక, బహిరంగ సభలను నిషేధించిన ఇందిరాగాంధీతో, ఆర్ఎస్ఎస్ అధినాయకుడు బాలాసాహెబ్ దేవోరస్ మంతనాలాడి తమ నాయకులను విడిపించుకోనే పనిలో నిమగ్నమయ్యారు. 1976 జులై 16న. 'ఆర్ఎస్ఎస్ పై నిషేధాన్ని ఎత్తివేయాలని వేడుకుంటూ, అందుకవసరమైతే 'మీతో' మాట్లాడడానికి వస్తానని' ఇందిరా గాంధీకి ఉత్తరం రాసారు. సంఘ్ వాలంటీర్లు ఏరకమైన హింసాత్మక చర్యలకు పాల్పడలేదని వక్కాణించారు. అత్యవసర పరిస్థితిని ఎత్తివేయడం పైన గాని, ఇతర నాయకులను జైళ్ల నుండి విడిపించే విషయంలో గాని ఉత్తరంలో ఎక్కడా ప్రస్థావన చేయలేదు.

1977లో ఎమర్జెన్సీ ముగియగానే, ఆర్ఎస్ఎస్, జయప్రకాశ్ నారాయణ్‌ని, ఆయన స్థాపించడానికి సహాయపడిన పార్టీని సందిగ్ధావస్థలో పడేసింది. హిందువేతర పార్టీలను చేర్చుకోడానికి అంగీకరించలేదు. జెపి ని ఇరకాటంలో పెట్టడమే కాదు

ఆఖరికి తెగతెంపులు చేసుకుంది. ఆర్ఎస్ఎస్ క్లిష్ట పరిస్థితులలోనూ తన సిద్ధాంతానికి దూరమవడానికి సిద్ధపడలేదు. జనసంఘ్‌ని పునః ప్రారంభించకుండా భారతీయ జనసంఘ్‌ని ఏర్పాటు చేసుకుంది.

జెపి అభిమాని, జీవితం గ్రంథస్థం చేసిన ఆలన్, వెండీ, 'డిసెంబర్ 1972 నాటికి 1942లో లాగే తీవ్రమైన మార్పులు సంభవించేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నట్టు జెపి భావించారు. యువకులను ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 1974లో జెపి ఉద్యమం ఉచ్ఛస్థితిలో ఉండగా ఎన్నికలలో అవినీతిని అంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఒత్తిడి చేయడం పారంభించారు. అందుకు లోక్‌పాల్ నియమించాలని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ అవినీతిలో కూరుకుపోతుండగా 'పరిపూర్ణ విప్లవం' నినాదం ఊపందుకుంది. అక్కడే జెపి ఒక పెద్ద తప్పు చేసారు. తాను జీవితాంతం వ్యతిరేకించిన వారితో చేతులు కలిపారు' అని రాసారు.

1968 డిసెంబర్ 28 ఢిల్లీలో మతతత్వానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయ సదస్సులో జెపి మాట్లాడారు: 'భారతదేశం వివిధ మతస్తులు గల దేశం; ప్రతి మతానికి ఒక ప్రత్యేకమైన మతతత్వం ఉంది. అవన్నీ హానికరమైనవే; అయితే అన్నిటికన్నా హానికరమైంది హిందూ మతతత్వం; ఎందుకంటే అది మెజారిటీ మతతత్వం; భారతదేశంలో హిందువులే ఎక్కువగా ఉండడం వలన హిందూ మతతత్వానికి, ఇతర మతస్థులను భారత జాతికి వ్యతిరేకులుగా చూపించే అవకాశం ఉంది. ఆర్ఎస్ఎస్ లాంటి కొన్ని సంస్థలు హిందూ జాతి హిందూ రాష్ట్రం ఒకటే అని బాహాటంగా చెప్పవచ్చు; ప్రత్యర్థులను ఖండించవచ్చు. అదే పనిని ఇతర అనేక సంస్థలు నర్మగర్భంగా చేయవచ్చు. కానీ, ఇటువంటివి తప్పులే సరిగ్గా జాతి విచ్ఛిన్నతికి దారితీస్తాయి'. ఇతర జాతుల వారు ఏవరైనా, కచ్చితంగా రెండో తరగతి పౌరులుగా ఉండడానికి ఇష్టపడరు కదా! అందువలన వీటిలో దేశం బీటలువారడానికి బీజాలు ఉన్నాయి. జెపి, ఆర్ఎస్ఎస్ అంతరంగాన్ని చూడలేకపోయారు.

1948 గాంధీజీ హత్య తరువాత ఆర్ఎస్ఎస్ కొన్నాళ్ళు తక్కువ స్థాయిలో మెసిలింది. ఆర్ఎస్ఎస్ నిఘా నీడలో పనిచేసుకోవలసివచ్చింది. కేవలం ఒక సాంస్కృతిక సంస్థ అని అనడాన్ని అనేకులు వ్యతిరేకించారు. కానీ, లౌకిక శక్తుల పిరికితనం ఆర్ఎస్ఎస్‌కి ముసుగు తొలగించుకుని ధైర్యంగా పనిచేయగల సత్తానిచ్చింది. భారతీయ జనతా పార్టీ తన ఆధీనంలోనే ఉందని బహిరంగంగా ఒప్పుకునే స్థితి ఏర్పడింది. ఆర్ఎస్ఎస్ జనతా పార్టీ వెనక ఉన్నన్ని రోజులు అదో లౌకిక పార్టీ కాలేదు. అలాగే రాజకీయ పార్టీలను ప్రభావితం చేయగలిగినన్ని రోజులు ఆర్ఎస్ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ కాలేదు.

1974లో బీహార్‌లో ఉద్యమాన్ని నడపడానికి జెపి, ఆర్ఎస్ఎస్ సహాయాన్ని తీసుకుని చాలా పెద్ద తప్పు చేసారు; అలా చేయడం వలన ఆర్ఎస్ఎస్ లాంటి ఒక వినాశనకర సంస్థకి గౌరవాన్ని కట్టపెట్టినట్టయింది. 1974 నవంబర్ 11వ తేదీ తాను చేసిన తప్పును జెపి ఒప్పుకున్నారు. అయినా వెనక్కు వెళ్లడం సాధ్యపడలేదు.

జెపి, ఆర్ఎస్ఎస్ తన ఉద్యమాన్ని ఎలా ఉపయోగించదలుచుకుందో గ్రహించలేకపోయారు. ఆర్ఎస్ఎస్, జెపితో కలిసి పనిచేస్తున్నట్టు కనిపిస్తున్న సమయంలోనే వారి అధినేత, తమ కార్యకర్తలను ఖైదు నుండి విడిపించుకోడానికి, తమ పై ఉన్న నిషేధాన్ని ఎత్తివేయించుకోడానికి ప్రధాన మంత్రి ముందు సాగిల బడ్డారు; మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్ బి చావన్‌తో మంతనాలు చేసారు; ఎక్కడా అత్యవసర పరిస్థితి ఊసే ఎత్తలేదు. జయప్రకాశ్ నారాయణ్‌కి ఈ విషయాలేవీ తెలియలేదు. కేవలం జెపికున్న మంచి పేరును తనకు అనుకూలంగా ఉపయోగించుకుంది. జయప్రకాష్ ఉద్యమానికి ఉన్న ప్రజాబలాన్ని తాము విస్తృతంగా ఆర్.ఎస్.ఎస్ పెరగడానికి వినియోగించుకుంది.

ఈ కాలంలో ఆర్ఎస్ఎస్ అంగలుపంగలుగా అభివృద్ధి చెందింది. దేశ వ్యాప్తంగా 10000 శాఖలు, పది లక్షల సభ్యత్వం పెంచుకుంది. ఒక్క కేరళలోనే 1000 శాఖలను ఏర్పరచుకుంది. 100 మంది పూర్తికాలం కార్యకర్తలను ఏర్పరచుకుంది. యుపి లో 2500 శాఖలు తెరిచింది.

ఆర్ఎస్ఎస్ విధానాల గురించి తెలుసుకోవాలంటే మచ్చుకు ఒక విషయం తెలుసుకుంటే సరిపోతుంది. 1975 నవంబర్ 10న దేవరస్ ఇందిరా గాంధీకి ఉత్తరం రాస్తూ 'సుప్రీంకోర్టు ఐదు గురు న్యాయమూర్తుల బెంచ్, మీ ఎన్నిక చెల్లుతుందని తీర్పునివ్వడాన్ని అభినందిస్తున్నాను' అని రాసారు. ఆమె సుప్రీంకోర్టులో గెలవడానికి పార్లమెంటులో చేసిన రాజ్యాంగ సవరణలు అతనికి తెలుసు. 1951 ప్రజా ప్రాతినిధ్య చట్టాన్ని ఉల్లంఘించిన విషయం తెలుసు. ఆమె చేసిన పనులు నిజాయితీ గలవారు ఖండించవలసినవే కానీ, అభినందించదగ్గవి కావు. అత్యవసర పరిస్థితి విధించినప్పుడు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఎక్కువ సంఖ్యలో ఖైదు చేయబడడం నిజమే అయినా, అందులో చాలామంది తమకి ఉద్యమాలతో ఎటువంటి సంబంధం లేదని రాసిచ్చి బయటపడ్డవారే. అందులో కొంతమంది ఎమర్జెన్సీని బలపరచి, జెపిని సైనిక చర్యలను రెచ్చగొట్టమని ఆరోపించిన వారున్నారు. వాస్తవంలో ఇందిరా, సంజయ్ గాంధీ రాజకీయాలతో వారికి ఏమాత్రం విభేదాలు లేవని కూడా చెప్పారు; సంజయ్ గాంధీ కమ్యూనిస్టు వ్యతిరేకతను, నిరంకుశ పోకడలను ఆహ్వానించారు. తరుణ్ భారత అనే సంఘ్ అనుకూల పత్రిక సంజయ్ గాంధీని పొగడ్తలతో ముంచెత్తింది. 1975

నవంబర్‌లో జెపి విడుదలయ్యారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం దేవరస్‌కి తెలియకుండా ఉండి ఉండదు. కానీ, 1976 జనవరి 12న వినోబాభావే మధ్యవర్తిత్వంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తానని మంతనాలు ప్రారంభించారు. ఈ వ్యవహారం ప్రతిపక్ష నాయకులకు తెలియకుండా రహస్యంగా ఉంచారు. వారి అసంతృప్తల్లా 20 అంశాల కార్యక్రమానికి వారి మద్దతు కోరకుండా నిషేధాన్ని విధించడమే. ఇందిరా గాంధీ, సంఘ్‌ని వారి సంస్థలను దుయ్యబట్టారు. పాపం సంఘ్ కార్యకర్తలకు ఈ విషయంలో ఊపిరి ఆడనట్టైంది. నిజానికి ఇందిరా గాంధీ నియంతృత్వ పోకడలు ఆర్ఎస్ఎస్‌కి అభ్యంతరాలు కావు.

మహారాష్ట్ర ప్రభుత్వం, రాజకీయ ఖైదీలను అంతర్గత రక్షణకు తాము విఘాతం కలిగించబోమని, అత్యవసర వస్తువుల పంపిణీకి ఆటంకాలు కలిగించబోమని, ఇతర ఎటువంటి చర్యలలో భాగస్వాములం కాబోమని అఫిడవిట్ పై సంతకాలు చేయాలంటే, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలంతా సంతకాలు చేసి బయటపడ్డారు. రాష్ట్ర నాయకులను, ఇది జనతా పార్టీలో భాగస్వాములుగా చేసుకున్న ఒప్పందాలకు భంగకరం కాదా అని ప్రశ్నిస్తే, కేంద్రం ఆదేశాలని తప్పించుకున్నారు. పోరాట కమిటీ ఆదేశాలను ఖాతరు చేయలేదు. ఆర్ఎస్ఎస్ తన ప్రయోజనాలను ఎప్పటికప్పుడు కాపాడుకుంటూనే వచ్చింది. అందుకు రాజీలు పడ్డట్టు, ఒప్పందాలు చేసుకున్నట్టు చెప్పుకుంది. కానీ, ఏనాడూ వాటికి విలువనివ్వలేదు. అందువల్లే జనసంఘ్‌లో సోషలిస్టులకు, ఆర్ఎస్ఎస్ అనుయాయులకు విభేదాలు ఏర్పడ్డాయి. బాలాసాహెబ్ దేవోరస్ మాటల్లోనే ప్రభుత్వం గనక ఎమర్జెన్సీ మాటున పెద్ద ఎత్తున తమ కార్యకర్తలను ఖైదు చేయకుంటే తమ వారు సత్యాగ్రహాలు చేసి ఇంత పెద్ద సంఖ్యలో జైళ్లకు వెళ్లే వాళ్ళే కాదు.' అన్నారు. నిజానికి యార్వడా జైలులో ఉన్న ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు అఫిడవిట్లు సమర్పించుకుని బయటపడ్డారు.

జనసంఘ్‌కి ఉన్న పెద్ద అనుకూలమైన విషయం దాని అజ్ఞాత వ్యవస్థ (అండర్ గ్రౌండ్ నెట్‌వర్క్).

ఆర్ఎస్ఎస్ తమ పనులను ఎలా చేయించుకుంటారో జాఫర్లొట్ ఉదహరించారు. 'వారికున్న ఉద్యమకారులంతా దీర్ఘకాల ప్రచారం చేయడానికి వీలుగా అజ్ఞానంలోకి వెళ్లిపోయారు. ఉన్న 1336 ప్రచారకులలోను 186 మంది ఖైదు చేయబడ్డారు. జులైనాటికల్లా అజ్ఞాతంలోకి వెళ్లిన నాయకులు తిరిగి పని ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు అవసరమైనందు వలన 'ప్రజాస్వామ్య' పునరుద్ధరణ జరగాలని డిమాండ్ చేసారు. ఇందిరా గాంధీతో మంతనాలు ఆపకుండానే జెపి సారథ్యంలో జరుగుతన్న ప్రతిపక్షాల సమావేశాలలో కూడా పాల్గొన్నారు. 1976

చరణ్ సింగ్ విడుదలైన తరువాత పావులు చకచకా కదిలాయి. జెపి ముంబైలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాంగ్రెస్(ఓ) తరఫున ఆచార్య కృపాలాని, చరణ్ సింగ్, అహమద్ పటేల్, ఎస్ ఎం జోషి, ఎస్ నిజలింగప్ప, పాల్గొన్నారు; జనసంఘ్ తరఫున ఒ.పి త్యాగి, ఉతమ్‌రావు పండిట్ పాల్గొన్నారు; నాలుగు పార్టీలతో ఒక స్టీరింగ్ కమిటీ ఏర్పడింది. బి ఎల్ డి, కాంగ్రెస్(ఓ), సోషలిస్టులు, జనసంఘ్. కొత్త పార్టీని జనతా పార్టీగా పిలవాలనుకున్నారు. జనతాపార్టీలో మతతత్వ పార్టీలు ఉండకూడదని, ఉన్న పార్టీలు మతతత్వ పార్టీలతో ఉన్న తమ సంబంధాలను తెగతెంపులు చేసుకున్నట్టు ప్రకటించాలని చరణ్ సింగ్ గట్టిగా పట్టుపట్టారు.

1977 జనవరి 18న ఇందిరా గాంధీ లోక్ సభ ఎన్నికలు జరుగుతాయని ప్రకటించారు. దేశమంతా జనతా పార్టీ గెలుస్తుందన్న ఊపు ఉండింది. మతతత్వం ఎదురుదెబ్బ తినింది. దేవరస్ మీద ఆర్ఎస్ఎస్ పై నిషేధాన్ని ఎత్తివేయించాలని, హిందువేతరులకు సభ్యత్వం కల్పించాలని ఒత్తిడి పెరిగింది. కానీ, దేవరస్ ఒత్తిడిని తట్టుకుని నిలబడ్డారు. 1977 ఫిబ్రవరి 25న 'ముందు మా హిందూ ఇంటిని చక్కదిద్దుకుంటాం. ఆ తరువాతే ఇతరుల సంగతి ఆలోచిస్తాం' అని ప్రకటించారు. అయితే ఆ 'ఇతరుల' సంగతి ఇప్పటికి ఆలోచించే పరిస్థితి రాలేదు!.

జెపి ఉద్యమం కారణంగా జనతాపార్టీ ప్రాబల్యం వలన జనసంఘ్‌కి 1977 జూన్ అసెంబ్లీ ఎన్నికలలో విజయాలు చేకూరాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, ఢిల్లీలలో ఒకప్పటి జనసంఘ్ సభ్యులే జనతాపార్టీకి నాయకత్వం వహిస్తున్నారు. కేంద్రంలో కూడా ఇన్ఫర్మేషన్ అండ్ బ్రాడ్‌కాస్టింగ్, పరిశ్రమలు విదేశీ వ్యవహారాలు వంటి ముఖ్యమైన శాఖలు వారి అధీనంలో ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన లోక్ సభలో 85–90 మంది వారి దిశానిర్దేశాన్ని అనుసరించేవారు ఉన్నారు. ఈ సదవకాశాన్ని ఆర్ఎస్ఎస్ తాను అభివృద్ధి చెందడానికి ఉపయోగించుకుంది.

అందివచ్చిన ఈ విజయాలు ఆర్ఎస్ఎస్‌కి తాము ఎదగడానికి ఇక ఏ మాత్రం జనతాదళ్ అండ అవసరం లేదన్న నమ్మకాన్ని కలిగించాయి. అందువలనే ఆర్ఎస్ఎస్ నాయకత్వం తమ దృక్పథాన్ని మార్చుకోవాల్సిన అవసరం ఉందనుకోలేదు. ముస్లింలను క్రిష్టియన్లను కలుపుకోవలసిన అవసరం లేదని నిర్ధారించుకున్నారు. తన ఉద్యమంలో పాలుపంచుకున్న విద్యార్థి పరిషద్, భారతీయ మజ్దూర్ సంఘ్, ఆర్ఎస్ఎస్ మొదలైన సంఘాలు, జనతా పార్టీ ఆవిర్భవించిన తరువాత దాని ముందు వరుసలో ఉండాలని జెపి కోరుకున్నారు.' అదే గనక జరగకపోతే అసంతృప్తులకు, విభేదాలకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయని' అన్నారు. కానీ, ఆర్ఎస్ఎస్ అటువంటి ఆలోచనలేవీ చేయలేదు.

జెపి అసంతృప్తులకి సమాధానంగా 1977 సెప్టెంబర్ 23న అప్పటి ఆర్ఎస్ఎస్

కార్యదర్శి మాధవరావు మూలెయ్, జెపికి ఒక పెద్ద లేఖ రాసారు. అందులో ప్రధానాంశాలు – ఆర్ఎస్ఎస్ ముస్లింలను, లేదా క్రిష్టియన్ మతస్థులను తమ సంస్థల్లో చేర్చుకునేందుకు సుముఖంగానే ఉన్నా వారే చేరడం లేదని, తాము ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు చెపుతున్నామని. అయితే అందుకుగాను తమ హిందూ రాష్ట్ర విధానాన్ని మార్చుకోవాల్సిన అవసరం కనిపించడం లేదని. హిందువులే తమకు ముఖ్యమని; దురుద్దేశంతో ఆర్ఎస్ఎస్ వ్యతిరేకులు చేసే ప్రచారాన్ని జెపి అర్థంచేసుకోవాలని. ఏతావాతా ఆర్ఎస్ఎస్ తన విధానాలను ఏమాత్రం మార్చుకోదన్నది సారాంశం. అంటే లౌకిక తత్వం అనేదానికి కట్టుబడమని స్పష్టం చేసారు. ఇది దేవరస్ అనుమతి లేనిదే రాసిన ఉత్తరం కాదని స్పష్టం అవుతున్నది. దేవరస్ అసలు సమస్యను మొదటిసారిగా ప్రకటించారు.

ఆర్ఎస్ఎస్ 52 ఏళ్ళుగా అనుసరిస్తున్న విధానాలను వదులు కోలేదు. హిందుత్వ ప్రచారాన్ని ఆపలేదు. సావర్కర్, గోల్వాల్కర్, మొదలైనవారు ప్రచారం చేసిన 'హిందుత్వ' భావనను వదిలి విప్లవాత్మకంగా మారలేదు. ఆర్ఎస్ఎస్ రెండు నిషేధాలను, బహిష్కరణలను తట్టుకుంది. ఇప్పుడిక తమవారు అధికారంలో ఉన్నారు. జెపి పరపతి అంతంత మాత్రమే. ఒక బ్రేక్ రావడానికి కొంత ఘర్షణను నివారించవలసిందే. అందుకనే దేవరస్ జె పి వద్దకు పెద్ద డెలిగేషన్‌తో వెళ్లి, 'హిందుజం అంటే ఒక విధమైన కొలువు మాత్రమే కాదు. ఆర్ఎస్ఎస్ ముస్లింలను, క్రిస్టియన్లను చేర్చుకునే విషయం తీవ్రంగా ఆలోచిస్తున్నది. తొందరపడితే లాభం లేదు. అధికారం కోసం ఆర్ఎస్ఎస్ అప్పుడప్పుడు ఇటువంటి ప్రకటనలు చేయడం కద్దు' అని చెప్పి వచ్చారు. దాని ఎదుగుదలకు అవసరమైనప్పుడల్లా ఇటువంటి మాటలు చెపుతూనే ఉంటుంది. జెపి ఆ ఉచ్చులోపడ్డారు. కృష్ణ కాంత్ 'నవజీవం' అనే పత్రికలో దేవరస్, 'కొన్ని రోజులు ఓపిక పట్టండి. జెపి, మొరార్జీ ముసలివారయ్యారు. ఆపై అధికారం మనదే' అని ఆర్ఎస్ఎస్ సభ్యులకు మాటిచ్చినట్టు వచ్చిన వార్తను చూపారు. అదే అసలు నిజం. దేవరస్‌కి అనుకూల సమయం కావాల్సినప్పుడల్లా చర్చలో ఉత్తర ప్రత్యుత్తరాల్లో నడుపుతుంటారు. 1978లో మళ్ళీ అటువంటి చర్చలే జెపికి దేవరస్‌కి మధ్య మొదలయ్యాయి. సమయం తీసుకోవాలనుకున్నప్పుడల్లా ఆర్ఎస్ఎస్ ఉత్తర ప్రత్యుత్తరాలతో కాలక్షేపం చేస్తూనే ఉంటుంది.

మరోవైపు ఆర్ఎస్ఎస్ కేంద్ర రాష్ట్ర మంత్రులు వివిధ ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలలో పాల్గొనడం పెరుగుతూనే ఉంది. మధు లిమయే వీటిని వ్యతిరేకిస్తూనే ఉన్నారు. 700 బడుల నుండి 15000 మంది పిల్లలతో శిశు సంఘం పెద్ద ఎత్తున మూడు రోజుల పాటు సభలు నిర్వహించింది. దీనిని దేశాధ్యక్షుడు సంజీవ రెడ్డి

ప్రారంభించగా, జగ్‌జీవన్ రామ్ ఒక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జనతా పార్టీ, లౌకిక విధానం మసక బారిపోతున్నదని వేస్తున్న కేకలు పట్టించుకునే వారు లేరు. ఫలితంగా జనతా పార్టీ లౌకికతత్వానికి కట్టుబడి ఉందన్న అభిప్రాయం పలచబడిపోతూ వచ్చింది. ఫలితంగా జనతా పార్టీకి మైనారిటీలు దూరం అవడం మొదలైంది. అదే సమయంలో ఆర్ ఎస్ ఎస్ సభ్యులు 9000 నుండి 12000 పెరిగారు. వారికి అధికారుల అండదండలు పుష్కలంగా లభిస్తున్నాయి.

1978 డిసెంబర్ 29న మధులిమయే తేనేతుట్టెని కదిపారు. ఆర్ఎస్ఎస్ ఆదాయ పన్ను అధికారులకు, చారిటీ కమిషనేర్‌కి వేర్వేరు అఫిడవిట్లు ఇస్తూనే ఉంది. ఒకసారి సాంస్కృతిక సంఘమని వేరొక సారి ఒక రకమైన రాజకీయ సంస్థ అని చెప్పుకుంటున్నది. ఆఖరికి దేశాయ్ దేవరస్‌కి ఈ విషయమై వివరణ కోరుతూ లేఖ రాసారు. కనీసం మంత్రులు ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలకు హాజరు కాకుండా చూడాలని అయన ఉద్దేశం.

ఈలోగా కొత్తగా ఎన్నికైన రాజేందర్ సింగ్ ఆర్ ఎస్ ఎస్ సభ్యులను జనతా పార్టీలో చేరడం నిషేధించడాన్ని అంగీకరించలేదు. ఆర్ ఎస్ ఎస్‌ని రాజకీయాలకు దూరం చేయలేమని స్పష్టం చేసారు. పైగా జాతీయ సదస్సు, కేంద్ర రాష్ట్ర సంబంధాల గురించి, నాగాలాండ్ కాశ్మీర్‌ల గురించి తీర్మానాలు చేసింది; 1979 మార్చ్ 12న ఆదాయ పన్నుల శాఖకి ఇచ్చిన ఒక లేఖలో 'ఆర్ఎస్ఎస్ ఒక రాజకీయ పార్టీ లాంటిది' అని సమర్పించినట్టు దేవరస్ బాహాటంగా ఒప్పుకున్నారు. జనతాపార్టీలో ఆర్ఎస్ఎస్‌కి వ్యతిరేకంగా ప్రత్యర్థుల అభిప్రాయాలు బలపడుతున్నాయి. వాజ్‌పాయ్ మునుగుతున్న నావను ఒడ్డుకు చేర్చడానికి శతవిధాలా ప్రయత్నించారు. ఆర్ఎస్ఎస్‌లోకి భారతీయులందరిని ఆహ్వానించాలని ప్రతిపాదించారు. జనతా పార్టీలో చేయి పెట్టి కెలకవద్దన్నారు. తాను జనతా పార్టీకి విధేయుడినని అన్నారు. లాభం లేకపోయింది.

దేశాయ్‌కి పార్లమెంటరీ బోర్డు 'రెండింటిలో ద్విసభ్యత్వం' పై ఒక పరిష్కారం కనుగొనడానికి పూర్తి అధికారాలను ఇచ్చింది. కానీ, దేశాయ్ పరిష్కారం కనుగొనలేకపోయారు. ఈలోగా లిమయే ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసారు. చరణ్ సింగ్ ఇందిరా గాంధీతో ఒప్పందాన్ని చేసుకున్నారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా రాజీనామా చేయవలసివచ్చింది.

ఆర్ఎస్ఎస్ ఈలోగా మరింత బలపడింది. 13000 కేంద్రాలకు విస్తరించింది. 20000 శాఖలను ఏర్పరుచుకుంది. బీహార్‌లో శాఖలు 1000 నుండి 1400కి పెరిగాయి. అందుకనే దేవరస్ ఎమర్జెన్సీ తరువాత ఆర్ఎస్ఎస్ బలం పుంజుకోడాన్ని

చూసి ఓర్వలేక నిందలు మోపుతున్నారని ఎదురు దాడికి దిగారు. పదేళ్లలో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసే బలాన్ని పొందుతామని ప్రకటించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో మమ్మల్ని చూసి ఎవరూ అసూయపడనక్కర లేదని సెలవిచ్చారు. ఆర్ఎస్ఎస్, జనసంఘ్‌ల మధ్య ఉన్న సంబంధం తండ్రీ కొడుకుల బంధం లాంటిదని ఆర్గనైజింగ్ సెక్రెటరీ యాదవ రావు ఉటంకించారు. ఆర్ఎస్ఎస్ కార్యక్రమాలలో రాజకీయ నాయకులు పాల్గొనకూడదన్న జనతా పార్టీ ప్రతిపాదనని ఎన్నిసార్లు ఒప్పుకున్నట్టుగా కనిపించినా, జనసంఘ్ పార్టీ నాయకులు అన్నా, అది ఏనాడూ కార్యరూపం దాల్చలేదు. అంటే, అవన్నీ నీటి మాటలుగానే మిగిలిపోయాయి.

వాజ్‌పాయ్ జనసంఘ్ జనతా పార్టీలు సయోధ్యతో మెలగాలన్న వాదనలో ఒంటరయ్యారు. జనసంఘ్ వారపత్రిక సాధనలో ఒక ముఖాముఖిలో 'హిందువులు మతోన్మాదులైతే భారతదేశం లౌకిక రాజ్యంగా మనలేదు. ఆర్ఎస్ఎస్ తన విధానాలను, సిద్ధాంతాన్ని, కార్యక్రమాలను ప్రణాళికలను మార్చుకోవాలని హితవు పలికారు. అంతేకాదు, దేశ విభజనని కమ్యూనిస్టు పార్టీ ఒప్పుకున్నందువలనే తాను ఆర్ఎస్ఎస్‌లో చేరానని, లేకుంటే అఖిల భారత విద్యార్థి సంఘంలో ఉన్న తాను కమ్యూనిస్టుని అయి ఉండేవాడినని' కూడా ఒక సందర్భంలో అన్నారు.

దేవరస్ మాత్రం తన అభిప్రాయాన్ని మార్చుకోలేదు. హిందూ సంస్థగా ఉండడం 'దేశానికి అవసరం' అని అభిప్రాయపడ్డారు. ఎందుకంటే దేశంలో హిందువుల సంఖ్య 85% ఉందికదా!

1979, డిసెంబర్‌లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఇందిరా గాంధీ తిరిగి విజయం సాధించారు. వెంటనే దేవరస్ ఆమెకు తన పూర్తి సహకారాన్ని అందిస్తానని మాటిచ్చారు.

'రెండింటి సభ్యత్వ' సమస్య మళ్ళీ ముందుకొచ్చింది. ఈసారి జగజీవన్ రామ్ ఆందోళనకి నాయకత్వం వహించారు.

రాజకీయ పార్టీ సభ్యులు ఆర్ఎస్ఎస్ సభ్యులుగా ఉండకూడదన్న ప్రతిపాదనకు చివరికి రాజీ మార్గంగా రాజకీయ పార్టీ ఆఫీస్ బేరర్లగా ఉన్న వారు రోజువారీ ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలకు హాజరు కానక్కరలేదని మాత్రమే చంద్రశేఖర్ ఒప్పందం చేసుకోగలిగారు. 1980 ఫిబ్రవరిలో జరిగిన ఎగ్జిక్యూటివ్ సమావేశంలో 'జనతా పార్టీకి చెందిన ఏ శాసన సభ్యుడు లేదా ఆఫీస్ బేరర్ ఆర్ఎస్ఎస్ రోజువారీ కార్యక్రమాలలో భాగస్వామి కాకూడదు. అలాగే జనతా పార్టీ సభ్యులు దానితో పోటీ పడుతున్న ప్రజాసంఘాల కార్యక్రమాలకు హాజరు కాకూడదు' అని ప్రకటించింది

'ప్రజాస్వామ్యంలో ప్రతి సంస్థకి తన సిద్ధాంతాన్ని, తాత్వికతను ప్రచారం

చేసుకునే హక్కు ఉంది. ప్రజాస్వామ్యానికి గుండెకాయ ఇదే. అయితే, అది రాజకీయాలలో ఆధిపత్యం చలాయించాలనుకున్నప్పుడు, దాని తాత్వికత, సిద్ధాంతం, భారతదేశ జాతీయత యొక్క మౌలిక తాత్వికతకు భంగం కలిగిస్తున్నదా లేదా అని చూడాలి. జనతా పార్టీకి ఆర్ఎస్ఎస్‌తో సంబంధం కలిగి ఉండడాన్ని ఆక్షేపించనక్కరలేదు. కానీ, అది పూర్తిగా లౌకిక పార్టీ కావాలనుకుంటే దాని హిందూ ముఖచిత్రాన్ని వదులుకోవాలి. అలా కాకపోతే అది రాజకీయాల నుండి వైదొలగాలి. జనతా పార్టీతో పూర్తిగా విడిపోవాలి.' అని జెపి అభిప్రాయపడ్డారు.

దినమణి పత్రికా విలేఖరితో, 'ప్రతిసారి కలిసినప్పుడు ఆర్ఎస్ఎస్‌కు చెందినవారు తమ అంతరంగ పరిస్థితులు చక్క దిద్దుకుంటామని చెప్తున్నారు. కానీ, ఇక్కడి నుండి వెళ్ళిన వెంటనే ఏం జరుగుతున్నదో నాకు తెలియడం లేదు. నాలుగేళ్లుగా ఇదే తంతు. దేనికైనా ఒక హద్దు ఉందికదా!' అన్నారు.

జెపి 1979 అక్టోబర్‌లో మరణించారు. మొరార్జీ దేశాయ్ పని తీరు నిరాశపరిచింది; జనతాపార్టీ నాయకత్వం వంచించింది; నానా దేశముఖ్, దేవరస్ వంటి ఆర్ఎస్ఎస్ నాయకులు మోసం చేసారు. ఆర్ఎస్ఎస్ తనను తాను సంస్కరించుకుని ఒక లౌకిక మితవాద పార్టీ కాదలచుకోలేదు. ఎటువంటి పరిస్థితులలోనైనా అది హిందుత్వకి నాయకత్వం వహించడానికే నిశ్చయించుకుంది. అందుకది అబద్ధాలు చెప్పడానికి, మోసాలు చెయ్యడానికి, వంచనకు పాల్పడడానికి సిద్ధపడింది.

◆

# బిజెపి ఆవిర్భావం,
# ఆర్‌ఎస్‌ఎస్ సమస్య

**జ**నసంఘ్ జనతా పార్టీ నుండి విడిపోయి 1980లో బిజెపి ఆవిర్భవించగానే బిజెపి పై ఆర్‌ఎస్‌ఎస్ అదుపు మరింత పెరిగింది. బిజెపికి ఆర్‌ఎస్‌ఎస్‌తో తన సంబంధం ఎలా ఉండాలన్నదానిపై బిజెపికి కొంత సందిగ్ధత ఉన్నా ఆర్‌ఎస్‌ఎస్‌కి మాత్రం స్పష్టమైన అభిప్రాయం ఉంది. బిజెపి కూడా జనసంఘ్ లాగే ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ విభాగం. ఈ విషయంలో అద్వానీకి కొంత అస్పష్టత ఉండేదనేది వాస్తవం. అందువలనే 'ఆర్‌ఎస్‌ఎస్‌కి ఒక రకమైన నైతిక అధికారం ఉంది; అది బిజెపికి ఆరోగ్యకరమే' అని ఆయన అభిప్రాయం వ్యక్తం చేసారు. ఇది అవాస్తవం. ఎందుకంటే ఇక్కడ 'నైతిక విలువను అంగీకరించడమా లేదా అని ఎంపిక చేసుకునే హక్కు' బిజెపికి లేదు. అలా ఎంపిక చేసుకునే హక్కు ఉన్నప్పుడే అది 'నైతిక విలువ' అవుతుంది. ఒక మాతృ సంస్థతో దాని అనుబంధ సంస్థలకి అటువంటి ఎంపిక చేసుకునే అధికారం ఉండదు. ఆధిపత్యంలో తేడాలు ఉండవచ్చు. బిజెపి విషయంలో ఆర్‌ఎస్‌ఎస్ పట్టు మరింత పెరిగింది.

బిజెపి ఆవిర్భవించిన చాలా సంవత్సరాల తరువాత ఒకసారి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకుడు ఎం.జి వైద్యని సూటిగా 'బిజెపి ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా ఉన్న ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుల పనేంటని ప్రశ్నిస్తే, 'పార్టీని సమర్థవంతంగా నడిపించడం' అని స్పష్టంగా కచ్చితమైన సమాధానం చెప్పారు. ఈ పాత్ర మొట్టమొదటిసారి పోషించిన వ్యక్తి దీన్ దయాల్ ఉపాధ్యాయ. సుందర్ సింగ్ భండారి, ఖుష్భువ్ థాక్రే వంటి వారి నెందరినో బిజెపికి ఈ పని పైనే పంపించాం. ఈ పనిలో నియమించబడిన చివరి వ్యక్తి సుందర్ సింగ్ భండారి; ఇప్పుడు రామ్ లాల్ వచ్చారు. వారంతా ఆర్‌ఎస్‌ఎస్‌తో కలిసి పనిచేస్తారు. 'భారత దేశంలో మరే ఇతర రాజకీయ పార్టీకి బయటి వ్యక్తుల

నుండి ఆదేశాలు ఉంటాయి? పైగా అదో 'సాంస్కృతిక సంస్థ' అని చెప్పుకుంటుంటుంది. ఈ సాంస్కృతిక సంస్థ తన తరఫున 'రాజకీయ పార్టీ సక్రమంగా పనిచేయడానికి అధికారులను పంపుతుంది'!

2005లో అద్వానీ 'బిజెపికి ఆర్‌ఎస్‌ఎస్‌కి ఉన్న సంబంధం గురించి ప్రశ్నించినపుడు, అప్పటి ప్రతినిధి, నేటి కార్యదర్శి రామ్ మాధవ్ గారు 'అటువంటి చర్చలు అనవసరం' అని తప్పించేసారు.

జనసంఘ్ లాగే బిజెపి కూడా ఆర్‌ఎస్‌ఎస్ యొక్క రాజకీయ అంగం. కానీ, వాజ్‌పాయ్, అద్వానీకి ప్రజలలో మంచి గుర్తింపు రావడం దానికో సమస్యగా మారింది.

ఆర్‌ఎస్‌ఎస్ ఒక మాతృమూర్తి. బిజెపి దాని పేగుతో ముడిపడివున్న శిశువు. ఆ పేగు బంధం పుట్టిన వెంటనే తెగి శిశువుకు ఒక కొత్త స్వతంత్ర జీవితాన్ని ఇచ్చింది. కానీ, ఆర్‌ఎస్‌ఎస్ దానిని గుర్తించ నిరాకరించింది. 1951లో జనసంఘ్ పుట్టినప్పటి నుండి 1977లో దానిని జనతా పార్టీలో విలీనం చేసేనాటి వరకు అదొక మితవాద లౌకిక పార్టీగా స్వతంత్రంగా మారుతుందన్న ఆశలు అనేక మార్లు చిగురించి చివరికి అడియాశలయ్యాయి. సావర్కర్ ఉపదేశించిన హిందుత్వనుగాని, గోల్వాల్కర్ ప్రవచనాలుగాని, వేటినీ ఆర్‌ఎస్‌ఎస్ వదలుకోలేదు. తన సిద్ధాంతంలో ఏమాత్రం మార్పులు చేసుకోడానికి సిద్ధపడలేదు.

1980లో జనతా పార్టీ స్థాపించబడిన నాటి నుండి నేటి వరకు మాతృ సంస్థతో ఉన్న పేగుబంధం ఏనాడూ తెగనీయ లేదు. ఎంతో కొంత మార్పులు చేయాలని 1980లో ప్రయత్నించి ఆ పనిని జాతీయ ఎగ్జిక్యూటివ్‌కి ఏప్రిల్ 3న అప్పచెప్పింది. కానీ, దాని రిపోర్ట్ రాకముందే 5వ తేదీ భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించింది.

ఫిరోజ్‌కోట్ల మైదానంలో జరిగిన కొత్త పార్టీ ప్రారంభ సభలో వేదికమీద జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకుడు ఎస్ పి ముఖర్జీ, సిద్ధాంత మార్గదర్శకుడు దీన్ దయాల్ ఉపాధ్యాయ, త్వరలోనే మార్గదర్శకుడి స్థానం నుండి తొలగించబడనున్న జయప్రకాశ్ నారాయణల చిత్రపటాలు పెట్టబడ్డాయి. ఉపాధ్యాయ గారి 'మానవత్వం అంతర్గతంగా' ఉండడం కొనసాగుతూనే, అందులో మొదటిసారిగా 'గాంధేయ సోషలిజం' అనే మాట ఉపయోగించబడింది. 1980లలోని బిజెపి నాయకులు, తాము జయప్రకాశ్ నారాయణ్ వారసులమని గొప్పగా చెప్పుకునే వారు. కానీ, ఈ రోజు వారు ఆర్‌ఎస్‌ఎస్‌కి దగ్గరివారమని చెప్పుకోడానికి ఇష్టపడుతున్నారు. ఒక దశాబ్దం గడిచేలోపు మళ్ళీ 'హిందుత్వ' ముందుకొచ్చింది. 1990లలో అద్వానీ గారు కోయంబత్తూర్‌లో ఒక సభలో మాట్లాడుతూ, బిజెఎస్, ఆర్‌ఎస్‌ఎస్‌ల బంధం కేవలం సైద్ధాంతికమే కానీ, బిజెపి ఆర్‌ఎస్‌ఎస్‌ల బంధం సైద్ధాంతికమే కాదు చారిత్రికం కూడా' అన్నారు.

అద్వానీ గారు, 1980 ఫిబ్రవరి 26న జనతా పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌కి ఉత్తరం రాస్తూ, 'పార్టీ సిద్ధాంతాలైన గాంధేయ సోషలిజం, లౌకిక తత్వాల పట్ల మా నిబద్ధత సంపూర్ణం; అసమానం.' అన్నారు. అయితే, ఆ తరువాతి కాలంలో అద్వానీ గారు ఈ అభిప్రాయాలని సూడో సెక్యులరిజం అని ఎద్దేవా చేసారు. అది వేరే విషయం.

ఎప్పుడూ ముస్లిం, హిందూ మతస్థుల మధ్య చిచ్చులు రేపే అవకాశం కోసం ఎదురుచూసే ఆర్‌ఎస్ఎస్‌కి, 1981 ఫిబ్రవరిలో తమిళనాడులోని తిరునల్వేలి జిల్లాలోని మీనాక్షిపురంలో మొత్తం గ్రామం అంతా ముస్లింలుగా మారడం కలిసివచ్చింది. అందుకు కారణం గల్ఫ్ నుండి వచ్చి పడే డబ్బు అని అంటూ, ఎప్పటిలాగే ముస్లిం నాయకులు లక్ష్యంగా చేసుకుని దాడులు మొదలు పెట్టారు. కానీ, ఎస్‌సీ, ఎస్‌టి సంక్షేమ ప్రాంతీయ డైరెక్టర్ పరిశోధనలో అవన్నీ కట్టుకథలు అని తేలింది.

1978 తరువాత దేశంలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో మతతత్వ దాడులు బాగా పెరిగిపోయాయి. దీని ప్రభావం అలీఘడ్  ముస్లిం విశ్వవిద్యాలయం పై పడింది. అక్కడ విద్యార్థులు ఉపాధ్యాయులు కూడా విశ్వవిద్యాలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించాలని ఆందోళనలు చేసారు. రాజ్యాంగంలోని 30(1) అధికరణం వారికి ఆ హక్కు కల్పించిందని వాదించారు. 1972 మేలో చేసిన ఒక సవరణ వారికి ఆ హక్కును నిరాకరించింది. కానీ, మళ్ళీ 1981 డిసెంబర్ 31న ఇందిరా గాంధీ అలీఘర్ ముస్లిం యూనివర్సిటీ (సవరణ) చట్టం 1981, చేసి వారికి స్వయం ప్రతిపత్తిని కల్పించారు.

మతసామరస్యాన్ని దిగజార్చే దిశగా జరిగిన అనేక సంఘటనలో, షా బానో తీర్పు ఒకటి. నిజానికి 1985 ఏప్రిల్ 23న సుప్రీం కోర్టు షా బాను కేసులో ఇచ్చిన తీర్పులో ఇది వ్యక్తుల మత  విశ్వాసాల ఆధారంగా ఏర్పడ్డ సంప్రదాయాలు, చట్టాల కన్నా రాజ్యాంగం కల్పించిన చట్టాలకు ప్రాధాన్యత నిచ్చింది. ఇది ఆహ్వానించదగ్గదే. కానీ, ముస్లిం పెద్దలను ఆ సందర్భంగా శాంతపరచడానికి రాజీవ్ గాంధీ మళ్ళీ ముస్లిం పర్సనల్ చట్టంలో సవరణలు చేసి సుప్రీం కోర్టు తీర్పును అమలు కానివ్వలేదు. మతాలకతీతంగా ఏర్పాటు చేసుకున్న రాజ్యాంగం మతవాదుల అధిపత్యాలకు బలవడం మొదలైంది. హిందూ మతతత్వ వాదులు ముస్లిం మహిళలకు ప్రత్యేకమైన ముస్లిం పర్సనల్ చట్టం అమలు చేయనక్కరలేదని, ఇవి ముస్లిం మతస్థులను సంతోషపెట్టడానికి వారి ఓట్లను దండుకోవడానికని ఎద్దేవా చేస్తే, ముస్లిం మతవాదులు తమ మతానికి సంబంధించిన అంశాలలో రాజ్యం జోక్యం చేసుకోవడం న్యాయ సమ్మతంకాదని

వాదించడం పెరిగింది. ఫలితంగా రెండు మతాల మధ్య సుహృద్భావ వాతావరణం దెబ్బతినింది. ఇటువంటి అవకాశాల కోసం ఎదురుచూస్తున్న బిజెపి అందివచ్చిన అవకాశాన్ని జారవిడువలేదు.

ఆ తరువాత మత సామరస్యాన్ని దెబ్బతీసిన మరో అంశం బాబ్రీ మసీదు వివాదం. 1986లో అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ బాబ్రీ మసీదు తలుపులు తెరవడానికి అనుమతించి, రెండు మతాల వారి మధ్య ఉన్న సంబంధాలను పూర్తిగా దిగజార్చారు; దేశ లౌకిక విలువలకు పూర్తిగా తిలోదకాలిచ్చారు. బాబ్రీ మసీదు తలుపులు తెరవాలన్న నిర్ణయం ఇందిరాగాంధీ తీసుకుంటే దానిని అరుణ్ నెహ్రూ రాజీవ్ గాంధీ అమలుజేశారు. 1986 ఫిబ్రవరి 19వ తేదీన లోక్‌సభలో బిల్లు పాసైంది. ఫిబ్రవరి 1వ తేదీన మసీదు తాళం తెరవబడింది. 1984 ఏప్రిల్ 8వ తేదీన విశ్వ హిందూ పరిషద్ బాబ్రీ మందిరం తొలగించాలని సమర నాదం (చేసింది) పూరించింది. గుడి తలుపులు శివరాత్రి ముందు గనక తెరవకపోతే తలుపులు బద్దలు కొట్టుకుని మరీ గుడిలో ప్రవేశిస్తామని, రామజన్మ భూమి ముక్తి సమితి శపథం చేసింది. అందువలన రాజీవ్ గాంధీ తలుపులు తీయించాలని నిర్ణయించుకున్నారు. సాయంత్రం 4.గం॥30 నిముషాలకు కోర్టు తీర్పునిస్తే 5.గం॥19 నిమిషాలకు గుడి తలుపులు తెరుచుకున్నాయి. ప్రజలు తండోపతండాలుగా గుడిలోకి ప్రవేశించారు.

అయోధ్యలో రామజన్మభూమి తలుపులు తెరవడానికి ముస్లిం బిలు పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి సంబంధం ఉన్న ఆధారాలను ఆనాటి స్టేట్స్‌మెన్ పత్రికా విలేకరిగా పనిచేసిన నీరజ్ చౌదరీ బయటపెట్టారు.

దీర్ఘకాలంలో దేశంలో మతసామరస్యానికి జరిగే నష్టాన్ని దృష్టిలో ఉంచుకోకుండా, కేవలం హస్వదృష్టితో ఇందిరా గాంధీ హిందుత్వ వాదులకు దగ్గరయ్యారు. సన్యాసులను సంత్‌లను ఆదరించారు. ఒక విధంగా చెప్పాలంటే బిజెపికి కాంగ్రెస్‌కి తేడా లేకుండా చేసారు. అందుకనే సాధారణ ప్రజలు జనసంఘ్ ఆర్ఎస్ఎస్‌కి దూరమైందని భ్రమపడ్డారు. ఇటువంటి అవకాశాన్ని కూడా తమకు అనుకూలంగా ఎలా మలచుకోవాలో అని ఆర్ఎస్ఎస్ ఆలోచించింది. నిజానికి ఆర్ఎస్ఎస్‌కి జనసంఘ్‌కి మధ్య దూరం పెరిగిన మాట వాస్తవమే. కానీ, అందుకు కారణం, సాధారణ ఆర్ఎస్ఎస్ సభ్యులకు జనసంఘ్‌కి ఎందుకు చేరువవ్వాలో, కాంగ్రెస్ (ఐ)కి ఎందుకు దూరంగా ఉండాలో అర్థంకాని పరిస్థితి. ఇందిరా గాంధీ అంతగా మతతత్వ వాదులను ఆదరించారు. ఆ తరువాత రాజీవ్ గాంధీకి వెనక్కు మళ్లే అవకాశం లేకపోయింది. 1984 సాధారణ లోక్‌సభ ఎన్నికలలో ఆర్ఎస్ఎస్ జన సంఘ్‌కి ఇచ్చిన మద్దతు అతి స్వల్పం. నాయకులు బిజెపికి పనిచేయాలని

ఆదేశాలు ఇచ్చినా – నానాజీ దేశ్‌ముఖ్ వంటివారు బాహాటంగా ప్రకటించారు తప్పితే, చాలామంది కాంగ్రెస్‌కే పనిచేసారు. ఇదేమి ఆర్‌ఎస్‌ఎస్ కాంగ్రెస్‌తో చేసుకున్న రహస్య ఒప్పందం వలన జరిగింది కాదు. కానీ, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు వారి నాయకుల చేష్టలకు ఖిన్నులై ఉండడం వలన జరిగింది. రాజకీయ విధానాలలో వారి నాయకుల పిలుపులను లెక్క చేయలేదు. ఈ పరిస్థితులలో ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు అప్రమత్తమయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకుడు హిందువులు ఎవరు అనే విషయం ప్రచారం చేయడం మొదలుపెట్టారు. ఆర్‌ఎస్‌ఎస్‌కి దగ్గరగా ఉన్న మద్దతుదారులు అంతా ఒక చోట చేరారు. కాంగ్రెస్‌కి ప్రత్యామ్నాయంగా ఎదగాలని నిర్ణయించడం జరిగింది.

'పరిస్థితులు ఇలాగే కొనసాగితే, హిందువులు మైనారిటీలుగా మారతారంటూ ప్రచారాన్ని దేవోరస్ ఎత్తుకున్నారు. ఇందుకు సాక్ష్యంగా మీనాక్షిపురంలో మూకుమ్మడి మత మార్పిడులను ఉదహరించారు. ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని, లౌకిక తత్వాన్ని నమ్మేవారెవరైనా అవన్నీ భారత దేశంలో కేవలం హిందూ రాష్ట్రం ఏర్పడినప్పుడే సాధ్యమని గుర్తించాలంటూ' ప్రచారం చేసారు. 1984 జనవరి 14వ తేదీ, దేవరస్ చేసిన ఉపన్యాసంలోనూ హిందూ మతం విషయంలో ఏమాత్రం అనుమానాలు లేవు. భావనలు అతిస్పష్టం. ముస్లింలు, క్రిష్టియన్లు ఈ దేశ వాసులు కాదు. హిందూ మతం మిగిలిన అన్నిమతాల వారిని–జైనులు, సిక్కులు, బౌద్ధులను హిందూ మతస్థులుగానే పరిగణిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ 'ఇతర మతస్థులల్ని వేరుచేయడం, హిందువుల ప్రాధాన్యతను నొక్కి చెప్పడమే' అని తాను అనుసరించదలుచుకున్న తన విధానాన్ని కొనసాగించింది.

అలాంటి ప్రచారాలలో ఒకటి దేవరస్, 1984 అక్టోబర్ 4న నాగపూర్‌లో, 'మన గాంధర్వదేశాన్ని ఇప్పుడు ఆఫ్ఘనిస్థాన్ అని పిలవాల్సివస్తున్నది. ఈ ప్రాంతాలన్నింటినీ మనం హిందువులు మైనారిటీలుగా ఉండడం వలన కోల్పోయాము. అంటూ ప్రచారం చేయడం మొదలుపెట్టడం. ఎక్కడికెళ్లినా ఇటువంటి ప్రసంగాలు చేయడం, మతం మారిన వారినందరిని తిరిగి సొంత గూటికి రమ్మని ఆహ్వానించడం సర్వసాధారణమయ్యాయి. మెజారిటీ ప్రజలలో ఈ రకమైన అభద్రతని నింపడంలోనే ప్రచారం కేంద్రీకృతమైంది. ఇటువంటి ప్రచారాలతోనే 1977– 1982 మధ్యకాలంలో ఆర్‌ఎస్‌ఎస్ విపరీతంగా పుంజుకుంది. దాని శాఖలు 6000 నుండి 19000 పెరిగాయి. వాటికున్న ఉప శాఖలతో కలుపుకుంటే 35000కి చేరాయి. 70000 మంది కచ్చితంగా ఎంతో విధేయతతో పనిచేసే స్వయం సేవకులు తయారయ్యారు. కొత్త కొత్త ప్రాంతాలకు విస్తరించింది. ఇది దానికి కొత్త నమ్మకాన్ని, ధైర్యాన్ని ఇచ్చింది.

అదే సమయంలో 1964లో ముంబైలో ప్రారంభించబడిన విశ్వ హిందూ పరిషద్ 1983 నవంబర్ 16న, పది కోట్ల మందితో ఒక నెల రోజుల ఏకాత్మత యోజన నిర్వహించింది – ఈ దేశాన్ని కేవలం హిందువులు మాత్రమే మాతృభూమిగా భావిస్తారు. మిగిలిన వారంతా ఈ భూమిని మాతృమూర్తిగా చూడను నిరాకరిస్తారనేదే ప్రధాన నినాదం. ఆర్ఎస్ఎస్ విస్తృతంగా తన పరిధిని పెంచుకోడానికి కొత్త కొత్త సంఘాలను ఏర్పాటు చేసింది. కార్మికవాడల్లో, విద్యార్థులలో, రైతులలో, గిరిజనులలో ప్రచారకులను పంపింది. 1977లో నిషేధాన్ని ఎత్తివేయగానే అంగాలు పంగలుగా అభివృద్ధి చెందింది. దేశంలోనే కాదు విదేశాలలో సహితం శాఖలు పెంచుకుంది. వనవాసి కళ్యాణ్ కేంద్రాలు ప్రారంభించి ఈశాన్య భారతదేశంలో, బీహార్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో ఉన్న క్రిష్టియన్ మిషనరీలు పనిచేస్తున్న చోట కార్యక్రమాలు ప్రారంభించింది.

రోజు రోజుకి ఆర్ఎస్ఎస్ అధినాయకుడు తన హిందుత్వ స్వరాన్ని పెంచుతూవచ్చారు. హిందువులు తాముగా తుడిచి పెట్టబడడానికి అంగీకరించినందు వలనే ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లు ఏర్పడ్డాయని, ఈ దేశంలో మైనారిటీలు అంటే ఎక్కడి నుండో వచ్చినవారు కాదని, ఆయా దేశాలకు వెళ్లిన వారికి ఏ ప్రయోజనాలు, గౌరవం ఉండదని, అందువలన వారు హిందువులుగా మారడం తప్ప గత్యంతరం లేదని చెప్పుకొచ్చారు. మైనారిటీలకు ఉన్నన్ని హక్కులు ఈ దేశంలో మెజారిటీ మతస్థులకు లేవనే ప్రచారం ఊపందుకుంది. మైనారిటీలు ఓటు బ్యాంకులుగా మారారన్నారు. ఇవన్నీ ఎప్పటి నుండో చేస్తున్న ప్రచారాలు అయినా వాటి స్థాయి విస్తృతి ఇప్పుడు బాగా పెరిగింది.

అంతర్గతంగా వాజ్‌పాయ్‌కి నానా దేశ్‌ముఖ్‌కి మధ్య విభేదాలు పెరిగాయి. నానాదేశ్ ముఖ్ ఇందిరా గాంధీని పొగుడుతూ, ఆమె వారసుడు రాజీవ్ గాంధీకి మద్దతునివ్వాలని పిలుపునిచ్చారు. ఇది సహజంగానే బిజెపికి ఆగ్రహం తెప్పించింది. ఆర్ఎస్ఎస్‌లో ఒక వర్గం జనసంఘ్‌ని పునరుద్ధరించాలని ప్రతిపాదించారు. బిజెపి అనుకున్నంతగా వేళ్లానుకోలేదు. అందుకు కారణాలు వెదకడం మొదలైంది. కార్యకర్తల సైద్ధాంతిక నైపుణ్యం పునరుద్ధరించాలని ఆర్ఎస్ఎస్‌లో అనేక మంది అభిప్రాయ పడ్డారు. బిజెపి యొక్క లౌకికవాదం పట్ల సానుకూలత, గాంధేయ సోషలిజం వలన దానికి కాంగ్రెస్‌కి మధ్య నున్న తేడా మాసిపోయిందని, అందువలనే బిజెపి కేవలం రెండు సీట్లకే పరిమితమవ్వవలసి వచ్చిందని, అందువలన పూర్వ విధానాలను అవలంబిస్తూ ఆర్ఎస్ఎస్ మరింత బలపడాలని ఎక్కువ మంది అభిప్రాయ పడ్డారు.

చివరికి 1985 మార్చిలో బిజెపి బలపడడానికి అనుసరించవలసిన విధానాలు

అధ్యయనం చేయడానికి ఒక వర్కింగ్ గ్రూప్ నియమించబడింది. అది 1985 జులై 20న 47 పేజీల రిపోర్టు ఇచ్చింది. అందులో 'మనం గనక అధికారంలోకి రావాలంటే కాంగ్రెస్ 1984లో పొందినట్టు 49% కాకపోయినా 1977లో జనతా పార్టీ పొందిన కనీసం 42% ఓట్లు పొందగలగాలి. 10% ఓట్లు అనేక కారణాల రీత్యా అటు ఇటు అవుతాయనుకున్నా మనం అదనంగా మరో 20% నుంచి 25% ఓట్లు అధికంగా పొందాలి. మన సిద్ధాంతం, నిర్మాణం, ఎన్నికల ఎత్తుగడలు వగైరాలను రాబోయే 5 సంవత్సరాలు ఎలా ఉంటాయన్నదానిపైనే ఇది ఆధారపడి ఉంటుందని గమనించాలి. అందుకేం చేయాలని ఆలోచించిన ఎగ్జిక్యూటివ్ కమిటీ, గాంధీ సోషలిజాన్ని పక్కన పెట్టి మళ్ళీ దీన దయాల్ ఉపాధ్యాయ విధానాలను అమలు చేయాలని నివేదికనిచ్చింది. పార్టీ కార్యకర్తలకి శిక్షణా తరగతులు నిర్వహించాలని అభిప్రాయపడింది.

బిజెపి గెలవాలంటే ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు విస్తృతంగా పనిచేయడం తప్పనిసరి. ఏ రాజకీయ పార్టీ గెలవాలన్నా ప్రజల మద్దతు తప్పనిసరి. అది ఎన్నికల సమయంలో ఓట్ల రూపంలో బయటపడుతుంది. ఏ పార్టీ తమ తరుఫున మాట్లాడుతుందని ప్రజలు భావిస్తారో ఆ పార్టీకే ప్రజలు ఓటు వేస్తారు. దీని కోసం ఏం చేయాలి అని బిజెపి తీవ్రంగా మల్లగుల్లాలు పడుతున్నది. మీనాక్షిపురం ఉదంతం చల్లబడిపోయింది. ఈశాన్య రాష్ట్రాలలోని అల్లర్లు పెద్దగా లాభించలేదు. 1981లోని అలీఘర్ ముస్లిం బిల్లు వేడి చల్లారిపోయింది. ముస్లిం మహిళల చట్టం వలన కూడా పెద్దగా ప్రయోజనం పొందలేకపోయారు. అటువంటి క్లిష్ట సమయంలో, బాబ్రీ మసీదు సమస్య, ఏం చేయాలన్న ప్రశ్నకు సమాధానంగా కనిపించింది. బిజెపి 'సైద్ధాంతిక' (మతతత్వం) అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రచారం చేస్తే, అవసరమైనన్ని ఓట్లు సంపాదించవచ్చు అని భావించింది. దీనినే ఆర్ఎస్ఎస్ ఇప్పుడు నొక్కి చెపుతున్నది. ఇది తీవ్రమైన విస్ఫోటం లాంటిది. ఈ విస్ఫోటం, దానిని తయారు చేసిన (కాంగ్రెస్) పార్టీని నాశనం చేసింది; దాని సహాయాన్ని తీసుకున్న పార్టీని (బిజెపి) విద్వేషంతో నిండిన ప్రజా పార్టీగా తయారు చేసింది. భారతదేశ లౌకిక విశ్వాసాన్ని తుత్తునియలు చేసింది; దాని ఫలితం ఈ నాటికీ మనం అనుభవిస్తూనే ఉన్నాం. బాబ్రీమసీదు తాళాలను తెరవాలని నిర్ణయించింది ఇందిరా గాంధీ. దానిని అమలు చేసింది అరుణ్ నెహ్రూ. 1986 ఫిబ్రవరి 1వ తేదీ ఫైజాబాద్ జిల్లా జడ్జి బాబ్రీ మసీదు తాళాలు తెరవాలని ఉత్తర్వు జారీ చేసారు. టీవి కెమెరాలు ముందే విషయం తెలిసినట్టు అక్కడకు చేరాయి. ఈ దోషపూరితమైన చర్య కారణంగా 1992 డిసెంబర్ 9వతేది మసీదు కూల్చివేయబడింది. ఆర్ఎస్ఎస్ పైపైకి ఎగబాకింది. బిజెపి మళ్ళీ పూర్తిగా దాని ఆధీనంలోకి వచ్చి చేరింది. కేంద్రంలో బిజెపి అధికారానికి

వచ్చింది. అన్నిటికన్నా మించి ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ పార్టీగా బిజెపిని కుంచింపచేసింది. రాజకీయాలలో కాస్తంత స్వయం ప్రతిపత్తి ఉన్నట్టు కనిపించినా కార్యాచరణలో గుండు సున్నగా మారింది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారకుడు ప్రధాన మంత్రి అయ్యారు.

ఆర్‌ఎస్‌ఎస్ డిమాండ్ చేస్తున్న ఏ ఒక్క దానిలో విలువ లేదు. 1. మొత్తం వ్యాజ్యంలో మహంత్, 19వ శతాబ్దంలో మసీదు బయట రామ్ చబ్రుత, రాముని జన్మస్థలం ఉండేదని అన్నారు. 2. ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలు రెండు రామజన్మ స్థలం ఎక్కడున్నదీ ఇతమిద్ధంగా చెప్పలేమని ఒప్పుకున్నాయి. 3. ఈ విషయం న్యాయస్థానాల పరిధిలోకి రాదు. 4. సంఘ్ పరివారం ఒక న్యాయ స్థాన నిర్ణయాన్ని గౌరవించదు. 5. అదే కనుక 'జాతి గౌరవ చిహ్నమైతే,' తిలక్ గాని, లాలా లజపతి రాయ్ గాని, గాంధీగాని, మాలవ్య గాని దానిని డిమాండ్ చేసి ఉండేవారు. 6. అంటే తన డిమాండ్‌లను తీర్చుకోడానికి వాస్తవాల ఆధారంగా గాని, చట్ట రీత్యాగాని కాక కేవలం మంద బలంతో సాధించింది.

◆

# రాముని పేరులో దాగున్న శక్తి

1964 ఆగస్టులో ఆర్ఎస్ఎస్ విశ్వహిందూపరిషద్‌ని స్థాపిస్తే, 1989లో అది బజరంగ్ దళ్‌ని స్థాపించింది. బిజెపికి సంబంధించినంత వరకు ఆర్ఎస్ఎస్ రెండింటిని పర్యవేక్షిస్తుంది. 1984 ఏప్రిల్ 7, 8 తేదీలలో జరిగిన ధర్మ సంసద్ బాబ్రీ మసీదును కూల్చివేయాలని నిర్ణయించింది. దీని ప్రధాన లక్ష్యం అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే. ఆర్ఎస్ఎస్‌కి చెందిన అఖిల భారతీయ ప్రతినిధుల సభ మొదటిసారిగా 1987లో ఈ తీర్మానాన్ని అంగీకరించింది. లోక్‌సభకు ముందు బిజెపి అధికారుల పాలంపూర్ తీర్మానం వెలువడింది. హిందూ మెజారిటీ సెంటిమెంటుకి అనుగుణంగా నడుచుకోవాలని, కోర్టు తీర్పులు వగైరా అనవసరమనే వాదన ముందుకొచ్చింది. రామజన్మభూమి సమస్య ఆర్ఎస్ఎస్ నుదిటి రాతను తిరగరాసింది. 1979-89 మధ్యకాలంలో స్వయం సేవకుల సంఖ్య 10 లక్షల నుండి 18 లక్షలకు పెరిగింది. 18800 పట్టణ, పల్లెల శాఖలలో 25000 మంది సభ్యులు చేరారు. 38 సంఘాలు ఏర్పడ్డాయి; అందులో సభ్యత్వం 50 లక్షలకు పెరిగింది. దక్షిణ భారతదేశంలో అద్భుతమైన ప్రగతి సాధించింది. ఒక్క కేరళలోని 12 జిల్లాలోనే 3000 దిన, వారి శాఖలు, 900 వారాంతపు శాఖలు ఏర్పడ్డాయి.

శిలాన్యాస్ కార్యక్రమం విహెచ్‌పి మొదలుపెట్టింది. 2000 జనాభాకి మించిన ప్రతి గ్రామం నుంచి రామమందిర నిర్మాణానికి ఇటుకలు తేవాలని పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమం ఎంతో కచ్చితమైన ప్రణాళికతో రూపొందించబడింది. పంచాయతీ కేంద్రాలు, జిల్లా కేంద్రాలు, రాష్ట్ర కేంద్రాలలో అమలు చేయబడింది.

ప్రచారమంతా విషపూరితంగా సాగింది. చిరునవ్వులు చిందించే రాముని స్థానంలో సాయుధ రాముడు ప్రత్యక్షమయ్యాడు. టీవీలలో రామానంద సాగర్ రామాయణం, బి ఆర్ చోప్రా మహాభారత పురాణాలు ప్రదర్శించడంతో, ఆ పౌరాణిక

గ్రంథాలకు కొత్త రూపాలను ఇచ్చారు. ఇవి ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేసాయి. ఉదాహరణకు టీవీలలో సీరియళ్లను చూడక ముందు అయోధ్య ఎక్కడంటే ఒక ఊరని మాత్రమే ప్రజలు అనుకునే వారు. కానీ, ఆ తరువాత అయోధ్య అంటే యుపిలో ఉన్నదే అన్న భావన ఏర్పడింది. లోఏడ్ ఐ రుడాల్ఫ్, రామాయణ మహాభారతాలు 'ఇది వరకు ఎన్నడూ లేనివిధంగా భారత ప్రజలను హిందూ దేశస్థులుగా గుర్తించబడేటట్టు చేయగలిగాయి,' అన్నారు.

ఆర్ఎస్ఎస్ ఈ పథక రచన సూత్రధారి. అద్వానీ రథయాత్ర బిజెపి ప్రణాళిక కాదు. ఇది ఆర్ఎస్ఎస్ నాయకులందరి సమిష్టి కృషి. ఈ యాత్ర ఉద్దేశం రాజకీయమే కానీ, మతం కాదు. నిజానికి ఇది విఎచ్‌పి చేయాల్సిన యాత్రే అయినా ప్రముఖంగా అద్వానీయే చేసారు. సోమనాథ్ గుడి దగ్గర ఒక ధర్మ ధ్వజం యాత్రకు ముందు ఇవ్వబడింది. అంటే ఒక ధర్మ యుద్ధాన్ని మొదలు పెట్టారన్నమాట. ఆర్ఎస్ఎస్ అదను చూసుకుని అవకాశాన్ని అందిపుచ్చుకుంది. ఓట్లు దండుకోడానికి ఇంతకంటే మంచి అవకాశం రాదని గ్రహించింది. ఆర్ఎస్ఎస్ రాజకీయ ప్రత్యర్థి కాంగ్రెస్. కానీ, మేధావుల దగ్గరి నుండి వ్యతిరేకత ఎదురైంది. ఆర్ఎస్ఎస్ ప్రచారం చేస్తున్న అసత్యాలను ఒక్కొక్కటిగా తప్పని నిరూపించడం మొదలైంది. వామపక్షవాదులు ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) మేధావులు ఈ పని చేసారు. వాదనలను పక్కదారి పట్టిస్తూ దేవరస్ 1986 నవంబర్ 11న గ్వాలియర్‌లో ఒక సమావేశంలో మాట్లాడుతూ, 'రాజకీయ పార్టీలు కోరుకునే ప్రజాతంత్రం, సోషలిజం, లౌకిక వాదం అత్యధికంగా హిందువులు ఉన్న దేశంలో హిందువులంతా ఐకమత్యంగా ఉంటేనే సాధ్యం; హిందువులు మైనారిటీలైతే భారతదేశం కూడా బంగ్లాదేశ్, పాకిస్తాన్, లేదా ఇతర అరబ్ దేశాలలాగా తయారవుతుంది.' అని అన్నారు.

బిజెపి కన్నా విశ్వహిందూ పరిషద్ ఎక్కువ జన సమీకరణాలు చేయగలుగుతున్నదని ఆర్ఎస్ఎస్ గుర్తించింది. అందువలన 'హిందూ గుర్తింపు'కి విశ్వ హిందూ పరిషద్ ఎక్కువగా తోడ్పడింది. వామపక్షాలపై నిరంతరం దాడులు చేయడం వలన వారిని 'ఒంటరిపాటు చేయడం' సాధ్యపడుతుందని, వారు కేంద్రంలో అధికారాన్ని ఎక్కడా భాగస్వాములు కాకుండా చూడాలని ఆర్ఎస్ఎస్ పట్టుపట్టింది.

బిజెపి ఎంతమంది అభ్యర్థులు గెలవడం కాదు ఎంతమంది అభ్యర్థులను నిలబెట్టగలుగుతుందని బిజెపి నాయకులను ఆర్ఎస్ఎస్ ప్రశ్నించింది. ఆర్ఎస్ఎస్ ఇంకెంత మాత్రం పక్క వాయిద్యాలకు పరిమితం కాదలుచుకోలేదు. తన సొంత రాగాన్నే ఆలపించాలనుకుంది. అద్వానీ కూడా ఉత్సాహంగా ఎన్నడూ మాట్లాడని విధంగా హిందుత్వ గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. 'మైనారిటీ కమిషన్‌ని

రద్దు చేయాలని కోరారు. 1980 ఏప్రిల్ 4న భారతదేశ భిన్న సంస్కృతిని కాపాడడానికే కట్టుబడి ఉన్నానన్నాయన,1989 కల్లా భిన్న సంస్కృతిని నొక్కి చెప్పడం అంటే హిందూ ఆత్మతో, భావంతో తెగతెంపులు చేసుకోవడమే' అన్నారు.

హిందూ మహాసభ నాయకుడొకాయన భారతదేశ ముస్లింలు భారతీయులు అవ్వాలంటే ఏం చేయాలో ఒక చిట్టాను చెప్పారు; వారు అరబిక్ పర్షియన్ ప్రాచీన సాహిత్యాన్ని త్యజించాలి; రామాయణ మహాభారతాలు వారి పురాణం గాధలుగా అంగీకరించాలి; రాముడిని కృష్ణుడిని వారి యోధులుగా గుర్తించి చరిత్రలోని ముస్లిం ఆక్రమణదారులను దేశద్రోహులుగా ఒప్పుకోవాలి; హిందువుల ఆహార్యం, సంప్రదాయాలు, చట్టాలు పుట్టుక దగ్గరి నుండి చావుదాకా అనుసరించాలి. అప్పుడు వారి మతం వారు అనుసరించవచ్చు! 'వారి మోక్షం గురించి ఏ మతం అనుసరించినా మాకు అభ్యంతరం లేదు.'

ఆర్ఎస్ఎస్ చూసినంత సంకుచితంగా గాంధీ సంస్కృతిని చూడలేదు. 'భారతీయ సంస్కృతి అంటే, కేవలం హిందూ, ఇస్లాం, లేదా మారే ఇతర సంస్కృతి మాత్రమే కాదు. అంతా కలిసిన సంస్కృతి' అన్నారు. నెహ్రూ తన డిస్కవరీ ఆఫ్ ఇండియాలో భారతదేశంలో, బౌద్ధుడి, జైనుడి ఆలోచనలకు మూలాలు భారతదేశ సంస్కృతిలో ఉంటాయి. అయినా వారు హిందువులు కాదు. ప్రాచీనకాలంలో భారతీయ సంస్కృతి అంటే హిందూ సంస్కృతే. కానీ, ఆ తరువాత విదేశీయుల సాంస్కృతిక ప్రభావం ఈ ఉపఖండంపై ఎక్కువగా పడింది. మొగలుల పాలనాకాలంలో ఇస్లాం ప్రాభవం ఉంది. కానీ, అది భారతీయతే. ముఖ్యంగా ఉత్తర భారత దేశంలో సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, ఆహారం, భవననిర్మాణం, సంప్రదాయాలపై ఇస్లాం ప్రభావం చాలా ఉంది. హిందూ ఇస్లాం కలిసి మిశ్రమ సంస్కృతిగా అవతరించాయి. ఆ సంస్కృతి కేవలం హిందూ సంస్కృతికాదు. కేవలం ఇస్లాం సంస్కృతి కూడా కాదు. అదే అభివృద్ధి చెందిన భారతీయ సంస్కృతి. నిజానికి రెండు సంస్కృతులు కలవడం అంటే సమపాళ్లలో కలవడం అని అర్థంకాదు. ఎక్కడో కేరళ లాంటి చోట క్రిస్టియన్ సంస్కృతి హిందూ సంస్కృతితో పెనవేసుకుపోయింది గాని భారతదేశం అంతటిలో అలా జరగలేదు. భారతీయ సంస్కృతి అంటే అత్యధికభాగం హిందూ సంస్కృతి అని ఒప్పుకోవలసిందే. ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో హిందువేతర సంస్కృతి ప్రభావం చాలా తక్కువ. ఇది మనం ఒప్పుకోకపోతే హిందూ సంస్కృతి అంటే భారతీయ సంస్కృతే అనే వారి ప్రయోజనాలను రుజువు చేసేవారి ఉచ్చులో పడతాం.

ఆర్ఎస్ఎస్ – బిజెపిల 'హిందుత్వకి', 'హిందూ రాష్ట్ర' కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) చెప్పే లౌకిక ప్రజాతంత్ర ఆలోచనలకు పోలికేలేదు. అందువలనే ప్రతిపక్ష

పార్టీలన్నీ కలుస్తున్న సందర్భంలో సిపిఐ (ఎం) నాయకుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ ఒక వ్యాసం విపులంగా రాసారు, 'మేము కమ్యూనిస్టులుగా లౌకిక ప్రతిపక్ష పార్టీలకు ఒక హెచ్చరిక చేయాలనుకుంటున్నాం. మతతత్వ, విచ్ఛిన్నకర శక్తులతో కూటములు, అవగాహనలు, సర్దుబాట్ల పరిణామాలు చాలా తీవ్రంగా ఉండబోతాయి.' అన్నదే ఆ హెచ్చరిక చేసారు. మూడు ముఖ్యమైన అంశాలలో, ఆర్టికల్ 370, బాబ్రీ మసీదు, ఒకే విధమైన పౌర చట్టం 'విషయాలలో ఈ భాగస్వాముల భిన్నత్వం స్పష్టంగా తెలియవచ్చింది....' 'ఆర్ఎస్ఎస్, బిజెపిలు వామపక్ష లౌకిక పార్టీలకు పూర్తిగా భిన్నమైనవి. భారతదేశం 80 కోట్ల హిందువులకు చెందినదని పగలు రాత్రి బోధిస్తున్నారు. ఇతరులు దేశంలో ఉండదలుచుకుంటే హిందువులుగా ఉండాలని, లేకపోతే దేశం విడిచిపోవాలని ప్రచారాలు చేస్తున్నారు. అటువంటి వారితో పొత్తు జనతాదళ్, జాతీయ ఫ్రంట్ మిత్రులు చేసుకుంటే వారి కలయిక జాతి ఐక్యతా ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉంటుందని మేం అంటే, అది విషయాన్ని మరీ పెంచి మాట్లాడడం అని మీరు అనుకుంటున్నారా?' అని ప్రశ్నించారు.

తిరువనంతపురంలో జరిగిన 'మైనారిటీలు, లౌకికవాదం' జాతీయ సదస్సులో ఇఎంఎస్ ఈ వ్యాసానికి కొనసాగింపుగా, 'హిందూ మత పునరుజ్జీవనం అంటే మెజారిటీ మతస్థుల మతతత్వ వాదం. దానిని మోసేది అర్ధ ఫాసిస్టు సంస్థ ఆర్ఎస్ఎస్' అని ఆ సెమినార్లో మాట్లాడారు. అంతేకాదు, 'ఆర్ఎస్ఎస్ ఎటువంటి ఉద్రిక్తలలోకైనా తలదూర్చగలదు. వాటిని మతతత్వ అల్లర్లుగా మార్చగలదు. బిజెపి గనక ఇతరులతో కలిసిగాని, తనంతతానుగాని ప్రభుత్వాన్ని ఏర్పరిస్తే, దేశం విచ్ఛిన్నమవుతుంది.' అని అన్నారు.

నిజానికి రామమందిర ప్రచారం కేవలం ఆర్ఎస్ఎస్ ప్రచారానికి వేసిన ఓ ముసుగు మాత్రమే. ఈ మధ్యకాలంలో ఆర్ఎస్ఎస్ మరో కొత్త ప్రచారం మొదలు పెట్టింది. బాల్ థాకరే 'హిందువునని గర్వించు; మనం హిందువులం; ప్రతి భారతీయుడు హిందువే; హిందువులు మేల్కొంటే భారతదేశం మేల్కొంటుంది.' ఈ ప్రచారం హింసకు దారితీసింది. టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక ఒక పెద్ద సంపాదకీయం రాస్తూ 'అద్వానీ ఇప్పుడు భారత మాతను పట్టుకుని ఎంతగా వెళ్లాడుతున్నారంటే, మహాత్మా గాంధీని జాతిపిత కాదంటున్నారు.' అని రాసారు.

ఈ ప్రచారం సందర్భంగా బిజెపి బాగా లబ్ది పొందింది. నాగపూర్‌లో దేవరస్ 'హిందువుల ప్రయోజనాలను కాపాడే వారికే ఓటు వేయాలని' ప్రజలకు పిలునిచ్చారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు హర్షాతిరేకంతో మునిగిపోయారు.' దీనిని మనం సొమ్ము చేసుకోవాలి' అని నాయకులు అనుకున్నారు. 1992 డిసెంబర్ 6న బాబ్రీ మసీదు

కూల్చి సొమ్ము చేసుకున్నారు. ఆ సందర్భంలో ముంబైలో ఛాంబర్ అఫ్ కామర్స్‌లో మాట్లాడిన 'ఆధునిక' నాయకుడు జస్వంత్ సింగ్, 'నెహ్రూకి సంబంధించిన ప్రతిదీ, ఆర్థిక, విదేశాంగ విధానమేదైనా, వాటిని మనం వ్యతిరేకించవలసిందే.' అన్నారు.

అద్వానీ రథయాత్ర నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని కూల్చేయలేకపోయినా, ఆ తరువాత జరిగిన ఎనిమిది రాష్ట్రాల ఎన్నికలలో బిజెపికి అధిక స్థానాలు తెచ్చిపెట్టింది. బిజెపికి 498, జనతా దళ్‌కి 458 సీట్లు, కాంగ్రెస్‌కి 444 వచ్చాయి. మధ్యప్రదేశ్‌లో, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. 1990 ఆగష్టు 7న విపి సింగ్ ప్రభుత్వం మండల్ కమిషన్ రిపోర్ట్‌ను అమలు చేయడానికి నిర్ణయించుకున్నట్టు ప్రకటించారు. మండల్ కమిషన్ 27% ప్రభుత్వ ఉద్యోగాలు బి.సి లకు కేటాయించాలని సిఫారసు చేసింది.

పీటర్ వాన్ డేర్ వీర్ మాటల్లో, 'బిజెపి రాజకీయ విజయం, మత గురువులతో నిండిన విశ్వహిందూ పరిషద్, ఆర్ఎస్ఎస్ అనే రెండు హిందూ జాతీయోద్యమ సంస్థల మీదే ఆధారపడి ఉంది.'

ఈ రెండు సంస్థలే కాదు. అద్వానీ విజయం వెనక భజరంగ్ దళ్ పాత్ర కూడా ఉంది. ఒక్క యుపిలోనే బజరంగ్ దళ్ కార్యకర్తలు 100000 మంది ఉన్నారని దాని అధినేత వినయ్ కతియార్ తెలియచేసారు. 1988లో బజరంగ్ దళ్ కార్యకర్తలు చేతిలో త్రిశూలాలతో విల్లమ్ములతో, ముస్లింలు అయోధ్య గుడి ప్రాంతానికి రాకుండా అడ్డుకున్నారు. 1990లో అద్వానీ సోమనాథ్ నుండి అయోధ్య వరకు జరిగే రథ యాత్ర సందర్భంగా బజరంగ్ దళ్ వాలంటీర్లు తమ విధేయతకు చిహ్నంగా అద్వానీకి ఒక కప్పు రక్తాన్ని కూడా ఇచ్చారట. ఉజ్జయినీలోను ఆయుధాలను బహూకరించారు. రథయాత్రంతా కత్తుల కఠారుల స్వైర విహారంతోనే సాగింది. కతియార్ 'కొన్ని నిర్మించాలంటే కొన్ని నాశనం చేయాలి' అన్నారు. 1993 బజరంగ్ దళ్ యూనిఫామ్‌లను కూడా రూపొందించుకుంది. 'బజరంగ్ దళ్ ఒక సంస్థ రక్షక దళం' అన్నారు పాల్. ఆర్. బ్రాస్.

ఈ రాజకీయ క్రీడలకు ప్రజల ప్రాణాలు బలయ్యాయి. 1991 స్టేట్ హోమ్ అఫైర్స్ మంత్రి 1990లో 2773 మంది ప్రాణాలు మతతత్వ ఘర్షణలతో బలయ్యాయని పార్లమెంటులో తెలిపారు. రక్తంతో పాటు విద్వేష విషం కూడా ప్రవహించింది.

1991లో చంద్రశేఖర్ ప్రభుత్వానికి రాజీవ్ గాంధీ మద్దతు ఉపసంహరించుకోగానే ప్రభుత్వం పడిపోయింది. వెంటనే ఆయన లోక్‌సభ ఎన్నికలకు మద్దతు కోసం బిజెపి ఆర్ఎస్ఎస్‌ల తలుపులు తట్టారు. ఆర్ఎస్ఎస్ విధించిన ఒకే ఒక షరతు – ఎన్నికలు పూర్తిగా హిందుత్వ పైనే జరగాలని. బిజెపికి 120సీట్లు

దక్కాయి. పివి నరసింహారావు ప్రధాని అయ్యారు. ఆర్ఎస్ఎస్‌కి ఆయనో సవాలు కానే కాదు. పట్టించుకోకపోడం కాదు. గానీ, నిశ్చలంగా ఉండేవారు. వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ఉన్నత మధ్య తరగతి వారు రామమందిర నిర్మాణానికి మద్దతునిచ్చారు. బడుగు వర్గాలు దూరంగా ఉన్నాయని కాదు. ఆర్ఎస్ఎస్ సైనికాధికారులలో కూడా గట్టి పట్టు సంపాదించింది. అధికార యంత్రాంగం తక్కువేం తినలేదు. పోలీస్ అధికారులు, న్యాయవాదులు, అధికారులు, సైనికాధికారులు ఉద్యోగ విరమణ తరువాత ఆర్ఎస్ఎస్‌లో చేరడం ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ మతాన్ని రాజకీయాలలో చొప్పిస్తూనే ఉంది.

1993లో సిబిఐ, ఎల్ కే అద్వానీ, ఎం ఎం జోషి, వి ఎచ్ దాల్మియా, అశోక్ సింఘాల్, వినయ్ కతియార్, ఉమాభారతిలపై కేసు నమోదు చేసింది. 1994 ఆగష్టులో ప్రత్యేక సెషన్స్ కోర్టు మెజిస్ట్రేట్ కేసును స్వీకరించారు. ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి, బజరంగ్ దళ్‌లపై కేంద్రం నిషేధాన్ని విధించింది. ట్రిబ్యునల్ ముందు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, 1967 కింద ఎటువంటి ఆధారాలు చూపారంటే న్యాయ నిర్ణేత కేసును కొట్టేసారు.

1996 సాధారణ ఎన్నికలలో బిజెపి 161 స్థానాలను గెలుచుకుంది. ఈ ఎన్నికలను 'సాంస్కృతిక జాతీయవాదం' ఆధారంగానే బిజెపి ఎదుర్కొంది. ప్రభుత్వం 13 రోజులే ఉంది. కానీ, బిజెపి హిందుత్వ నినాదమే బాగా పనిచేస్తుందని నమ్మకానికి వచ్చింది. బ్రహ్మాండమైన రామమందిరాన్ని నిర్మిస్తామని ఓటర్లకు విజ్ఞప్తి చేసింది.'ఇదే భారత మాతకు మన మిచ్చే నివాళి. ఈ దేశంలోని లక్షలాది ప్రజల కల, వారి మనసులలో నిండి ఉన్నది రాముడే. ఈ ప్రచారమే తమకు ఓట్లు తెచ్చిపెడుతుందని ఆర్.ఎస్.ఎస్ నిశ్చయించుకుంది. హిందుత్వకి మూలమైన సాంస్కృతిక జాతీయవాదం, అంటే, భారతీయ మతం, భాష, నాగరికతల సమ్మేళనం. అదే 'భారత వర్షము' ప్రాచీన భారతదేశం అని నమ్మించగలిగింది. రామజన్మభూమి సమస్య మరింత బాగా ఉపయోగపెట్టుకుంది.

1998లో జరిగిన 12వ లోక్ సభలో బిజెపి 180 సీట్లు గెలుచుకుంది; ప్రాంతీయ పార్టీల మద్దతుతో 250 సీట్లు పొందింది. ఆర్ఎస్ఎస్ ఈ విజయానికి తానే బాధ్యురాలినని గర్వంగా చెప్పుకుంది. బిజెపిలోని ఏ రాజకీయ నాయకుడైనా, అది అద్వానీ అయినా, వాజ్‌పాయ్ అయినా ఆర్ఎస్ఎస్ కనుసన్నలలో మెలిగేటట్టు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూనే ఉంది. బిజెపి పాలిత రాష్ట్రాలలో సహితం ఆర్ఎస్ఎస్‌కి ఎదురులేకుండా చూసుకుంది. 1998లో ఒక 'మేధో మధనం' కార్యక్రమాన్ని ఆర్ఎస్ఎస్ నిర్వహించింది. దానికి బిజెపి అధ్యక్షులు ఖుష్‌భవ్‌థాక్రే

కార్యదర్శులు, వెంకయ్య నాయుడు, గోవిందాచారి, విహెచ్‌పికి చెందిన గిరిరాజ్ కిశోర్, బజరంగ్ దళ్‌కి చెందిన జిబాన్ సింధ్ పోవయ్యా, గురుమూర్తి హాజరయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ నాయకత్వానికి ఏకాస్త విధేయత చూపకపోయినా వారిని తూర్పారపట్టారు. కొంతమంది ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, ఇంతకీ ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిలలో ఎవరిది నాయకత్వం అంటూ కోపంతో సవాలు చేసారు. దారి తప్పిన బిజెపి నాయకులకు తగిన గుణ పాఠాలు చెప్పాలని, బిజెపి నాయకులు హిందుత్వ సిద్ధాంతాన్ని ఏ మాత్రం పలచన చేయకుండా చూడాలని ఆర్‌ఎస్‌ఎస్ ని కోరారు.

1999లో జరిగిన ఎన్నికలలో బిజెపి, దాని కూటమికి 296 సీట్లు వచ్చాయి. ప్రభుత్వాన్ని ఏర్పరచింది. 2000 ఏప్రిల్ 14న సుష్మా స్వరాజ్ 'గుడి ఉద్యమం అంతా' కేవలం రాజకీయపరమైనది. దీనికి మతానికి సంబంధం ఏమిలేదు' అని ప్రకటించింది. 2005లో అమెరికన్ దౌత్యవేత్తతో మాట్లాడుతూ అరుణ్ జైట్లీ, అప్పటి రాజ్య సభ ప్రతిపక్ష నాయకుడు, రాబర్ట్ బ్లేక్‌తో 'హిందూ జాతీయవాదం' అన్నది ఎప్పుడూ బిజెపికి ఒక చర్చనీయాంశంగానే ఉంటుంది; ఇదొక అవకాశవాదం' అన్నారు.

ప్రముఖ సంపాదకుడు భారత్ భూషణ్, ఆర్‌ఎస్‌ఎస్ దాని కుటుంబం, సంఘ్ పరివార్ కార్యక్రమాలను వరుసక్రమంలో పేర్చినందుకు ఎంతో అభినందించారు; ఆర్‌ఎస్‌ఎస్ ఒక్క సంస్థే నిరంతరంగా అతి తక్కువ స్థాయి నుండి రాజకీయంగా సన్నద్ధం చేయడానికి శ్రమిస్తుంటుంది. సామాజిక రాజకీయ జీవితాలను ప్రభావితం చేసే ప్రతి అంశాన్ని స్పృశిస్తుంటుంది. విద్యలో విద్యాభారతి ఈనాడు అతి పెద్ద విద్య సంస్థ. ఇందులో సరస్వతి విద్య మందిర్‌కి 13000 శాఖలు ఉన్నాయి; 75000 మంది అధ్యాపకులు ఉన్నారు, 17 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు; ఆర్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు నడిపే ఆదివాసీ (వనవాసి కళ్యాణ్ ఆశ్రమం). సాహిత్యం (అఖిల భారతీయ విద్య పరిషద్), మేధావులు (ప్రజ్ఞ భారతి, దీన దయాల్ పరిశోధనా కేంద్రం), చరిత్రకారులు (భారతీయ ఇతిహాస సంకలనం యోజన), ఉపాధ్యాయులు (భారతీయ శిక్షణ మండలి, అఖిల భారత రాష్ట్రీయ శిక్షక్ మహాసంఘ్), భాష (సంస్కృతి భారతి), సంస్కృతీ (సంస్కార్ భారతి), గూడేలలో నివసించేవారు (సేవా భారతి, హిందూ సేవ ప్రతిష్టను, స్వామి వివేకానంద మెడికల్ మిషన్, నేషనల్ మెడికోస్ సంస్థ), లెప్రసి వ్యాధి గ్రస్తులు (భారతీయ కుష్టు నివారణ సంఘం), వినిమయదారులు (అఖిల భారతీయ గ్రాహక పంచాయత్), వార్త పత్రికలు, ఇతర ప్రచార మాధ్యమం (భారత ప్రకాశం, సురుచి ప్రకాశం, లోక్ హిత్ ప్రకాశం, జ్ఞాన గంగ ప్రకాశం, అర్చన ప్రకాశం, భారతీయ విచార సాధన, రాష్ట్రోత్తం సాహిత్య, సాధన పుస్తక ప్రకాశం,

ఆకాశవాణి ప్రకాశం) శాస్త్రజ్ఞులు (విజ్ఞాన భారతి), కుల సంరక్షణ (సామాజిక సామ్రాష్ట మంచ్), మతం, మత మార్పిడి (వివేకానంద కేంద్ర, విశ్వహిందూ పరిషద్, హిందూ జాగరణ మంచ్, బజరంగ్ దళ్), పారిశ్రామిక (భారత వికాస్ పరిషద్), న్యాయాధికారులు (అఖిల భారత ఆదివ్యక్త పరిషద్) సిక్స్ (రాష్ట్రీయ సిఖ్ సంగతి), ఎక్స్ సర్వీస్ మెన్ (పూర్వ సైనిక్ పరిషద్), చిన్న పరిశ్రమలకు లగు ఉద్యోగ భారతి, ఏంఆర్ఐ (భారతీయ స్వయం సేవక్ సంఘ్, హిందూ స్వయం సేవక్ సంఘ్, హిందూ సేవా సంఘ్, సనాతన ధర్మ స్వయం సేవక్ సంఘ్, ఫ్రెండ్స్ అఫ్ ఇండియా సొసైటీ ఇంటర్ నేషనల్)... ఈ చిట్టా అనంతం. దీనికి రాజకీయ అనుబంధం గల సంఘాలు (బిజెపి), కార్మిక సంఘాలు (భారతీయ మజ్దూర్ సంఘ్), మహిళా విభాగం (రాష్ట్రీయ సేవిక కమిటి), విద్యార్థి సంఘం (అఖిల భారత విద్యార్థి పరిషద్), ఆర్థిక విభాగం (స్వదేశీ జాగారం మంచ్) అదనం. ఆర్ఎస్ఎస్ కి సంబంధించనంత వరకు ఎవరు అధికారంలోకి వస్తారన్నది ముఖ్యం కాదు. దాని పోషకులు కూడా తగ్గకూడదు. అందుకే అది సమాజంలోని అన్ని రంగాలకు విస్తరించింది.

కాంగ్రెస్‌కి గాని వామపక్షాలకు గాని ఇంత విస్తృతమైన సంఘాలు లేవు. పైగా అవి కేంద్రీకృతంగా ఉండడం వలన సమాజంలో కొత్త కొత్తగా రాజకీయ కేంద్రాలుగా తయారవుతున్న సేవా సంస్థలలో (ఎన్‌జిఓ) పనిచేయడం లేదు. కానీ, ఈ పార్టీలు బతికి బట్టకట్టాలన్నా సమాజంలో హిందుత్వ శక్తుల మితవాదాన్ని మతతత్వాన్ని దునుమాడవలసిందే; సమాజంలోని అన్ని రంగాలలో ఈ శక్తుల సవాలును ఎదుర్కోవలసిందే.'

2000 మార్చ్ 12న మోహన్ భగత్, సుదర్శన్ నుండి కార్యదర్శి బాధ్యతలను తీసుకున్నారు. ఈయన మరింత కరుడుగట్టిన హిందుత్వవాది, గోల్వాల్కర్ ఆలోచనల వారసుడు, 'ఆధునికతను' ఉపయోగించకుండానే ఆర్ఎస్ఎస్‌ని ఆధునీకరిస్తానని ప్రకటించారు. ఆర్ఎస్ఎస్ శాఖలు 45000 పెరిగాయి. పూర్తికాలం కార్యకర్తలు 5000కు చేరారు.

ఆర్ఎస్ఎస్ రాజకీయ జోక్యాన్ని ప్రశ్నించగా ఒక విలేకరికి 'సంఘ్ రాజకీయాలను అస్పృశ్యంగా భావించదు. రాజకీయాలలో ఉన్న మా స్వయం సేవకులకు సంఘ్ అధికారుల పై నమ్మకం ఉంది. ఇదివరకు రాజకీయాలలో స్వయం సేవకులు తక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు వారి సంఖ్య పెరిగింది. స్వయం సేవకులు విభిన్న రంగాలలో పనిచేస్తుంటారు కాబట్టి వారు సంఘ్ అధికారుల దగ్గరికి వారి

సమస్యలను గురించి చర్చించడానికి వస్తుంటారు. అలాగే రాజకీయాలలో ఉన్న స్వయం సేవకులు కూడా.' అన్నారు.

గుజరాత్‌లో బిజెపి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు ఆర్‌ఎస్‌ఎస్ కార్యక్రమాల్లో భాగస్వాములు కాకూడదన్న నియమాన్ని తొలగించింది. అప్పటి కేంద్ర గృహ మంత్రి ఎల్‌కె అద్వానీ, వాజ్‌పాయ్ దానికి మద్దతు ఇచ్చారు. కానీ, అధ్యక్షుడు కెఆర్ నారాయణన్ తీవ్ర అభ్యంతరం చెప్పారు. అయినా గుజరాత్ ప్రభుత్వం నిషేధాన్ని తొలగించింది.

1925లో మొదలైన ఆర్‌ఎస్‌ఎస్ విధానాలు 2019 కూడా కొనసాగుతున్నాయి. అధినేత ఎవరైనా ఆర్‌ఎస్‌ఎస్ విధానం హిందుత్వను రాజకీయ అధిపత్యానికి ఉపయోగించడం. హిట్లర్ ముసోలినీలు కూడా ఫాసిజంని 'ఆధ్యాత్మిక, లేదా సాంస్కృతిక ముసుగుతో కప్పలేదు. కానీ, ఆర్‌ఎస్‌ఎస్ అత్యంత తక్కువ స్థాయిలో 'గాంధేయ సోషలిజం' అన్నా, బాబరీ మసీదు కూల్చేస్తూ 'హిందువుల ఆధిపత్యాన్ని రాముని రూపంలో' చూపినా ఈనాడు 'హిందువులుగా ఉండలేనివారు దేశం వదిలి పొమ్మన్నా' ఉద్దేశం ఒకటే. హిందువులను గుండు గుత్తముగా తమవైపు నిలుపుకుని వారి బలంతో రాజకీయాధికారం సొంతం చేసుకోవాలి, నిలుపుకోవాలి.

# హింసతో మోడీ ఎలా లాభం పొందారు?

**గు**జరాత్‌లో చెలరేగిన హింసను చూసి ఎవరైనా అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్రమోడీకి అది నష్టం చేకూరుస్తుందనుకుంటే వారికి ఆర్‌ఎస్‌ఎస్ గురించి, బిజెపి పై దానికున్న నమ్మకం గురించి తెలియదన్నమాట.

సుప్రీం కోర్టు బెస్ట్ బేకరీ కేసు విచారిస్తూ 'జీవితాలను, సంపదను రక్షించవలసిన వారికి, సరైన విచారణ జరపవలసిన వారికి ఏమాత్రం ఆందోళన ఉన్నట్టు కనిపించడం లేదు. పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు; నిందితుడు దోషా కాదా అని నిర్ధారించడానికి నిష్పక్షపాతంగా న్యాయంగా విచారణ జరపలేకపోతున్నాము. ఆధునిక 'నీరో'లు, అమాయకులైన పసిపాపలు, నిస్సహాయులైన మహిళలు తగలబడిపోతుంటే ప్రేక్షక పాత్ర వహించారు. బహుశ నిందితులను ఎలా రక్షించాలి అని ఆలోచిస్తున్నారేమో! ... కంచె చేను మేస్తుంటే శాంతి భద్రతలు ఎలా ఉంటాయి? న్యాయం ఎలా జరుగుతుంది?' అని ప్రశ్నించింది. దానిని పాలక వర్గం ఏమాత్రం పట్టించుకోలేదు.

ఏ మాత్రం పశ్చాత్తాపపడని ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్‌పిలు మోడీని సమర్థించడంలో తలమునకలయ్యాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చినందుకు కనీసం పశ్చాత్తాపాన్ని ప్రకటించిన వారు ఇప్పుడు ముస్లింలపై ఎదురు దాడికి దిగారు. వాజ్‌పాయ్ ముస్లిములను నిందిస్తే అద్వానీ మోడీకి మద్దతుగా నిలిచారు. అప్పటి వర్కింగ్ అధ్యక్షుడు అశోక్ సింఘాల్, ఢిల్లీలో 2002 అక్టోబర్ 11న 'గుజరాత్‌లో జరిగిందే దేశమంతా జరుగుతుంది. హిందువులు క్యారెట్ల లాగా రాడిష్లలాగా ముక్కలుగా నరకబడడానికే పుట్టలేదు. గుజరాత్ ప్రజలు హిందూకరించబడడం ముస్లింల జిహాద్ పర్యవసానమే.' అన్నారు.

మార్చ్ 17న ఆర్ఎస్ఎస్ అదే విధమైన హెచ్చరికచేసింది. 'అఖిల భారతీయ ప్రతినిధి సభ, ముస్లింల నిజమైన భద్రత మెజారిటీ మతస్థుల సౌహార్ధ్రత పైనే ఆధారపడి ఉందని అర్థం చేసుకుంటే మంచిది' అని హెచ్చరించింది. ఆర్ఎస్ఎస్ దీనివలన రాజకీయంగా లబ్దిపొందడానికే నిశ్చయించుకుంది. మోడీ ఉత్సాహం రెట్టింపైంది. వాజపాయ్ గుజరాత్ వచ్చినప్పుడు కూడా ముందు గోద్రా సందర్శించిన తరువాత బెస్ట్ బేకరీ బాధితులను పరామర్శించారు. అప్పుడు కూడా గోద్రా సంఘటన పథకం ప్రకారం జరిగినదే అని వక్కాణించారు. ఆ తరువాతి గోవా ఎన్నికల ప్రచార సభలో మాట్లాడుతూ, భారతదేశ హిందువులు అనాదిగా లౌకికవాదులే. ముస్లింలను, క్రిష్టియన్లను వారి వారి పూజలు వారిని చేసుకోనిచ్చారు. 'మాకు ఎవరూ లౌకికవాదాన్ని గురించి నేర్పించనక్కరలేదు' అన్నారు. ప్రపంచం అంతా మోడీని అభిశంసిస్తున్న రోజులవి. గుజరాత్‌లోని ముస్లింలు తీవ్రంగా గాయపడి ఉన్నారు. ఇటువంటి సమయంలో కూడా మైనారిటీ ప్రజలను గాయపరిచే వ్యాఖ్యలు చేసినా, వాజ్‌పాయ్ ప్రజాదరణ ఏమాత్రం తగ్గలేదు.

జూలియా రుబిరో ఆనాటి సంఘటనలు గురించి రాస్తూ, 'షా ఆలం కాంపులో 10000 మంది ముస్లింలను తలదాచుకొన్నారు. వారి ఇళ్ళు తగలపెట్టబడ్డాయి, దోచుకోబడ్డాయి; వారి మాన ప్రాణాలు హరించబడ్డాయి. ఇంతటి ఘాతుకం జరిగినా అక్కడున్న అమ్మాయిలు అబ్బాయిలు, ఏమాత్రం చలించకుండా, కేవలం చనిపోయిన వారిని లెక్కించడం మాత్రమే కనిపించింది. బాధితులు న్యాయం జరుగుతుందన్న ఆశను పూర్తిగా కోల్పోయారు. చాలాసార్లు అల్లర్లు జరిగినప్పుడు, రాజకీయ నాయకుల జిత్తులమారి వ్యవహారాలతో న్యాయం జరగదు. కానీ, ఆశ మిగిలి ఉంటుంది. అహమ్మదాబాద్‌లో అలా జరగలేదు. ముస్లిం ప్రజలు ప్రధాన స్రవంతి ప్రజానీకానికి దూరమయ్యారు. వారిది ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి. ఎక్కడికీ వెళ్లలేరు కాబట్టి అక్కడే పడి ఉన్నారు. రెండో విషయం, రాజ్యం కేవలం కల్పించుకోకుండా ఉండడమే కాదు. నరమేధం జరిగేందుకు సహకరించింది. 59 మంది కరసేవకులను హతమార్చిన నిందితులను వెంటాడి పట్టుకునే బదులు రాష్ట్ర ప్రభుత్వం బంద్‌లో భాగస్వామ్యం వహించింది. ముఖ్యమంత్రి అధికారులను పిలిచి, ముందు జాగ్రత్త చర్యలకు మీరంతగా ఉత్సాహాన్ని చూపనక్కరలేదు' అని కూడా ఆదేశాలిచ్చారు. '... ఒక మంత్రిరాష్ట్ర పోలీస్ కంట్రోల్ రూమ్ లోను మరొకరు రాష్ట్ర డిజిపి ఆఫీస్‌లోను కూర్చుని పనులు వారికనుకూలంగా జరిగేటట్టు ఒత్తిడి చేశారు. అన్నిటికి మించి ఎక్కువగా ఆందోళన కలిగించే అంశం, మధ్యతరగతి హిందువుల హృదయాలలో, ఆలోచనలలో మతతత్వ విషం లోతుగా జొప్పించబడింది.'

ఆర్ఎస్ఎస్ మద్దతుతో మోడీ గుజరాత్‌లో, గుజరాత్ ఆత్మగౌరవ యాత్ర అంటూ అమితంగా ప్రచారం మొదలు పెట్టారు. అసత్యాలతో గందరగోళాలు సృష్టించి ఎంతకైనా దిగజారగలవారు మోడీ. సుజాత దత్త మాటల్లో 'గోద్రా ట్రైన్ మారణహోమం నేపథ్యంలో జరిగిన అల్లర్ల వెనక అధికార యంత్రాంగం అండదండలుండడమేకాదు, మోడీ ప్రభుత్వం విహెచ్‌పి, **బజరంగ్** దళ్‌ల దళాలకు తమ పని చక్కపెట్టుకోడానికి 24 గంటలు సమయం కూడా ఇచ్చింది. గోద్రా చర్యకి ప్రతిచర్యగా' అప్పటికప్పుడు మాత్రమే హింస దోపిడీ హత్యలు జరగలేదు; అవి పట్టణాల్లో పల్లెల్లో వారం రోజుల పాటు కొనసాగాయి.

మరోవైపు ఆర్ఎస్ఎస్‌లో ఆంతరంగిక విభేదాలు పెరిగాయి. ముఖ్యంగా, బిజెపికి వాజ్‌పాయ్‌కి మధ్య; బిజెపికి, విఎచ్‌పికి మధ్య; వీరందరూ ఆర్ఎస్ఎస్ ఆజ్ఞలు శిరసా వహించేవారే. ఆర్ఎస్ఎస్ 26, 27 ఏప్రిల్‌లో వాజ్‌పాయ్‌తో కలిపి కొంతమంది ముఖ్యుల సమావేశం ఏర్పాటు చేసుకుంది. బిజెపి అధ్యక్షుడు జానా కృష్ణ మూర్తి పార్టీలో మార్పులు చేసారు. మరింత మంది ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను బిజెపిలోకి తీసుకున్నారు. బిజెపిని 5 భాగాలుగా విభజించి ప్రతి విభాగాన్ని ఒక ఆర్ఎస్ఎస్ ప్రచారక్ అధీనంలో పెట్టారు.

ఆర్ఎస్ఎస్ ఇచ్చిన దన్నుతో మోడీ రెచ్చిపోయారు. సెప్టెంబర్ 7న జరిపిన ఒక సభలో, 'మహాత్ముడు ఆంగ్లేయులను పారదోలేందుకు కృషి చేస్తే వారి వారసులు వారినే తిరిగి తెచ్చుకుని అధికారాన్ని అప్పగించారని ఎద్దేవా చేసారు (సోనియా గాంధీ గురించి ప్రస్తావిస్తూ) ముస్లింలని ఉద్దేశిస్తూ, మీరు మరోమారు కూడా చేతికి వచ్చిన అవకాశాన్ని చేజార్చుకున్నారు. మీకు హిందువులతో సయోధ్యతో ఉండే అవకాశం వచ్చింది. బంధాలు ఎల్లప్పుడూ ఒకవైపు నుండే కొనసాగలేవు; మీ నేరాలన్నిటిని క్షమిస్తూ రెండు మతాల మధ్య సుహృద్భావ వాతావరణం కొనసాగించడం ఎల్లప్పుడూ హిందువుల బాధ్యత మాత్రమే కాదు; బంధం కొనసాగాలంటే ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలి.' అన్నారు.

'రైలులో నరమేధం సృష్టించిన వారు, గోద్రా మున్సిపాలిటీ ఎన్నికలలో బిజెపికి ద్రోహం చేయాలనుకున్నవారే. వారిని కాంగ్రెస్ సత్కరిస్తున్నది. కాంగ్రెస్ ద్రోహులను జైళ్లకు పంపకుండా కాపాడుతున్నది. వారికి ఫలహారాలు సరఫరా చేస్తున్నది' ఇటువంటి మోడీ ఉపన్యాలకు ఆహుతుల నుండి చప్పట్ల వర్షం కురిసేది.

మోడీ చెప్పే అసత్యాలకు అంతేలేదు. అబద్ధాలు చెప్పడంలో దిట్టైన మెకార్థీ కూడా మోడీ ముందు ఓటమిని ఒప్పుకోవలసిందే.

'గోద్రా నరమేధానికి సమాధానం చెప్తాం' అన్న విఎచ్‌పి పిలుపును సమర్థిస్తూ

మోడీ ప్రభుత్వం ఫిబ్రవరి 27న నిర్ణయం తీసుకుంది. ఆ రోజు ముఖ్య మంత్రి మోడీ, గృహ మంత్రి జడాపియా, ఆరోగ్య మంత్రి అశోక్ భట్, విహెచ్‌పి సహాయ కార్యదర్శి జైదీప్ భాయ్, నిర్మాణ కార్యదర్శి అరవింద్ భాయ్ పట్టణంలోనే ఉన్నారు. సబర్మతి ఎక్స్‌ప్రెస్ 6వ పెట్టె తగలబడిన చోట, కలక్టరేట్‌లో, హాస్పిటల్‌లో అనేకసార్లు సమావేశమయ్యారు. అయితే అవేవీ అధికారికమైనవి కావు. నిర్ణయాలు ఎప్పటికప్పుడు అధికారులకు అందేవి. సంఘటన జరిగిన తరువాత విహెచ్‌పికి పగ తీర్చుకునేందుకు కావలసినంత సమయం ప్రభుత్వం ఇచ్చింది. అంతేకాదు, ఇంకో ముఖ్యమైన గమనించ దగ్గ విషయం; మెహెశాన జిల్లాలో 33 సజీవంగా తగలపెట్టబట్టారు; అదే జిల్లాలోని దిస్‌నగర్‌లో మరో 11 మంది సజీవ దహనం చేయబడ్డారు. అక్కడి పబ్లిక్ ప్రాసిక్యూటర్ దిలీప్ త్రివేది ఆరేళ్ళు విఎచ్‌పి రాష్ట్ర కార్యదర్శిగా పనిచేసినవాడు. అలాగే నిరోధ పాటియా, గుల్మార్గ్ సొసైటీ కేసులలో 140 సజీవదహనం చేయబడ్డారు. ఈ కేసు వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ చేతన్ షా విఎచ్‌పి అడ్వకేట్‌లలో ఒకరు. పంచమహల్స్ జిల్లాలో దాడులకు 121 మంది బలయ్యారు. అక్కడ కేసు వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎచ్‌పి అధ్యక్షుడు. పియూష్ గాంధీ; ఆనంద్ కైరా జిల్లాలో జరిగిన దాడుల కేసులు వాదించినాయన పిఎస్ దొర, ఆర్‌ఎస్‌ఎస్, విహెచ్ పిల మద్దతుదారునిగా ప్రజలందరికి తెలిసినవారు. ఇటువంటి పరిస్థితిలో కేసుల ఫలితాలు ఎలాగుంటాయో ఎవరైనా సులభంగా ఊహించవచ్చు.

గుజరాత్‌లో పరిస్థితి ఇలా ఉంటే విహెచ్‌పి రామమందిర నిర్మాణానికి సన్నాహాలు చేయడంలో తలమునకలుగా ఉంది. ఆర్ ఎస్ ఎస్ బిజెపిని పాదాక్రాంతం చేసుకోడానికి చేయని కృషి లేదు. ఆర్‌ఎస్‌ఎస్, పత్రిక పాంచజన్యం వాజ్‌పాయ్ ప్రభుత్వాన్ని తూర్పారపట్టింది. 2002 అక్టోబర్ 8న ప్రభుత్వం' అన్ని రంగాలలోను విఫలమైందని,' విమర్శలను ఆహ్వానించలేని ప్రభుత్వం చెత్తబుట్టలోకి పోతుందని, బిజెపి నేతలు ఆర్‌ఎస్‌ఎస్ భుజాలనెక్కి అధికారానికి చేరారని ఎత్తిపొడిచింది. 'ఆర్‌ఎస్‌ఎస్‌తో దగ్గరి సంబంధాలున్న ఒక సీనియర్ మంత్రి' ఆర్‌ఎస్‌ఎస్ అన్ని విషయాలలోను కల్పించుకోడం పెద్ద ఇబ్బందికరంగా ఉంది. వారిని సంప్రదించ కుండా మేమేపని చేయలేకుండా ఉన్నాం' అని వ్యాఖ్యానించారు. వాజ్‌పాయ్ ఆర్‌ఎస్‌ఎస్‌ని మెప్పించడంలో తలమునకలుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆర్‌ఎస్‌ఎస్ వ్యక్తులు కింది నుండి పైదాకా అన్ని స్థానాలలోను చేరిపోయారు.

2004లో పరాజయం బిజెపిని ఆశ్చర్యానికి గురిచేసింది. అనుకున్న విధంగానే, ఈ ఓటమి బిజెపి పై ఆర్‌ఎస్‌ఎస్ పట్టు మరింత పెంచింది. కొత్తగా ఆరుగురు

క్షేత్రీయ సంఘటన మంత్రుల పేరుతో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను బిజెపి రాజకీయాలలో పని చేసేందుకు దించింది.

విహెచ్‌పి, బజరంగ్ దళ్‌ల హత్యాకాండని గిరిరాజ్ కిషోర్ 'హిందూ సమాజ జాగృతి'గా అభివర్ణించారు. అశోక్ సింఘాల్, ఢిల్లీలో జరిగినట్టే గుజరాత్‌లో మళ్ళీ జరుగుతుందని అన్నారు. కెపి ఎస్ గిల్, ఢిల్లీకి బయలు దేరుతూ 'రాజకీయ నాయకులే పునరభ్యసించవలసి ఉంది' అన్నారు.

సంఘ్ బలం చూసుకుని మోడీ రెచ్చిపోయారు. 'మనం సహాయ శిబిరాలను ప్రారంభించుకోవాలా? పిల్లలను తయారు చేసే కేంద్రాలు తెరుచుకోవాలా?' అంటూ రంకెలేశారు. ఒకవైపు సాక్ష్యాలన్నీ ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి వైపు చూపిస్తుంటే, విహెచ్‌పి రామ మందిర నిర్మాణంలో బిజీగా ఉంది. ఆర్ఎస్ఎస్ బిజెపిని కట్టడి చేసే పనిలో ఉంది. బిజెపి ఎట్టి పరిస్థితులలోను విహెచ్‌పి ని దూరం చేసుకోకూడదని, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలను ప్రభుత్వంలో మూలాల నుండి నింపివేయాలని,' కీలక సమస్యలపై తప్పనిసరిగా తమతో చర్చించే నిర్ణయాలు తీసుకోవాలని ఆదేశాలు జారీ అయ్యాయి. బిజెపిలో ఆర్ఎస్ఎస్, విహెచ్‌పిల జోక్యంపై నాయకులలో వాదోపవాదాలు జరుగుతున్న ప్రతిసారీ ఆర్ఎస్ఎస్ తనమాట నెగ్గించుకుంటూనే ఉంది. వెంకయ్య నాయుడు, వాజ్‌పాయ్‌ని వికాస పురుషుడని, అద్వానీని లోహ పురుషుడని స్తుతించగానే సుదర్శన్ గారు, వెంకయ్య గారు 'సిద్ధాంతం' పై, 'సూత్రాల'పై దృష్టి ఎక్కువగా పెట్టి వ్యక్తుల మీద తక్కువ దృష్టి పెట్టడం మంచిదని, ఏ రకమైన వ్యక్తి ఆరాధనైనా నివారించవలసినదే అని హెచ్చరించారు.

మరో వైపు మోడీ గారు ఆర్ఎస్ఎస్‌కి నిశ్శబ్దంగా చేరువవుతూ వచ్చారు. వాజ్‌పాయ్ తరువాత ఆ పదవిని చేపట్టగల వ్యక్తిగా పేరు తెచ్చుకున్నారు. ఆర్ఎస్ఎస్ నమ్మకాన్ని పొందారు.

మోడీగారు కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా, సోనియా గాంధీకి వ్యతిరేకంగా పేలుతున్న అవాకులు చవాకులు ప్రముఖంగా ప్రచారం పొందుతున్నాయి. 'పార్లమెంటు నుండి అత్యాచారాలు చేసిన వారిని, హత్యలు చేరిన వారిని, గృహదహనాలు చేరిన వారిని పారదోలాలని పిలుపునిచ్చారు. సుదర్శన్ ఎప్పటి నుండో అనుకుంటున్న పనిని ఆచరించారు. 2004 ఏప్రిల్‌లో అద్వానీ, వాజ్‌పాయ్ వారి పదవులకు రాజీనామా చేయాలని సుదర్శన్ సూచించారు. ఆర్ఎస్ఎస్‌ని బహిరంగంగా విమర్శించే సాహసం ఎవరూ చేయలేకపోయారు. 2004లో బిజెపి ఎన్నికలలో ఓటమి ఆశ్చర్యాన్ని కలిగించింది. ముఖ్యంగా అద్వానీ ఓటమి ఊహించలేనిది. అద్వానీకి ఆర్ఎస్ఎస్ చుట్టూ తిరగక తప్పలేదు. 2004 అక్టోబర్‌లో అద్వానీ బిజెపి అధ్యక్షుడయ్యారు;

హిందుత్వ పంథాను అనుసరించడం మొదలుపెట్టారు. సుదర్శన్ మాత్రం ఏమాత్రం మెత్తబడలేదు. ఆర్ఎస్ఎస్ యువ రక్తమే ఉండాలన్న పట్టు విడువలేదు. బిజెపి తలొగ్గక తప్పలేదు. వారి ఆదేశాల మేరకు 'మౌనం' పాటించవలసి వచ్చింది.

మరో ఆర్ఎస్ఎస్ నాయకుడు, ఎస్.గురుమూర్తి 'లౌకిక రాజ్యంలో హిందువులకు ఎన్నడూ న్యాయం జరగదు' అన్నారు. 'లౌకిక వాదులు ఆంగ్లంలో చదువుకున్నవారు భారతదేశానికి తీరని నష్టం కలిగించారు' అన్నారు. ఇక ఆర్ఎస్ఎస్ అధిపతి సుదర్శన్' ఆంగ్ల సంస్కృతి మన పిల్లలకు స్వలింగ సంపర్కం, స్వేచ్ఛాయుతంగా లైంగిక వాంఛలు తీర్చుకోడం నేర్పిస్తాయి. పశ్చిమ దేశస్థులకు అవి అభ్యంతరాలు కావు.' అంటూ సెలవిచ్చారు. 'అక్షర జ్ఞానం నేర్పడం దగ్గరి నుండి పరిశోధనల వరకు ప్రతి విద్యాబోధన భారతీయ భాషలలోనే ఉండాలని ప్రజలు డిమాండ్ చేయాలి'. ఆంగ్లాన్ని ఒక విదేశీ భాషగా పరిగణించాలి. ఆంగ్ల భాషలో అత్తా, పిన్నమ్మ, అమ్మమ్మ, బామ్మ, మామ, చిన్నాన్న, వంటి పదాలకు ప్రత్యేకమైన పదాలే లేవు. (చాలా ఆంగ్ల పదాలకు తెలుగు పదాలు లేవు అన్న విషయం మనం గుర్తించకూడదు!). అమ్మ, నాన్న, కొడుకు, కూతురు, భర్త, భార్య, ... వంటివాటికి తప్ప అంతకు మించి పదాలు లేవు.' అన్నారు. అంతేకాదు, ఆంగ్లేయులు తామర తూట్ల వంటి చేతులు, ముఖ పద్మం, కలువల వంటి కనుదోయి, పాదపద్మాలు అనే వర్ణనలను ఎలా చేస్తారు? మనం మన భాషలన్నిటిలో గిరిధర గోపాలుడంటే తెలుసుకోగలం. అదే ఆంగ్లంలో అయితే కొండను ఎత్తిన, గోవును పట్టిన అనాలి! మరి అటువంటప్పుడు ఆంగ్లేయులకు ఏమర్థమవుతుంది?' – ఇలా సాగాయి ఆయన మాటలు.

అందుకే మోడీ వేదకాలంలో ప్లాస్టిక్ సర్జరీ జరిగిందని చెప్పుకొచ్చారు. 2005 ఫిబ్రవరి 13వ తేదీ ఆర్గనైజర్ పత్రికలో ఒక పేజీ అంతా 'ప్రాచీన కాలంలో హిందువులు వాయు ప్రయాణం ఎలా చేసేవారో' తెలియచేసేందుకు కేటాయించారు. హిందూ పునరుజ్జీవనం ముస్లిములను క్రిష్టియన్లను తక్కువ చేయడానికి, ఒక్క చరిత్ర వరకే పరిమితం కాలేదు. మొత్తం ఆధునిక ఆలోచనలుగల ప్రతి అంశానికి వ్యాపించింది.

కరాచీలోని సెయింట్ పాట్రిక్స్ లాంటి పశ్చిమదేశాల స్కూళ్లలో చదువుకున్న లాల్ కృష్ణ అద్వానీ, లాంటి వారిపై దాడి జరగకపోవడం విడ్డూరమే మరి. మనం ఒక విషయాన్ని స్పష్టంగా నిర్మొహమాటంగా ప్రశ్నించాలి. ఇటువంటి నాయకులకు హిందువులలో ఉన్నత చదువులు చదివినవారు ఎలా మద్దతునిస్తారు? వారి అనుమానాలన్నిటిని పాతిపెట్టి ఇటువంటి చెత్తను కౌగలించుకునేందుకు ప్రోత్సహిస్తున్న పరిస్థితులేంటి?

◆

# అద్వానీ కథ

'ఎన్నడూ చర్చకు రాని ఆ అంశమే,
అతిగా ఆమెను బాధించింది'.
ఫైజ్ ఫైజ్ కవిత్వంలోని మరపురాని పద్య పంక్తులు అవి.
ఆర్ఎస్ఎస్ దాని రాజకీయ అనుబంధ సంస్థ బిజెపితో వ్యవహరించే తీరు ఇదే.

సైద్ధాంతికంగా ఆర్ఎస్ఎస్‌లో శిక్షణపొందిన అద్వానీ, ఆర్ఎస్ఎస్ పెద్దల గొణుగుళ్ళను లెక్కచేయకుండా, తన గూడు చక్కబెట్టుకోవడం ప్రారంభించారు. బాబ్రీ మసీదు కూల్చివేసినందుకు విచారాన్ని వ్యక్తం చేసారు. ఇది చాలదూ, తమను విస్మరించాడని ఆర్ఎస్ఎస్ నాయకులు భావించడానికి. మనసులో ఏమున్నా మధ్యేవాదునిగా, వాజ్‌పాయ్ వారసునిగా నిరూపించుకోవాలనుకుని అలా మాట్లాడారు. నాగ్‌పూర్‌పై దాని ప్రభావాన్ని అంచనా వేయలేకపోయారు. పైగా అదో అబద్ధం. అద్వానీ కూల్చివేతలో పాల్గొన్న దృశ్యమాలిక ఉండనే ఉంది. 1994 ఆగష్టు 27న ప్రత్యేక జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ అద్వానీ పై అభియోగాలకు ప్రాథమిక ఆధారాలు ఉన్నట్టు నిర్ధారించారు. ఈ కథ ఎప్పటికీ కంచికి చేరనే లేదు. అదే ఏడు జూన్ 4న అద్వానీ కరాచీ వెళ్లారు. అక్కడ మహమ్మద్ ఆలీ జిన్నా స్మారక చిహ్నం దగ్గర అతిధుల పుస్తకంలో 'చరిత్రలో చాలామంది తమదైన ముద్ర వేస్తారు. కానీ, కొంతమందే చరిత్ర సృష్టిస్తారు.' అని రాసారు. జిన్నాకు 'గౌరవ వందనాలు సమర్పించారు'. ఆ తరువాత కరాచీ కౌన్సిల్ ఆన్ ఫారిన్ రిలేషన్స్, ఎకనామిక్ అఫైర్స్‌లో పాల్గొన్న ఒక కార్యక్రమంలో కూడా జిన్నాను పొగిడారు. కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. కానీ, ఆర్ఎస్ఎస్ అధినాయకుల అసంతృప్తి పెరిగింది. అంతే.. నిజంగానే ఆయనలా అనుకుంటే రథయాత్ర ఎందుకు నిర్వహించినట్టు అంటూ అశోక్ సింఘాల్ గర్జించారు.

7వ తేదీ అద్వానీ రాజీనామా చేయవలసి వచ్చింది. ప్రతిపక్ష నాయకుడుగా మిగిలారు.

నరేంద్రమోడీ మౌనంతో చెవులు చిల్లులుపడ్డాయి. బిజెపి పార్లమెంటరీ పార్టీ అద్వానీని వెనకేసుకొచ్చింది. ఆర్ఎస్ఎస్ దాడి చేసింది. జిన్నాని లౌకిక వాది అనడం అంటే రావణాసురుడిని మంచి వాడనడమే.' అన్నారు సుదర్శన్. అద్వానీ పై చర్యని నిలిపివేయాలని సుష్మ స్వరాజ్, జాస్వంత్ సింగ్ వంటి నేతలు వేడుకున్నా విలువ లేకుండాపోయింది. నీనా వ్యాస్ అప్పటి ఉదంతాన్ని వివరిస్తూ ' .... బిజెపి, తాము ప్రజలకు, పార్లమెంటుకు జవాబుదారులం కాదు. కేవలం తామే ఉత్తమమైన దేశభక్తులమని, ఉత్తమమైన జాతీయవాదులమని తమకే దేశానికీ ఏది మంచో ఏది చెడో తెలుసుననుకుని భ్రమపడే గుప్పెడు మనుషులకు మాత్రమే జవాబుదారీ. ఆర్ఎస్ఎస్ భారత రాజ్యాంగాన్ని ఎన్నడూ ఒప్పుకోలేదని గుర్తుంచుకోండి. బిజెపి ఎన్నడైనా అధికారంలోకి వస్తే, ఏనాడూ ఎన్నికవని ఆర్ఎస్ఎస్ నాయకులు పాలిస్తారని, ఈనాడు మనం అనుభవిస్తున్న ప్రజాస్వామ్యం ఒకనాటి మాటగా మిగిలి పోతుంది.' అని రాసారు.

ఆర్ఎస్ఎస్ భారతదేశానికి దాపురించిన ప్రమాదం. అద్వానీగారు కళ్ళెదురుగా ఉన్నదానిని స్పష్టంగా పెద్ద అక్షరాలతో కనిపిస్తున్న దానిని చూడడానికి నిరాకరించారు. జూన్ ఆరోతేదీ సాయంత్రం అద్వానీ పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చారు. తనను కలిసిన బిజెపి నాయకులకు అద్వానీ రాజీనామా చేయవలసినదే అని మొహన్ భగత్ స్పష్టంగా చెప్పారు. జూన్ 7వ తేదీ అద్వానీ రాజీనామా లేఖను సంజయ్ జోషీకి సమర్పించారు. జూన్ ఎనిమిదిన బిజెపి పార్లమెంటు బోర్డు సమావేశమై అద్వానీ రాజీనామాను ఆమోదించడం లేదని తెలిపింది. కానీ, ఇది కేవలం అద్వానీ పరువు కాపాడుకోడానికే అద్వానీ పార్టీ అధినాయకునిగా, త్వరలో తప్పుకుంటారనే అవగాహన, అందులో ఇమిడి ఉంది. ఎంతటి నాయకుడైనా ఆర్ఎస్ఎస్ కంటే ఎదగడాన్ని ఆర్ఎస్ఎస్ ఎన్నడూ సహించదు. నిజానికి వాజ్‌పాయ్, అద్వానీలను ఆర్ఎస్ఎస్ వదిలించుకోవాలని అనుకుంటున్నది.

ఆర్ఎస్ఎస్ దృష్టిలో 2002 ముస్లింలకు వ్యతిరేకంగా గుజరాత్ అల్లర్లు చేయించిన మోడీ ఉన్నారు.

నిజానికి అద్వానీపై జాలి చూపాల్సిన పని లేదు. ఈ మనిషే నిసిగ్గుగా అధికారం కోసం, ప్రధాని పదవి కోసం రాజకీయాలలో మతతత్వాన్ని జొప్పించారు. మానవ రక్తంపై రథాన్ని నడిపించారు. మోడీ జారిపోతే తనకవకాశం వస్తుందని ఇప్పటికీ నమ్ముతున్నారు. బాబ్రీ మసీదు కూలగొట్టగానే ఆనంద హేలలో 'ఇకపై హిందువుల హక్కులను కాపాడే వారే పాలిస్తారని' అనలేదా!

పాకిస్తాన్‌లో నివసిస్తున్న మైనారిటీ హిందువుల హక్కులు రక్షించబడాలని అద్వానీ జిన్నాను లౌకికవాదిగా పొగిడి ఉండవచ్చు. పాకిస్తాన్ ఎలా ఉండాలనుకుంటున్నది జిన్నా ఇష్టం. భారతదేశాన్ని మత ప్రాతిపదికన విభజించడాన్ని బిజెపి వ్యతిరేకిస్తుంది. పాకిస్తాన్‌ని సాధించడానికి మతతత్వాన్ని జిన్నా రెచ్చగొట్టారన్నదానిలో ఎటువంటి సందేహాలు లేవు. దానివలన లక్షలాది మంది అమాయక ప్రజలు బలయ్యారు. కోట్లాది మంది నిరాశ్రయులయ్యారు. తమ జీవనాన్ని కోల్పోయారు.

ఈ పాపం ఖండించబడింది, పాపాత్ముడు నిర్దోషిగా బయటపడ్డాడు. 2005 సెప్టెంబర్ 18న అవమానకరంగా పార్టీ అధ్యక్ష పదవి నుండి తొలగించబడినప్పుడు ఆర్ఎస్ఎస్ జోక్యం అంటూ రాగాలు తీస్తే లాభం లేదు. బిజెపి నడిచేది ఆర్ఎస్ఎస్ శాసనాల మేరకే. అదో స్వతంత్ర పార్టీ కానేకాదు. ఆర్ఎస్ఎస్ రాజకీయ విభాగం. బిజెపి ఆర్ఎస్ఎస్ అధినాయకుడిని ఎప్పుడైనా తొలగించగలదా..?

◆

# విజయోత్సాహంలో ఆర్ఎస్ఎస్

**బి**జెపిలోని బలమైన నాయకులందరినీ వారి వారి స్థానాలలో పెట్టిన తరువాత, ఆర్ఎస్ఎస్ ఏ రకమైన రాజీలు పడాల్సిన అవసరం లేకుండా పార్టీని నడిపే స్వేచ్ఛను పొందింది. రెండో తరం నాయకులంతా తాము చెప్పినట్టు అనుసరించేవారే.

బిజెపి స్వర్ణోత్సవాల సందర్భంగా ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్‌లో,' (బిజెపి) భారతదేశంలో ఒక శక్తిగా పార్టీ నిజమైన అభివృద్ధిని సాధించింది రామజన్మభూమి ఉద్యమం తరువాతే; ఆ సందర్భంలోనే ఒక సైద్ధాంతిక చర్చ జరిగింది; కులాలకు, ప్రాంతాలకతీతంగా, పట్టణాలు పల్లెల అన్న భేదం లేకుండా ప్రజలు పార్టీ పట్ల ఆకర్షితులయ్యారు. అదొక సృజనాత్మక కార్యక్రమం. మహిళలు, గిరిజనులు వచ్చి చేరారు. మేధావులు, సోషలిస్టు లౌకిక నినాదాలకు నిజమైన ప్రత్యామ్నాయాలు వెతుక్కుంటున్నవారు అటు ఇటు తేల్చుకోలేకపోతున్నవారు, బిజెపిలో ఒక ప్రత్యామ్నాయాన్ని చూసారని రాసుకుంది.

బిజెపి లాంటి పార్టీలకు కేవలం అధికారం లక్ష్యమయితే, అవి బతికి బట్టకట్టలేవు. అధికారం లక్ష్యమే అయితే వ్యక్తుల మధ్య ఘర్షణలు తప్పవు. ఇప్పుడు బిజెపి పాలిత రాష్ట్రాలలో జరుగుతున్నదదే. ఈ నాయకులకు సిద్ధాంతాలతో నిమిత్తం లేదు. కానీ, నాయకుల సైద్ధాంతిక నిబద్ధతే పార్టీలో చురుకుగా పనిచేయడానికి, పోరాటాలు చేయడానికి త్యాగాలు చేయడానికి కార్యకర్తలను ఉత్తేజపరుస్తుంది. సమర్థులైన నాయకులు ఈ రెండు భాగాలను సమన్వయము చేసుకోవాలి. కార్యకర్తలు ఎప్పుడూ నాయకుల చుట్టూ తిరుగుతూనే ఉంటారని నమ్మడం ఆత్మహత్యా సాదృశ్యం.

రాజనాథ్ సింగ్, బిజెపి అధ్యక్షునిగా ప్రమాణ స్వీకారం చేయగానే సైద్ధాంతికంగా తనేమాత్రం తగ్గనని ఆర్ఎస్ఎస్ అధినాయకులకు హామీ ఇచ్చారు. తనముందున్న ప్రధాన కర్తవ్యం పార్టీ పునాదిని విస్తృతపరచడం అన్నారు. భారతదేశ ఐక్యత కేవలం

రాజకీయాల మీదే ఆధారపడి లేదు. సంస్కృతి పైన కూడా ఆధారపడి ఉంది. సాంస్కృతిక జాతీయవాదానికి, హిందుత్వకి ఒకే మూలం. హిందుత్వం ఎప్పుడు మనుషుల మధ్య ఘర్షణను సృష్టించదు. ఏమైనప్పటికీ 'మేమందరం సంఘ్ కార్యకర్తలం' అన్నారు. అంతేకాదు, ఆజ్ తక్ పత్రికకు ఇచ్చిన ఒక ముఖాముఖిలో ఆర్ఎస్ఎస్ ఎప్పుడూ బిజెపి వ్యవహారాలలో తల దూర్చదు. ఆ కుటుంబం నుంచి వచ్చినవాడిని కాబట్టి నేనే వారి దిశానిర్దేశం కోరుతుంటాను. 'అందుకు నేను సిగ్గుపడడం లేదు; సంశయించడం లేదు. అంతేకాదు, ఆర్ఎస్ఎస్ పూర్తికాలం కార్యకర్తలను మరింత మందిని పార్టీ కేంద్ర కమిటీలోకి ఆఫీస్ బేరర్లగా తీసుకుని పార్టీని పటిష్ట పరుస్తామని' అన్నారు.

ఇప్పుడు ఆర్ఎస్ఎస్ ఆధునికతను సంతరించుకుంది. వారి నాయకులు ఫైవ్ స్టార్ హొటళ్లకే వెళ్తున్నారు. 2006 జనవరిలో జైపూర్‌లో జరిగిన మేధోమదనానికి వాజ్ పాయ్, అద్వానీలు హాజరుకాలేదు. మురళీమనోహర్ జోషి, సుష్మా స్వరాజ్, వెంకయ్య నాయుడు, ప్రమోద్ మహాజన్, అర్జున్ జైట్లీలు మాత్రమే హాజరయ్యారు. అద్వానీని తొలగించిన తరువాత ఆర్ఎస్ఎస్ బిజెపి పై తిరిగి పైచేయి సాధించింది. '2011 కల్లా ప్రపంచం అంతా 'భారతీయకరణ' జరుగుతుందని, భారతదేశం ప్రపంచాన్ని ఏలుతుందని' చెప్పుకొచ్చారు. భారతదేశంలో నివసిస్తున్న 17 కోట్ల మంది ముస్లింలు, 3 కోట్ల మంది క్రిష్టియన్లు హిందువులుగా మార్చాల్సిన అవసరం ఉందని శబరీ కుంభమేళాలో రెండో రోజు సుదర్శనం అన్నారు. '2011 నాటికి సంక్రమణల కాలం చెల్లిపోతుంది. మనకుగా మనమే నాయకత్వంలోకి వస్తాం. ముస్లింలను. క్రిష్టియన్లను సముద్రంలోకి తోసేయలేం కాబట్టి వారిని హిందువులుగా మార్చాలి. అందుకోసం వారికి హిందూ మత ప్రాధాన్యతను వివరించాలి; వారణాసిలో ఉండే వారికి, 'వారు హిందువులకు దూరపు చుట్టాలని' చెప్పాలట! ఒక గిరిజన కూటమిని ఉద్దేశించి మాట్లాడుతూ, ఫిబ్రవరి 12వ తేదీ, క్రిష్టియన్లు, హిందువులు, ముస్లిములకు వ్యతిరేకంగా 'సంఘటితంగా పనిచేయాలని' ప్రవీణ్ తొగాడియా మరో పిలుపునిచ్చారు.

ఆర్ఎస్ఎస్‌కి విధేయులుగా ఉన్న హిందుత్వ వాదులు ఉన్నత పదవులు పొందారు. ఏమాత్రం ఎదిరించినట్టు కనిపించినా వెనక్కు నెట్టబడ్డారు. అందుకే గుజరాత్ ముఖ్య మంత్రి నరేంద్ర మోడీ, బజరంగ్ దళ్ నాయకుడు వినాయకటియర్, లాంటి దృఢమైన హిందుత్వవాదులు కీలకమైన పదవులు పొందారు. మోడీ గుజరాత్‌ని వదిలిపోవాలన్న ఉద్దేశంలో లేనప్పటికీ, కేంద్ర పార్లమెంటరీ పార్టీ బోర్డుకు తీసుకొస్తే, కతియార్ని ప్రధాన కార్యదర్శిని చేసారు. మితవాదిగా కనిపించే ప్రయత్నం చేసిన

అద్వానీని వెనక్కుపెట్టారు. అద్వానీతో తగాదా పడిన మదన్‌లాల్ ఖురానా బిజెపి జాతీయ అధ్యక్షుడయ్యారు.

ఎంతో చదువుకున్నవారు, ఆధునిక భావాలున్నవారు, చరిత్రలో మంచి పట్టు ఉన్నవారు కూడా ఆర్‌ఎస్‌ఎస్ లాంటి మితవాద సంస్థకి ఎందుకు మద్దతునిస్తున్నారో అని ఆశ్చర్యంగా ఉంటుంది. ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి, మోహన్ భగత్, 'హిందువుల జనాభా తగ్గుతుండడం వలనే ప్రపంచవ్యాప్తంగా తీవ్రవాదం పెరిగిపోయింది. ఆఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, మయన్మార్, టిబెట్‌లలో తీవ్రవాదం పెరగడానికి కారణం వారు భారతదేశం నుండి విడిపోవడమే.... అన్ని ప్రాంతాలలో అన్ని వైపుల నుండి హిందువుల మీద దాడులు పెరిగిపోతున్నాయి. ఇక 2006 జులై 10వ తేది సుదర్శన్ ప్రసంగం ఇలా కొనసాగింది: పశ్చిమ దేశాలకు, జిహాద్‌ని అమలు చేస్తున్న ముస్లింలకు మధ్య సంబంధాలు అత్యధమస్థాయికి చేరినందువలన వారి మధ్య అణు యుద్ధం రాకతప్పదు; ఆ తరువాత 73 వేర్వేరు ముస్లిం గ్రూపులకు పుట్టినిల్లైన భారతదేశం ప్రపంచానికి శాంతి నిలయంగా, ప్రపంచ శక్తిగా మారుతుంది. ... 'వర్ణ వ్యవస్థ పట్ల ఆయన బాహాటంగా ప్రకటించిన అభిప్రాయాలు ఎందరినో ఆశ్చర్యానికి గురిచేశాయి. 'చారిత్రికంగా చూసినప్పుడు కుల వ్యవస్థ వలన ఉద్యోగ భద్రత ఉంటుంది. సమాజంలో వారి వారి స్థానాలు ప్రతివారికి తెలుస్తాయి కాబట్టి ఘర్షణలు ఉండవు'. 'ప్రతివారికి పాత్ర ఉంటుంది. 700 సంవత్సరాలుగా ముస్లింలు క్రిస్టియన్లు అధికారంలో ఉన్నా, కుల వ్యవస్థ కట్టుదిట్టంగా ఉండడం, ఆ వ్యవస్థ పటిష్టతను తెలియచేస్తున్నది. దురదృష్టవశాత్తు స్వతంత్రం వచ్చిన తరువాతే కులనిర్మాణాన్ని కూల్చే ప్రయత్నాలు మొదలయ్యాయి'.

సంఘ్ పరివార్ కుల వ్యవస్థకి అనుకూలం. వారు అంబేద్కర్ని పొగడడం కేవలం బూటకం. అది కుటుంబ నియంత్రణకు వ్యతిరేకం; అందువలన హిందువుల జనాభా తగ్గుతుందన్న భ్రమలో ఉంటుంది. పది మంది పిల్లలను కనగల తల్లులు తనకు కావాలని సుదర్శన్ చెప్పుకున్నారు. 2006 నవంబర్ 27న, ఢిల్లీలో, 'ఇద్దరు పిల్లల సూత్రన్ని మరిచిపోండి. కనీసం ముగ్గురిని కనండి. అంతకన్నా ఎక్కువ మందిని కానగలిగితే సంతోషం'. 'నిజానికి 10 పిల్లలనుకన్న తల్లుల్లకు మేము అవార్డులు ప్రకటించాం. సంజయ్ భాస్కర్ ది కూడా ఇదే వాదన. దానికో లెక్క కూడా చూపారు. 12 మంది పిల్లలను కన్న తల్లి తండ్రులకు 1200 ఏళ్ళ తరువాత 1200 మంది వారసులుంటారు; 11 మందిని కన్నా వారికీ 1100 మంది ఉంటారు; అదే ముగ్గురిని కంటే 38 మందే ఉంటారు. ఇద్దరిని కంటే ఒక్కరు కూడా ఉండరు. ఓ బిజెపి

నాయకుడైతే... లాలూ యాదవ్ ఇందులో సరిగ్గా కుదురుకుంటాడని' చమత్కరించారు కూడా. ఈ భావాలను అంగీకరించని బిజెపి నాయకులు కూడా వ్యతిరేకించే సాహసం చేయలేదు.

ఆర్ఎస్ఎస్ నమ్మకాన్ని పోగొట్టుకున్న అద్వానీ, తిరిగి పొందేందుకు విశ్వప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది. అద్వానీని రాజీనామా చేయాలన్న ఆరు నెలల తరువాత రాజీనామా సమర్పించడం ఆర్ఎస్ఎస్‌కి ఆగ్రహం తెప్పించింది. కోపంగా ఉన్న సుదర్శన్ 'నిన్ను నమ్మలేం. సంఘ్ అజెండాని నువ్వు ముందుకు తీసుకెళ్ళలేవు. రాజనాథ్ తీసుకెళ్తారు,' అని మొహమ్మీదే చెప్పారు.

ఆర్ఎస్ఎస్ లోపల అన్ని మల్లగుల్లాలు పడుతున్నప్పటికీ దాని ముస్లిం వ్యతిరేకతను మాత్రం ఏ నాడు అశ్రద్ధ చేయలేదు. సుదర్శన్ ముస్లింలను కృష్ణుడిని తమ దేవుడిగా స్వీకరించాలన్నారు. ఇటువంటి డిమాండ్ మునుపెన్నడూ ఆర్ఎస్ఎస్‌కి చెందిన ఏ నాయకుడూ చేయలేదు. ఆర్ఎస్ఎస్, చరిత్రని తిరిగి రాయించడం మొదలుపెట్టింది. సంజయ్ బాసక్ మాటల్లో – "1952 –1980 మధ్య పుట్టిన భారతీయ జనతా పార్టీ వివరాలంటూ, బిజెపి ఆ కాలంలో పెరగడానికి కారణం హిందువుల మీద ముస్లింలు చేసిన దాడులు పెరగడమే, అని వారి పార్టీ డాక్యూమెంట్‌లో రాసుకున్నారు. ఆరు విభాగాలు గల ఈ గ్రంథం రచయితలూ, కాషాయ చరిత్రకారుడు మఖన్ లాల్, బిజెపి సీనియర్ నాయకుడు జె పి మాథుర్. ఇందులో దీన్ దయాల్ ఉపాధ్యాయ, ముస్లిములను గుండాలుగా, ఆవారాగాళ్ళుగా, మొరటువాళ్ళగా, దోపిడీదొంగలుగా వర్ణించినట్టు ఉటంకించారు. గాంధీ రాకతో ముస్లింలను బుజ్జగించడం మొదలైందన్నారు. అయితే, ప్రస్తుతం ఈ వ్యతిరేక ప్రచారం లాభించదని భావించి వాటి కాపీలను తమ పుస్తక దుకాణాలలో కొన్నాళ్లపాటు అమ్మడం నిలిపివేసి, కొన్ని మార్పులతో తిరిగి అమ్మకాలు ప్రారంభించారు.

దీన్‌దయాళ్ ప్రకటన ఇలా ఉంది: 'ముస్లింలు ఎంతటి ఉన్నతమైన పౌరుల పరపతిని గౌరవాన్నైనా మసిబార్చగలరు. ఎందుకంటే వారెంత ఉన్నతమైన వారైనప్పటికీ వారున్న సమాజం బలహీనమైనది, కునారిల్లిపోతున్నది; శక్తి ఉడిగిపోతున్నది; స్వార్థపూరితమైనది. మన అక్క చెల్లెల్లు, ఆడపిల్లలను ముస్లింలు ఎత్తుకుపోతారు. వారు పట్టపగలు బ్రిటిష్ సైనికుల దౌర్జన్యాలకు గురవుతున్నారు. అయినా మనం మన గౌరవాన్ని గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నాం. అందువలనే రజ్జు భయ్యా, వాజపాయి, అద్వానీ లాంటి వారు ఆర్ఎస్ఎస్‌లో చేరారు. 'జెపి మాథుర్, ఇంకా చాలామంది మతతత్వ హింసను ఎదుర్కోడానికి ఆర్ఎస్ఎస్‌లో చేరారు.

2006 నవంబర్ 26న అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికైన రాజానాథ్ సింగ్ 'మాకు

పదేళ్ల సమయం ఇవ్వండి ఐదేళ్లు చాలవు. దేశాన్ని నాశనం చేస్తున్న ముస్లింలను బుజ్జగించే రాజకీయాలకు చరమ గీతం పాడతాం,' అన్నారు.

1997లో బిజెపి తన రాజ్యాంగంలో కేవలం పూర్తికాలం కార్యకర్తలే, అంటే, 'ప్రచారకులే' ప్రధాన కార్యదర్శి కావాలని మార్పు చేసింది. ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను ప్రచారం చేయగలవారే ప్రధాన పదవులలో ఉండాలి. ఈ సవరణతో జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ప్రధాన పదవులు కేవలం ఆర్ఎస్ఎస్ ప్రచారకులకే దక్కేందుకు వీలు కలిగింది.

బిజెపి జాతీయ కౌన్సిల్, పార్టీ రాజ్యాంగంలో సవరణలను చేసి పార్టీ అధ్యక్షుడికి, ఆర్ఎస్ఎస్ 'ప్రచారకులను' మరింత మందిని బిజెపి పార్టీలోకి తీసుకునేందుకు అనుమతిచ్చింది. ఇందువలన పార్టీ పై ఆర్ఎస్ఎస్ నియంత్రణ మరింత సులువవుతుంది. ఈ విధంగా చేయడం వలన ఆర్ఎస్ఎస్‌కి విహెచ్‌పి, బజరంగ్ దళ్ లాంటి అనుబంధ సంస్థలకు మధ్య సమన్వయము, సహకారం మరింత పెరుగుతాయని అభిప్రాయపడింది.

ఆర్ఎస్ఎస్ అఖిల భారత ప్రతినిధి సభ నాగ్‌పూర్‌లో ఫిబ్రవరి నెలలో జరుపుకుని, చిత్రకూటంలో 2005లో అఖిల భారత కార్యకారి మండలి నిర్ణయాలు ఏ మేరకు అమలయ్యాయో అంచనా వేయాలని నిర్దేశించింది. బిజెపి రెండింతలు పెరిగిందన్న అంచనాకు వచ్చింది. ఆర్ఎస్ఎస్ తన శక్తిని పెంచుకోడానికి ఇప్పుడు సరికొత్త పన్నాగం ప్రారంభించింది. – తన అధీనంలో ఉన్న విశ్వహిందూ పరిషద్, భారతీయ మజ్దూర్ సంఘ్, స్వదేశీ జాగరణ మంచ్ లాంటి సంస్థలను ప్రోత్సహించడం. విహెచ్‌పి ఓటు బ్యాంకు బిజెపి ఓటు బ్యాంకు ఒకటి కాదు. ఇప్పుడు విహెచ్‌పి ప్రత్యేకత ఏమి లేదు. మిగిలిన సంస్థలతో అది కూడా పోటీపడవలసిందే.

1980లలో బాలరాజ్ మాదొక్, నానా దేశముఖ్ వంటి రాజకీయ సన్యాసులను బయటికి పంపడంతో మొదలైన శకం అద్వానీ, వాజ్‌పాయ్‌లతో ముగిసింది.

2014లో ఒక కొత్త రూపం ముందుకొచ్చింది. అదే నరేంద్రమోడీ. నరేంద్ర మోడీ తన వ్యక్తిగత ప్రభావాన్ని పెంచుకోవడం ప్రారంభించారు. ఆర్ఎస్ఎస్ పై ఆయన ప్రభావాన్ని మరికొంత శ్రద్ధగా పరిశీలించాలి.

◆

# భారతదేశ ప్రధానిని ఎంపిక చేసేది ఆర్‌ఎస్‌ఎస్

**ము**ంబైలో ఒక సభకు హాజరయ్యేందుకు వచ్చిన ఆర్‌ఎస్‌ఎస్ అధిపతి మోహన్ భగత్‌తో 2013 అక్టోబర్ 23వ తేదీన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక ముఖాముఖీ నిర్వహించింది. అందులో ఒక ప్రశ్నకు సమాధానంగా, 'సంఘ్ పరివార్ ఇంకా ప్రధానమంత్రిని నిర్ణయించలేదని' మోహన్ భగవత్ చెప్పారు. నిజానికి మన రాజ్యాంగం ప్రకారం మెజారిటీ సీట్లు పొందిన పార్టీ పార్లమెంటు సభ్యులు తమ నాయకుడిని ఎంపిక చేసుకుంటారు. అతనే ప్రధాన మంత్రి అవుతారు. కానీ, ఇందుకు భిన్నంగా ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకుడు మోహన్ భగవత్ బిజెపి పార్లమెంటు పార్టీ నాయకుడిని ఇంకా ఎంపిక చేయలేదని ప్రకటించారు. సాంస్కృతిక సంస్థ అనిచెప్పుకునే ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి రాజకీయాలను శాసిస్తుందని చెప్పకనే చెప్పడం ఇది. అంతేకాదు, ఇందులో మరోమర్మం కూడా ఉంది. అంతకు ముందు వారం రోజుల క్రితం ఎల్.కె అద్వానీ మోహన్ భగత్ గారిని నాగ్‌పూర్‌లో కలుసుకున్నారు. కానీ, అందుకు కారణం ఏమిటని అడిగిన విలేకరులకు, అవినీతికి వ్యతిరేకంగా మరో రధయాత్రని చేయడం గురించి మాట్లాడడానికని చెప్పుకున్నారు. ఇద్దరూ నిజాలు దాచారు. ఆర్‌ఎస్‌ఎస్ అప్పటికే మోడీని ప్రధానిగా ఎంపిక చేసింది. అద్వానీగారు తనను ప్రధానమంత్రిని చేయాలని కోరుకోడానికి నాగ్‌పూర్ వెళ్లారు. అంతగా ఎవరూ గమనించని విషయం, తమలో ఒకరిని దేశ భవిష్యత్ ప్రధాన మంత్రిగా ఎంపిక చేసే హక్కు తనకుందని ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకుడు బాహాటంగా ప్రకటించడమే.

ఏ ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త అయినా ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరేముందు, 'అత్యంత శక్తివంతమైన దేవుని ముందు, నేను మనస్ఫూర్తిగా ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడిని అయ్యానని,

నేను భరతవంశం ఔన్నత్యానికి, పవిత్రమైన నా హిందూ మతం, హిందూ సమాజం, హిందూ సంస్కృతి అభివృద్ధి చెందడానికి కృషి చేస్తానని ప్రమాణం చేస్తున్నాను. సంఘం కోసం నిజాయితీగా, ఆసక్తితో, మనస్ఫూర్తిగా పనిచేస్తాను. ఈ ప్రమాణానికి జీవితాంతం కట్టుబడి ఉంటాను' అని ప్రమాణం చేసి ఉంటారు.

ఇది భారత రాజ్యాంగ స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. భారత రాజ్యాంగం లౌకిక ప్రజాతంత్ర విధానాలపై రూపొందించబడింది. సమానత్వం దాని మూలం. – 'రాజ్యాంగం ప్రకారం, చట్టానికి అనుగుణంగా ఏ రకమైన భయంగాని, వివక్షతగాని, దురుద్దేశం లేకుండా ప్రజలందరికి సమ న్యాయం చేస్తాను' అనే దానికి ఇది పూర్తిగా విరుద్ధం. రాజ్యాంగంలోని అధికరణాలు ఒక ప్రధాని గాని, ఆమాటకొస్తే ఏ మంత్రిని కూడా హిందూ మతం అభివృద్ధికి అనుమతించవు. భారత రాజ్యాంగం పశ్చిమ దేశాల విలువలపై ఆధారపడి ఉందని, దానిని రూపుమాపడం తమ ప్రథమ కర్తవ్యమని ఆర్‌ఎస్‌ఎస్ అధినేత సుదర్శనం గారు చాలాసార్లు అన్నారు. భారతదేశ రాజ్యాంగంలోని ప్రతి అంశం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతానికి వ్యతిరేకమే. కానీ, ఈ ఫాసిస్టు సంస్థ, రహస్య కార్యకలాపాలు నిర్వహిస్తున్న సంస్థ, లౌకిక ప్రజాతంత్ర భారతదేశానికి నాయకునిగా ఉండవలసిన ప్రధానిని ఎంపిక చేసింది. నిజానికి మోడీ ఎంపిక అంత సులభంగా జరగలేదు. అద్వానీ చివరివరకు కుతంత్రాలు పన్నుతూనే ఉన్నారు; నిస్సిగ్గుగా అనేకరకాల ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. 2006 నుంచి 2014 మోడీ ఎన్నికయ్యే నాటి వరకు శత విధాలా ప్రయత్నాలు చేసారు. మోడీకి అద్వానీ, రాజ్‌నాథ్‌ల నుండి గట్టి పోటీ ఎదురైంది. అలాగే 2006 నవంబర్ 26న బిజెపి అధ్యక్షుడిగా ఎన్నికైన రాజ్‌నాథ్ సింగ్ ఎన్నికైన రెండు నెలలకే పార్లమెంటరీ బోర్డులో ఉన్న మోడీని తొలగించారు. అదేవిధంగా అరుణ్ జెట్లీని బిజెపి ప్రతినిధిగా తొలగించారు. పైగా మీడియా ఆర్‌ఎస్‌ఎస్ జోక్యం గురించి ప్రశ్నించినపుడు, మోడీ విషయంలో 70% ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఉందని. జెట్లీ విషయంలో 50% ఉందని అంగీకరించారు. ఇది ఆర్‌ఎస్‌ఎస్ అధినాయకులకు అస్సలు రుచించలేదు.

ఆ సమయంలో గుజరాత్ ఎన్నికలకు సిద్ధపడుతున్నది. మోడీ దేశంలోని అన్ని రాష్ట్రాలలో గుజరాత్‌ని ప్రథమ స్థానంలో నిలుపుతానని రంకెలేసి చెప్తున్నారు. వైద్య సుబ్రహ్మణ్యం మోడీని ముఖాముఖిలో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా, "గుజరాత్‌లోని ఐదున్నర కోట్ల జనాభాను సమానంగా పరిగణిస్తామని" చెప్పారు. అదే నిజమైతే, "తాం దల్జా, వాస్నా రోడ్‌లకి మధ్య కేవలం రెండు మీటర్ల దూరం ఉంటుంది కానీ, అక్కడి పరిస్థితులు మోడీ పరిపాలనలోని గుజరాత్‌కి ప్రతీకలుగా ఉన్నాయి. ఆ స్థలానికి గణేష్ దేవి అనే సాహితీ విమర్శకురాలు, కార్యకర్త నన్ను

తీసుకెళ్లి చూపించారు. మొదటి ప్రాంతమంతా ముస్లింలు నివసించే ప్రాంతం. రెండో ప్రాంతం హిందువులు నివసించే ప్రాంతం. ఆరడుగుల దూరంలో ఉన్న ఆ రెండు ప్రాంతాల మధ్య ఉన్న తేడా మనసులను కలచివేస్తుంది. చెత్తకుప్పలు పేరుకుపోయి, లైట్లు లేకుండా, కిక్కిరిసి ఉన్న ప్రజలతో ఉన్నది ముస్లింలు ఉండే ప్రాంతమని సులువుగానే గుర్తించవచ్చు. రోడ్డుకు ఆ వైపున ఉన్న ప్రాంతం హిందువులుండే ప్రాంతమైన వాస్నా ప్రాంతం; వెలుగులు విరజిమ్ముతూ, పరిశుభ్రంగా ఉంటుంది. ఇవి ఉత్తమమైన రాష్ట్రంగా అందరిని సమానంగా తీర్చిదిద్దుతానన్న మోదీగారి చేతలు, అంటారు వైద్య సుబ్రహ్మణ్యన్.

అయితే ఎంత అపరిశుభ్రంగా ఉన్నా ఈ ప్రాంతాలలో ముస్లింలు తమ సొంత ఇళ్లలో ఉన్నారు. కానీ, 2006 అక్టోబర్‌లో మైనారిటీల కమిషన్, 5000 మంది ముస్లిం కుటుంబాలు 46 తాత్కాలిక క్యాంపులలో ఉంటున్నట్టు ప్రకటించింది. 17 క్యాంపులను పరిశీలించిన కమిటీ అక్కడి అపరిశుభ్ర వాతావరణం, అమానుష పరిస్థితులను గురించి రిపోర్ట్ ఇచ్చింది. వారంతా దాడులకు, అల్లర్లకు బలైన వారే. కానీ, గుజరాత్ ప్రభుత్వం వారిపట్ల తనకేం బాధ్యత లేదని చేతులు దులుపుకుంది. మోడీ తన ప్రచారంలో ముస్లింలు పాల్గొనకూడదని ఆదేశాలిచ్చారు. ఈ కరుడు గట్టిన హిందుత్వవాదే ఎన్నికలలో గెలిచి మరింత మంది మద్దతు పొందారు. పోను పోను బిజెపిలో, ఆర్ఎస్ఎస్ లోను మోడీ అనుయాయులు పెరిగారు. ఆర్ఎస్ఎస్ బాణీని వినిపించే మోడీ నాయకులకు దగ్గరయ్యారు. కేంద్రంలో కాబోయే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారు. అందుకు భిన్నంగా అద్వానీ ముస్లింల పట్ల మెతక వైఖరి ప్రదర్శిస్తారని పేరు పొందారు. ఫలితంగా, వాజ్‌పాయ్ తరువాత పీఠం తనదే అని ఆయన పెట్టుకున్న ఆశలు అడియాశలయ్యాయి.

ఆర్ఎస్ఎస్ తనని తాను పునర్నిర్మించుకోడానికి కేవలం ముస్లింలను క్రిస్టియన్లను వ్యతిరేకించడం మాత్రమే లక్ష్యంగా పెట్టుకోలేదు. ఆధునిక ఆలోచనలన్నిటిని వ్యతిరేకించడం లక్ష్యంగా పెట్టుకుంది. 2009 ఫిబ్రవరిన ఇచ్చిన ఒక ఉపన్యాసంలో సుదర్శన్, 'భారతదేశం ఒక నాటి ధనిక దేశం; అభివృద్ధి చెందిన దేశం. మెకాలే విద్యా విధానంతో భారతదేశంలోకి ఇంగ్లీష్ వచ్చింది. .. స్వతంత్రం వచ్చి అరవై ఏళ్లైనా అది మనలను వదలడం లేదు.' అన్నారు. ఆర్ఎస్ఎస్ కరుడుగట్టిన హిందూత్వ వాది కానివారికెవరికీ నిర్ణయాత్మక స్థానాలు దక్కకుండా జాగ్రత్తలు తీసుకుంది. అలాగే విదేశాంగ విధానంలో అఖండ భారత్ అనే ఆర్ఎస్ఎస్ నినాదాన్ని విస్తృతపరచాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్ఎస్ఎస్ అఖండ భారత్ అనే భారతదేశంలో, అఫ్ఘనిస్థాన్, పాకిస్తాన్, టిబెట్, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్, మయన్మార్, శ్రీలంక

కూడా భాగాలు. భగవత్ ఎక్కడికెళ్లినా ముస్లింల మీద విషం చిమ్మడమే ప్రధానంగా పెట్టుకున్నారు. ఒక సమావేశంలో, "మన మీద అరబ్ నుండి స్పెయిన్ వరకు ఎంత మంది దాడి చేసినా మన జాతిని పార్శి జాతిని చేసినట్టు ధ్వంసం చేయలేకపోయారు." అన్నారు. ఆర్ఎస్ఎస్ అధీనంలోని ఇతర ప్రజాసంఘాలు – ఎబివిపి, బిఎంఎస్, బికేఎస్, వనవాసి కళ్యాణ్ ఆశ్రమాలు అభివృద్ధి చెందుతున్నా, రాజకీయ అంగమైన బిజెపిలో మాత్రమే నాయకుల మధ్య భేదాభిప్రాయాలతో, ఎదుగూ బొదుగూ లేకుండా ఉండడం గమనించిన ఆర్ఎస్ఎస్, బిజెపిలో ఉండేవారెవరూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేయకూడదని ఆదేశాలు జారీ చేసింది. మాటకారి మోడీని మెట్టు మెట్టు ఎక్కిస్తూ వచ్చింది. అద్వానీని పక్కన పెట్టింది.

2002 మార్చిలో అటల్ బిహారి వాజ్‌పాయ్, మోడీని 'రాజధర్మం' పాటించలేదన్నారు. అధికారమదంతో ఉన్నారన్నారు. కానీ, ఆ తరువాత మోడీ ఎలా ఎదిగారో చూడండి. మోడీ ప్రభావం మరింతగా పెరిగిందేగాని తగ్గలేదు. తనను ఎదిరించిన వారి అడ్రస్ లేకుండా చేయగలిగారు. 2002 నవంబర్‌కి మోడీ, తనను వ్యతిరేకించిన కేశుభాయ్ పటేల్ ఎన్నికల కమిటీలో లేకుండా చేసుకోగలిగారు. రైతులకు అనుకూలంగా ఉద్యమం చేసిందని భారతీయ కిసాన్ సభ ఆఫీస్‌ను తన బంగ్లాలో నుంచి బయటకి నెట్టేశారు; పోలీసుల అకృత్యాలకు నిరసన తెలిపినందుకు విహెచ్‌పి కార్యకర్తలను జైళ్లలో పెట్టించారు. 2007 ఎన్నికలకు కేంద్రం నుండి ఏ ప్రచారకుడు రానక్కరలేదన్నారు. 2011లో అద్వానీ అవినీతికి వ్యతిరేకంగా రథయాత్ర చేస్తానంటే నిలువరించగలిగారు. 2012 కల్లా ఆర్ఎస్ఎస్, బిజెపిలపై మోడీ శక్తివంతమైన పట్టు సాధించారు. పాంచజన్యం అరుపులు సన్నాయి నొక్కులుగానే మిగిలాయి. 2015 వరకు మోడీని వ్యతిరేకించిన నితీష్ ఆ తరువాత మోడీతో చేతులు కలిపారు. ఆర్ఎస్ఎస్ తన పూర్తి మద్దతు మోడీకే ఇచ్చింది.

2009 ఎన్నికలలో హిందువులలో హిందూ ఓటు బ్యాంకును ఏ మాత్రం విస్మరించకుండా అభివృద్ధి చేయడమే తమ లక్ష్యమని ఒక సీనియర్ ఆర్ఎస్ఎస్ నాయకుడు అన్నారు. ఆ యేడు గోల్వాల్కర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా తమ బలాన్ని అన్ని రాజకీయ పార్టీలకు ప్రదర్శించాలని సభకు అందరిని ఆహ్వానించారు; కాని ఏ ఇతర పార్టీ హాజరు కాలేదు. అది వేరే విషయం.

ఎన్నికల ఫలితాలతో రాజకీయ బంధాలు తారుమారు అవుతుంటాయి. ఉత్తర ప్రదేశ్‌లో ఎన్నికలలో ఓటమికి కారణం ఆర్ఎస్ఎస్ అని విమర్శలు వచ్చాయి. మోడీ వ్యతిరేకి అద్వానీ, 'మోడీ నిజమైన లౌకికవాది' అని అనవలసివచ్చింది.

2009 లోక్‌సభ ఎన్నికలు ముగియగానే మోడీ గుజరాత్‌కి మాత్రమే పరిమితమైన వ్యక్తి కాదని అంతకుమించిన ప్రజాదరణ సాధారణ జనంలో ఉందని గుర్తించడం జరిగింది. అద్వానీ ఇంట్లో జరిగిన బిజెపి ముఖ్య కేంద్రీకృత వ్యూహ నిర్ణయ సమావేశానికి మోడీని ఆహ్వానించింది. ఆ సమావేశానికి హాజరైన ఒకే ఒక ముఖ్యమంత్రి మోడీ. దానితో మిగిలిన రాష్ట్ర ముఖ్యమంత్రులలో కొంత అసూయ ఏర్పడింది.

ఆర్ఎస్ఎస్, బిజెపికి ఇతర రాజకీయ పార్టీలకు భేదం హిందూమతమని గట్టిగా నమ్మింది. అందుకే రాముడి గుడికట్టించడాన్నే 2009లో ఎన్నికల అస్త్రంగా వాడింది. గోరక్‌పూర్ నుండి ప్రారంభించిన ఎన్నికల ప్రచారంలో అద్వానీ రామమందిర నిర్మాణం గురించే ప్రచారం చేసారు. కేంద్రంలోనూ, ఇతర ఎన్నో రాష్ట్ర ఎన్నికల్లో ఇదే అంశం బిజెపికి విజయం తెచ్చిపెట్టింది.

2009లో సుదర్శన్ తరువాత మోహన్ భగత్ ఆర్ఎస్ఎస్ అధిపతిగా వచ్చారు. మోహన్ భగత్ పశువైద్యులు. అతని తండ్రి ఒక ప్రచారకుడు. ఆయన అధికారం చేపట్టగానే, 'భారతదేశం హిందూ రాష్ట్రం; ఇక్కడున్న వారందరూ హిందువులు' అన్నారు. మొహన్ భగత్ సుదర్శన్ కన్నా తక్కువ మాట్లాడతారు కానీ, ఎక్కువ ఆధిపత్య ధోరణి ప్రదర్శిస్తారు. 'వ్యక్తీకరణలో భేదం ఉన్నప్పటికీ ఆర్ఎస్ఎస్ మౌలికంగా హిందుత్వ సిద్ధాంతానికి అనుగుణంగా ఉండాలని' ఆయన కోరిక. సురేష్ జోషిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకుని, హిందువుల ప్రయోజనాలకే నూటికి నూరు శాతం పని చేస్తున్నట్టు చూపించారు.'

ఆర్ఎస్ఎస్ సహాయం కోసం అద్వానీ, రాజ్‌నాథ్ ఒకరి వెంట ఒకరు నాగ్‌పూర్ పరుగెత్తారు. 2009 లోక్ సభ ఎన్నికలలో బిజెపి ఓటమితో, బిజెపి పై ఆర్ఎస్ఎస్ పట్టు మరింత పెరిగింది. జైట్లీ, సుష్మా స్వరాజ్‌లు ప్రతిపక్ష నాయకులుగా నియమించబడితే అద్వానీ లోక్‌సభలో డెప్యూటీగా మిగిలిపోవలసి వచ్చింది. ఆర్ఎస్ఎస్ దేశంలో తన విస్తరణ పై కేంద్రీకరించడంలో ఏమాత్రం అశ్రద్ధ చేయలేదు. ఇప్పుడు మొత్తం దేశంలో ఉన్న 60000 రెవెన్యూ కేంద్రాలకుగాను 25000 కేంద్రాలలో ఆర్ఎస్ఎస్ శాఖలను తెరిచింది. ఆ ప్రజా పునాది వలనే ఎన్నికలలో ఓటమి గాని, ఇతర ఏ ప్రమాదం ముంచుకొచ్చినా, బిజెపి నాయకులు ఆర్ఎస్ఎస్ దగ్గరకి పరుగులు పెడతారు. ఆర్ఎస్ఎస్, పార్టీ నాయకుడు అద్వానీని రాజీనామా చేయాలని కోరింది. కాందహార్ సంఘటనలో ఆయన, నేరాన్ని అన్యాయంగా పక్కకు నెట్టేశారన్నది అభియోగం. నిజానికి అద్వానీని ఇంటికి పంపేయాలని భగవత్ ఇంతకు ముందే నిశ్చయించుకున్నారు. ఒక యువకుడిని ఎంచుకోవాలనుకున్నారు.

బిజెపి అధ్యక్షుడిగా రాజ్‌నాథ్ సింగ్ కాలపరిమితి ముగియగానే మోహన్ భగవత్ గడ్కరీని ఎంపిక చేసారు. అద్వానీ స్థానంలో సుష్మా స్వరాజ్ ఎంపికయ్యారు. మోడీకి, రాజ్‌నాథ్, గడ్కరీల మద్దతు లభించింది. ఆర్‌ఎస్‌ఎస్‌కి దూరమైన అద్వానీ ప్రధాని పదవి ఆశను వదులుకోవలసి వచ్చింది. మోడీని ప్రధానిని చేయాలని బిజెపి అధ్యక్షుడు రాజ్‌నాథ్‌ను ఆర్‌ఎస్‌ఎస్ తొందర చేసింది; అద్వానీ అలకలను, విజ్ఞప్తులను ఆర్‌ఎస్‌ఎస్ ఏ మాత్రం లెక్కచేయలేదు; రాజ్‌నాథ్‌ని పార్లమెంటరీ పార్టీని సమావేశ పరచాలని హుకుం జారీ చేసింది. సాయంత్రానికల్లా మోడీ గుజరాత్ నుండి ఎగిరి వచ్చేసారు. ఈ తతంగం అంతా కేవలం ఒక ఫార్మాలిటీ. ఆర్‌ఎస్‌ఎస్ అనే ఒక సాంస్కృతిక సంస్థ తన రాజకీయ అంగం పై ఎంత పెత్తనం చలాయించగలదో ఈ సంఘటనలు మనకు స్పష్టం చేస్తాయి.

ఆర్‌ఎస్‌ఎస్ కున్న భయమల్లా అద్వానీ లాగే మోడీ కూడా తన ఆధిక్యతని పెంచుకోడానికి ప్రయత్నాలు చేస్తాడా అనే. అలా జరగకుండా ఉండడానికి చర్యలు మొదలు పెట్టింది. 2000 మంది గట్టి ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలను బిజెపిలోని వివిధ స్థాయిలలో నింపింది. అంతేకాదు, 3108 అసెంబ్లీ సెగ్మెంట్లలోనూ, 543 లోక్ సభ సెగ్మెంట్లలోనూ కో–ఆర్డినేటర్స్‌ని నియమించింది.

ఆర్‌ఎస్‌ఎస్ తన వార్షిక మహాసభ నివేదికలో, “మోడీ శక్తివంతమైన నాయకుడు. తానే ఒక స్వయం సేవకుడు; అందుకు మేము గర్విస్తున్నాము;” అని రాసుకుంది. ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహాలు ఫలించాయి. 2014 మేకి చేరేసరికి బిజెపి ఎన్నికలలో గెలవడం ఖాయమని తేలింది. 2014 మే 16న ఎన్నికల ఫలితాలు మోడీని ఆకాశానికి ఎగిరేటట్టు చేసాయి. భారత ప్రభుత్వంలోని అత్యున్నత స్థానానికి మోడీ ఎంపికయ్యారు. ఆర్‌ఎస్‌ఎస్ తన పంతం నెగ్గించుకుంది. తనను నమ్మిన బంటుని భారతదేశ ప్రధానిని చేసింది. తన హిందుత్వ ఎజెండాను అమలు చేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ అమ్ముల పొదిలో మోడీ ఒక ఆయుధం.

◆

# మోడీ పాలనలో ఆర్‌ఎస్‌ఎస్

**మో**డీ అనుసరించిన మూడు ముఖ్యమైన కార్యక్రమాలూ ఆర్‌ఎస్‌ఎస్‌ని సంతృప్తిపరిచాయి. మొదటిది 19వ శతాబ్దం నుండి నమ్ముతూ వచ్చిన భారతదేశం ఒక లౌకిక రాజ్యమనే ఆలోచనను, జాతీయ స్ఫూర్తిని పూర్తిగా తుడిచిపెట్టడం; రెండోది, భారతదేశ నిర్మాణంలో ప్రముఖ పాత్రవహించి, ప్రజలందరి హృదయాలే కాదు ప్రపంచదేశాల గౌరవాన్ని కూడా చూరగొన్న నెహ్రూని కనుమరుగు చేయడం; నెహ్రూవి పూర్తిగా లౌకిక భావాలు; ఆర్‌ఎస్‌ఎస్ ఇందుకు పూర్తిగా విరుద్ధం. ఆర్‌ఎస్‌ఎస్ భారతదేశం కేవలం హిందూ రాజ్యంగా ఉండాలని కోరుకుంది. దీనిని చివరి శ్వాస వరకు సంపూర్ణంగా వ్యతిరేకించిన వ్యక్తి నెహ్రూ. ఆ భావాలను సమూలంగా తుడిచిపెట్టి, హిందూ రాజ్యం, 'ఒక్క నాయకుడు' అన్న తమ సూత్రం అమలు చేయాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ ఎజెండా. గుజరాత్ నమూనాను భారతదేశమంతా అమలు చేసే ప్రయత్నాలు చేయడం ఆర్‌ఎస్‌ఎస్ అభిమతం. మూడోది మైనారిటీలను నాశనం చేయడం. ముఖ్యంగా ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు ఏ మాత్రం రాజకీయంగా గుర్తింపు లేకుండా చేయడం; ఇదివరకటి ప్రభుత్వాలు ముస్లింలను సంతృప్తిపరుస్తున్నాయనే పేరుమీద "హిందూ ఓటర్లను" కూడగట్టడం..

ఆర్థిక విధానాలను అమలుపరిచేందుకు అడ్డు లేకుండా మతతత్వాన్ని వాడుకోవడం మోడీ విధానం. అందుకనే, మోడీ 'ఆపరేషన్ ఖల్సా', అంటే దళిత సిక్కులను మతమార్పిడి చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. ఒక్కొక్క ముస్లింను మతమార్పిడి చేయడానికి 5 లక్షలు, క్రిస్టియన్‌ని మతమార్పిడి చేయడానికి 1 లక్ష అవుతుందని చెప్పుకుని విపరీతంగా విదేశాల నుండి నిధులు సేకరించారు.

ఈ కాలంలో ఆర్‌ఎస్‌ఎస్ సభ్యత్వం నెలనెలా పెరుగుతూ పోయింది; ఒక్క జమ్మూ కాశ్మీర్ మినహా తక్కిన అన్ని జిల్లాలకు ఆర్‌ఎస్‌ఎస్ పాకింది. "రెండేళ్ల కిందటి

వరకు నెలకి 8 నుండి 10 వేల మంది ఆర్ఎస్ఎస్ సభ్యులుగా చేరితే ఈ కాలంలో పది నుండి పదిహేను వేల మంది చేరుతున్నారు" అని అన్నారు ఒక ఆర్ఎస్ఎస్ సీనియర్ నాయకుడు. విదేశాలలో కూడా శాఖలు ప్రారంభించబడ్డాయి.

'విజ్ఞాన భారతి' అనే పేరుమీద వేదాలలో శాస్త్ర జ్ఞానాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించారు. గల్ఫ్ దేశాలలో దీనిని విస్తరించాలని ప్రణాళిక తయారు చేసుకున్నారు. మరో వైపు విహెచ్‌పి దేశంలో ఆవులను రక్షించడం పై కేంద్రీకరించింది.

వ్యవసాయ మంత్రిత్వ శాఖ రూ. 500 కోట్లను దేశీయ ఆవులను అభివృద్ధి చేయడానికి కేటాయించింది. మథురలో ఒకటి, దక్షిణ భారతదేశంలో మరొకటి పరిశోధనా శాలలు నిర్మించడానికి నిధులు మంజూరు చేసింది ప్రభుత్వం.

ఆర్ఎస్ఎస్ తన రెక్కలను 39 ప్రపంచదేశాలకు చాచగలిగింది. విస్తరణలు నమ్మకాలను పెంచితే, ఎన్నికలలో అపజయాలు ఆ నమ్మకాన్ని తగ్గిస్తాయి. 2018లో జరిగిందదే. రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్‌లలో వరుస ఓటములు మోడీ చుట్టూ ఉన్న ప్రభ వెలుగును క్షీణింపచేసాయి. దీనిని తిరిగి పొందడానికి మోడీ తీవ్రమైన ప్రయత్నాలు చేయవలసి వచ్చింది. అందుకు అనుగుణంగా 2018 చివరి నాటికి అన్ని సంస్థలను ఆర్ఎస్ఎస్ అనుయాయులతో నింపేసారు.

2015 డిసెంబర్‌లో మితవాద భావాలున్న మేధావులతో ఒక సభను నిర్వహించారు. వామపక్ష భావాలు పాతుకుపోయున్న ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ, మతపరమైన ఆలోచనలను సంపూర్ణంగా మితవాదం వైపు మళ్లించడమే దీని లక్ష్యం. 2015 మార్చిలో పాంచజన్యం అనే ఆర్ఎస్ఎస్ పత్రిక ఎడిటర్ నేషనల్ బుక్ ట్రస్ట్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఆ తరువాతి 5 రోజులకి భారతదేశ చారిత్రిక పరిశోధనా సంస్థ పునఃనిర్మించబడింది. అసలైన చరిత్రతో సంబంధం లేకుండా, ఏ ఆధారాలు లేకపోయినా, ఆర్ఎస్ఎస్ భావనలను వ్యాప్తిచేయడం కోసమే ఈ మార్పులు చేయబడ్డాయి. 'హిందువులు ముసల్మానుల దాడిలో నష్టపోయారని, బలవంతంగా మత మార్పిడులు జరిగాయని, యుద్ధాలు జరిగేటప్పుడు ముసల్మానులు తమ సైన్యం ముందు ఆవులను పెట్టేవారని, వారు చేసే ఆరోపణలను సమర్థించుకోడానికే ఈ మార్పులు చేశారు. కెఎం పణిక్కర్, ఇర్ఫాన్ హబీబ్ లాంటి ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధులైన చరిత్రకారులు, 'ఈ బోర్డులో పరిశోధనలలో నిపుణులైన చరిత్రకారులు లేరని' ఆరోపించారు.

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతవేత్త బాహాటంగానే తాను ఉన్నత విద్యను కాషాయంతో నింపాలనుకుంటున్నట్టు ప్రకటించారు. 'ఉపాధ్యాయుడు విద్యార్థులకు భగవద్గీతలోని కనీసం రెండు శ్లోకాలకు వ్యాఖ్యానాలు చేయడం నేర్పించాలి.' అన్నారు.

మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్, 2016లో, ఏబివిపి, రాష్ట్ర సైనిక్ మహాసంఘ్, భారతీయ శిక్షణ మండలి, సంస్కృత భారతి, శిక్షా బచావో ఆందోళన, విజ్ఞాన భారతి, ఇతిహాస సంకలన యోజన మొదలైన సంఘాలతో విద్యావిధానంలో ఆర్ఎస్ఎస్ ఆలోచనలను ఎలా జొప్పించాలో చర్చించారు. "ఆధునిక విద్యలో సనాతన భారత విలువలు, జాతిని చూసుకుని ఎలా గర్వించాలో" నేర్పేందుకు ప్రణాళికలు రచించబడ్డాయి.

ఇందిరా గాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ సభ్యులను, ఆర్ఎస్ఎస్ సభ్యులతో నింపేశారు. ఆర్ఎస్ఎస్ సభ్యులను సెన్సార్ బోర్డు, ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించారు ఆయా రంగాలలో ఏ మాత్రం నైపుణ్యం లేకపోయినా ఆర్ఎస్ఎస్‌కి విధేయులై ఉండడమే వారి నియామకాలకు అర్హతగా మారింది. విద్యారంగంలో నిపుణులుగా ప్రఖ్యాతి చెందిన వారందరూ విద్యాసంస్థల నుండి దూరం చేయబడ్డారు. జీన్ డ్రెజ్, అమర్త్యా సేన్ వంటి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన విద్యావేత్తలు ఢిల్లీ ఆర్థిక సమావేశాలకు దూరంగా ఉంచబడ్డారు. అమర్త్యా సేన్‌ని నలంద విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా తొలగించారు. ఐసిసిఆర్ డైరెక్టర్ డాక్టర్ లోకేష్ చంద్ర ఉద్దేశంలో మోడీ మహాత్మా గాంధీ కన్నా ఉన్నతుడు! ఢిల్లీ ఐఐటి డైరెక్టర్, రఘునాథ్ శివగోన్కర్ తన పదవికి రాజీనామా చేసారు; డైరెక్టర్లనందరిని ప్రభుత్వమే ప్రత్యక్షంగా నియమించుకునే విధంగా బిల్లు సవరణ చేయబడింది.

ముస్లింలను 'పవిత్రమైన' హిందువులుగా మార్చాలనే దీన దయాళ్ ఉపాధ్యాయను, ముస్లిం, హిందూ మతస్థులంతా ఎవరి మతాన్ని వారు ఆచరిస్తూ, కలిసి ఉండాలనే గాంధీ, నెహ్రూలను మోడీని ఒకే గాటన కట్టేసారు. ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్‌కి కావలసింది ఇటువంటి వారే. ఉత్తరప్రదేశ్, బీహార్ ఎన్నికల సమయాలలో మోదీగారు మౌనం వహించారు. ఘర్ వాపసీ అంటూ ఒక వైపు, ఆవులను చంపారనే నెపం మీద, ఇంకో వైపు, ముస్లింలను, దళితులను లక్ష్యంగా చేసుకుని అక్కడ ఎన్నెన్ని ఆగడాలు జరిగాయో మనం చూసాం. వాతావరణం పూర్తిగా కలుషితమైంది. మునుపెన్నడూ లేనంతగా విద్వేష ఉపన్యాసాలు ఎక్కడబడితే అక్కడ చేయబడ్డాయి. ఆర్ఎస్ఎస్ మహిళా విభాగమైతే ఏకంగా "ఇస్లాం ఒక మతం కాదు. ఒక దాడి" అని ఆరోపించింది. అమిత్ షా ఈ రాగాన్ని కొనసాగించారు. 2016లో "భారతమాతని విశ్వమాతగా తీర్చిదిద్దాలంటే బిజెపి ప్రభుత్వం మరో 25 సంవత్సరాలు కొనసాగాలి" అన్నారు. సురుచి ప్రకాశం అనే ఆర్ఎస్ఎస్‌కి చెందిన ప్రచురణ సంస్థ 'పుణ్య భూమి భారత్' అనే పేరుతో ఒక మ్యాప్ ప్రచురించింది. అందులో 'అఫ్ఘనిస్థాన్‌ని, ఉపగనాథన్, కాబుల్‌ని కుంభ నగర్ అని, పెషావర్‌ని పురుషపుర్ అని, ముల్తాన్‌ని

మూలస్థాన్ అని, టిబెట్‌ని త్రివిష్టప అని, శ్రీలంకని సింఘాల్ ద్వీప అని మయన్మార్‌ని బ్రహ్మదేష్' అని రాసి ఉంది. అంతేకాదు, 'ఈ మ్యాప్‌ని ప్రతి వారు తమ ఇళ్లలో పెట్టుకుని అది సాకారం చేసుకునేందుకు దృష్టి పెట్టాలని' వారి నాయకుల ఉద్బోధలు! మరో నాయకుడైతే, 'మేం మతం మారమనడం లేదు. కేవలం తిరిగి సొంత గూటికి రమ్మంటున్నాం' అంటాడు.

ముస్లిం మతస్థులే కాదు. క్రిస్టియన్ మతస్థులు కూడా దాడులకు గురవుతున్నారు. భారతదేశంలో కేవలం రెండు శాతమే ఉన్న క్రిస్టియన్లను మతతత్వ వాదులు వదిలిపెట్టడం లేదు; ఎన్నో చర్చిలు తగలపెట్టబడ్డాయి. ఈ మధ్యనే ఢిల్లీలోని సెయింట్ సెబాస్టియాన్ చర్చి తగలబడింది. అల్ఫోన్సా చర్చి విధ్వంసం చేయబడింది. పాస్టర్లపై దాడులు జరుగుతున్నాయి.

మోడీ ఎప్పుడూ ఎన్నికల ప్రచారాలలో విస్తృతంగా పాల్గొంటారు. ప్రతి ఎన్నికల ప్రచారంలోనూ ముస్లింల పట్ల విద్వేషాన్ని వెదజల్లుతుంటారు. ఒక ఎన్నికల సభ ప్రసంగంలో "దళితుల గిరిజనుల రిజర్వేషన్లు తీసేసి 'వారికి' (ముస్లింలకు) ఇచ్చారని" అన్నారు. మోడీ దృష్టిలో ముస్లింలెప్పుడూ పరాయివారే. నరేంద్ర మోడీగారి మరో ఎన్నికల ప్రచారంలో "ఒక నాడు భారతదేశంలో జనాభా పెరిగేది కాదు. స్వతంత్రం వచ్చే నాటికి మన దేశ జనాభా 30 కోట్లే. గాని ఈనాడు దేశజనాభా వంద కోట్లు పెరిగింది. పైగా ఎయిడ్స్ లాంటి రోగాలు వస్తున్నాయి. అందుకు కారణం రాముడిని మనం అనుసరించకపోవడమే"; మరో చోట యుపిలో "గ్రామాలలో శవాలను పూడ్చడానికి స్థలాలను కేటాయిస్తే కాల్చడానికి కూడా కేటాయించాలి"; "రంజాన్ పండక్కి కరెంటు ఇస్తే దీపావళికి కూడా ఇవ్వాలి;" .. ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ అంటే అదేమరి. గత ఏడు దశాబ్దాల కాలంలో ఏ ఒక్క ప్రధాన మంత్రి ఇంతటి విద్వేష ప్రసంగాలు చేయలేదు. ఇటువంటి పరిస్థితులలో యోగి ఆదిత్య నాథ్ యుపి ముఖ్య మంత్రి అవడం ఆశ్చర్యాన్ని కలిగించదు.

ఆర్‌ఎస్‌ఎస్ నాయకుల రెచ్చగొట్టే ప్రసంగాలు కొన్ని మచ్చుకు చూద్దాం ... "వారు ఒక హిందూ అమ్మాయిని తీసుకెళితే మేము వంద మందిని తీసుకుని వెళ్తాము", "షారుక్ ఖాన్ సినిమాలను మీరు గనక బహిష్కరిస్తే అతను కూడా హాఫీద్ సయీద్ అవుతాడు", "యోగ చేయనివాడు భారతదేశం నుండి వెళ్లిపోవచ్చు''.

2015 ఫిబ్రవరిలో కమ్యూనిస్టు నాయకుడు గోవింద్ పన్సారే హత్య గావించబడ్డారు. అదే ఏడాది ఆగస్టు 30న 77 ఏళ్ల విద్యావేత్త ఎం ఎం కల్బుర్గి, హత్యకు గురయ్యారు. కారణం ఆయన విగ్రహారాధనకు వ్యతిరేకం; ఈ సంఘటనలను గురించి ప్రస్తావిస్తూ 'వాక్స్వాతంత్రంపై భారతదేశం దాడి' అని ఆనాటి అంతర్జాతీయ

న్యూయార్క్ టైమ్స్  పత్రికలో సోనియా ఫిలారీ అనే ఓ రచయిత రాసారు. తిరిగి 2017లో గౌరీ లంకేశ్, పత్రికా రచయిత్రి హత్య గావించబడ్డారు. ఎప్పటిలాగే మోడీ మౌనముద్ర దాల్చారు. మోడీ పాలన మూకుమ్మడి దాడులు హత్యలు చేసేవారికి అనుకూలం. 1992 నుండి నేటికి  కనీసం 27 మంది పత్రికా విలేకరులు హత్య చేయబడ్డారు. వెండి ధొనిగర్, ప్రఖ్యాత రచయిత్రి. సంస్కృత పండితురాలు. భారతదేశాన్ని గురించి లోతుగా అధ్యయనం చేసారు. చరిత్ర పరిశోధకురాలు; చికాగో విశ్వవిద్యాలయంలో మతాల చరిత్ర పాఠాలు చెప్పే అధ్యాపకురాలు. ఆమె ఎన్నో పరిశోధన గ్రంథాలు రాసారు. అందులో కొన్ని 'అసిటిజం అండ్ యురోయిజం ఇన్ ది మిథాలజీ ఆఫ్ శివ', 'హిందూ మిత్స్ : ది ఆరిజిన్ ఆఫ్ ఈవిల్ ఇన్ హిందూ మిథాలజీ', 'విమెన్', 'ఆండ్రొజన్స్', 'అండ్ అదర్ మిథికల్ బీస్ట్స్', '108 సంస్కృత పద్యాల అనువాదాలు', 'ది హిందుస్', 'ఎన్ ఆల్టర్నేటివ్ హిస్టరీ' ముఖ్యమైనవి. 2009లో మితవాద హిందూ గ్రూపుల వలన ఆమె వార్తలలోకి ఎక్కారు. ఆమె పై  295 ఏ కింద, ఒక మతస్థుల భావనలు ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టారని దేశ ద్రోహం నేరారోపణ చేసారు. ఇంతకు మునుపు కూడా జేమ్స్ లైన్ రాసిన, శివాజీ పుస్తకం, జోసెఫ్ లిలివెల్డ్, గాంధీ పై రాసిన పుస్తకం, సల్మాన్ రష్దీ రాసిన సాటానిక్ వెర్సెస్ నిషేధించబడ్డాయి. కానీ, వారి పై ఇటువంటి అభియోగాలు మోపబడలేదు.

స్వేచ్ఛ కోసం పోరాడిన వీరులను కనుమరుగు చేయడమే కాక హింసాయుత హిందూ జాతీయవాదులను ప్రోత్సహించడం పనిగా పెట్టుకుంది ఆర్ఎస్ఎస్; దాని రాజకీయ అంగం బిజెపి. గాంధీని చంపిన గాడ్సేని దేశభక్తుడంటాడు ఆర్ఎస్ఎస్ నాయకుడు సాక్షి మహారాజ్.

భారతదేశంలో దాడులు కేవలం లౌకిక వాదులకే పరిమిత మవలేదు. ప్రజాతంత్ర వాదులందరు దాడులకు గురవుతున్నారు. మతతత్వ వాదుల దృష్టి కోణం నుండి దేశాన్ని చూడని వారందరూ దేశ ద్రోహులవుతున్నారు. ఆఖరికి అమీర్ ఖాన్, నసీరుద్దీన్ షా లాంటి ప్రముఖులు కూడా తమ పిల్లల భవిష్యత్ గురించి బెంగపడవలసిన పరిస్థితులు నేడున్నాయి. ప్రజాతంత్ర వాదుల గొంతుకలన్నీ కలిసి గళం విప్పకపోతే మన గొంతుకలు కూడా మూగబోయే ప్రమాదం పొంచి ఉంది.

ఈ మధ్య కాలంలో అభిప్రాయం భేదాలు తేల్చుకోడానికి చర్చలు పనికి రావడం లేదు. భౌతిక దాడులే సమాధానాలుగా ఉంటున్నాయి. ఈ మధ్యనే  ముంబైలో ఒక పుస్తకావిష్కరణ సభ జరిగింది. పుస్తకం పేరు – 'డేగా కాదు, పావురం కాదు' రచయిత పాకిస్తాన్‌కి చెందిన ఖుర్షిద్ మహమ్మద్ కసూరి. భారత్ పాకిస్తాన్‌లు ఐక్యంగా ఉండాలనే ఉద్దేశంతో రాసినది. సభకు అధ్యక్షత వహించడానికి వచ్చిన సుధీర్

కులకర్ణి మొహానికి నల్ల రంగు పులిమారు! కాశ్మీర్‌లో బిజెపి ఎంఎల్‌ఏ, స్వతంత్ర శాసన సభ్యుడు ఇంజినీర్ రషీద్ బహిరంగంగా దాడి చేసారు.

పరిస్థితులు ఎంత దుర్భరంగా ఉన్నాయంటే ఉర్దూ భాషాభివృద్ధి సంస్థ, రచయితలు "మేము మా రచనలలో భారతదేశ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గాని, దేశ ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా గాని ఏమి రాయలేదని 'హామీపత్రాన్ని' జతచేయ వలసివస్తున్నది. ఢిల్లీ, ముంబైలలో కూడా ముస్లింలకు ఇళ్ళు అద్దెకు దొరకడం లేదు. ఇటువంటి పరిస్థితి అమెరికా, ఇంగ్లాండ్‌లలో సహితం లేదు." అంటున్నారు.

మోడీ ప్రభుత్వానికి, సంఘ్‌కి మధ్య విభేదాలు తలెత్తకపోలేదు. కానీ, ఇద్దరూ సర్దుకుంటున్నారు. మోడీ ఆర్ఎస్ఎస్ విధానాలను విద్య, సాంస్కృతిక రంగాలలో అంగీకరిస్తే, ఆర్ఎస్ఎస్ మోడీ ఆర్థిక విధానాలకు మద్దతునిస్తున్నది. మోడీ పాలనలో సంఘ్ తన హిందుత్వ ఎజెండాను మరింత ముందుకు తీసుకుపోయే క్రమంలో ఉన్నది. 2014లో 32 సార్లు ముస్లింల పై మూకదాడులు జరగ్గా 23 మంది చనిపోయారు. గృహ మంత్రిత్వ శాఖ నివేదికల ప్రకారమే 2016లో 2015 కన్నా 1454 మతతత్వ దాడులు ఎక్కువగా జరిగాయి. 183 మంది చనిపోగా 4585 మంది గాయపడ్డారు. నిజానికి ఒక దాడి మతతత్వ దాడా కాదా అని నిర్ణయించేది స్థానిక పోలీసులే. మతతత్వ విషం నూరి పోసిన తరువాత చాలా సందర్భాలలో పోలీసులు, ఆవులను చంపారని నెపం వేసి చేసే దాడులను మతతత్వ దాడులుగా నమోదు చేయరు. కొన్ని సార్లు ఈ దాడులు మరీ పాశవికంగా జరుగుతున్నాయి. ఉదాహరణకి 12 ఏళ్ల ఇనయతుల్లా ఖాన్‌ని మహమ్మద్ మజ్‌లుమ్‌తో ఆవుల వ్యాపారం చేస్తున్నాడని అనుమానించి ఉరి తీశారు. మేవత్‌లో 14 ఏళ్ళ బాలికను ఆమె సోదరిని నలుగురు యువకులు మానభంగం చేశారు. బాధితురాలు, ఆవుమాంసం తింటున్నందుకు మిమ్మల్ని శిక్షిస్తున్నామని మాన భంగం చేయకముందు ఆ యువకులు ఆరోపించారని, ఆ తరువాత మీడియాకి తెలిపింది. చాలాసార్లు ఇటువంటి సంఘటనలు జరిగినప్పుడు గోవధో, గోమాంసం తినడమో కారణాలుగా చెప్పుకుంటున్నారు.

హిందువులు మెతకగా ఉన్నందువల్లనే మొగలులు, ఆ తరువాత ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశాన్ని ఆక్రమించిందనే తప్పుడు చారిత్రిక ఆధారాలు సృష్టించి, ప్రజల మనసులలో అభద్రతా భావం చొప్పించడం, ఆ తరువాత బానిసత్వానికి స్వస్తి చెప్పి ముస్లింలను ఎదిరించాలని పిలుపునివ్వడం ఈ కాలంలో పెచ్చురిల్లింది.

దేశంలో జరిగిన ఏ అనర్థానికైనా ముస్లింలే కారణమని నిందించడం పరిపాటయిందని ఎన్‌సిపి జాతీయ సదస్సులో రెండో రోజు, కేంద్ర వ్యవసాయ

మంత్రి శరద్ పవర్ అన్నారు; "హిందూ తీవ్రవాదులను ముసుగులేసి ప్రదర్శనలు చేయించడం నే నెప్పుడూ చూడలేదు. సనాతన సంస్థ లాంటి వాటిలో పనిచేసే హిందువులకు, వారి లౌకికతను నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. కానీ, ముస్లింలకు మాత్రం అటువంటి మినహాయింపులేం లేవు." అని అన్నారు.

మోడీ పాలనలో శిక్షలు అనుభవిస్తున్న ముస్లింల సంఖ్య చాలా ఎక్కువయ్యింది. దేశం మొత్తంలో లాకప్‌లో 658 మంది ముస్లింలు ఉండగా ఒక్క గుజరాత్‌లోనే 240 మంది ఉన్నారు. ఆరు కోట్ల గుజరాతీ జనాభాలో ముస్లింల జనాభా 58.61 లక్షలు. అంటే 9.7%. మొత్తం దేశంలో 17.2 కోట్ల మంది ముస్లింలు ఉంటే గుజరాత్‌లో ఉన్నది అందులో 3.9% మంది మాత్రమే. కానీ, మొత్తం లాకప్‌లో ఉన్న ముస్లింలలో 36.5% మంది గుజరాత్‌లోనే ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

2018 ఏప్రిల్ 20వ తేదీ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ జాఫర్లాట్, ఏ. కాలాయరసన్ ఒక వ్యాసం రాసారు. అందులోని అంశాలు భారతదేశంలోని విచారకర పరిస్థితులను వివరిస్తున్నాయి; నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, భారతదేశంలో ఉన్న 20 అత్యంత వెనుకబడిన జిల్లాల్లో 11 జిల్లాలు ముస్లింలు అధికంగా ఉండే జిల్లాలే. మతం భాషా మైనారిటీల పై వేసిన కమిషన్, రంగనాథ్ మిశ్రా కమిషన్, మైనారిటీల అభివృద్ధికి దోహదపడే చర్యలు తీసుకోవాలని సిఫారసు చేసింది. కానీ, దానిని పార్లమెంటులో ప్రవేశపెట్టనే లేదు. మైనారిటీలకు మేలు కలిగించే ఏ చర్య అయినా ఈ మెజారిటీ ప్రభుత్వం దృష్టిలో అన్యాయమే.

పోను పోను పోలీసులతో సైన్యంలో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గుతూవస్తున్నది. మోడీ పాలనలో ముస్లింలపై అనుమానాలు ఎంతగా పెరిగాయంటే, చివరికి గోమాంసం ఉందేమో అని అనుమానించి ముస్లింల టిఫిన్ డబ్బాలు కూడా శోధించే దశకు చేరుకుంది. ఈ ప్రభుత్వం ముస్లింలను పూర్తిగా వేరుచేస్తున్నది. సుప్రీం కోర్టు, ఆహారం తీసుకోవడం ఒక వ్యక్తిగత అంశమని తీర్పు చెప్పినా పరిస్థితులలో మార్పు లేదు.

చట్ట సభలలో ముస్లింల ప్రాతినిధ్యం ఈ కాలంలో గణనీయంగా తగ్గిపోయింది. ముస్లింలను ఎవ్వరినీ ప్రజా ప్రతినిధులుగా; ఎంపిక చేయకూడదన్నది బిజెపి విధానం. హిందువుల ఓట్లను తమవైపు తిప్పుకోడానికి, ఎన్నికలబరిలో ముస్లింలు ఎవ్వరూ సభ్యులుగా నిలబడకుండా చేస్తున్నది. జాఫర్లాట్, గిల్లేష్ వెర్నియర్స్ విశ్లేషణ: 'ముస్లింలను శాసన సభలకు పోటీచేయడానికి బిజెపి ఎంపిక చేయకపోవడంతో ఆంతర్యం ఉంది. ముస్లిం అభ్యర్థులే లేకపోతే హిందువుల ఓట్లన్నిటినీ తామే ఆకర్షించవచ్చు. ఆ విధంగా ఇతర పార్టీలలోని హిందువుల ఓట్లను కూడా

ఆకర్షించగలమని భావిస్తున్నది; ఇతర పార్టీలు ముస్లిం సభ్యులను ఎంపిక చేస్తే, వారిని 'ముస్లింలను బుజ్జగించడానికి ఎంపిక చేసుకున్నట్టు నిందిస్తున్నది; ఇందువలన ఇతర పార్టీలు కూడా ముస్లింలను శాసన సభ్యులుగా నిలపడానికి వెనకాడుతున్నాయి. 'ఫలితంగా ముస్లింల ప్రాతినిధ్యం శాసన సభలలో గణనీయంగా తగ్గిపోయింది. ఇతర పార్టీలు, ముఖ్యంగా కాంగ్రెస్ ముస్లింలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించి, బుజ్జగిస్తున్నదనడం ఎంత అసమంజసమో, ముస్లింలు యుపిఏ పాలనలో కూడా ఎంతగా పేదరికంలో ఉన్నారో చూస్తే అర్థమవుతుంది. కాంగ్రెస్ దిగజారుడు ప్రారంభమైన 1990 నుండి ఏనాడూ 7% కంటే ఎక్కువ మంది ముస్లింలను శాసన సభ్యులను ఎన్నికల బరిలో నిలపలేదు. సాంప్రదాయకంగా నమ్మే లౌకిక తత్వానికి తిలోదకాలిచ్చిన కాంగ్రెస్ 2009లో 29 మందిని మాత్రమే బరిలోకి దింపింది. అందులో 10 మంది మాత్రమే గెలిచారు. 2014లో 31 మంది కాంగ్రెస్ నిలిపితే 7 గురు మాత్రమే గెలిచారు.

బిజెపి కొత్తగా ఏ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా, అక్కడ ముస్లిం ఎంఎల్ఏ లు తగ్గిపోతారు. యుపిలో ఇది స్పష్టంగా కనిపించింది. 2017లో వారి ప్రాతినిధ్యం 17% నుండి 6%కి పడిపోయింది. 2012లో 17% చేరింది ఎస్పి వలెనే. ఎస్పి ముస్లిం శాసన సభ్యులను వారి జనాభాకు దామాషాగా నిలిపింది. 1991 తరువాత మళ్ళీ 2017లోనే వారి ప్రాతినిధ్యం అత్యంత హీన స్థాయికి చేరుకుంది. అప్పటికే బిజెపికి రాష్ట్రం పై ఆధిపత్యం వచ్చేసింది.

కాంగ్రెస్ బిజెపిలు, రెండూ పోటీచేసే రాష్ట్రాలలో, అంటే ఉత్తర, పశ్చిమ ప్రాంతాలలో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గడం మరింత స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ప్రాంతాలలో సాంప్రదాయంగా హిందూ జాతీయవాదుల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాంతాలలో బిజెపి తాము ఎన్నికల బరిలో ముస్లింలను దింపడం మానేయడమే కాక కాంగ్రెస్‌ను కూడా ఎన్నికలలో పోటీ పెట్టకుండా నిలవరించగలిగింది. దేశంలోని అతి పెద్ద మైనారిటీ గ్రూపుకు తమ సమస్యలను పార్లమెంటులో వినిపించే అవకాశాలు లేకుండాపోయాయి. లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయంలో అడిగిన ప్రశ్నలను పరిశీలిస్తే ఈ విషయం గమనించవచ్చు. అంటే మైనారిటీలకు సంబంధించిన ప్రతినిధులు ఉంటేనే వారి సమస్యలు, వారు ప్రాతినిధ్యం వహించే సంస్థల ముందుకువస్తాయి.

ఇర్ఫాన్ అహ్మద్ సోఫీ, సంతోష్ మెహరోత్రా ముస్లింలు ఏ మాత్రం పేదరికం నుండి బయట పడలేదని నిరూపించారు. జాతీయ సర్వేలో విద్యలో ముస్లింలు చాలా వెనకబడి ఉన్నట్టు తేలింది. ముస్లింల అభివృద్ధికి ఏం చేసినా అది వారిని

బుజ్జగించడానికని, ఓటు బ్యాంకు రాజకీయాలని ముద్ర వేయడంతో ఏ పార్టీ వారిని పట్టించుకునే పరిస్థితి లేకుండాపోయింది.

ఆర్ఎస్ఎస్ బ్రాండ్ బోధనలు విద్యార్థుల మనసులలో నాటుకుపోయాయి. సోనియా సర్కార్ ఈ విషయంలో బయట పెట్టిన విషయాలు మనకు హెచ్చరికలు కావాలి: 'పురాణాలు పాఠ్యాంశాలు అయ్యాయి. అసలైన చరిత్ర చరిత్ర పుస్తకాల నుండి తొలగించబడింది'. ఈ ధోరణి అనేక విశ్వవిద్యాలయాలలో కొనసాగుతున్నది. 2014 తరువాత పరిశోధకులందరూ జాతీయవాదం, హిందుత్వ, గోల్వాల్కర్, సావర్కర్, మోడీ, భారతదేశ పురాణాలకు పరిమితమవుతున్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీగారి (MADE IN INDIA) పిలుపు విద్యా సంస్థలలో పాతుకుపోయినట్టుంది.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్ర ఆచార్యులుగా ఉన్న కౌశల్ కిశోరె మిశ్రా, భారతీయ పరిశోధకులు కార్ల్ మార్క్స్ (జర్మన్ విప్లవవేత్త), వ్లదిమీర్ లెనిన్ (రష్యన్ కమ్యూనిస్టు) లను అధిగమించి భారతదేశ మహాపురుషులు, రాజకీయ వేత్తలు, విధాన కర్తలు, భారతీయ సంస్కృతి, స్పృహ మొదలైన విషయాలపై దృష్టి పెట్టాలని గట్టిగా నొక్కి చెప్పారు. మిశ్రా గారి విద్యార్థులు సాంస్కృతిక జాతీయవాదం, ఎంఎస్ గోల్వాల్కర్, రాజకీయాల్లో హిందూ మహాసభ నాయకుడు వినాయక్ దామోదర్ సావర్కర్ అనే అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. హిందుత్వకి సంబంధించిన అంశాన్ని విద్యార్థులు ఎంఫిల్, పిహెచ్డిలకు ఎంపిక చేసుకునే విధంగా ఆచార్యులు ప్రోత్సహిస్తున్నారు. మోడీని పొగడ్తలతో ముంచెత్తే ధోరణి గల పరిశోధనలదే పైచేయి. బిఎచ్యులో పరిశోధకులు 'ముస్లిం మహిళల స్వావలంబనలో మోడీ పాత్ర', 'మోడీ, ట్రంప్ – ఇద్దరి వ్యక్తిత్వాలు, వారి ఎన్నికలు', 'మోడీ ప్రవేశం తరువాత జాతీయ రాజకీయాలలో భారతీయ జనతా పార్టీ' వంటి అంశాలపై పరిశోధనలు చేస్తున్నారు. రాష్ట్రాల అధీనంలో ఉన్న విశ్వవిద్యాలయాలు, ఉదాహరణకి రాజస్థాన్లోని బికనీర్లో ఉన్న రామ్ మనోహర్ లోహియా అవధ్ విశ్వవిద్యాలయం వంటివి, 'హిందూ' మతం అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున కృషి చేస్తున్నాయి. ఫైజాబాద్ విశ్వవిద్యాలయంలో,' దీనదయాళ్ ఉపాధ్యాయ, ఆయన హిందుత్వ సిద్ధాంతం' అనే అంశంమీద పరిశోధన జరపడానికి నిధులు మంజూరు చేయబడ్డాయి.

కేవలం హిందుత్వ మీద మాత్రమే పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పడం నా ఉద్దేశం కాదు. అయితే, ఇటువంటి హిందుత్వకి సంబంధించిన యువ పరిశోధకులకు, వాటి చాంపియన్గా పరిగణించబడే మోడీకి సంబంధించిన అంశాలకే నిధులు సమకూర్చడంలో ప్రాధాన్యత ఉంటున్నది. అందువలన కేంద్రం నుండి నిధులు పొందాలనుకుంటున్న యువకులు ఇటువంటి పరిశోధనలను ఎంచుకునే అవకాశాలు

ఎక్కువగా ఉంటున్నాయి. అలాహాబాద్ విశ్వవిద్యాలయం రాజకీయశాస్త్ర విభాగ అధిపతి విజయ కుమార్ రోయి, 'దేశ యువ పరిశోధకులు రాబోయే రోజులలో ఆలోచనా సరళిని తీర్చిదిద్దుతారు; అందువలన విశ్వవిద్యాలయాలు ముందే ఊహించిన నిర్ధారణల ఆధారంగా ప్రాజెక్టులు తీసుకునేందుకు అనుమతించకూడదు' అన్నారు. కానీ, మోడీ హయాంలో నెహ్రూకి బదులుగా పరిశోధకుల గ్రంథ పట్టికలలో గోల్వాల్కర్ లాంటి వారికి సంబంధించిన పత్రాల చిట్టా పెరుగుతున్నది. 1990లలోని రామజన్మ భూమి ఉద్యమం తరువాత హిందుత్వ సిద్ధాంతానికి సంబంధించిన ప్రాధాన్యత విద్యాలయాలలో పెద్ద ఎత్తున పెరిగింది. మితవాద పరిశోధకులకు మంచి ఊతం లభించింది. మనోజ్ దీక్షిత్, లక్నో విశ్వవిద్యాలయంలో ప్రజా పరిపాలన బోధించే ప్రధానాచార్యుడు. ఆయన, ఆర్ఎస్ఎస్‌కి సంబంధించిన వారినే ఎంపిక చేసి విద్యాలయాల అధిపతులుగా నియమిస్తున్నారనే దానికి, ఐసిహెచ్ ఆర్‌కి, వై.సుదర్శన్ రావు, బిహెచ్‌యుకి, చంద్రకళ పాడియాని, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ అఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కి, నలంద విశ్వవిద్యాలయం విజయ్ భక్తర్‌ని నియమించడాన్ని ఉదాహరణలుగా చూపారు.

ఆర్ఎస్ఎస్ సభ్యులు విద్యాలయాలలో జరిగే సెమినార్‌లకి హాజరవడం సర్వ సాధారణమైంది. ఉదాహరణకి, భారతీయ రాజకీయ శాస్త్ర సంఘం వార్షిక సమావేశాలు 2015లో జరిగాయి. అందులో అత్యధిక పరిశోధనలు. 'రామరాజ్య సిద్ధాంతం– ప్రస్తుత రాజకీయాల్లో దానికి మనువాదంతో ఉన్న సంబంధం' పైనే వచ్చాయి. లక్నో విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఉపన్యాసం చెప్పడానికి శంకరాచార్య స్వామి, నిశ్చలానంద సరస్వతి ఆహ్వానించబడ్డారు. ఆయన అక్కడ వేదాలలోని కంప్యూటర్ల మూలాలున్నాయని మాట్లాడారు! కిందటి సంవత్సరం ఢిల్లీ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవానికి ఆర్ఎస్ఎస్ నాయకుడు, కృష్ణ గోపాల్ ఆహ్వానించబడ్డారు. విశ్వవిద్యాలయ చాన్సలర్ ర్యోగేష్ త్యాగి వేదికను ఎక్కబోతూ ఆ నాయకుని పాదాభివందనం చేసారు. డియుకి ఆర్ఎస్ఎస్ నాయకులూ ఇంద్రేశ్ కుమార్, మరికొందరు క్రమం తప్పకుండా విద్యాలయాలకు హాజరై ఉపన్యాసాలు చెపుతుంటారు. అన్నింటిలోను ఆర్ఎస్ఎస్, ఆర్ఎస్ఎస్ తన సిద్ధాంతమైన హిందూ జాతీయవాదాన్ని వినిపిస్తుంది. ఆ ఉపన్యాసాలు విన్న ఒక ఉపాధ్యాయుడు, 'ఒక వక్త అణువులో ఉండే పరమాణువులైన ఎలక్ట్రాన్స్, న్యూట్రాన్స్, ప్రోటాన్స్‌లను హిందూ దేవతలు – బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు అన్వయించారు' అన్నారు. ఐఐటి ఢిల్లీ దాదాపు మూడు డజన్ల పరిశోధన పత్రాలు, కేవలం పంచగవ్య, ఆవు పేడ, మూత్రం, పాలు, నెయ్యి, పెరుగు కలపడం వలన కలిగే ప్రయోజనాల పైనే వచ్చాయి.

మోడీ గురువు దీన్ దయాల్ ఉపాధ్యాయ చెప్పినట్టు, 'వారిని (ముస్లింలను) బుజ్జగించకండి; వదిలేయకండి; పవిత్రులను చేయండి' అనే అంశాన్ని మోడీ తూచా తప్పకుండ పాటిస్తున్నారు. హర్యానా ప్రభుత్వం రెండు కోట్లు పెట్టి 5000 కాపీల ఉపాధ్యాయ ప్రచురణలు కొన్నది. చత్తీస్ఘర్ 900 కాపీలు, మధ్యప్రదేశ్ 500 కాపీలు కొన్నాయి. అమిత్ షా, బిజెపి పాలనాలో ఉన్న ప్రభుత్వాలు ఈ పుస్తకాలు ప్రభుత్వ స్కూళ్ళు, కాలేజీలు తప్పనిసరిగా కొనేట్టు చూడాలని ఆజ్ఞాపించారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కూడా ఈ విషయంలో వెనక పడలేదు. సచిన్ పరాశర్ మాటలలో, 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ మతప్రచార సంస్థలు – లండన్ నుండి మాస్కో, స్పెయిన్ వరకు, ఉపాధ్యాయ వందో జన్మదిన ఉత్సవాలు జరిపాయి. ఈ ఉత్సవాలని ఘనంగా జరపడమే కాక, ఉపాధ్యాయను గురించిన ' మానవత్వము మూర్తీభవించిన వ్యక్తి, ఉపాధ్యాయ' ఒక ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. 'ఇంటిగ్రల్ హ్యూమనిజం' అనే సిద్ధాంతాన్ని 1965 ఏప్రిల్ 22–25లలో ఉపాధ్యాయ ప్రతిపాదించారు. విదేశీ వ్యవహారాల మంత్రి, సుష్మ స్వరాజ్ ఈ పుస్తకానికి ముందు మాట రాస్తూ, ఇవి ఉపాధ్యాయ ఆలోచనలలో కొన్ని ఆణిముత్యాలని, దీనిని దేశ విదేశాలలోని నాయకులు చదవాలని, వారికి బాగా ఉపయోగపడుతుందని రాసారు. విదేశీ మంత్రిత్వ శాఖలో ఇంతకు ముందు పనిచేసిన ఎంతో మంది విదేశాంగ కార్యదర్శులు దీనిని తీవ్రంగా విమర్శించారు. ఈ చర్య విదేశీ మంత్రిత్వ శాఖ దేశీయ వ్యవహారాలలో చొరబడడమే అని కూడా విమర్శించబడింది.

ముస్లింలను పరిశుద్ధులుగా మార్చాలన్న ఉపాధ్యాయ పిలుపు మోడీని, ఎంతగానో ఆకర్షించింది. ఆయనను నెహ్రూకి ప్రత్యామ్నాయంగా చూపాలని భావించారు. నెహ్రూ వంటి ఒక ఆరాధ్యుడి అవసరం వారికుంది. విభజించబడని, సమైక్య భారతదేశం ఉపాధ్యాయ కల కానే కాదు. కానీ, ఈ అభిప్రాయం ప్రచారం చేయడం, జాగ్రత్తగా ఆలోచించి చేసిన పనే. "కొంతమంది మేధావులు భారతదేశ విభజనతో విషయం సద్దుమణిగిందని భావించారు. ...వీరు చరిత్రను మరిచిపోయారు... పరిణామాలు ఎలా ఉంటాయో సరిగ్గా ఊహించలేదు. ఈ దేశం ముస్లింల పాలనలో అనేక సార్లు విభజించబడింది. కానీ, ఆ విభజనను హిందూ నాయకులు ఎన్నడూ అంగీకరించలేదు. వ్యతిరేకిస్తూ, పోరాడుతూనే ఉన్నారు. ఈ దేశంలో ఉన్నది ఒకే జాతి. ఇందులో మైనారిటీలకు తావే లేదు. ...ఈ దేశంలో ఉన్నది ఒకే సంస్కృతి; ముస్లింలకు క్రిస్టియన్లకు వేరు వేరు సంస్కృతులు లేవు. సంస్కృతికి పూజా విధానానికి సంబంధం లేదు; అది దేశానికీ సంబంధించిన అంశం. కబీర్, జయసి, రసఖాన్‌లు ముస్లింలకు ఆదర్శవంతంగా ఉండాలి. ఈ రోజు వారి విధేయత భారతదేశానికి

వెలుపల ఉంది. ముస్లింలు వారి సెంటిమెంట్లను, దృక్పథాన్ని పూర్తిగా మార్చుకోవాలనే ఉపాధ్యాయ అభిప్రాయం బాగా ప్రచారం చేయబడుతున్నది.

1965 యుద్ధకాలంలో ముస్లింలు నివసించని ఒక దారి, భారత్ పాకిస్తాన్ మధ్య ఉండాలని ఉపాధ్యాయ కోరుకున్నారు. ఈయన లేని లోటు జనసంఘ్‌లో లేని వారెవ్వరికి తెలియనే లేదు. ఆయన ఇతర జనసంఘ్ నాయకుల కంటే భిన్నమైన వ్యక్తి కానే కాదు. కానీ, ఒక ఆరాధనా రూపం కావాలి; అందుకని అద్వానీ అండ్ కంపెనీ ఆయనను ముందుకు తెచ్చింది. మతాల మధ్య ఆయన విషాన్ని విరజిమ్మారు; దానిని మోడీ ఉపయోగించుకోవాలని అనుకున్నారు. 2017 నాటికల్లా మోడీ ఈ ధోరణిలో కొంత ముందడుగు వేశారు. అందుకే అయిదేళ్లలోగా ప్రధాని కాగలిగారు. నరేంద్రమోడీ అన్ని సంస్థలను దిగజార్చగలిగారు; వాటిని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలతో నింపగలిగారు. పార్లమెంటుకు గాని ప్రసార మాధ్యమాలకుగాని ఆయన జవాబుదారీ కాదు; హిందుత్వ సిద్ధాంతాన్ని రాజ్యాధికారం సహాయంతో ఒక్క గుజరాత్‌లోనే కాదు, మొత్తం దేశం అంతటా ప్రచారంలో పెట్టారు; దేశవ్యాప్తంగా ఒక చీలికని తెచ్చిపెట్టారు. వైషమ్యాలు పెంచారు. క్రమంగా గుజరాత్ విధానాలు దేశవ్యాప్తంగా అమలవుతున్నాయి.

◆

# ఆఖరి పోరాటం–2018

నరేంద్ర మోదీ గాని ఆర్‌ఎస్‌ఎస్ గాని వారి ఎన్నికల ప్రచారాన్ని ఏనాడూ ఆపలేదు. నిరంతరంగా కొనసాగిస్తూనే ఉన్నారు. 2014 ఎన్నికలలో గెలిచినా వారేమాత్రం ఎన్నికలపై తమ కేంద్రీకరణను తగ్గించలేదు. మోడీ హయాంలో, ప్రభుత్వ సంస్థలలో ఆర్‌ఎస్‌ఎస్ ముద్ర కొనసాగింది; మోడీ ప్రత్యర్థి పార్టీలను అప్రతిష్టపాలు చేసారు; నెహ్రూను అపఖ్యాతి పాలుచేశారు; రాజ్యాంగ పాలనా వ్యవస్థలను అవినీతిమయం చేసారు. ప్రధాన మంత్రి, క్యాబినెట్ మంత్రులతో చర్చించి వారి ద్వారా కార్యక్రమాలను నిర్వహించడం కాక స్వయంగా అధికారులకు ఆదేశాలివ్వడం మోడీ హయాంలో మొదలైంది; దానితో అధికారులు, మంత్రులు నామ మాత్రమయ్యారు. 2014లో పొందిన విజయాలను, 2019లో స్థిరపరచుకోడం పైనే మోడీ దృష్టి పెట్టారు. 'కాంగ్రెస్ నుండి భారతదేశాన్ని విముక్తి చేయడమే' లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే ఒకే పార్టీ ఆధిపత్యం కొనసాగించే ప్రయత్నాలను ముమ్మరం చేసారు. పైగా 2015 ఆర్‌ఎస్‌ఎస్ శత వార్షిక సంవత్సరం. అందువలన పూర్తిగా కేంద్రీకరించి పనిచేసారు.

దేశంలో తన మద్దతు పెంచుకోడానికి మోడీ విదేశీ ప్రయాణాలను వ్యక్తిగత స్థాయికి మార్చుకున్నారు. ప్రసార మాధ్యమాలు ఇందుకు పూర్తి మద్దతునిచ్చాయి.

ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పుడు మరింత సానుకూల పరిస్థితులలో పని చేయగలుగు తున్నది. మోహన్ భగవత్ నిరంతరంగా విషంగక్కుతూ ఇతర ఆర్‌ఎస్‌ఎస్ నేతలందరికంటే ఎక్కువగా హిందుత్వను గురించి ప్రసంగాలు చేస్తున్నారు. ఆతని అనుచరగణం అతని బాణీని అందుకుంటున్నది. ముస్లింల మీద, క్రిష్టియన్ల మీద స్వతంత్ర భారతదేశంలో ఇంతటి విద్వేష వాతావరణం ఇదివరకెన్నడూ చూడలేదు. ఉత్తరప్రదేశ్ ఎంఎల్ఎ సురేంద్ర సింగ్, బలియాలో, 'ముస్లింలలో చాలా కొద్దిమందే దేశభక్తులున్నారు. మనదేశం హిందూ రాష్ట్రంగా మారిన వెంటనే మన సంస్కృతిలో

మమేకమైన ముస్లింలే ఇక్కడుంటారు. కానివారు ఇతర దేశాలలో ఆశ్రయం పొందవచ్చు' అన్న రాగం అందుకున్నారు. జనవరి 14న రిపోర్టర్స్‌తో అన్నమాటలివి. నరేంద్రమోడీని 'అవతార పురుషుడంటూ', ఆకాశానికెత్తేస్తూ, 'దేవుడి దయవలన నరేంద్రమోడీ, యోగి ఆదిత్యనాథ్ లాంటి వ్యక్తుల నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన దేశంగా అవతరిస్తున్నదని' అన్నారు. 2024 కల్లా భారతదేశం ఒక 'విశ్వ గురువుగా' అవతరించడమే కాక హిందూ రాష్ట్రంగా కూడా మారుతుందని ప్రవచించారు.

ఆర్ఎస్ఎస్, బిజెపిలు మతవిద్వేషాలను పెంచి, నరేంద్రమోడీని పొగడ్తలతో ముంచెత్తే గ్రూపులను, వ్యక్తులను పోషిస్తూ ఉంటాయి; సాక్షి మహారాజ్ ఇందుకు ఉదాహరణ. ఇప్పటివరకు అంతగా ఉపయోగించని 'విశ్వగురువు' అనే పదం ఆ తరువాత పదే పదే ఉపయోగించడంతో మంచి ప్రాచుర్యం పొందింది. జనవరి 21న మోహన్ భగవత్ భారతదేశాన్ని విశ్వగురువుగా మార్చడమే ఆర్ఎస్ఎస్ లక్ష్యంగా చెప్పుకున్నారు. ఫిబ్రవరి 11న భారత సైన్యానికి శక్తివంతంగా తయారవడానికి 6,7 నెలలు పడుతుందిగాని ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు 3 రోజుల్లో సైనిక శిక్షణపొంది మంచి సైనికులుగా తయారవుతారని అన్నారు. ఇటువంటి తెలివి తక్కువ ప్రకటనలను చేయడం, ఆ తరువాత వెంటనే అవి తాము అనలేదనడం ఆర్ఎస్ఎస్ పెద్దలకు మామూలే. అందుకనే వారి మాటల్లో సరిగ్గా ఏమన్నారో చూద్దాం. "మాది సైనిక సంస్థ కాదు. కానీ, మావాళ్లకు మంచి క్రమశిక్షణ ఉంది. దేశానికి అవసరమైతే, మా స్వయం సేవకులు 3 రోజుల్లో సైనికులుగా మారగలరు. ఇది మా సమర్థత."

కర్రలు, త్రిశులాలు పట్టుకుని వీధులలో పోరాడడం, యుద్ధభూమిలో తుపాకులు, రాకెట్ లాంచర్లు వంటి ఆధునిక ఆయుధాలతో పోరాడడం ఒకటేనని అనుకుంటున్నట్టున్నారు భగవత్ గారు! మోడీ గారి పాలనలో రాజ్య పాలన, బిజెపి పార్టీ పని, ఆర్ఎస్ఎస్ సంస్థ పని ఒకటిగా మారాయి. రాష్ట్ర అధికారులను ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యక్రమాలకు వినియోగించుకుంటున్నారు. కోల్‌కతాలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలోని ఒక ఎన్‌జిఓ నడుపుతున్న కార్యక్రమంలో పాల్గొంటున్న డిజిపిని చూసి, "యూనిఫామ్‌లో ఉండి, డిజిపిగా పనిచేస్తున్న కెకె శర్మకి అక్కడేం పని" అని తృణముల్ కాంగ్రెస్ ఎంపి. డెరెక్ ఓ బ్రియన్ ప్రశ్నించారు.

దేశంలో జరిగే ప్రతి సంఘటనను మతానికి ముడిపెట్టడంలో మోడీ నిష్ణాతుడు. 2017 నవంబర్ మాసంలో 21వ తేదీ కాన్పూర్ దగ్గర ఒక రైలు, పట్టాలు తప్పింది. ఆ సంఘటనలో 150 మంది చనిపోయారు. 2018 ఫిబ్రవరి నెలలో 24వ తేదీ గొండలో ఒక సభలో మోడీ మాట్లాడుతూ, ఇది దేశ సరిహద్దులలో ఉన్నవారి కుట్ర

అని ఆరోపించారు. ఒకదేశ ప్రధాని సంఘటన జరిగిన రెండు నెలలకి అదొక కుట్ర అని ఆరోపించడం ఎంత అసమంజసం! "గొండ, నేపాల్ సరిహద్దులో ఉంది. శత్రువులు సరిహద్దులో చర్యలకు పాల్పడుతుంటే ఎదుర్కోవలసిన అవసరం లేదా" అని ప్రశ్నించారు. అవసరం ఉంది. కానీ, ఏ సందర్భాన్ని ఉపయోగించుకున్నారన్నదే ఇక్కడ ముఖ్యమైన అంశం. మతవిద్వేషాలు రెచ్చగొట్టేందుకు ఏ ఒక్క అవకాశాన్ని మోడీ వదిలిపెట్టరు. అంతే కాదు; అవకాశాలు కల్పించుకుంటారు కూడా. కబ్రిస్థాన్, రంజాన్ vs దీపావళి ఉదాహరణనే చూడండి. ఉత్తరప్రదేశ్‌లోని పదకొండు జిల్లాలలో 52 సీట్లకు ఫిబ్రవరి 27న ఐదో విడత ఎన్నికలు జరగనున్నాయి. ఇందులో గోండ్ ఒకటి. గోండులో ఎన్నికల ప్రచారం కోసం ఉపన్యాసం చెబుతూ "కుట్రదారులకు సహకరిస్తున్న ఇటువంటి అధికారుల అధీనంలో గోండు ఉంటే దేశానికీ ఏమైనా రక్షణ ఉంటుందా?" అని ప్రశ్నించారు. అందువలన దేశభక్తిగలవారంతా బిజెపికి ఓటు వేయాలని కోరారు. గోండ్‌కి ఏరకంగానైనా మేలు జరగాలంటే, దేశభక్తిగల పౌరులు బిజెపికి ఓటు వేయాలని అంటూ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఎస్‌పికి గాని, బిఎస్‌పికి గాని ఒక్కసీటు కూడా దక్కకూడదన్నారు. నూటికి నూరు శాతం ఓట్లు బిజెపికే పడాలన్నారు. కానీ, తరువాత రైలు దుర్ఘటన పై జరిగిన పరిశోధనలలో, జరిగిన సంఘటనలో కుట్ర కోణం ఏది లేదని తేలింది. పట్టాలపై కుట్రకు సంబంధించిన ఎటువంటి అధారాలు లభ్యం కాలేదు. అంటే మోడీ ప్రయత్న పూర్వకంగానే జాతి రక్షణ, దేశభక్తి వంటి అంశాలను ఓట్ల కోసం వాడుకుంటున్నారన్నమాట. దీని వలన ప్రజల మనోభావాలు ఎలా దెబ్బతింటాయో ఆయనకు అనవసరం.

2019 సాధారణ ఎన్నికల ముందు అఖిల భారతీయ ప్రతినిధి సభ ఆర్ఎస్ఎస్ జరుపుకుంది. ఇందులో సంఘ్ పరివార్‌కు చెందిన 1500 ప్రతినిధులు పాల్గొన్నారు. సంఘ్ సభ్యులు అంతా కలిసి 2019 సాధారణ ఎన్నికలను ఒక్కటిగా ఎలా ఎదుర్కోవాలో ఈ సభలో పిలుపునిచ్చారు. ఈశాన్య భారతదేశ ఎన్నికలలో బిజెపి గెలుస్తున్న కొద్దీ బిజెపి ఆధిపత్యంతో పాటుగా ప్రజలలో ఆర్ఎస్ఎస్ పరపతి కూడా పెరుగుతున్నది. ఆర్ఎస్ఎస్‌కి కావలసినది కూడా అదే. మోడీ, షాల పరపతి ఎంత పెరిగినా అది ఆర్ఎస్ఎస్‌కి ఒక మెట్టు కిందనే ఉండాలి. సర్ కార్యవాహక్ నే కాక ఆర్ఎస్ఎస్ ముఖ్య విభాగాలైన, బిఎంఎస్, విహెచ్‌పి, నాయకులను కూడా తానే నిర్ణయించాలి. బిజెపిని గెలిపించడమే ఆర్ఎస్ఎస్ ముఖ్య ఎజెండాగా పెట్టుకుంది. ఆ యేడు ఆర్ఎస్ఎస్ శతవర్ధంతి కావడంతో ఈ ఎన్నికల ఫలితాలు మరింత కీలకం కానున్నాయి.

మోడీ, భగవత్ లిద్దరూ ఎన్నికల నగారాలు ముందుగానే మోగించారు. "నేను హిందువునని గర్వంగా చెప్పుకో. హిందువులుగా మనమందరం ఐక్యంగా ఉండాలి. ఎందుకంటే ఈ దేశం బాధ్యత మన పైనే ఉంది. ప్రాచీన కాలం నుండి ఇదే మన స్వస్థలం. మనకు వెళ్ళడానికి ప్రపంచంలో ఇంకెక్కడా స్థానం లేదు. ఈ దేశానికి ఏదైనా జరగకూడనిది జరిగితే ఆ బాధ్యత మనదే. అని మీరట్‌లో భగవత్ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలనుద్దేశించి ఉపన్యసించారు. ఆ సమావేశానికి 3 లక్షల మంది వచ్చినట్టు రిజిస్టర్ అయింది. ఇది ఈ మధ్య కాలంలో అత్యంత పెద్ద సభగా పేర్కొనబడింది. "మనం మరింత నిఖార్సైన హిందువులుగా ఉండాలి. అటువంటప్పుడే మనం మరింతగా వైవిధ్యాన్ని ఆహ్వానించగలుగుతాం, అంటూనే భగవత్ అందులో కూడా ఒక హెచ్చరిక చేసారు; "ఈ ప్రపంచం, మన వెనక బలమైన శక్తి ఉన్నప్పుడే మనం చెప్పే మంచినైనా వింటుంది" అన్నారు. అంటే ఆర్ఎస్ఎస్ తన బలాన్ని పెంచుకుని తీరాలని నొక్కి చెప్పడమే. పైగా "దేవుళ్లైనా ఏ మాత్రం శక్తి లేని మేక పిల్లలను తినడానికే మొగ్గుచూపుతారు. బలం లేనివారిని ఎవరూ గౌరవించరు. అయితే, అందుకు మీరేం బల ప్రదర్శన చేయనక్కరలేదు. బలం ఉంటే అదే ప్రదర్శించబడుతుంది." అంటూ ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకి ఉపదేశించారు.

60000 శాఖల ప్రతినిధులు తమ కొత్త సర్ కార్యవాహకుని ఎన్నుకునేందుకు హాజరైన సభను ఉద్దేశించి శ్యాం లాల్ యాదవ్ మాట్లాడుతూ, ఆర్ఎస్ఎస్ పని విధానాన్ని చక్కగా వివరించారు. "ఈ సభకు ఆర్ఎస్ఎస్‌కి సంబంధించిన అన్ని ప్రజా సంఘాలవారు హాజరయ్యారు. ఈ అఖిల భారతీయ ప్రతినిధుల సభలో అత్యధిక ప్రాతినిధ్యం ఉన్నది విహెచ్‌పికి. మాజీ ప్రాంతీయ ప్రచారకులను కూడా ఆర్ఎస్ఎస్ ఆహ్వానించింది. బిజెపి తరఫున దాని అధ్యక్ష కార్యదర్శులు హాజరయ్యారు. సర్ కార్యవాహక్ సురేష్ భయ్యాజీ ఆర్ఎస్ఎస్ భారతదేశంలో 59136 ప్రాంతాలకు విస్తరించినట్టు చెప్పుకున్నారు. ఈ అన్ని ప్రాంతాలలో వారానికి ఒక సరైన సమావేశాలు జరుగుతున్నాయి.

ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్‌కి ఎన్నికలు జరగవు. అధినాయకుడే తన వారసుడిని నియమిస్తాడు. అతడు జీవితకాలం కొనసాగుతారు. ఆర్ఎస్ఎస్‌కి తన ఆధీనంలోని అన్ని విభాగాలపైనా సంపూర్ణ మైన పాలనాపర ఆధిపత్యం ఉంటుంది. బిజెపి ఇప్పుడు కేంద్రంతో పాటు 22 రాష్ట్రాల్లో ప్రత్యక్షంగా గాని, భాగస్వామ్య పక్షంగాగాని అధికారంలో ఉంది. లోక్‌సభ ఎన్నికలు ముందుండడం వలన పార్టీకి, దాని సైద్ధాంతిక మార్గదర్శికి మధ్య సంబంధం మరింత సన్నిహితంగా ఉండాలి. ఒకవైపు ఆర్ఎస్ఎస్ తానొక రాజకీయ పార్టీ కాదంటూనే ఉంటుంది;

వేరొక వైపు ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు బిజెపి తరఫున రాజకీయ ప్రచారంలో ప్రముఖ పాత్ర వహిస్తుంటారు. ఆర్ఎస్ఎస్ కూడా పెద్దన్న పాత్ర పోషించడాన్ని కోరుకుంటుంది. ప్రచారకులు కేంద్ర రాష్ట్ర విధానాల రూపకల్పనలను, నియామకాలను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. అందువలన ఎన్నికలను ఎదుర్కోడానికి ఆర్ఎస్ఎస్‌కి ఇప్పుడు గట్టి సర్ కార్యవాహక్ అవసరం ఉంది. తన కార్యకర్తలకి, బిజెపి విధానాలకు మధ్య సన్నని గీతను నిలపాల్సిన అవసరం ఉంది. అందుకు జోషి తగిన వ్యక్తిగా భావించబడ్డారు. ఆర్ఎస్ఎస్ విభాగాలైన భారతీయ మజ్దూర్ సంఘ్, విహెచ్‌పి, భారతీయ కిసాన్ సభ, స్వదేశ్ జాగారణ మంచ్‌ల మధ్య తీవ్రమైన విభేదాలు ఉన్నా; నరేంద్రమోడీ ప్రభుత్వ విధానాలు నచ్చకపోయినా, విభేదాలనన్నిటిని పక్కన పెట్టి 2019 ఎన్నికలను ఎదుర్కోవలసి ఉంటుంది. అందుకు ఆర్ఎస్ఎస్ సన్నాహాలు చేస్తున్నది.

జవదేకర్ మాటల్లో “భారత భూభాగంలోని 96% ప్రాంతాలలో ఇప్పుడు సంఘ్ కార్యకలాపాలు నడుస్తున్నాయి.” ఆర్ఎస్ఎస్ సభ్యత్వం ఉచ్ఛస్థితిలో ఉంది. మోడీ ప్రధానమంత్రి అయిన తరువాత సంఘ్ ఉనికి 30% పెరిగింది. కృష్ణ గోపాల్ మాటల్లో “ఇది వరకు బిజెపి ఉనికి లేని చోట సంఘ్ చాపకింద నీరులాగా విస్తరించడం ప్రారంభించింది. కేవలం ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 1.25 లక్షల పట్టణ వాసులు, ముఖ్యంగా వృత్తిదారులు భారతదేశంలోగాని విదేశాలలోగాని, సంఘ్‌లో చేరేందుకు ఉత్సాహం చూపించారు. ఇదివరకెన్నడూ ఇంత పెద్ద ఎత్తున సంఘ్‌లో చేరేందుకు ఉత్సాహాన్ని చూపిన దాఖలాలు లేవు.”

ఆర్ఎస్ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రభుత్వేతర సంస్థ. 2016లోని ఒక నివేదిక ప్రకారం, ప్రతిరోజూ 57000 ఆర్ఎస్ఎస్ శాఖలు పనిచేస్తాయి; 15 నుండి 20 లక్షల మంది ఈ శాఖలలో ఉంటారు. 14000 శాఖలు వారానికొకసారి సమావేశమవుతాయి. 7000 శాఖలలో నెలకొకసారి సమావేశాలు జరుగుతాయి. ఈ శాఖలు 36293 ప్రాంతాలలో జరుగుతాయి. పైగా ఆర్ఎస్ఎస్‌కి 60 లక్షల మంది స్వయం సేవకులు, కార్యకర్తలు, పూర్వ సభ్యులు ఉన్నారు. ఇదొక పెద్ద సంస్థ అనేదానిలో సందేహమే లేదు; కానీ, ఈ సంస్థ ఈ మధ్య కాలంలో ఇబ్బడిముబ్బిడిగా పెరిగింది. ఒక్క 2018లోనే 1800 సంఘ్ శాఖలు పెరిగాయి. అయినా సంఘ్ తన లక్ష్యాన్ని ఏమాత్రం ఉపేక్షించలేదు. ఆర్ఎస్ఎస్ తన శాఖలు తన సైద్ధాంతిక లక్ష్యాలను చేరుకోడానికే, ఎటువంటి రాజీలు లేకుండా పనిచేయాలని ఆదేశిస్తున్నది. అందుకు నిరంతరంగా కృషిచేస్తున్నది.

ఆర్ఎస్ఎస్ ప్రజలలో మమేకమయ్యేందుకు మరో అస్త్రం రామ మందిరం.

"ప్రభుత్వం రామజన్మభూమిలో మందిర నిర్మాణానికి అనుమతిస్తుందని భావిస్తున్నాను" అని ఒక వృద్ధ ఆర్ఎస్ఎస్ నాయకుడు అన్నాడు. ప్రభుత్వానికి విధానపరమైన నిర్ణయాలు చేయడంలో కొంత వెసులుబాటు కలిగించినప్పటికీ సంఘ్ ప్రభుత్వంపై పట్టును ఏమాత్రం సడలించలేదు. నిరంతరం నియంత్రిస్తూనే ఉంది. ఏదేమైనా మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత సంఘ్ ఎదుగుదల మూడు పువ్వులు ఆరుకాయలుగా ఉంది. అందువలననే ఆర్ఎస్ఎస్ అధిపతి, 3 రోజుల్లో మేము కార్యాచరణకు దిగగలమని హెచ్చరించగలిగారు. ఈ మతతత్వ, రహస్య మిలిటెంట్, ఫాసిస్ట్ సంస్థ బిజెపి ఎజెండాను నిర్ణయిస్తుంది. "ఆర్ఎస్ఎస్ సహాయం లేకుండా బిజెపి ఎన్నికలలో నెగ్గలేదు. ఆర్ఎస్ఎస్ బలంతోనే భగత్ నమ్మకం కూడా పెరిగింది." అందుకనే హిందువులను, మతం విషయానికి వచ్చేసరికి ఘర్షణలకు సిద్ధంగా ఉండాలని నేను చెపుతున్నాను. .. "హిందువులు మూడో వంతు సమయాన్ని దేశం కోసం వెచ్చించాలి" అనగలిగారు.

ఇటువంటి ప్రసంగాలు మైనారిటీలలో అభద్రతను పెంచుతాయి. క్యాథలిక్స్, బిషప్స్ కాన్ఫరెన్సు అధ్యక్షుడు, కార్డినల్ ఓస్వాల్ గ్రాసియోస్, "మైనారిటీల రక్షణ కోసం ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదు" అని అన్నారు. ''భయమని అనలేముగాని, మైనారిటీలు ఆందోళనకి గురవుతున్నారు; దేశంలోని ప్రతి చర్చి దాడులకు గురవుతున్నదని అనలేంకాని ప్రభుత్వం వాటి రక్షణకు తగిన చర్యలు తీసుకోవడం లేదు; మైనారిటీల మీద దాడులు తప్పన్న సందేశాన్ని అందించడం లేదు అన్నదే నా ఆరోపణ" అన్నారు. గోవా ఆర్క్ బిషప్ ఫిలిప్ నేటి ఫెరారా, ఢిల్లీ ఆర్క్ బిషప్ అనిల్ కవుతో కూడా భారతదేశంలో 'ఏక సంస్కృతి' వ్యాప్తి చేసే పరిస్థితులు ఉంటున్నాయని, ఇవి ఆందోళన కలిగిస్తున్నాయని, రాజ్యాంగంలో కల్పించబడిన మౌలికమైన అంశాలు – లౌకిక తత్వం, వాక్స్వాతంత్ర్యం, మత సంప్రదాయాలను పాటించే స్వేచ్ఛ కోసం చర్చిలు కృషి చేయాలని సూచించారు.

భిన్న విశ్వాసాలున్న భారతదేశంలో మెజారిటీ మతానికి చెందినవారి ప్రవర్తన మైనారిటీ మతస్థులను ఆందోళనకు గురిచేసేట్టు ఉంటే దేశంలో ప్రశాంత వాతావరణం దెబ్బతింటుంది. మోడీగారి పాలనలో ఆర్ఎస్ఎస్ సూత్రాలకనుగుణంగా హిందువులను ఏకం చేయాలనే సంకల్పం వలన ఇతర మతస్థులు అభద్రతకు లోనవుతున్నారన్నది నిర్వివాదాంశం.

ఎన్నికలు దగ్గరవుతున్న కొద్దీ ఆర్ఎస్ఎస్ బిజెపిల మధ్య సఖ్యత పెరుగుతూ వస్తుంది. ఆర్ఎస్ఎస్ తన కార్యదర్శులను రంగంలోకి దించి, ఆర్ఎస్ఎస్ బిజెపిల మధ్య సమన్వయం కుదర్చడానికి నియోగించింది. ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం అమిత్

షాతో నేరుగా సమన్వయం చేసుకోవడం మొదలుపెట్టింది. ఎన్నికల బరిలో నిలబెట్టాల్సిన సభ్యుల దగ్గరి నుండి ఫలితాలు వెలువడే వరకు ప్రతి అంశాన్ని నిశితంగా, ప్రణాళికాబద్ధంగా రూపొందించడం జరిగింది. 2017లో మొదటిసారిగా యుపిలో, ఆ తరువాత కర్ణాటకలో ఇటువంటి ప్రయోగం చేసి, ఫలితం రాబట్టగలగడంతో అది దేశ వ్యాప్తంగా అనుసరించడం మొదలైంది.

ఎన్నికల ఎత్తుగడలలో భాగంగా ఇతర పార్టీలతో పొత్తులు పెట్టుకున్నా, ఆర్ఎస్ఎస్‌కి నచ్చని సభ్యులను ఎంపిక చేస్తే, కార్యకర్తలు ఆ సభ్యుని కోసం ప్రచారంలో పాల్గొనరన్న అంశాన్ని దృష్టిలో పెట్టుకుని, సభ్యుల ఎంపిక చేయబడింది. ఆర్ఎస్ఎస్ తన కార్యకర్తలను బిజెపితో సన్నిహితంగా మెలగడానికి కూడా అనుమతించదు. నిజానికి ఆర్ఎస్ఎస్‌కి బిజెపి మిత్ర పక్ష పార్టీలంటే ఏ మాత్రం అభిమానం లేదు; ఎన్‌డిఏకి పరిమితమైన నిర్ణయాత్మక స్థానం ఉన్నప్పటికీ, అవకాశం ఉంటే ఎన్‌డిఏ కూలిపోవడాన్నే కోరుకుంటుంది. అమిత్ షా, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘర్ మిజోరాం తెలంగాణలలో జరగబోయే ఎన్నికలలో ఆర్ఎస్ఎస్ సహాయాన్ని కోరుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఏప్రిల్ మేలలో జరగబోయే ఎన్నికలకు ప్రణాళికలను అనుసరించవలసిన విధానాలను కూడా ఆర్ఎస్ఎస్‌నే సూచించాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్‌లోని తుంగభద్రా నదీతీరాన ఉన్న కర్నూల్‌లో మూడు రోజులపాటు జరిగిన 'చింతన్ బైఠక్' (సమాలోచన)కి ఆర్ఎస్ఎస్, బిజెపి, విహెచ్‌పిలకు సంబంధించిన కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సమావేశాన్ని ఉద్దేశిస్తూ అమిత్ షా, సామాజిక, రాజకీయ, విద్యా రంగాలలో కార్యక్రమాలను పునః పరిశీలించుకోవాలని, కార్యక్రమాలు సమర్థవంతంగా జరగడానికి ఏయే చర్యలు తీసుకోవాలో చర్చించాలని కోరారు. నరేంద్రమోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేసిన మంచి కార్యక్రమాలను ప్రచారం చేసి, ఎన్నికలకి సహకరించవలసిందిగా ఆర్ఎస్ఎస్‌ని అర్థించారు.

ఆర్ఎస్ఎస్ తన పరపతిని జాతీయంగా అంతర్జాతీయంగా పెంచుకోవాలని అనుకున్నది; అంటే మైనారిటీలలో కాదు; ఆర్ఎస్ఎస్ అంటే సద్భావం లేని హిందువులలో. అందుకుగాను పాకిస్తాన్‌ను విడిచిపెట్టి మిగిలిన 60 విదేశీ రాయబారులను ఆహ్వానించింది. జాతీయ ప్రాంతీయ రాజకీయ పార్టీలను, ప్రసార మాధ్యమాలను, పారిశ్రామిక వేత్తలను, ఇతర రంగాల వారిని కూడా ఆహ్వానించింది. ఇందుకు దేశాధ్యక్షుడు ప్రణబ్ ముఖర్జీ సహాయాన్ని కూడా తీసుకుంది. 2018 జూన్ 7వ తేదీ ముఖర్జీ నాగపూర్‌లోని ఆర్ఎస్ఎస్ ముఖ్య కార్యాలయాన్ని సందర్శించారు.

'భారతదేశ భవిష్యత్తు : ఆర్ఎస్ఎస్ దృక్పథం' అనే విషయం పై మోహన్ భగవత్ 2018 సెప్టెంబర్ 17న ప్రసంగించారు. మోడీ ప్రభుత్వాన్ని భారతదేశమంతటిని కలుపుకుని పోయే ప్రభుత్వంగా నిరూపించుకునేందుకు శతధా ప్రయత్నించారు. ఒక ప్రకటనలో "ముస్లింలు లేని హిందూ రాష్ట్రం లేదన్నారు". "హిందూ రాష్ట్రం నిర్మించడం అంటే ముస్లింలకు చోటు లేదని కాదు. రాబోయే రోజుల్లో ఒక రోజు 'హిందుత్వ' అని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం ఉండదు. ప్రపంచమంతా ఒకే కుటుంబం (వసుధైక కుటుంబం) గా మారుతుంది." అన్నారు. దానర్థం, జవహర్‌లాల్ విశ్వవిద్యాలయం ఆచార్యులు బద్రి నారాయణ భగవత్ గారి ప్రకటనలో ఉంది, "ముస్లింలు లేని హిందూ రాష్ట్రం లేదంటే, దాని అర్థం, తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించే అన్ని తరగతుల, మతాల ప్రజలను తమలో విలీనం చేసుకోవడమో, కలుపుకోవడమో లేదా ఇముడ్చుకోవడమో చేస్తారని". పదాలలో అవసరాన్ని బట్టి భేదాలు ఉండవచ్చు. కానీ, ఆర్ఎస్ఎస్ ఆలోచనలో ఏమాత్రం మార్పు ఉండదు. ఆయన ప్రసంగం అంతా వింటే ఆయన ఏం చెప్పదలుచుకున్నారో స్పష్టంగా అర్థం అవుతుంది. "మనం మన దేశాన్ని హిందూ రాష్ట్రమని పిలుచుకోడానికి కారణం, ఇక్కడ ఒకే మతం, అంటే హిందూ మతం, ఉందని కాదు. ఈ దేశం వేలాది ఏళ్లుగా అన్ని ఆచారాలను సాదరంగా స్వీకరిస్తున్నందుకు, వారితో మమేకమవుతున్నందుకు."

ఈ ముసుగు కూడా రెండు రోజుల్లో తొలగిపోయింది. సెప్టెంబర్ 19వ తేది "రాముడు మెజారిటీ మతస్థుల దేవుడు; అంతేకాదు దేశ రక్షకుడు, దేశ ప్రతిష్ట కూడా. భారతదేశంలో అన్ని తరగతుల ప్రజలకు పూజ్యనీయుడు. ఎన్నో రామమందిరాలు దేశంలో ధ్వంసం చేయబడ్డాయి. మేము వాటి గురించి మాట్లాడడం లేదు. రాముడు పుట్టిన స్థలంలో రామ మందిరం గురించి మాత్రమే మాట్లాడుతున్నాం. అక్కడ తప్పనిసరిగా మందిరం నిర్మించబడవలసిందే. మందిర నిర్మాణంతో సమస్య పరిష్కరించబడుతుంది" అన్నారు. భగవత్ గారి మాటలు, వారి గురువర్యులు గోల్వాల్కర్ గారి 'బంచ్ ఆఫ్ థాట్స్' లోని మాటలను కాస్త సవరించినట్టు కనిపిస్తుంది. కానీ, వాస్తవంలో ప్రతి ఆర్ఎస్ఎస్ కార్యకర్త ప్రమాణం చేసేది ఆ 'బంచ్ ఆఫ్ థాట్స్' (పాంచజన్యం) లోని వాక్యాలే.

ఆర్ఎస్ఎస్ బిజెపికి అన్ని విధాలా సహాయం చేస్తుంది. కానీ, దాని ఆధిపత్యాన్ని ఎన్నటికీ వదులుకోదు. తన 'గురు' స్థానానికి ఎన్నటికీ ముప్పు రానివ్వదు.

◆

# ఆర్ఎస్ఎస్ – హింస

**ఆ**ర్ఎస్ఎస్ పుట్టుకే పాపాల పుట్ట; నేరపూరితమైన హింస. ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్ నాగ్‌పూర్‌లో చెలరేగిన అల్లర్లతో ప్రాచుర్యం పొందాడని వారి 'చరిత్రకారులందరూ' బల్లగుద్దిమరీ చెపుతుంటారు. ఆర్ఎస్ఎస్‌ని స్థాపించడానికి హిందూ మహాసభ సహకరించింది హిందువుల దృష్టి కోణాన్ని ప్రతిబింబింపచేయడమే హిందూ మహాసభ లక్ష్యం. లాలా లజపతి రాయ్, మదన్  మోహన్ మాలవ్య వంటి వారు దీనికి నాయకత్వం వహించారు.. ఆర్ఎస్ఎస్‌కి హిందూ మహాసభకు మధ్య సైద్ధాంతిక విభేదాలు ఏమీ లేవు. రెండింటి ఉద్దేశం హిందుత్వాన్ని పెంపొందించడమే. ఉన్న భేదమల్లా, అవసరమనుకున్నప్పుడు హింసకు కూడా ఆర్ఎస్ఎస్ వెనుకాడదు. అహింసంటే తనకు ఏమాత్రం సమ్మతం కాదని ఆర్ఎస్ఎస్ కచ్చితంగా చెప్పుకుంది. ఆర్ఎస్ఎస్ కేవలం సైద్ధాంతిక వ్యాప్తికి మాత్రమే పరిమితం కాలేదు. గాంధీ వ్యతిరేకతను దాచుకోనూలేదు. "ఇక్కడున్న మన నాయకులు, మన ప్రజల మగతనాన్ని తాకట్టు పెట్టారు. అనాదిగా  ప్రజలలో ఉన్న ఉన్నతమైన జీవాత్మను చంపే నీచమైన పాపానికి ఒడిగట్టారు. శివాజీ వంటి వీరుడికి జన్మనిచ్చిన సమాజం నిర్వీర్యంగా మార్చబడింది.. వారి ఆత్మ నిబ్బరాన్ని, అభిమానాన్ని నాశనం చేసారు. ఒకనాడు (చరిత్రలో), ప్రపంచంలోనే అసమాన పౌరుషానికి ప్రతిరూపమైన సమాజం, ఈ నాడు మోయలేనంత ద్రోహం మూటనెత్తుకుని కునారిల్లుతున్నది" అన్నారు గోల్వాల్కర్.

దేశంలోని లౌకికవాదులైన హిందువులనే ద్రోహులన్నవారు విదేశీ ముస్లింలని శత్రువులనడంలో ఆశ్చర్యమేముంది? అటువంటి శత్రువుతో ఏ మాత్రం సర్దుబాటుగాని శాంతి గాని సాధ్యపడదు అనేది ఆర్ఎస్ఎస్ ఆలోచన.

గోల్వాల్కర్ వాదనంతా ముస్లింలు దాడిచేసిన వారనే. "1200 సంవత్సరాలుగా వారు (ముస్లింలు) తమని తాము విజేతలుగా ప్రకటించుకుంటున్నారు. ఇప్పటికీ

వారు ఆ ఊహలోనే ఉన్నారు. వారితో శత్రుత్వం కేవలం రాజకీయాలకు సంబంధించినది మాత్రమే కాదు; అదే నిజమైతే వారిని కొద్ది రోజులలోనే జయించేద్దాం. ఈనాడు, వారి (ముస్లింల) ఆలోచనలు మన సమాజంలో చాలా లోతుగా నాటుకుపోయి, మన సమాజం మన నమ్మకాలన్నిటితో పూర్తిగా విభేదించే స్థాయికి చేరుకుంది. ఉదాహరణకు మనం గుడులలో పూజలు చేస్తాము; వాటిని అలంకరిస్తాం. భజనలు చేస్తాం. రథయాత్రలు చేస్తాం. ఇవన్నీ వారిలో ఆగ్రహాన్ని రెచ్చగొడతాయి. మనం గోమాతను పూజిస్తాము; వారు గోవులను తింటారు. మనం మహిళలను మాతృత్వానికి ప్రతీకలుగా చూస్తాం. వారు మహిళలను లైంగికంగా వేధిస్తారు. వారికీ మనకూ ఏ విషయంలోనూ ఏ మాత్రం సంబంధం లేదు – మతపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా". ఇవి ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకుడు, గోల్వాల్కర్ ఆలోచనలు.

ఈ శత్రుత్వాన్ని హెడ్గేవార్ అణువణువునా వంటపట్టించుకున్నారు. ఆనాటికి లాఠీలు ఆర్ఎస్ఎస్ ఆయుధ సామగ్రిలో భాగమైతే, ఈనాడు త్రిశూలాలు కూడా అందులో చేరాయి.

"మేము లాఠీ, కత్తి సాము, కర్రసాము నేర్పిస్తున్నందుకు మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. ఆ ఆయుధాలను మేము ఉపయోగించడం అంటే, ఒక తల్లి తన పిల్లలకు క్రమశిక్షణలో పెట్టడానికి దండించినట్టు ప్రేమతో దండించడమే.. శత్రుత్వంతో దండించడం కాదు. అయినా, ముస్లింల పట్ల ప్రేమతో ఉండడం వలన, వారి నమ్మకాలను గౌరవించడం వలన, మనకేం ప్రయోజనం కలిగింది? నిజానికి మన సమాజంలో హింసకు తావేలేదు. మా చేతులలో ఉన్న ఆయుధాలు, ఒక వైద్యుడి చేతిలో ఉన్న కత్తుల లాంటివే. మమ్మల్ని రక్షించుకోడానికి, శత్రువును బలప్రయోగంతో ఓడించడానికి మాత్రమే. ఓడించాలంటే బలాన్ని ప్రయోగించాలి కదా. దుష్టశక్తులు మంచిమాటలతో లొంగవన్నది సాధారణంగా అందరికి తెలిసిన విషయమే. వారికి (ముస్లింలకు) మన తత్వం, మంచితనం అర్థం కావు. కేవలం బలప్రయోగంతోనే వారిని అణచిపెట్టగలం". ఇదీ, గోల్వాల్కర్‌కి ముస్లింల పట్ల ఉన్న అవగాహన.

కెఆర్ మల్కని, ఆర్ఎస్ఎస్, బిజెపి సభ్యుడు. ఆయన, గోల్వాల్కర్, 'మతం హింసకు అనుమతిస్తుందని' భావించేవారని రాసారు "భారతదేశంలో అహింసకు ప్రాధాన్యతే లేదు. 'హిందూ దేవుళ్ళ చేతిలో ఆయుధాలు ఉంటాయికదా!'... అలెగ్జాండర్ పురుషోత్తముడిని ఓడించాడని చెప్పే చరిత్రని ఆయన అంగీకరించరు; నిజానికి యుద్ధం ముగిసిన తరువాత పురుషోత్తముడి ఆధీనంలోకే ఎక్కువ భూభాగం వచ్చి చేరింది; అలెగ్జాండర్ వెనుదిరిగిపోవలసి వచ్చింది. భారతదేశ చరిత్ర సరిగా

రాయబడలేదు. భారతదేశ చరిత్రను హిందూ, ముస్లిం, బ్రిటిష్ చరిత్రగా విభజించడం తప్పు. చరిత్ర పాలకుల పేరుమీద విభజించబడకూడదు. చరిత్ర ప్రజల చరిత్ర కావాలి. అందువలన మన చరిత్ర అంతా హిందువుల చరిత్రగానే ఉండాలి" అనేది గోల్వాల్కర్ అభిప్రాయం.

ఆర్ఎస్ఎస్ హింస గురించి రాస్తూ, 1948 డిసెంబర్‌లో న్యూఢిల్లీలోని బ్రిటిష్ హై కమిషనేర్‌గా ఉన్న, సర్ అర్క్ బిషప్ నాయె, ఆర్ఎస్ఎస్‌ని 'పాక్షికంగా సైనికీకరించబడిన హిందూ మితవాద పార్టీ' అని అభివర్ణించారు.

మహాత్ముడిని హత్య చేసేందుకు ఆర్ఎస్ఎస్ అనేకసార్లు కుట్రలు పన్నింది. అవి విఫలమయ్యాయి. 1948లో ఆర్ఎస్ఎస్ మహాత్ముడి హత్య చేసేందుకు పన్నిన పన్నాగం పై కూడా సరైన సమయంలో చర్యలు తీసుకోగలిగి ఉంటే మహాత్ముడి హత్యను ఆపగలిగేవారం. కానీ, అప్పటి ప్రాంతీయ ప్రధాని గోవింద వల్లభ పంత్ నిర్ణయం తీసుకోడంలో వెనుకాడారు.

ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ కార్యదర్శి, రాజేశ్వర్ దయాల్, తాను గోల్వాల్కర్‌ని 'పొగచూరుకున్న తుపాకీతో' చూశానని, కానీ గోవింద్ వల్లభ పంత్ అతనిపై ఏ చర్య తీసుకోకుండా అడ్డుపడ్డారని పేర్కొన్నారు.

"మతోద్రిక్తతలు ఉచ్ఛస్థితిలో ఉండగా, సమర్థుడు, అనుభవజ్ఞుడు అయిన పశ్చిమ ప్రాంత డిఐజి, బిబిఐ జైట్లీ మా ఇంటికి రహస్యంగా, వెంట తాళం వేసి ఉన్న రెండు పెద్ద ఇనుప ట్రంక్ పెట్టెలను, ఇద్దరు అధికారులను వెంటపెట్టుకుని వచ్చారు. ఆ పెట్టెలనిండా పశ్చిమ ప్రాంతమంతా తీవ్రమైన కుట్ర జరిపేందుకు కావలసిన అన్ని సాక్ష్యాధారాలు ఉన్నాయి. ఒక ట్రంక్ మొత్తం, ముస్లింలు నివసించే ప్రతి పట్టణం, గ్రామ ప్రాంతాల ప్లానులతో నిండి ఉంది. వివిధ ప్రాంతాలకు చేరుకునే దారులు, ఇతర సమాచారాలు సవివరంగా రాసి ఉన్నాయి. అందులో ఉన్న సమాచారం వారి దుశ్చర్యలను చెప్పకనే చెప్తున్నాయి. వెంటనే నేను ప్రధాన మంత్రి (ప్రాంతీయ) గృహానికి పోలీసులను తీసుకునివెళ్ళాను. సరైన సమయంలో ఆర్ఎస్ఎస్ కార్యాలయం పై దాడిచేయడం వలన అన్ని ఆధారాలూ దొరికాయి. ప్రణాళిక వేసింది ఆర్ఎస్ఎస్ అధిపతి అని నిరూపించగల ఆధారాలు అన్నీ ఉన్నాయి. వెంటనే అతనిని అరెస్ట్ చేయాలని నేను, జైట్లీ ఒత్తిడి చేసాం. అప్పటికి గోల్వాల్కర్ ఇంకా ఆ చుట్టు పక్కలే తచ్చాడుతున్నారు. పంత్, మేము చూపిన ఆధారాలను అంగీకరించ లేకపోయారు. ఎంతో వ్యాకులత చెందారు కానీ, అరెస్ట్‌కి అనుమతి ఇచ్చేందుకు బదులు తరువాతి క్యాబినెట్ సమావేశంలో విషయాన్ని చర్చిస్తామని చెప్పి మమ్మల్ని పంపించేశారు. అందులో రాజకీయ ప్రాముఖ్యత గల కోణాలు ఉన్న మాట వాస్తవమే. ఎగువ సభ

అధ్యక్షుడు, ఆత్మా గోవింద్ ఖేర్, ఆర్ఎస్ఎస్‌కి చెందిన వాడనేది రహస్యం కాదు. పైగా అతని ఇద్దరు కొడుకులు ఆర్ఎస్ఎస్ సభ్యులని బహిరంగంగా అందరికి తెలిసిన విషయమే.”

“ఆ తరువాత జరిగిన క్యాబినెట్ సమావేశంలో కూడా సాధారణ విషయాలు చర్చించబడ్డాయిగాని ఇంతపెద్ద ద్రోహం చివరి వరకు చర్చకు రాలేదు. ఆఖరికి నేను సమస్యను సమావేశంలో పెట్టాలని బలవంతం చేయడం వలెనే సమావేశంలో పెట్టారు; కానీ, క్యాబినెట్, గోల్వార్కర్‌కి సాక్ష్యాలను గురించి చెప్పి సంజాయిషీ అడగాలని నిర్ణయించింది. అందుకు ఇద్దరు అధికారులను నియమించింది. విషయం అంతా గోల్వాల్కర్‌కి పోలీసులకన్నా ముందే చేరింది. గోల్వాల్కర్ పరారయ్యారు. దక్షిణం వైపు వెళ్లారని తెలిసిన పోలీసులు అతనిని వెదుక్కుంటూ వెళ్లినా, వారిని తప్పించుకున్నారు. వారాలు గడిచాయి గాని పోలీసులు గోల్వాల్కర్‌ని కేవలం వెంబడించగలిగారు. 1948 జనవరి 30 రానే వచ్చింది. శాంతి దూత, మహాత్ముడు, ఒక ఆర్ఎస్ఎస్ తుపాకి గుళ్లకు బలయ్యాడు. సరైన సమయంలో చర్యలు తీసుకుని ఉంటే మహాత్ముడిని కాపాడుకోగలిగే వారం.”

మార్జిత్ కాసాలరీ అనే పరిశోధకుడు, ఎన్నో కష్టాల కోర్చి చేసిన పరిశోధనలో, “ఆర్ఎస్ఎస్‌కి ముస్సోలినీ ఫాసిజం అంటే వల్లమాలిన అభిమానం. 1927లో బిఎస్ మూంజి, (హిందూ మహాసభ) మహాసభ అధ్యక్షునిగా ఉండేవారు. ఆయన ఆర్ఎస్ఎస్‌కి కూడా సన్నిహితుడే. 1931లో ఆయన ఇటలీ వెళ్లి వచ్చారు. అక్కడి పరిస్థితులను చూసి ఆశ్చర్యచకితులయ్యారు. ఆయన ముస్సోలినీని హిట్లర్‌ని కూడా కలిశారు. ఆ తరువాత ఆరేళ్ళకు ఆర్ఎస్ఎస్‌ని స్థాపించారు. 1934లో మూంజి భోంసాల సైనిక స్కూల్ స్థాపించారు హిందూ సైనికీకరణ కోసం, కేంద్ర హిందూ సైనిక సమాజాన్ని స్థాపించేందుకు సన్నాహాలు చేసారు. హిందూ యువకులను మాతృదేశ రక్షణకు సంసిద్ధులను చేయడం వీరి ప్రధాన లక్ష్యం. హెగ్డేవార్ ఈ హిందువులను సైనికీకరణ చేయడానికి స్థాపించిన, కేంద్ర హిందూ సైనిక సమాజం బోర్డు సభ్యుడు. ఏ పరిస్థితులలో అయినా ఈ సమాజం రద్దు చేయబడితే దాని ఆస్తులన్నీ ఆర్ఎస్ఎస్‌కి చెందుతాయని సొసైటీ మూల సూత్రాల్లో రాసుకున్నారు.” అని వెల్లడించారు.

1933లో బ్రిటిష్ వారికి అందిన ఒక ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం, ‘ఇటలీలో ముస్సోలినీ, జర్మనీలో హిట్లరు నాజీ’ని స్థాపించినట్టు, భారత దేశంలో ఎప్పటికైనా ఫాసిజంని స్థాపించాలని ఆర్ఎస్ఎస్ కోరుకుంటున్నది.’

హింసను విద్వేషాలను రెచ్చగొట్టడాన్ని, ప్రోత్సహించడాన్ని నమ్మే ఆర్ఎస్ఎస్ దాదాపు ఒక శతాబ్దం పాటు విద్వేషాలను క్రమం తప్పకుండా రెచ్చగొడుతూనే

ఉన్నది. (1925 నుండి 2018 వరకు) ఆర్ఎస్ఎస్ 2025లో శతజయంతి ఉత్సవాలు జరుపుకోవాలనుకుంటున్నది. మోడీ అప్పటికి కూడా అధికారంలో ఉంటారనుకుంటున్నాను.

జేరిమి వాల్డ్రోన్ అనే న్యూయార్క్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా ప్రొఫెసర్, చిచ్చేలే ప్రొఫెసర్ ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ థియరీ, విద్వేష ఉపన్యాసాల ఫలితాలు ఎలాగుంటాయో నిరూపించారు. ఉదాహరణకు అమెరికాలో ఒక పోస్టర్ పెట్టారు. అందులో 'మీరు ఇక్కడికి ఆహ్వానించబడ్డారని భ్రమపడకండి. మీ చుట్టూ ఉన్న సమాజం శత్రుపూరితమైనది. వివక్షత గలది. నిజానికి మీ అవసరం ఇక్కడ లేదు. మీరు మీ కుటుంబం వెలివేయబడతారు; పారద్రోలబడతారు; మీరు దెబ్బలు తింటారు. నిర్లక్ష్యం చేయబడతారు. హాయిగా ఉండడానికి ప్రయత్నించకండి. గతంలో మీకు మీ కుటుంబ సభ్యులకు ఏం జరిగిందో గుర్తుంచుకోండి. భయపడుతూ ఉండండి.' ఇటువంటి పోస్టర్ల వలన తెల్ల జాతీయులకు ఎటువంటి ఇబ్బందీ లేదు. మహా అయితే ఇది అసభ్యకరంగా ఉందని వారు భావించవచ్చు. కొంతమంది, చెప్పినది తప్పయినా, చెప్పేస్వేచ్ఛ వారికుందని వాదించవచ్చు. కానీ, ఇటువంటి వాతావరణంలో తెల్లజాతేతరులు వారి పిల్లలను ఎలా పెంచగలుగుతారు? వారి ఆశలు ఎలా కొనసాగుతాయి? ఇంతటి విద్వేషపూరిత వాతావరణంలో సామాజిక భయాలు ఎలా తొలగిపోతాయి? ప్రసంగాలకు పర్యవసానాలు ఎలా ఉంటాయి? 'ఒక విషయాన్ని, తాము ముందుగా ఏర్పరచుకున్న లక్ష్యానికి అనుగుణంగా ఏర్చి కూర్చి, పదేపదే చేసిన ప్రసంగాల ప్రభావం ప్రజలపై తప్పకుండా ఉంటుంది', అంటారు కథెరిన్ ఏ మాక్ కిన్నోన్, తాను రాసిన 'ఓన్లీ వర్డ్స్' (పదాలు మాత్రమే) అనే పుస్తకంలో.

వాల్డ్రోన్, "సామాజిక వాతావరణాన్ని కలుషితం చేసే విధంగా ఒక జాతిలోని కొంతమంది వ్యక్తులు ఇతరులపై తమ అభిప్రాయాలను ప్రసంగాలలో బహిరంగంగా వెలిబుచ్చడం, బాహాటంగా, చిరకాలం మనసులను కలచివేసే ప్రకటనలు చేయడం, ఇతర జాతుల వారు తమతో సరి సమానమైన పౌరులు కాదని ప్రకటించడం, కొందరు వ్యక్తులకు లేదా కొన్ని గ్రూపులకు హాని కలిగించడమే; ఇదే అసలు సమస్య." అని స్పష్టంగా వివరించారు.

అల్లర్లను గురించి ఎంతో మంది రాజకీయ విశ్లేషకులు పరిశోధనలు చేసారు. వారిలో వెల్లింగ్టన్ విశ్వవిద్యాలయంలో పనిచేసే పౌల్ ఆర్ బ్రాస్ ఒకరు. ఆయన 'తెఫ్ట్ ఆఫ్ ఐడల్' (విగ్రహ దొంగతనం) అనే పుస్తకం రాసారు. "నేను పరిశీలించిన అల్లర్లు ఏవీ సహజసిద్ధంగా జరగలేదు; అకస్మాత్తుగా కూడా జరగలేదు; అల్లర్లు సృష్టించినవారు గుర్తించగల వారే; వారు అల్లర్లను పథకం ప్రకారమే చేసారు; లేదా

అల్లర్లు సృష్టించగల చర్యలకు పాల్పడ్డారు; వీటి ఫలితంగా హత్యలు జరిగాయి. అనేక సందర్భాలలో ప్రజలు రకరకాల హింసాత్మక చర్యలకు పాల్పడే అవకాశాలున్నా, 'మతతత్వ హింస' మాత్రం 'అందులో ఆరితేరినవారి' కే సాధ్యం అని నమ్ముతున్నాను. ఈ హింస వలన ఎవరికి ప్రయోజనకరమో ఈ చర్యలు ఎవరికి లాభం చేకూరుస్తాయో వారే హింసకు పాల్పడతారు. ప్రయోజనం ఆర్థికపరంగానే ఉండాల్సిన పని లేదు. 'హింసా విధానం సంస్థానీకరించ'బడింది. ఇందులో పాత్రధారులు వివిధ జాతుల మధ్య జరిగే మాములు సంఘటనలను 'మతతత్వ అల్లర్లుగా' మలచడంలో నేర్పరులు. ఇక్కడ కూడా ప్రతి సంఘటన అల్లర్లకు దారి తీయదు. అల్లర్లు పూర్తి స్థాయిలో జరగాలంటే అక్కడి స్థానిక రాజకీయ నాయకుల, అధికారుల అసమర్థత ఉండాలి లేదా వారి ప్రమేయమైనా ఉండాలి; లేదా జరిగిన సంఘటనలకు మతపరమైన అల్లర్ల రంగు పులిమే ప్రయత్నం అన్నా అయిఉండాలి. అల్లర్లకు అవకాశమున్న పట్టణాలలో ఇటువంటి సంస్థలు ఉంటాయి. వాటన్నిటి మధ్య ఏదో ఒక మేరకు సంబంధాలు ఉంటాయి. ఈ వ్యవస్థీకృత అల్లర్లు సృష్టించే వారి దగ్గర జాతి, మత, ప్రాంతీయ అల్లర్లు సృష్టించడానికి తగిన మనుషులు సిద్ధంగా ఉంటారు. అలజడి రేగగానే వారు రంగ ప్రవేశం చేస్తారు. రెండు జాతుల మధ్య వివక్షత, వ్యథలు, నైరాశ్యము ఉండడం వలన ఒక్కసారిగా అల్లర్లు సంభవిస్తాయన్న ప్రతిపాదనను నేను అంగీకరించను. అగ్నిలో ఆజ్యం పోసినందువలన భగ్గుమన్నదన్న సిద్ధాంతంతో నేను ఏకీభవించలేను. అందుకు భిన్నంగా కొంతమంది అగ్గి రాజేసి దానిని ఎప్పుడూ ఒక స్థాయిలో కాపాడుతుంటారు. అప్పుడప్పుడు కింద పైన ఎగదోస్తూంటారు. కొన్నిసార్లు ఆ నిప్పు కణకణ మండేటట్టు చేస్తారు. ఈ అల్లర్లు రాజేయడంలో నిష్ణాతులు ఎప్పుడు ఎలా ఉద్రిక్త పరిస్థితులను అల్లర్లగా మలచవచ్చో బాగా తెలిసినవారు."

"ఈ అగ్గి రాజేసే వారు సంఘటితంగా, అసంఘటితంగా కూడా ఉంటారు; వారికి కొన్ని సంస్థలతో సంబంధాలు ఉంటాయి; కొందరు కుల సంస్థల్లో, కొందరు సాంస్కృతిక సంస్థలలో మరికొందరు రాజకీయ పార్టీలతో సంబంధాలు పెట్టుకుని ప్రత్యర్థులను శత్రువులుగా చిత్రిస్తుంటారు; కులానికి , దేశానికీ, శత్రువులని ప్రచారాలు చేస్తుంటారు. ఇటువంటి సంస్థలే భారతదేశంలోని ఆర్ఎస్ఎస్, బిజెపిలు. మొదటిది సాంస్కృతిక సంస్థని చెప్పుకుంటే రెండోది హిందూ జాతీయవాదం కోసం పనిచేసే మిలిటెంట్ రాజకీయ పార్టీ. ఇందులో కూడా ముఖ్యమైన స్థానాలన్నిటిలో ఆర్ఎస్ఎస్ అనుయాయులే ఉంటారు. బజరంగ్ దళ్ ఆర్ఎస్ఎస్ ఆధీనంలోని సంస్థలన్నిటి 'రక్షణ' సంస్థ. ఇది నాజీ ఎస్. ఏ. వంటి భయంకరమైన సంస్థ."

"భారతదేశంలో కొన్ని చోట్ల ఇటువంటివే ముస్లిం సంస్థలు కూడా ఉన్నాయి.

కానీ, అవి ఇంత విస్తృతంగాగాని సమర్థవంతంగా గాని లేవు. వాటికి క్రమశిక్షణ, దిశానిర్దేశం లేదు. మరికొన్ని సంస్థలు నిజంగానే సాంస్కృతిక సంస్థలు. అవి సాంస్కృతిక కార్యక్రమాలే నిర్వహిస్తుంటాయి. కానీ, తెలిసో తెలియకో హింసలో పాలు పంచుకుంటుంటాయి. ఇటువంటి సంస్థ ఉత్తర భారతదేశంలోని ఆర్య సమాజ్. ఇందులో సభ్యులు వ్యక్తులుగా కలిసే ఉంటారు. తమ ఆలోచనలను పంచుకుంటుంటారు. అదే సమయంలో ఒక్కొక్కసారి అగ్గి రాజేసే పని కూడా చేస్తుంటారు.

ఇదివరకు కూడా హిందువులు ముస్లింలు తగాదాలు పడుతుండేవారు. అప్పటికి ఇప్పటికి తేడా ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు ఒక 'కుటుంబం'గా ఏర్పడిన బిజెపి, విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌లను కలుపుకుని హింసను ఒక ఉపాసనగా చేయడం; ముస్లింలను లక్ష్యంగా ఎంచుకుని అల్లర్లు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం. ముస్లింలను దాడులు చేసేవారిగా చిత్రించడం; వారిని ఆయుధాలను ఉపయోగించడంలోనూ, చంపడంలోనూ ఆరితేరినవారిగా చూపడం. ముస్లింలను హతమార్చిన వారిని నాయకులుగా కొనియాడడం.

ఇదే హింసకు మూలం. అందుకే 1968లో అప్పటి గృహ మంత్రి వై, బి. చవాన్ 'అల్లర్లు ఎందుకు మొదలయ్యాయి తెలుసుకుంటే సరిపోదు. వాటి వెనక ఎవరున్నారో తెలుసుకోవాలి' అన్నారు. ప్రభుత్వాలు అల్లర్లను ముందుగానే ఉహించలేకపోవచ్చు; కానీ, అప్రమత్తంగా ఉండి పరిస్థితులను అదుపుచేయగలగాలి. 1969 లో జగన్మోహన రెడ్డి కమిషన్ సూచించినట్టు "చట్టాన్ని అమలు చేసే ప్రభుత్వ సంస్థలు రాష్ట్రంలో, పట్టణాలలో, స్థానికంగా ఉన్న మతతత్వ వాతావరణాన్ని సరిగ్గా అర్థంచేసుకోవాలి; మొగ్గలోనే తుంచేయాలి; అల్లర్లు మొదలవగానే ఉక్కుపాదంతో అణచి వేయాలి." అని మత ఘర్షణలకు దారితీసిన విధానాలను వివరించారు.

మతతత్వ హింస దేశ విభజన నాటి నుండి మాత్రమే ఉందనుకొంటే పొరపాటే. అయితే అది 1954-60 ల మధ్య కాలంలో క్రమంగా కొంత తగ్గుముఖం పట్టింది. 1960 అత్యంత శాంతియుతమైన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. ఆ ఏడాదిలో కేవలం 26 మత ఘర్షణలు జరిగాయి. కానీ, 1961 నుండి మళ్ళీ మతతత్వ అల్లర్లు బాగా పెరిగిపోయాయి. ముఖ్యంగా బీహార్, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లో. 1961 ఫిబ్రవరి మాసంలో ఉషా భార్గవ అనే జబల్పూర్ స్థానిక కళాశాలలో చదువుకునే అమ్మాయిపై ఇద్దరు ముస్లింలు అత్యాచారం చేసారు. అవమానంతో ఆమె ఒంటిపై కిరోసిన్ పోసుకుని తగల పెట్టుకుని చనిపోయింది. ఆ మరునాడు దుకాణాలు మూసివేయబడ్డాయి. హర్తాళ్ ప్రకటించింది. విద్యార్థులు ఆగ్రహంతో ఊగిపోయారు;

దోషులను శిక్షించాలని డిమాండ్ చేసారు. ఆ తరువాత జబల్పూర్‌లో అల్లర్లు మొదలయ్యాయి. దుకాణాలను దోచుకున్నారు; కాల్చిపారేసారు. ఇవి తొందరలోనే మధ్యప్రదేశ్ అంతా వ్యాపించాయి. ఆ తరువాత యుపికి కూడా పాకాయి. ఈ అల్లర్లలో 50 మంది చనిపోయారు. అందులో ముస్లింలే ఎక్కువమంది ఉన్నారు. సాధారణంగా ఇటువంటి పరిస్థితులలో స్థానిక వార్త పత్రికల పాత్ర అధికంగా ఉంటుంది. స్థానిక పత్రికలు ఏ మతానికి చెందిన వారి నుండి తగాదాలు మొదలైనా ఎక్కువగా హిందువుల పక్షమే తీసుకుంటాయి. పాలనా వ్యవస్థ కూడా వారి పక్షమే ఉంటుంది. ముస్లింలే ఎక్కువగా నష్టపోతుంటారు.

ఈ సంఘటనలో కూడా జరిగిందదే. స్థానిక పత్రికలూ చిలవలు పలవలుగా నేరం కన్నా నేరస్థుల మతానికి ప్రాధాన్యతనివ్వడంతో విషయం పక్కదారి పట్టింది. హింస చెలరేగింది. ఈ విషయం పరిశీలించడానికి వేసిన జస్టిస్ శివ్ దయాల్ శ్రీవాత్సవ నేతృత్వంలోని కమిటీ, ప్రాంతీయ పత్రిక యుగధర్మ ప్రచురణ కూడా అల్లర్లకు దోహదం చేసి ఉండవచ్చని నివేదించింది.

1969లో గుజరాత్‌లో జరిగిన అల్లర్లలో 100 మంది మరణించారు. ఆ అల్లర్ల నేపథ్యంలో 'హిందూ మతాన్ని కాపాడేందుకు ఒక కమిటీ' ఏర్పడింది. వీరు విద్వేషాలను పెంచే కరపత్రాలు పంచడం వంటి కార్యక్రమాలు చేసేవారు. జబల్పూర్ ఘటనల తరువాత దేశవ్యాప్తంగా అహమ్మదాబాద్ అల్లర్లు చర్చించబడ్డాయి. జయప్రకాశ్ నారాయణ్ ముస్లింలపై తుపాకీ ఎక్కుపెట్టారు. ఎచ్‌ఎం పటేల్ ఈ రచయితతో 'ముస్లింలు ప్రశాంతంగా ఈ దేశంలో ఉండదలుచుకున్నారో లేదో నిర్ణయించుకోవలసిన సమయం ఆసన్నమైందని అన్నారు. కానీ, అసలు సంగతి బయటపెట్టిన నివేదిక,' జగన్నాథ గుడి పై ముస్లింలు దాడి చేసారని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని' తేల్చింది. గుడికి జరిగిన నష్టం చాలా స్వల్పం. నిజానికి నష్టం కలిగించాలనుకుంటే లోపలగాని, బయటగాని, చాలా అవకాశాలు ఉన్నా అటువంటిది ఏమి జరగలేదని నివేదించింది. అసలు గొడవ గుడిదగ్గరున్న సాధువులతో, ఆవుల విషయంలో వచ్చింది. ఒక గుంపు సాధువుల పై దాడి చేసారు. సాధువులు గుడిదగ్గర ఉండడం యాదృచ్ఛికం. సాధువులపై రాళ్లు వేసినమాట నిజమే అయినా, ప్రముఖ ద్వారం బద్దలుకొట్టడం, నరసింహుడి విగ్రహం, గోవుతో ఉన్న కృష్ణుడి విగ్రహం దెబ్బతిన్నాయని చేసిన ప్రచారం అంతా అబద్ధాలు. నిజానికి ముస్లిం నాయకులు కూడా జరిగిన సంఘటనలో నిజానిజాలు తెలుసుకోలేకపోయారు. అందుకనే క్షమాపణ చెప్పారు. ముస్లింలే అల్లర్లు మొదలుపెట్టారని నిరూపించబడలేదు. కొందరు సంఘవ్యతిరేక శక్తులు అల్లర్లను సృష్టించారని మాత్రమే తేలింది.'

అలాగే 1970లో మహారాష్ట్రలో రాష్ట్రీయ ఉత్సవ మండల్ అనే పేరు మీద కౌస, భివాండీలలో అల్లర్లకు ముందు ఒక కమిటీ ఏర్పడింది. అందులో ఉన్నది కూడా ఆర్ఎస్ఎస్, శివ సేన, బిజెపిలే. ఇక్కడ జరిగిన అల్లర్ల గురించి ముంబై హై కోర్టు జస్టిస్ డిపి మోహన్ నేతృత్వంలో పరిశోధన కమిటీ వేయబడింది. ఈ నివేదికలోని అంశాలు: 1. ముస్లిం వ్యతిరేక నినాదాలు, భూసార మొహల్లా – పాత థానే రోడ్ ప్రాంతాలలో పెద్ద ఎత్తున రెచ్చగొట్టే విధంగా ఇచ్చారు. 2. గులాములు కూడా ప్రదర్శనలో పాల్గొన్న వారు ఒకరిపై ఒకరు జల్లుకోడం కాక దారినపోయే ముస్లింలపై జల్లారు. 3. డ్యూటీలో ఉన్న పోలీసులు ఏమాత్రం అల్లర్లను అరికట్టడానికి జోక్యం చేసుకోలేదు; 4. ప్రదర్శనలో ఉన్నవారు ముస్లింలను తిట్టి పోస్తుండడంతో కొంతమంది ముస్లింలు రాళ్లతో ప్రదర్శనకారులపై దాడిచేశారు, వెంటనే ప్రదర్శనలో ఉన్నవారు ముస్లింల ఇళ్లపై, దుకాణాలపై, ఫ్యాక్టరీలపై, దాడులు చేసారు. వారి వద్ద ఉన్న కాషాయ జండాలతో ముస్లింలను కట్టేసారు; వీధిలో హిందూ ముస్లింల మధ్య కొట్లాటలు తీవ్రంగా జరిగాయి. 5. అతి తక్కువ సమయంలో ఇది ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ముస్లింల పై దాడులే కాదు ఆస్తులను కూడా తగలపెట్టారు. ముస్లింలు కారాలు, యాసిడ్ సీసాలు, సోడా సీసాలతో దాడులలో పాల్గొన్నారు. ఈ ఘర్షణలకు మూలం రాష్ట్రీయ ఉత్సవ మండల్. ఈ సంస్థలో ఉన్న వారిలో ఎక్కువమంది జనసంఘ్ సభ్యులు. కొంత మంది శివ సేనకు సంబంధించినవారు.

1979లో జంషెడ్‌పూర్‌లో హిందువుల ప్రదర్శన మసీదు ముందు నుండి వెళుతుండగా అల్లర్లు మొదలయ్యాయి. ఇది రెచ్చగొట్టడానికి అనాదిగా అనుసరించే విధానమే. ఆర్ఎస్ఎస్, బ్రాహ్మణ ఆధిపత్యంలో నడిచే సంస్థే అయినప్పటికీ, తన పరిధిని విస్తరించుకోడానికి బ్రాహ్మణేతరులను కూడా చేర్చుకోడం ప్రారంభించింది. ముఖ్యంగా శివసేన, బిజెపిలు ప్రారంభమైన తరువాత ఈ ప్రక్రియ ఊపందుకుంది. ఈ అల్లర్లకు సంబంధించిన ఎంక్వైరీకి ఒక త్రి సభ్య కమిటీ, పాట్నా హైకోర్టు నేతృత్వంలో వేయడం జరిగింది. జంషెడ్‌పూర్‌ల్లో సహకార కాలేజీ ఆవరణలో ఘర్షణలకు 5 రోజుల ముందు ఆర్ఎస్ఎస్ డివిజనల్ కాన్ఫరెన్స్ అక్కడ జరుపుకున్నారు. ఆ సమావేశానికి వచ్చిన ఎస్‌పి శ్రీ దేవరస్, హిందువులకు వారి స్వంత దేశంలో స్వేచ్ఛగా మత ప్రదర్శనలు జరుపుకునేందుకు అనుమతి లభించడం లేదని, ముస్లింల మసీదులు మాత్రం రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, అదే అరబ్బు దేశాలలో అయితే హిందువులు గుళ్లను కూడా కట్టుకునేందుకు అనుమతించరని ప్రసంగించారు. ఇటువంటి ప్రసంగం ప్రభావం సభికులపై ఎలాగుంటుంది అన్నది ఆలోచించవలసిన అంశం. అందుబాటులో ఉన్న ఆధారాలను అన్నింటిని పరిశీలించిన

తరువాత కమిటీ, హిందువులలో మతతత్వ భావనని ప్రోత్సహించడమే అల్లర్లకు అసలు కారణంగా నివేదించింది. రామనవమి సందర్భంగా ఆర్ఎస్ఎస్ అల్లర్లను రెచ్చగొట్టిందని తేల్చింది.

1982లో మీరట్‌లో ముస్లింల మీద హింసను ప్రోత్సహించడానికి ఆర్ఎస్ఎస్ అస్పృశ్యులను కూడా సంస్థలో చేర్చుకోవడం మొదలుపెట్టింది.

1982 లో కన్యాకుమారి జిల్లాలో ఉన్న 'మాదైకుడు' గ్రామం జరిగిన సంఘటన అల్లర్లకు దారితీసింది. కన్యాకుమారి భారతదేశం దక్షిణాన ఉన్న చిట్టచివరి జిల్లా. ఇక్కడ మూడు సముద్రాల సంగమం చూడవచ్చు. చూడముచ్చటగా ఉండే ఈ సంగమం – బే ఆఫ్ బెంగాల్, హిందూ మహాసముద్రం, అరేబియా సముద్రం – కలయిక. ఇక్కడ అన్ని మతాలవారు నివసిస్తారు. కన్యాకుమారిలో సముద్రంలో వివేకానందుడి స్మారక చిహ్నం కట్టాలా లేక సెయింట్ జేవియర్ సిలువ పెట్టాలా అనే దానితో వివాదాలు మొదలయ్యాయి. చివరికి వివేకానందుడి విగ్రహానికి అనుమతి లభించింది. ఆ తగాదాయే అక్కడ క్రిస్టియన్లకి హిందువులకి మధ్య తగాదాలకు మొదలు. అక్కడి నుండి అప్పుడప్పుడు క్రిస్టియన్లకు హిందువులకు మధ్య ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయి. 1982 మార్చ్ 15న మత ఘర్షణలు నిలువరించడానికి పోలీసులు జరిపిన కాల్పులలో ఇద్దరు మరణించారు. ఈ ఘటనపై వేసిన కమిషన్ "రాజ్యాంగపరంగా ఎన్ని రక్షణలు కల్పించినా, ఎన్ని హక్కులు ఇచ్చినా, ఎన్ని కొత్త పోలీసు స్టేషన్‌లను కట్టినా, వారికి ఎన్ని అధికారాలను ఇచ్చినా, మైనారిటీలు మెజారిటీ మతస్థుల సౌహార్ద్రత పొందకపోతే ప్రయోజనం ఉండదు" అని రాసింది. ఆర్ఎస్ఎస్ ఈ అస్త్రాన్నే ఉపయోగించుకుని మైనారిటీలకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తుంది. రెండు మతాలకు చెందిన వారి మధ్య ఉన్న సౌహార్ద్రతను నాశనం చేస్తుంది. మైనారిటీల పట్ల సానుభూతి, అవగాహన లేకుండా చేస్తుంది. ఇప్పటివరకు ఏ రెండు మతాల మధ్య జరిగిన ఏ మత ఘర్షణ అయినా, అందుకు కారణం మాత్రం ఆర్ఎస్ఎస్ అనుసరించే విధానాలే. ఆర్ఎస్ఎస్, భారతదేశం వివిధ జాతుల సమ్మేళనం అని భావించదు. అన్ని జాతుల సంఘటిత కృషి భారతదేశ అభివృద్ధికి కారణమని అంగీకరించదు. మతాలకతీతంగా పౌరులకు హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తుంది. ఆర్ఎస్ఎస్ జాతీయవాదమే హిందువులు కానివారందరిని పరాయివారుగా భావించడం.

అందువలన భారత దేశంలో మతఘర్షణలు హింసకు ప్రధాన కారణం ఆర్ఎస్ఎస్, దాని విధానాలు. భారతదేశంలో మత ఘర్షణలను గురించి అంతర్జాతీయంగా ఎందరో అధ్యయనాలు చేసారు అందులో వార్డ్ బెరెన్సోట్ ఒకరు. రాయల్ నెదర్లాండ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ సౌత్ ఈస్ట్ ఆసియా అండ్ కరీబియన్ స్టడీస్

లండన్‌లో ఉంది. అందులో పనిచేసే వార్డ్ బెరెన్స్చోట్, 'అల్లర్ల రాజకీయాలు: హిందూ ముస్లిం హింస, భారతదేశం' అనే అంశం పై పరిశోధన చేసారు. "విఎచ్‌పి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంఎల్ఎలు పోలీసులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక సామాజిక సేవకుల మధ్య చక్కటి అనుసంధానం ఉంటుంది. వీరే అల్లర్లను ప్రేరేపించేది, నడిపించేది. బ్రాస్ చెప్పింది కూడా ఇదే. 'అల్లర్లు వ్యవస్థీకృతం' చేయబడ్డాయి. ఇందులో 'నిప్పురాజేసే వారు', దానిని అవసరమనుకున్నప్పుడు వ్యాపింపచేసేవారు ఉంటారు. రాజకీయ నాయకులు 'అల్లర్ల నిపుణులను' చేరదీస్తారు. వీరు మత ఘర్షణలను అల్లర్లుగా మలచడంలో నైపుణ్యం గలవారు. దాడులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రజలలో ఆరోపణలను వ్యాపింపచేస్తారు. సమావేశాలలో, చర్చలలో, శిక్షణలో, క్రతువులలో, ప్రత్యర్థులను ఎలా 'బెదిరించాలో' చెప్పి నిప్పు ఆరకుండా నిరంతరం మంట రగులుతూనే ఉండేటట్టు చూస్తారు. మతాల మధ్య ఉన్న భేదాలను సదా నొక్కి చెపుతూ ఉండడం వలన ప్రతివారికి వారి గుర్తింపు ముఖ్యంగా కనిపిస్తుంది. ఇది 'మనం, ఇతరులు' అనే భేద భావాన్ని పెంచుతుంది. దీనికి తోడుగా, అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి నాయకుల ప్రసంగాలు ఉండనే ఉన్నాయి. పైగా వీటి శాఖలలో నిరంతరంగా కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. మత గ్రంథాలను బోధించడమే కాక సైనికీకరణ, ముస్లింల పట్ల శత్రుత్వం, హిందూ జాతీయవాద సిద్ధాంతం జొప్పిస్తూనే ఉంటారు. గుజరాత్‌లో జరిగిన గొద్రా అల్లర్లకు ముందుగా పథకం ప్రకారం శిక్షణ ఇవ్వబడినట్టు తెలుస్తున్నది. ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి, బజరంగ్ దళ్ సమావేశాలలో మారుతున్న కాలానికి అనుగుణంగా ఆత్మ గౌరవం, ఔన్నత్యం గురించి ఘనంగా బోధిస్తుంటారు.

గాంధీ పట్ల ఎలా వ్యవహరించాలా అన్న విషయంలో సంఘ్‌పరివార్ తెగ మల్లగుల్లాలు పడింది. గాంధీని వారు తమ నాయకునిగా బహిరంగంగా ఒప్పుకోలేరు. అదే సమయంలో విమర్శించలేరు. ఆఖరికి 1997లో గాంధీని దత్తత చేసుకుని, 1997 అక్టోబర్ 17న 'మహాత్మా గాంధీ కాంగ్రెస్ పార్టీ గుత్త సొత్తెం కాదని సుష్మాస్వరాజ్ ప్రకటించారు. నెహ్రూ పాకిస్తాన్ అనుకూల విధానంతో గాంధీ విభేదించి నిరాహారదీక్ష చేసారని, ప్రజల ఆగ్రహానికి గురయ్యారని' చెప్పుకుంది ఆర్ఎస్ఎస్. అంటే నాథురాం గాడ్సే 'ప్రజల ప్రతినిధి' అన్నమాట. ప్రజల మనోభావాల కనుగుణంగా చంపాడన్నమాట! 1961లో దీన్ దయాల్ ఉపాధ్యాయ గాంధీని గురించి మాట్లాడుతూ, "గాంధీ మీద పూర్తి గౌరవంతోనే చెపుతున్నాను. ఇక పై గాంధీని 'జాతి పిత' అని పిలవవద్దు. జాతీయతకు పురాతన మూలాలు అర్థం చేసుకుంటే అది కేవలం హిందుత్వమని స్పష్టంగా అర్థమవుతుంది." అన్న విషయాన్ని గమనించాలి. ఆర్ఎస్ఎస్

అధినేత, రాజ్‌నాథ్ సింగ్, "గాడ్సేకి 'అఖండ భారత్' తాత్వికత అబ్బింది. ఆయన ఉద్దేశం మంచిదే. కానీ, ఎంచుకున్న మార్గమే తప్పు" అన్నారు. న్యూ ఢిల్లీలో వాయిస్ ఆఫ్ ఇండియా అనే సంస్థ సంఘ్ పరివార్ ప్రచార పాత్రలను ప్రచురిస్తుంటుంది. 2001-2012లలో 'గాంధీ, గాడ్సే', అనే కోఇన్రాడ్ ఎల్స్ట్ రాసిన పుస్తకాన్ని ఆ సంస్థ ప్రచురించింది. ఈయన బెల్జియం దేశస్థుడు; సంఘ్‌కి ప్రీతిపాత్రుడు. ఆయన 175వ పేజీలో "సమకాలీనులు (గాడ్సేకి), ఆ తరువాత వచ్చిన వారెందరో నాథురాం గాడ్సే, గాంధీల శీలాలకు సంబంధించి రాసిన అభిప్రాయాలతో, వారి రాజకీయాలు, ఇతర అనేక అంశాలకు సంబంధించి వారిపై చేసిన విమర్శలతో ఏకీభవిస్తున్నాను. అందులో ఆయన 7 అంశాలను గురించి చాలా విపులంగా ప్రస్తావించారు... అయినా గాడ్సే గాంధీని హత్య చేయడాన్ని ఏవిధంగానూ సమర్థించలేం. ఆయన రాజకీయ అభిప్రాయాలతో ఏకీభవిస్తూ హత్యను సమర్ధించడం అంటే గాడ్సే చేసిన తీవ్రమైన నేరాన్ని తుడిపేయ ప్రయత్నించడం కాకపోయినా తక్కువ చేయడం అవుతుంది" అన్నారు.

సర్వ సాధారణంగా ఆర్ఎస్ఎస్ శాఖల గురించే చెప్పుకుంటాం గాని వాటి అఖాడాల గురించి చెప్పుకోం. మాంచెస్టర్ విశ్వవిద్యాలయంలో పనిచేసే జాన్ జావోస్, "ఆర్ఎస్ఎస్ పుట్టుక, శాఖలకు అఖాడాలకి ఉన్న సంబంధాన్ని తెలియచేస్తుంది. 1926లో శాఖలు మొదలుపెట్టడానికి పూర్వం హెగ్డేవార్ స్వయం సేవకులు అఖాడాలకు వెళ్లడాన్ని ప్రోత్సహించేవారు. ఆర్ఎస్ఎస్ ప్రారంభించిన తొలి రోజుల్లో అందులో చేరినవారు చాలా మంది అఖాడాల ద్వారా చేరినవారే. శాఖలు అఖాడాల కొత్త రూపాలుగా ఉండేవి... 1920ల మధ్య కాలంలో నాగ్‌పూర్ జిల్లాలో అఖాడాల సంఖ్య 230 నుండి 570కి పెరగడాన్ని ఆండర్సన్, దాంలేలు గుర్తించారు. ..సంఘం, తన ఉద్యమం, హిందూ సమాజం పునరుత్తేజం పొందడానికి అఖాడాలలో హాజరుకు పెరగాల్సిన అవసరాన్ని కొంతమేరకైనా ప్రోత్సహించింది. ...ఆర్ఎస్ఎస్ అఖాడా రూపాన్ని ఎంచుకోడంలో ఒకస్పష్టమైన గూడార్థం ఉంది. అదే గాంధీ గారి అహింసా సిద్ధాంతాన్ని అడ్డుకోవడం.

1989లో భాగల్పూర్ అల్లర్లు జరిగాయి. దీనిపైనా జస్టిస్ రామ్ నందన్ ప్రసాద్ నాయకత్వంలో కమిషన్ వేశారు. ఈ నివేదిక 1995 వరకు సమర్పించబడలేదు. 1989 అక్టోబర్‌లో మొదలైన మత ఘర్షణలు 1990 మార్చ్ వరకు కొనసాగాయి. దాదాపు వెయ్యి మంది చనిపోయారు. చైర్మన్‌కి కమిటీ సభ్యులకి నివేదికలో విభేదాలు ఉండడం వలన నివేదిక ఏకగ్రీవంగా ఇవ్వలేదు. చైర్మన్‌కి విహెచ్‌పితో సంబంధాలు ఉన్నాయి; ఆయన కుమార్తె రీటా రాయ్ బిజెపి ఎం పి.

ఈయన బిజెపికి ఘర్షణలలో ప్రమేయం లేదని అనుకూలంగా నివేదికను ఇస్తే, సభ్యులు పోలీసు అధికారులను తప్పుబట్టారు. నిజానికి రామ్ నందన్ కమిషన్ చైర్మన్‌గా ఉండడానికి అంగీకరించి ఉండకపోవలసింది. భాగల్పూర్ అల్లర్లలోనే అయోధ్య ఉద్యమ మూలాలున్నాయి. భాగల్పూర్‌లో అల్లర్లు జరగకుండా ఉండడానికి పోలీసులు ఏవిధమైన చర్యలు తీసుకోలేదు. అల్లర్లకు మూలమైన మతోన్మాదులను నిలువరించడానికి – హిందువులైనా, ముస్లింలైనా అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ అల్లర్లలో పాల్గొన్నవారు, సల్లం, అన్సారీ, మహాదేవ్, కామేశ్వర యాదవ్ బజాయితి, మొదలైన వారు నేరస్తులు. వారి పై అనేక నేరారోపణలు ఉన్నాయి.

అగ్నికి ఆజ్యం పోసినట్టు 1993 జనవరి 30వ తేదీ టైమ్స్ ఆఫ్ ఇండియా పత్రిక, పాంచజన్యంలో అద్వానీగారు "ముస్లింలు హిందుత్వమే తమ గుర్తింపని అంగీకరిస్తే అల్లర్లు ఆగుతాయని" అన్నట్టు ప్రకటించింది. అద్వానీ, 'ఈ దేశంలో ఉన్నవారందరూ హిందువులే. వారు ఇతర మతాలను అనుసరిస్తూ ఉండవచ్చుగాక. ముస్లిం మతాన్ని అనుసరించినవారు మహమ్మదీ హిందువులు; క్రిస్టియన్ మతాన్ని అనుసరించిన వారు క్రిస్టియన్ హిందువులు; సిక్కు మతాన్ని అనుసరించిన వారు సిక్కు హిందువులు' అన్నారు.

అదే విధంగా కొంతమంది సనాతన హిందువులైతే మరికొంత మంది ఆర్య సమాజ హిందువులు. ఈ వాస్తవాన్ని మనం అంగీకరించడం మంచిది. మొత్తానికి ఇది హిందూ రాష్ట్రం. హిందూ రాష్ట్రమన్నది జనసంఘ్ కాలంలో లేదు. బిజెపి మ్యానిఫెస్టోలో కూడా లేదు. అయోధ్య ఉద్యమం పెరుగుతున్న క్రమంలో ఏర్పడ్డదని అందువలననే తాను వివరణ ఇచ్చినట్టు చెప్పుకున్నారు. 'మౌలికంగా ఈ దేశం హిందూ దేశం గానే గుర్తించబడింది. సాధారణ ముస్లింలు హిందూ రాష్ట్రమని ఒప్పుకునేందుకు సిద్ధంగా లేకపోతే, వారికి హిందూ రాష్ట్రమన్నా, భారతీయ రాష్ట్రమన్నా, భారతదేశమన్నా ఒకటేనని తెలియచేయండి' అన్నారు. అద్వానీగారి లాంటి వారి నుండి ఇటువంటి ప్రకటనలు రావడం వ్యాకులతను కలిగిస్తుంది. ఆ వ్యాకులతకు కారణం భయంకాదు; ఒక దేశ ప్రఖ్యాత నాయకుడు అల్లర్లకు భయపడి ఇటువంటి ప్రకటనలు చేస్తున్నందుకు.

భాగల్పూర్‌లో జరిగిన మతఘర్షణలు లోతుగా అధ్యయనం చేసిన, రాంనాథన్ ప్రసాద్, ఢిల్లీలో ఒక పేరున్న న్యాయవాది; ప్రియ ఝా అహమ్మదాబాద్‌లో నివసించే పరిశోధకురాలు, సామజిక కార్యకర్త. వారు స్ప్లిన్ టెర్డు జస్టిస్: లివింగ్ ది హారర్ ఆఫ్ మాస్ కమ్యూనల్ వయోలెన్స్ ఇన్ భాగల్పూర్ అండ్ గుజరాత్ అని 2016లో ఒక పత్రం రాసారు. 'జడ్జీలు, రిపోర్టర్లు, న్యాయవాదులు, పరిశోధకులు సమర్పించిన

నివేదికలు కేవలం అతి తక్కువ అంశాలను మాత్రమే సృజిస్తున్నాయి. ఆర్ఎస్ఎస్ దాదాపు ఒక శతాబ్దం పాటు శాఖల ద్వారా, పత్రికల ద్వారా ప్రసంగాల ద్వారా ముస్లింలకు క్రిస్టియన్లకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తూనే ఉన్నది. వాటి పర్యవసానాలు ఇలాగే ఉంటాయి' అంటారు.

న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, సారా లిప్టన్, బ్రుటల్ స్పీచ్, వయోలెంట్ యాక్ట్స్ (పాశవిక ప్రసంగాలు, హింసాత్మక చర్యలు) అని ఓ వ్యాసం రాసారు. ఆమె, కఠినమైన మాటలు హింసకు దారితీస్తాయా ? అని ఆమె ప్రశ్నించారు. విద్వేష ప్రసంగాలు కొనసాగుతున్న తరుణంలో ఈ ప్రశ్న సమంజసమైంది. లారెన్స్ ఈ లించ్, "ముస్లిములకు వ్యతిరేకంగా పదునైన అస్త్రాలు సంధిస్తుండడం వలన, ఈ మధ్యకాలంలో వెలువడుతున్న రాజకీయాల వాక్చాతుర్యాలు, ఏక్షణాన అయినా ముస్లింలపై దాడులకి ప్రోత్సహిస్తాయేమో అని ఆందోళన కలుగుతున్నదని ... ఒక సమూహాన్ని శత్రువులుగాను, కిరాతకులుగాను ముద్ర వేస్తే, అందులోని వ్యక్తులు శత్రువులుగాను, కిరాతకులుగాను చూడబడడం సహజం" అని అనడం ఎంతో సమంజసం.

2014 నుండి ప్రధానమంత్రి నరేంద్ర మోడీనే స్వయంగా విద్వేషపు కూతలకు నాయకత్వం వహిస్తున్నారు. గుజరాత్ మారణహోమంలో నివేదికలు, పత్రాలు ఆధారంగా చూపి ఇటువంటి తప్పుడు పద్ధతులను అనుసరించవద్దని నేను స్వయంగా మోడీకి సలహా ఇచ్చాను. సంబంధిత పత్రాలు వేలలో ఉన్నాయి. అయితే, అందులో ముఖ్యమైన రెండింటి గురించి చెప్పుకోవచ్చు. ఒకటి వి ఎన్ ఖరే, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, బెస్ట్ బేకరీ కేసులో, గుజరాత్ 'నీరో' గురించి చేసిన వ్యాఖ్యలు. ఆయన రాజీనామా చేసిన తరువాత ఒక వ్యాసం రాసారు. అందులో "ఒక రాష్ట్ర ప్రభుత్వానికి మూడు ముఖ్యమైన బాధ్యతలు ఉన్నాయి. ప్రజల జీవితాలకు, ముఖ్యంగా బలహీనులకు రక్షణ కల్పించడం; 2. చట్టాన్ని వ్యతిరేకించిన వారిపై చర్యలు తీసుకోవడం; 3. హింసకు బలైన బాధితులకు పరిహారం చెల్లించడం. ఈ మూడు అంశాలలో గుజరాత్ ప్రభుత్వం విఫలమైంది. అల్లర్లు చెలరేగినప్పుడు పోలీసులు, రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. పరిశోధనలు కూడా ప్రభుత్వం నేరస్థులకు అండగా ఉండడాన్ని తెలియచేసినట్టు నేను భావిస్తున్నాను. బెస్ట్ బేకరీ కేసులో 20-22 మంది బేకరీలో ఉండగా నిప్పంటుకుంది. పోలీసు స్టేషన్ నేరం జరిగిన స్థలానికి రెండు కిలోమీటర్ల కన్నా దూరం లేదు. మంటలార్పడానికి ప్రభుత్వం ఏవిధమైన చర్యలు తీసుకోలేదు; మర్నాడు మధ్యాహ్నం 11.30గంటల వరకు మంటలు ఎగజిమ్ముతూనే ఉన్నాయి. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం కాదా?

16 మంది సజీవంగా మంటలలో కాల్చబడ్డారు. పోలీసులు ప్రజలను రక్షించే చర్యలు ఏవీ తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల జీవితాలను రక్షించడంలో వైఫల్యం చెందినట్టు కాదా? జహీరా షైక్ మర్నాడు మధ్యాహ్నం 3.30 గం॥ వరకు ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోలేకపోయారు." అని రాసారు.

మోడీ పాలనను గురించి రానా అయూబ్, స్టింగ్ ఆపరేషన్ ద్వారా ధైర్యంగా పరిశోధన చేసి, భయంకరమైన నిజాలను గుజరాత్ ఫైల్స్ అనే పుస్తకంలో రాసి ప్రచురించారు. ఆర్‌బి శ్రీకుమార్ గారి, గుజరాత్: బిహైండ్ ది కర్టెన్, (పరదా వెనుక గుజరాత్), ని కూడా చెప్పుకోవచ్చు. ఆయన 2002 ఏప్రిల్ నుండి సెప్టెంబర్ వరకు గుజరాత్ డిజిపి (ఇంటలిజెన్స్) గా పనిచేసారు. ఇవన్నీ మోడీ హింసాయుత పాలనకు మచ్చుతునకలు.

రెండు వందల ఏళ్ల ప్రజా జీవితం గురించి తెలిసినవారు, విలువలకు కట్టుబడి ఉన్న భారతీయులు ఇటువంటి వ్యక్తి ఎలా, ఎందుకు భారతదేశానికి ప్రధాని అయ్యారో ఆలోచించాలి. మతతత్వం ఆకర్షించడం అనేది సమాధానంలో ఒక పార్శ్వం మాత్రమే. లోతుగా చూస్తే, కారణం మన రాజకీయాలలోనే ఉంది.

బ్రిటిష్ పార్లమెంటుకు జాత్యహంకారం వత్తాసుగా ఎన్నికైన ఒక ఎంపి గురించి హెరాల్డ్ విల్సన్, "నైతిక కుష్టురోగి" అన్నారు. తోటి పౌరుల పట్ల, తోటి మానవుల పట్ల మతతత్వ విషాన్ని వెదజిమ్మే మనిషికి వర్తించే సరైన పదం ఇంతకన్నా వేరేదీ ఉండదనుకుంటున్నాను.

# ఆర్ఎస్ఎస్ వారసులు :
# ఎబివిపి, విహెచ్పి, బజరంగ్ దళ్

**ఆ**ర్ఎస్ఎస్ తన కార్యకలాపాలను విస్తరించడానికి రూపొందించినంత సమర్థవంతమైన పథకాలను ఏ యాజమాన్య సలహా సంస్థా రూపొందించలేదు. 1948లో విధించిన నిషేధం, తనకు ఒక ప్రత్యేకమైన పార్లమెంటు విభాగం ఉండాలని, అయితే అది పూర్తిగా తన ఆధీనంలోనే ఉండాలనే గుణపాఠాన్ని నేర్పింది. ఫలితమే బిజెపికి ముందు ఆర్ఎస్ఎస్ ఆధీనంలో ఏర్పడిన దాని రాజకీయ విభాగం, జనతా పార్టీ అవిర్భావం. అయితే నిషేధం వల్ల ఏర్పడిన కుదుపు కారణంగా ఆర్ఎస్ఎస్ పని అంతరాయాలు లేకుండా కొనసాగడానికి వీలుగా ఆర్ఎస్ఎస్ అఖిల భారత విద్యార్థి పరిషద్ను ఏర్పాటు చేసుకుంది. ఇది బాలరాజ్ మధోక్ ఆలోచన. అయితే ఆర్ఎస్ఎస్ ఆధీనంలోని భారతీయ జనతా పార్టీకి, ఇతర రాజకీయ పార్టీలతో పోలిక లేనట్టే దాని విద్యార్థి సంఘానికి కూడా ఇతర విద్యార్థి సంస్థలతో పోలిక లేదు. ఎబివిపి అధ్యక్షుడిని ఆర్ఎస్ఎస్ నియమిస్తుంది. ఇతర కార్యవర్గం కూడా ఆర్ఎస్ఎస్ అంగీకారంతోనే నియమించబడుతుంది. ఇది ఏఐఎస్ఎఫ్ అనే వామపక్ష విద్యార్థి సంస్థకి వ్యతిరేకంగా ఏర్పరచబడింది.

ఆర్ఎస్ఎస్ ఆధీనంలోని సంస్థలైన ఎబివిపి, విహెచ్పి, బజరంగ్దళ్ల శాఖల వ్యవస్థని ఎంతో సమర్థవంతంగా నిర్మిస్తుందన్న విషయాన్ని విస్మరించలేం. ఇవి అనియతమైనవి. నిషేధ సమయంలో కూడా సమావేశాలు ఏర్పాటు చేసుకోగలవు. మౌఖిక ఆదేశాలు, సందేశాలు చాలు. ఈ మూడు హిట్లర్ నిర్మించిన స్టార్మ్ ట్రూపర్లు లాంటివే. ఎప్పుడైనా ఎక్కడైనా హింసకు సిద్ధంగా ఉంటాయి.

**ఎబివిపి**

నరేంద్ర మోడీ, అరుణ్ జైట్లీ, కె ఎన్. గోవిందాచార్య, సుశీల్ కుమార్ మోడీ, అంతా ఎబివిపి నుండి వచ్చిన వారే. జయప్రకాశ్ నారాయణ్ యొక్క నవ నిర్మాణ సమితిని గుజరాత్‌లో నడిపింది ఎబివిపి నే. బీహార్‌లో ఎబివిపి, జెపి ఉద్యమ కాలంలో ఛాత్ర సంఘర్ష్ సమితితో చేరింది. 1995 నాటికి ఎబివిపి ఉన్న మొత్తం 485 శాఖలలో 415 శాఖలు చురుకుగా పనిచేస్తూ ఉండేవి. దేశంలో ఉన్న మొత్తం167 విశ్వవిద్యాలయాలలో 121 విశ్వవిద్యాలయాలలో ఎబివిపి శాఖలు ఉండేవి.

కారవాం పత్రిక, 2017 అక్టోబర్ మాస సంచికలో 'ఎబివిపి యుగం' అనే వ్యాసాన్ని ప్రచురించింది. ప్రియాంక దూబే ఈ వ్యాస రచయిత. ఈ పత్రిక అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పత్రిక. ఆ పత్రిక నిర్భయంగా, నిజాయితీగా ఆలోచింపచేసే వ్యాసాలు ప్రచురిస్తుందని ప్రతీతి. అందులో ఆమె, ఎబివిపి నిర్మాణాన్ని గురించి రాస్తూ, "2017 లో ఎబివిపి నిర్మాణ కార్యదర్శిగా, సునీల్ దుబె అనే 49 ఏళ్ళ యువకుడు ఉండేవారు. ఆతను ఆర్ఎస్ఎస్ చేత నియమించబడినవాడు ... ... నిజానికి ఏబివిపి విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌లు బిజెపికి అనుబంధ సంస్థలు కావు. స్వతంత్ర సంస్థలు. కానీ, ఆర్ఎస్ఎస్, బిజెపిని అదుపులో పెట్టాలనుకుంటే, విహెచ్‌పిని బిజెపి పైకి ఎగదోస్తుంది. వెంటనే బిజెపి ఆత్మ రక్షణ కోసం నాగ్‌పూర్‌ని ఆశ్రయించవలసిందే. ఇక ఆర్ఎస్ఎస్ నిర్దేశాలకి బిజెపి కట్టుబడి ఉండాల్సిందే" అని రాసారు.

రాజ్‌కుమార్ భాటియా, ఎబివిపి జాతీయ అధ్యక్షుడిగా నాలుగు దశాబ్దాల పాటు పనిచేసారు. ఆయన, రచయిత్రి, ప్రియాంక దూబేతో ఎబివిపి గురించి చెపుతూ, 1949లో ఎబివిపి రాజ్యాంగం ఏకనాథ్ రానడే చేత రాయించబడింది... భారతదేశం ఒకనాడు విశ్వ గురువుగా ఉండేది. ఈ దేశంలో పాల నదులు ప్రవహిస్తుండేవి. ఇదొక బంగారు చిలక లాగా ఉండేది. ఈ వర్ణనలు కేవలం ఉపమాలంకారాలు కావు. వాస్తవాలు. ఎబివిపి భారతదేశానికి అటువంటి మంచి రోజులను తిరిగి తేవాలని సంకల్పించింది" అని చెప్పారు. (ఇవీ, ఎబివిపి రాజ్యాంగకర్తల ఆలోచనలు)

దేశ వ్యాప్తంగా ఎబివిపి అనేక వివాదాస్పద కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది. ఏబివిపి శాఖలు హైదరాబాద్, ఢిల్లీలలో నిర్వహించే వివాదాస్పద కార్యకలాపాలు దేశమంతా ఆసక్తిగా గమనిస్తుంటుంది. ఒక్క ఢిల్లీ, హైదరాబాద్‌లలోనే కాదు. ఈశాన్య రాష్ట్రాలలోను ఎబివిపి కార్యక్రమాలు చర్చలకు దారితీసాయి. ఒకసారి గౌహతిలో డాన్‌బాస్కో బడిలో ఉన్న ఒక పాఠాలు నేర్పే కాథలిక్ పూజారి విగ్రహాన్ని ఏబివిపి కార్యకర్తలు ధ్వంసం చేసారు; అలాగే రాజస్థాన్‌లోని శిఖర్ పట్టణంలో ప్రత్యర్థి

విద్యార్థి సంస్థ నాయకుడిపై దాడులకు తెగబడ్డారు; సిమ్లాలో ప్రభుత్వ కళాశాల ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసారు; ఐఐటి చెన్నైలో విద్యార్థులు 'అంబేద్కర్ పెరియార్ స్టడీ సర్కిల్ పేరుతో చర్చలు జరుపుకోవాలనుకుంటే వారిని నిర్వహించుకోనీయలేదు.' అంబేద్కర్ పెరియార్ స్టడీ సర్కిల్ 'పై చర్యలు తీసుకునేటట్టు అధికారులపై వత్తిడి చేసారు; బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో నియామకాల విషయంలో జరుగుతున్న అవకతవకలను గురించి అధికారులకు ఫిర్యాదు చేసిన ఉపాధ్యాయుడిపై జాతి వ్యతిరేకతను ఆపాదించి ఉద్యోగం నుండి తొలగించేటట్టు చేసారు. 2011లో ఎబివిపి, హైదరాబాద్ విశ్వవిద్యాలయ విద్యార్థి, వేముల రోహిత్ చావుకు కారణమయ్యింది. అలహాబాద్ విశ్వ విద్యాలయంలో, విద్యార్థులు, 'ప్రజాతంత్రం, ప్రసారమాధ్యమాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ' అనే అంశంపై చర్చాగోష్టి సభను ఏర్పాటు చేస్తే, ఎబివిపి బలవంతంగా రద్దుచేయించింది. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో చరిత్ర విభాగంలో 'మూడువందల రామాయణాలు' అనే పాఠ్యాంశాన్ని తొలగించేవరకు అధికారులపై (తీవ్రమైన) ఒత్తిడి తెచ్చింది. చివరికి ఆ అంశాన్ని తొలగించేటట్టు చేసింది. రంజాన్ కళాశాల, ఢిల్లీ యూనివర్సిటీలో ఒక భాగం. వారు 'సంస్కృతి – నిరసనలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన చర్చాగోష్టిలో మాట్లాడడానికి 2016లో జెఎన్‌యులో సిఎఎ నిరసనలతో పాల్గొన్న వారిలో ముగ్గురిని ఆహ్వానించారు. ఆ విశ్వవిద్యాలయంలో అప్పుడు ఎబివిపి విద్యార్థి సంస్థ ఆధిక్యతలో ఉంది; వారు గోష్టి జరగనీయకుండా అడ్డుకున్నారు. ఆహ్వానితులను రానీయలేదు.

ఆశ్చర్యం గొలిపే అంశం, ఎబివిపి భౌగోళిక చిత్రంలో (ఆర్ఎస్ఎస్ చిత్ర పటంలో లాగ) పాకిస్తాన్, టిబెట్, బంగ్లాదేశ్‌లు భారతదేశంలో భాగాలుగా చూపబడుతుంటాయి.

**విహెచ్‌పి**

హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి చెందిన కజ్జు, విహెచ్‌పిని గురించిన పూర్తి సమాచారాన్ని రెండు పుస్తకాలలో ప్రచురించారు.: 'విశ్వహిందూ పరిషద్: భారతదేశ రాజకీయాలు, ప్రజాతంత్ర వ్యవస్థను హైందవీకరించడం.' పుస్తకంలోని కొన్ని ముఖ్యమైన అంశాలు:

విహెచ్‌పి 1964లో ముంబైలో గోల్వాల్కర్, ఎస్ఎస్ ఆప్టే, కెఎం మున్షీల ఆధ్వర్యంలో స్థాపించబడింది. వందితా మిశ్రా, "శివ శంకర్ ఆప్టే, ప్రపంచ ప్రజలందరినీ క్రిస్టియన్లుగా మార్చాలని క్రిస్టియన్ల ఉద్దేశం; ఇస్లాం ఉద్దేశం భారతదేశాన్ని 'పాక్'గా మార్చాలని" అన్నారు అని రాసారు. విహెచ్‌పి వ్యవస్థాపక అధినాయకుడు ఈ శివశంకర్ ఆప్టే; "ఇప్పుడిక మూడో మతం వచ్చిపడింది. అదే

మతతత్వం. ఈ మూడు (మతతత్వం, క్రిస్టియన్ మతం, ముస్లిం మతం) హిందూ సమాజాన్ని పంచభక్ష్య పరమాన్నాలుగా భావిస్తున్నాయి; వాటిని సేవించి తాము బలపడాలని అనుకుంటున్నాయి; అందువలన ఈ పోటీ, సంఘర్షణల కాలంలో హిందూ ప్రపంచాన్ని నిర్మించవలసిన అవసరం ఉంది. అప్పుడే ఈ మూడింటి దిష్టి మనకంటదు" – శివశంకర్ ఆప్టే గారి మరో ఉవాచ.

గోల్వాల్కర్ కూడా ఈ మూడు అంశాలనే తన బంచ్ ఆఫ్ థాట్స్ (పాంచజన్యం) లో సృజించారు. విహెచ్‌పి పూర్తిగా నకిలీ మత సంస్థ. సాధువులను రాజకీయాలలోకి దింపే సంస్థ. చేతన్ భట్ దీని గురించి రాస్తూ, 1964లో జరిగిన ప్రారంభోత్సవ సభలో1966 జనవరి 22–24 తేదీలలో ప్రపంచ హిందూ సమ్మేళన జరపాలని నిశ్చయించడం జరిగింది. దీనికి దాదాపు 25000 మంది హాజరయ్యారు. శారద పీఠం, పూరిలోని గోవర్ధన పీఠం నుండి శంకరాచార్యులు హాజరయ్యారు. విదేశాలలో కూడా హిందూ మత ప్రాచుర్యం కోసం కృషి చేయడం దీని లక్ష్యం. భౌగోళిక విధేయతను విధేయతకు సూచికగా అభివృద్ధి చేయాలన్నది మరో లక్ష్యం. ఈ సమ్మేళనంలో బ్రాహ్మణతేజం క్షత్రియ తేజం అభివృద్ధి చేయాలనీ, సంస్కృతాన్ని సెకండరీ స్థాయి నుండి తప్పనిసరిగా బోధించాలని, గో హత్యలను నిరోధించాలని, హింసకు భయపడి, బలవంతాలకు భయపడి, లేదా ప్రలోభాలకు లొంగిపోయి హిందూ ధర్మాన్ని వదిలి పెట్టినవారిపై కేంద్రీకరించి తిరిగి వారిని హిందూ మతంలోకి తీసుకుని రావాలని, ముఖ్యంగా మిషనరీలు గిరిజన ప్రాంతాలలో చేస్తున్న కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, హిందూ ధర్మాన్ని దేశంలో, విదేశాలలో కూడా అభివృద్ధి చేసే దిశగా చర్యలను తీసుకోవాలని నిర్ణయించింది.

సమ్మేళనంలో ఒక విద్వద్ పరిషద్‌ను ఏర్పరచాలని నిర్ణయించారు. 'హిందువులకు కనీస ప్రవర్తనా నియమావళి, సాంస్కృతిక మార్గదర్శకాలు రూపొందించుకుని, ఆ హిందూ సంప్రదాయాల ద్వారా సమాజంలో హిందువుల బలాన్ని పెంచుకోవాలని సమ్మేళనంలో నిర్ణయించడం జరిగింది. ప్రాచీన వారసత్వ సంప్రదాయాలను ఆధునిక జీవనానికి సంధానం చేస్తూ ప్రాపంచిక, దైవిక జీవన విధానాలను రూపొందించాలని, చివరికి వాటి గమ్యం హిందుత్వం కావాలని నిర్ణయించారు.

విహెచ్‌పి 1967 సాధారణ ఎన్నికలకు ముందు గోవధను నినాదంగా తీసుకుంది. 1984, ఏప్రిల్‌లో రాముని జన్మభూమి అయిన అయోధ్యను విముక్తి చేయాలన్న నిర్ణయాన్ని ప్రకటించింది. 1989 మార్చ్ 24న ఆర్‌ఎస్‌ఎస్ ఉన్నత స్థాయి నాయకత్వం సమావేశమయ్యారు. ఇందులో దేవోరస్‌తో పాటు హెచ్.వి శేషాద్రి,

ఎల్ కె అద్వానీ, ఏబి వాజ్‌పాయ్, బిజెపి నుండి ఎస్‌ఎస్ భండారి, ఆర్‌ఎస్‌ఎస్ నుండి యాదవ్ రావు జోషి, విహెచ్‌పి  నుండి అశోక్ సింఘాల్, బిఎంఎస్ నుండి డిబి తెంగేది, ఎబివిపి నుండి మదన్ దాస్ దేవి పాల్గొన్నారు. అయోధ్యలో మసీదుపై చేయబోయే దాడికి ముందు ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంఘాలన్నీ కలసి పనిచేయాల్సిన అవసరం ఉంది; అందుకు అనుగుణంగానే సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. విహెచ్‌పి అయోధ్యలో రామమందిరం నిర్మించాలని నిర్ణయం తీసుకున్న కొద్దీ కాలంలోనే ఆర్‌ఎస్‌ఎస్‌కి చెందిన ఎబివిపికే హిందువులందరు దీనికి సహకరించాలని పిలుపునిచ్చింది.

హిందుత్వాన్ని వ్యాప్తి చేయాలనే లక్ష్యం సాధించడానికి, 1982లో కేంద్ర మార్గదర్శక మండలి ఏర్పడింది. ఇది హిందూ సమాజం చేయవలసిన మత క్రతువులు, ఉత్సవాలు, అనుసరించవలసిన నైతిక అంశాలు నిర్ణయిస్తుంది. హిందూ మతంలోని వేర్వేరు జాతులకు సంబంధించిన 39 మంది సభ్యులు ఇందులో ఉన్నారు. దీనికి తోడుగా 17 మంది సాధువులతో ఒక సాధు సంసద్ ఏర్పడింది. 'జాతిని నిర్మించడంలో సాధువుల పాత్రను విస్తరించడానికి' దీనిని ఏర్పరిచారు.

1990లకు వచ్చేసరికి కేంద్ర మార్గదర్శక మండలి స్థిరత్వాన్ని సంతరించుకుంది. ఇది సంవత్సరానికి రెండుసార్లు కలవడం కలిసిన ప్రతిసారి కనీసం 200 మంది హాజరు కావడం మొదలైంది. ఇది హిందుత్వాన్ని విస్తరించడంతో ముఖ్యమైన సమస్యలను గురించి చర్చించడం మొదలుపెట్టింది. 1983లో విహెచ్‌పి ఏకాత్మత యాత్రను చేసింది. ప్రజలు మూడు పాయలుగా ఏర్పడి – నేపాల్‌లోని ఖాట్మండ్ నుండి తమిళనాడులోని రామేశ్వరం వరకు, బెంగాల్‌లోని గంగాసాగర్ నుండి గుజరాత్‌లోని సోమనాథ్ వరకు, ఉత్తర ప్రదేశ్‌లోని హరిద్వార్ నుండి తమిళనాడులోని కన్యాకుమారి వరకు – కలిసే విధంగా యాత్ర రూపొందించబడింది. గంగ నీటిని 50 సిఎం లు పది రూపాయలకు ఇందులో అమ్మారు. అప్పటి వరకు ఆవుకే పరిమితమైన ప్రచారాంశం ఇప్పుడు యాత్రకి విస్తరించింది. 1985లో ఉత్తర ప్రదేశ్ బీహార్‌లలో రామ్ జానకి రాధాలు ఊరేగాయి. 1986లో విహెచ్‌పి రామ శిలా పూజలు నిర్వహించింది.

1989లో కాంగ్రెస్ ప్రభుత్వం శిలాన్యాస్ చేయడానికి అనుమతించింది. బిజెపి నాయకుడు ఎల్‌కె అద్వానీ శిలాన్యాస్ కోసం జరిగిన యాత్రకి నాయకత్వం వహించారు.

యుబరాజ్ ఘిమేరి, 'అయోధ్య ఉద్యమ కాలంలో 'సాధువుల పెరుగుదల' అనే వ్యాసంలో, 1989 జూన్ జరిగిన జాతీయ కార్యనిర్వాహక సమావేశంలో బిజెపి ఒక తీర్మానం చేసింది. అందులో 'సాధువుల ఔన్నత్యాన్ని ఒప్పుకుని, ధర్మ సంసద్,

మార్గదర్శక మండల్‌ల తీర్మానాలను ఆమోదించింది. డిసెంబర్ 6వ తేదీ కరసేవ చేయాలన్నది ఈ నిర్ణయాలలో ఒకటి. కరసేవలో పాల్గొన్న సాధువుల సంఖ్య బిజెపిని కూడా ఆశ్చర్యపరిచింది. 1989 నవంబర్ 9న జరిగిన శిలాన్యాస్‌లో మాత్రం సాధువులను పూజలకు పరిమితం చేసారు. 1999కి వచ్చేసరికి పార్లమెంటులో 22 మంది కాషాయాంబరులు ప్రత్యక్షమయ్యారు. తమ బలం పెరగడంతో సాధువులు భారతదేశ రాజ్యాంగాన్ని తిరగ రాయాలని డిమాండ్ చేయడం మొదలుపెట్టారు. స్వామి నిరంజన్ తీర్థ్ కుల వ్యవస్థ ఉండాలని బ్రాహ్మణాధిక్యత కొనసాగాలని అదే ధర్మమని వాదించారు.' అని రాసారు. ఇటువంటి ప్రవచనాలు కింది తరగతులను తమకు దూరం చేస్తుందనే భయం బిజెపికి కూడా కలగడం మొదలవగానే, మందిర నిర్మాణం పక్కనే వాల్మీకి గుడిని కూడా నిర్మిస్తామని చెప్పడం మొదలుపెట్టారు. ఇది నిమ్న కులాలను ముఖ్యంగా హరిజనులను తృప్తిపరచడానికి వినియోగించిన అస్త్రం. లల్లూ ప్రసాద్ యాదవ్ హరిజనులను పూజారులుగా నియమిస్తామని చేసిన ప్రకటనకు వేసిన పై ఎత్తు.

తానొక విశ్వవ్యాప్త సంస్థ కాబట్టి తనకు ఐక్యరాజ్య సమితిలోని ఆర్థిక, సామాజిక పరిషద్‌లో సాధారణ సలహాలందించే స్థానాన్ని ఇవ్వమని విహెచ్‌పి కోరింది. అటువంటి స్థానం కలిగి ఉన్న ఢిల్లీలోని దక్షిణ ఆసియా మానవ హక్కుల సంఘు కేంద్రం చేసిన ప్రకటన విహెచ్‌పికి చెంపపెట్టు లాంటిది. అందులో (విహెచ్ పికి సభ్యత్వం ఇవ్వడానికి ముందు) సంక్షిప్తంగా గమనించవలసిన అంశాలు సమర్పించింది. దీనిని రూపొందించడంలో ప్రపంచ ప్రసిద్ద దర్శకుడు రవి నాయర్ హస్తం ఉంది. 33 పేజీల ఈ ప్రకటన చదవి తీరాల్సిందే.

**బజరంగ్‌దళ్**

ఆర్ఎస్ఎస్ బజరంగ్‌దళ్ తండ్రి కాదు. తాత. దీనిని స్థాపించింది విహెచ్‌పియే అయినా, ఆర్ఎస్ఎస్ ఆదేశాల మేరకే స్థాపించారు. బజరంగ్ దళ్, 1984 మేలో ఓ వినయ్ కతియార్ నాయకత్వాన ఏర్పరచబడింది. ఈయన 1980 నుండి ఆర్ఎస్ఎస్ ప్రచారకునిగాను 1970-74 లలో ఎబివిపి నిర్మాణ కార్యదర్శిగాను ఉండేవారు. రామమందిర నిర్మాణ ఉద్యమానికి విహెచ్‌పి చేతిలో ప్రధాన అస్త్రంగా ఉండడానికి ఈ నియామకం జరిగింది. జఫర్‌లాట్, నమోదు చేసినదాని ప్రకారం, "1993 జులై 11న బజరంగ్‌దళ్, ఆర్ఎస్ఎస్ లాంటి అఖిల భారత సంస్థగా రూపొందించబడింది. ఏక రూప దుస్తులు రూపొందించబడ్డాయి - (నీలం నిక్కర్లు, తెల్ల చొక్కాలు. కాషాయ మెడగుడ్డలు). 1993లో దాదాపు 350 శిక్షణా శిబిరాలు నిర్వహించబడ్డాయి. మానసిక శారీరక శిక్షణకు సంబంధించిన కరపత్రాలు

ముద్రించబడ్డాయి". బజరంగ్ దళ్ గురించి యోగేంద్ర మాలిక్, వి బి. సింగ్ మాటల్లో, బజరంగ్ దళ్ విహెచ్‌పి చేతిలో ఆయుధం; ఇందులో ఎక్కువమంది అల్లరిమూకలు ఉన్నారు. భారతదేశంలో సమకాలీన రాజకీయాలను, రాజకీయ నాయకుల లక్ష్యాలు చేరుకునేందుకు అవసరమైన బల ప్రయోగాలకు అనుగుణంగా రుపొందించబడింది. నేరగాళ్లు, దోపిడీదారులు, కిరాయి గుండాలు ఇందులో ఉన్నారు. ఈ మధ్య కాలంలోని రామభక్తులు కరసేవకులు బిజెపి, ఆర్ఎస్ఎస్, విహెచ్‌పి కార్యకర్తలే. భారతదేశ రాజకీయాలను మరింత దిగజారుస్తున్నది వీరే. పట్టణ ప్రాంతాలలో చదువుకున్న నిరుద్యోగులు పెరగడంతో సమాజం మరింత పతనమవుతూ ఉన్నది. విహెచ్‌పి ప్రాపకంలో ఉన్న బజరంగ్‌దళ్ ఇటువంటి వారిని చేరదీయడంలో అందరికన్నా ముందుంది.

బజరంగ్‌దళ్ విపరీతంగా నిధులు వసూలు చేస్తున్నది. పట్టణాలలోని వారే కాదు పల్లెల్లోని వ్యాపారస్థులు, చిన్న పారిశ్రామికవేత్తలు నిధులు సమకూరుస్తున్నారు; ఉత్తర భారతదేశంలో ప్రధానంగా ఉన్నా, దక్షిణ, ఈశాన్య భారతదేశంలో కూడా గట్టి మద్దతు పొందుతున్నది.

రాజకీయ నాయకులు మందిని పోగుచేసుకోడానికి మతగురువులను ఆశ్రయించడం సులువు. ఒకసారి వారు వచ్చి రాజకీయాల రుచి మరిగితే, వారిని వదిలించుకోవడం ఏమంత సులభం కాదు. శ్రీలంక, మియాంనర్, పాకిస్తాన్‌లో జరిగింది ఇదే. యేల్ విశ్వవిద్యాలయం ఆచార్యుడు రిచర్డ్ ఎచ్ డేవిస్ బజరంగ్‌దళ్ శక్తిని గురించి, రథయాత్రలో ప్రముఖంగా కనిపించింది బాణాలు త్రిశూలాలు పట్టుకున్న యువకులే; వీరే విహెచ్‌పి యువ సైన్యం, బజరంగ్‌దళ్ కార్యకర్తలు; వీరు బిజెపి నాయకులను సవాలు చేస్తున్నారు. బజరంగ్‌దళ్ కార్యకర్తలు ప్రదర్శనలో పాల్గొనక ముందే, మహిళలను, గుడులను, మతాన్ని, 'అరాచకాల నుండి రక్షిస్తానని' ప్రతిజ్ఞ చేసి త్రిశూలాలు పొందుతారని, నీలాద్రి భట్టాచార్య రాసారు. శివుడు, 'కొత్తగా మిలిటెంట్‌గా ఉండి, దూకుడుగా వ్యవహరించే హిందుత్వకి చిహ్నం. తన తదనంతర కాలంలో సృష్టించబడిన వారిని ధ్వంసం చేయడానికి వెనుకాడనివాడు (విఘ్నేశ్వరుడి తల నరకడానికి వెనుతీయలేదు కనక). రాముడికి ఆనాడున్న వ్యవస్థని కొనసాగించాల్సిన రాజధర్మం ఉంది. కానీ, శివుడికి అటువంటిదేమి లేదు. కానీ, బజరంగ్‌దళ్ కార్యకర్తలు తాము హనుమంతుడి సైన్యమని చెప్పుకుంటుంటారు. రాముడి వానర సైన్యంలో భాగమని అర్థం. ఆ విధంగా రామాయణంలోకి జొరబడ్డారు. అందుకనే ప్రతి ప్రదర్శనలోను హనుమంతుడి వేషంలో ఒకడు తప్పనిసరిగా ఉంటాడు.

ఈ యువ కార్యకర్తలు అద్వానీని తమలో కలుపుకోవాలని చూసారు. ఉజ్జయినిలో అద్వానీకి ఆయుధాలను బహూకరించారు. ఆయన నుదుటికి రక్త సింధూరాన్ని దిద్దడం ఆనవాయితీగా పెట్టుకున్నారు. కొన్ని సార్లు అద్వానీగారు కూడా యువకుడిలాగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అయితే రాజకీయ సందేశాన్ని ఇచ్చేటప్పుడు మాత్రం ఆయన మద్దతుదారులను దృష్టిలో పెట్టుకుని సంయమనం పాటించేవారు. ఉన్నత పట్టణ మధ్య తరగతిని ఆకర్షించే సంప్రదాయ తెల్ల కుర్తాలు ధరించేవారు. ఒకసారి పాత్ర నిండా రక్తాన్ని ఇస్తే, తన అనుచరుల ద్వారా ఇటువంటివి స్వీకరించబడవని సందేశం పంపించారు. ఒక ఢిల్లీ సభలో బజరంగ్‌దళ్ కార్యకర్తలు ఆయుధాలు త్యజించాలని, దూకుడును తగ్గించాలని బహిరంగంగానే పిలుపునిచ్చారు.

వాస్తవంలో త్రిశూలాలు కేవలం చిహ్నాలే. కానీ, వీధి కొట్లాటలు వస్తే ఆ చిహ్నాలే నిజమైన ఆయుధాలుగా కూడా మారతాయి.

అద్వానీ చేసిన అయోధ్య రథయాత్ర ప్రచారం, రెండు విభిన్న శత్రువులను తెలియచేయడానికి వినియోగించబడింది. ఒకటి ముస్లింలపై బజరంగ్‌దళ్ విహెచ్‌పిలు చేస్తున్న కల్పిత యుద్ధం; రెండు, అద్వానీ, బిజెపిలు భారత ప్రభుత్వంపై చేస్తున్న పోరాటం. కానీ, ఈ రెండింటి ఎజెండా మాత్రం ఒక్కటే. హిందూదేశ నిర్మాణం.

ఆస్ట్రేలియన్ పూజారిని తగలపెట్టినప్పుడు కెఆర్ నారాయణన్, ఎన్నటికీ మరిచిపోలేని మాట, ప్రజలు మనోఫలకాలపై శాశ్వతంగా నిలిచే మాట" అని అన్నారు. అది ప్రపంచంలో హీనాతిహీనమైన చర్యల పట్టికలో ఒకటి. "గ్రాహం స్టెయిన్స్‌ని, అతని ఇద్దరు కుమారులు ఫిలిప్ (9), తిమోతి6 లను సజీవంగా దహనం చేయడం మొత్తం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఒరిస్సాలోని కెంజోహార్ జిల్లాలో మనోహర్ పురలో 1999 జనవరి 22వ తేదీ అర్ధరాత్రి ఈ దుర్ఘటన జరిగింది. స్టెయిన్స్ తన జీవిత కాలం కుష్టువ్యాధితో బాధపడుతున్న వారికి సేవలందించారు. జనవరి 29న ప్రభుత్వం నేరస్థులను పట్టుకునేందుకు కమిషన్‌ని నియమించింది. దారాసింగ్, రబీంద్ర పాల్ నేరస్థులని అందరికి తెలిసినదే. కానీ, అదే రోజు రాత్రి, ఒక టివి కార్యక్రమంలో తనకు ఏ సంస్థతో ఎటువంటి సంబంధం లేదని" దారాసింగ్ ప్రకటించాడు. కమిషన్‌ని నియమించడానికి 5 రోజుల ముందే అప్పటి గృహ మంత్రి అద్వానీ, బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ బజరంగ్‌దళ్‌లకి ఈ నేరంతో ఎటువంటి సంబంధం లేదని ప్రకటించారు. దారా సింగ్ అప్పుడు పరారీలో ఉన్నారు. అద్వానీ ప్రచార మాధ్యమాలపై విరుచుకుపడ్డారు. "నాకు ఈ సంస్థలతో ఎన్నో ఏళ్లగా సంబంధాలు ఉన్నాయి. వాటిలో ఎటువంటి నేరస్తులు లేరు." అని లోక్ సభలో ఫిబ్రవరి 23న ప్రకటించారు.

అద్వానీ రథయాత్ర సందర్భంగా బజరంగ్‌దళ్ చేసిన సేవలకు బదులు తీర్చుకునేందుకుగాను, నేర పరిశోధనకు ముందే ఇటువంటి ధ్రువీకరణ పత్రాన్ని బజరంగ్‌దళ్‌కి అందించి అద్వానీ తన ఋణం తీర్చుకోవడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. బిజెపి తరఫున ఎన్నికలలో విస్తృతంగా ప్రచారం చేసిన దారా సింగ్‌కి బిజెపి, ఆర్ఎస్ఎస్, బజరంగ్‌దళ్‌లతో ఎటువంటి సంబంధాలు లేవని, ఈ కేస్ విచారిస్తున్న సిబిఐ తీర్పు చెప్పింది !

వికాస్ పాథక్ 2015 డిసెంబర్‌లో బజరంగ్‌దళ్ గురించి రాస్తూ, "ఆర్ఎస్ఎస్ అనుసంధాన సంస్థలు స్వతంత్రంగానే పనిచేస్తాయి; ఆర్ఎస్ఎస్‌తో వాటి సంబంధం మాత్రమే నిరంతరంగా ఉంటుంది. ఆర్ఎస్ఎస్‌కి సంబంధించిన కార్యకర్తలు ఒక సంఘం నుంచి మరో సంఘానికి మారుతూ ఉంటారు. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు మాత్రం అన్ని సంస్థలను కలిపి ఉంచుతాయి. వారానికొక్కసారి హనుమాన్ చాలీసా అన్ని గుడులలోను జరుగుతుంది. దీనికి తోడుగా దళ్ కార్యకర్తలు, స్థానిక అఖాడాల్లో గాని జిమ్నాజియంలలో గాని పాల్గొనాల్సి ఉంటుంద"న్నారు.

దళ్‌లో విద్యార్థి ప్రముఖులుంటారు. విద్యార్థులలో తమ ప్రభావాన్ని పెంచడం వారి కర్తవ్యం. అయితే ఈ పని పూర్తిగా రాజకీయాలకతీతంగా జరగాలి. రాజకీయాలకు సంబంధించిన కార్యక్రమాలు ఎబివిపి చేస్తుంది. ఎబివిపి చేసే కార్యక్రమాలను సంఘ నిర్మాణ కార్యక్రమాలుగా దళ్ గుర్తిస్తుంది. పోరాటాలు తనవంతుగా భావిస్తుంది. రామ మందిరం ఇందుకు ఉదాహరణ. దళ్ గోవధకి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని సమీకరిస్తుంది; రవాణా చేస్తున్న గోవులను పట్టుకుంటుంది; పోలీసుల వద్ద ఫిర్యాదులు నమోదు చేస్తుంది; అవసరమైన చోట కొట్లాటలకు కూడా దిగుతుంది. 1996లో అమరనాథ్ యాత్ర సాగుతున్నప్పుడు దళ్ పోషించిన పోరాట పాత్ర ఒక మైలురాయి. శర్మగారు, "దళ్‌కి కూడా ఒక మంచి పార్శ్వం ఉందని నిరూపించుకోడానికి రక్తదానం వంటి సామాజిక కార్యక్రమాలు చేస్తుంటుంది. కానీ, దళ్ చేసే ఇటువంటి పనులను ఎవ్వరూ నిజమని నమ్మరు." అన్నారు.

బజరంగ్‌దళ్ హనుమంత జయంతిని బలోపాసన దినంగా జరుపుతుంది. నిజమైన దళ్ సభ్యుడు హనుమంతుడి రూపంలోనే ఉండాలంటారు దళ్ ప్రముఖులు; శారీరకంగా, దృఢంగా ఉండాలి; సౌశీల్యం కలిగి ఉండాలి; దుష్టులను శిక్షించేందుకు సదా సిద్ధంగా ఉండాలి. ఎప్పుడూ ఎదో ఒక తగాదాకి సిద్ధంగా ఉండాలి; అది రాముడి గుడే కావచ్చు, లేదా గోవధ కావచ్చు.

తనను స్థాపించిన విహెచ్‌పి లాగే దళ్ కూడా స్వతంత్ర సంస్థే. దానికి బిజెపితో ప్రత్యక్ష సంబంధం లేదు. కానీ, మూడు సంస్థలు ఆర్ఎస్ఎస్ నిర్ణయాలకు బద్ధులై

ఉండవలసిందే. మోడీ వ్యక్తిగత పోకడలతో శక్తివంతుడైన నాయకుడై, ఆతని ఆధ్వర్యంలో బిజెపి సంస్థాగతంగా బలహీనపడితే మిగిలిన రెండు సంస్థలు శక్తివంతమవుతాయి. ఈ సంస్థలను వాటికిష్టమైనట్టు దాడిచేయడానికి వదిలి పెట్టి, ఆర్ఎస్ఎస్ బలపడుతుంది. ఇటువంటి విభాగాలు ఉన్నన్ని రోజులు ఆర్ఎస్ఎస్‌కి తిరుగులేదు.

◆

# పన్నుల, ధార్మిక అధికారుల ముందు ఆర్ఎస్ఎస్ స్వయం ప్రకటనలు

2019 వరకు ఆర్ఎస్ఎస్ తనకు తానొక ధార్మిక సంస్థనని ఆదాయ పన్ను, ధార్మిక సంస్థల అధికారులకు చెప్పుకుంటూ వచ్చింది. కానీ, తన గురువు గోల్వాల్కర్ ప్రామాణిక గ్రంథాలైన మనము, మన జాతీయత నిర్వచనం, పాంచజన్యలలో ప్రవచించింది, వీరు అధికారుల ముందు చెప్పుకున్నది పూర్తిగా భిన్నమైనవని గమనించాలి. 'ఆర్ఎస్ఎస్ ఒక సాంస్కృతిక సంస్థ అని, సంస్కృతిని కాపాడడమే దాని విధానమని, రాజకీయ రంగంలో కేవలం అవసరమైనప్పుడు మాత్రమే అడుగు పెట్టవచ్చని' ఆర్ఎస్ఎస్‌కి దిశా నిర్దేశం చేసిన గోల్వాల్కర్ రాసారు.

కేంద్ర ప్రభుత్వం అడిగిన వివరణకు మొదటిసారిగా, ఆర్ఎస్ఎస్, తనకు రాసి పెట్టబడిన రాజ్యాంగం లేదని, వల్లభాయ్ పటేల్ ముందు చెప్పుకుంది. కానీ, డాక్టర్ కందర్ అనే ఆర్ఎస్ఎస్ కార్యకర్త, ఆర్ఎస్ఎస్‌కి 1933 నాటికే రాయబడిన రాజ్యాంగం ఉందని చెప్పారు. ఇది 1949లో ఒకసారి సవరించబడింది. తిరిగి 1972లో తాము స్వీకరించే 'గురు దక్షిణను' చట్టబద్ధం చేయడానికి సవరించడం జరిగింది. "ప్రాచీన సంస్కృతికి చిహ్నమైన కాషాయ జెండాని సంఘ్ గురువుగా భావిస్తుందని" సవరించారు. 1949కి ముందు రాజ్యాంగంలో శాఖలు వసూలు చేసిన గురు దక్షిణ కేంద్ర ఆర్ఎస్ఎస్‌కి చెందుతాయని ఉంటే, 1949లో శాఖల వసూళ్లు శాఖలకే చెందుతాయని సవరించారు. ఈ సవరణలు చట్టపరంగా ఇబ్బందులు లేకుండా చేసుకోడానికి జరిగాయి. ఆదాయ పన్ను, ధార్మిక సంస్థల అధికారులతో జరిగిన ఈ సుదీర్ఘ వివాదాల కాలంలో అర్ఎస్ఎస్ చెప్పిన ఎన్నో అబద్ధాలు బయటపడ్డాయి. ముంబై హై కోర్టు ముందు తానొక ధార్మిక సంస్థనని తనకు ఆదాయపు

పన్ను చట్టం 1961,10 (22) వర్తిస్తుందని చెప్పి, అదే సమయంలో ధార్మిక కమిషన్ ముందు ఆర్‌ఎస్‌ఎస్ ఒక ధార్మిక సంస్థ కాదని, రాజకీయ సంస్థ అని అందువలన ముంబై ప్రజా ధార్మిక సంస్థల చట్టం, 1950లోని సెక్షన్ 12(13) వర్తిస్తుందని చెప్పుకుంది. ప్రజలకు అదో సాంస్కృతిక సంస్థ. పన్నులు ఎగవేయడానికి ధార్మిక సంస్థ అని సవరణలు చేసుకుంది. కానీ, ఆ సవరణలను ధార్మిక సంస్థల కమిషనర్‌కి తెలియకుండా దాచింది.

1965లో దేవరస్ ఆర్‌ఎస్‌ఎస్ ఒక విద్యా సంస్థ అని అందువలన వ్యక్తులుగా గాని సమూహంగా గాని పన్నులు చెల్లించవలసిన అవసరం లేదని ఆదాయపు పన్ను అధికారులు కోరిన వివరణకు సమాధానం ఇచ్చారు. 1971 జనవరి 27న రాసిన మరో లేఖలో, "సంఘ్ కేవలం ఒక సాంస్కృతిక సంస్థ అని, సమాజం క్రమబద్ధంగా వికసించడానికి పనిచేస్తున్నదని, తన పని పూర్తిగా విద్యకు సంబంధించినదని, హిందూ యువకులకు హిందూ సమాజం యొక్క సాంస్కృతిక వారసత్వం గురించి బోధన చెయ్యడం లక్ష్యమని, ఇది శారీరక శిక్షణ, వ్యాయామం, బోధనలు మొదలైన వాటి ద్వారా అందిస్తామని" వివరణ ఇచ్చారు. ఇలా ఆర్‌ఎస్‌ఎస్ పన్నులు ఎగ్గొట్టె అవసరాలకు తగ్గట్టు తనను గురించి తాను చెప్పుకుంటూ వచ్చింది.

1974లోనే ఆర్‌ఎస్‌ఎస్ గురుదక్షిణ ద్వారా 20 లక్షలను వసూలు చేసింది అంటే ఇప్పుడు ఎంత వసూలు చేస్తుంటుందో ఎవరైనా ఉహించగలరు.

ఆర్‌ఎస్‌ఎస్ స్థాపించడానికి అసలైన కారణం 'భారత వర్షంలో' 'హిందూ రాష్ట్ర' ఏర్పాటు. ఇందులో ఎవరికైనా ఎటువంటి సందేహాలు ఉంటాయేమో అని స్పష్టంగా 'సంఘ్‌లో సభ్యత్వం కేవలం హిందువులకే అయినా, హిందూ స్వయం సేవక్ సంఘ్ అని పేరు ఎందుకు పెట్టుకోలేదంటే, సంఘ్ ఉద్దేశంలో భారతదేశంలో 'రాష్ట్రీయ' అంటేనే ఈ దేశంలో ప్రధానంగా నివసించేది హిందువులు మాత్రమే అని. మరో ముఖ్యమైన కారణం, తన సంస్థ రాజకీయ సిద్ధాంతం ప్రతిబింబింపచేయడానికి. సంఘ్‌కి విధానపరంగా తనకంటూ ప్రత్యేకమైన రాజకీయాలు లేవు అని వివరించింది.

ఆర్‌ఎస్‌ఎస్ మౌలిక విధానాన్ని అర్థం చేసుకోవడంలోనే ఈనాటికీ వైఫల్యాలు ఉన్నాయి. ఆర్‌ఎస్‌ఎస్ మాత్రం తన విధానంలో ఎప్పుడూ స్పష్టంగానే ఉంది. మొదటిగా " .. వాడే పదాలకు మాములుగా వాడే అర్థంలోకాక ప్రత్యేకమైన అర్థాలు ఉన్నాయి. స్థూలంగా చెప్పాలంటే ... సంస్థ ఆ పదాలను సంస్థ దృష్టిలో ఆ పదానికి ఉన్న అర్థంలో వాడింది; ఇతరులు సాధారణంగా ఎలా వాడతారో అన్న అంశంతో సంఘ్‌కి సంబంధం లేదు. ఉదాహరణకి 'రాష్ట్రీయ, ధర్మ (మతం) సంస్కృతి, హిందూ ధర్మ' వగైరా పదాలు.

ఈ విధంగా తనకు తాను చెప్పుకోవడం వలన ఒక సౌలభ్యం ఆర్ఎస్ఎస్‌కి ఉంది. ఎప్పుడుబడితే అప్పుడు వేర్వేరు అర్థాలు చెప్పుకోవచ్చు. రెండోది, సర్ సంఘ్ చాలాక్ 'సలహాదారు, మార్గదర్శకుడు', ఆతని రచనలు, ప్రసంగాలు అత్యంత ప్రధానమైనవి. రాతపూర్వక రాజ్యాంగం 1949లో మొదటిసారిగా ఏర్పడింది. మూడో అంశం, జెండా ప్రాధాన్యత. కాషాయ జెండా హిందువుల ప్రాచీన సంస్కృతిక గుర్తు. ఇంకో అంశం, దాని స్వరూపంలో, నిర్మాణంలో ప్రజాతంత్ర వ్యవస్థకి అతి తక్కువ స్థానం ఉండడం, ఎక్కడా ఎన్నికలు ఉండవు. అన్ని స్థానాలకు నియామకాలే. కేవలం సర్ కార్యవాహక్ (కార్యదర్శి) ప్రాంతీయ సర్ సంఘ్ చాలక్ (రాష్ట్ర అధిపతులు) లను మాత్రమే ఎన్నుకుంటారు.

పైగా ప్రకటనలో స్పష్టంగా మరో విషయం కూడా చెప్పుకుంది. "ఆర్ఎస్ఎస్ ప్రస్తుతానికి ఒక రాజకీయ పార్టీ కాకపోయినా, అనుసరిస్తున్న రాజ్యాంగం ప్రకారం క్రియాశీల రాజకీయాలలో పాల్గొన కూడదని ఉన్నా,, రేపటి రోజు ఈ విధానం మార్చుకోవచ్చు; ఆర్ఎస్ఎస్ రోజువారీ రాజకీయాలలో పాల్గొనవచ్చు. ఎందుకంటే విధానాలేం మార్చుకోలేనంతటి స్థిరమైనవి కావు కదా."

వ్యక్తిగతంగా సభ్యులు ఎవరైనా ఏ పార్టీలో అయినా ఉండవచ్చు. (ఆర్టికల్ 4). డాక్యుమెంట్‌లో ఆర్ఎస్ఎస్ ఏ రోజైనా రాజకీయాలలో పాల్గొనవచ్చని నిర్భయంగానే చెప్పుకుంది. దేవరస్‌తో సహా అనేక పర్యాయాలు ఈ విషయాన్ని ఉటంకించారు. సాంస్కృతిక సంస్థ అనే పదంలో సంస్కృతి అంటే ఏమిటో స్పష్టంగానే చెప్పుకుంది. ''సంస్కృతికి అర్థం సాధారణంగా గాని, పాలనాపరంగా గాని అనుకుంటున్నట్టు, కళలకు-నాటకాలకు, సంగీతానికి, నృత్యానికి ఇలాంటి ఇతర కళలకు సంబంధించినది మాత్రమే కాదు. సంఘ్ కార్యక్రమాలు చాలా విస్తృతమైనవి; ఆర్ఎస్ఎస్ సలహాదారుడు, మార్గదర్శకుడు చేసిన వ్యాఖ్యానాలకనుగుణంగా సంస్కృతిని అర్థంచేసుకోవలసి ఉంటుంది; దేశం లేదా సమాజం యొక్క ఏ పార్శ్వానికి సంబంధించి అయినా ఆ వ్యాఖ్యానాలు ఉండవచ్చు. అంటే, రాజకీయాలు, సమాజం, ఆర్థికాంశాలు, సంప్రదాయాలు, నీతి, భాష, లిపి; ఆర్ఎస్ఎస్ అధిపతి దేశంలోని అనేక ఇతర సంప్రదాయాలు, వేదసమ్మతమైన సిద్ధాంతాలు కలిగిన సాధారణ హిందూ జీవన విధానం గురించిన వ్యాఖ్యానాలు, వివరణలు ఇవ్వవచ్చు.

ఆర్ఎస్ఎస్ తన రాజ్యాంగంలో 26వ పేరాలో చెప్పిన దానికి భిన్నంగా ఆర్టికల్ 4(బి)లో సంఘ్‌కి తనకంటూ రాజకీయాలు ఏవి లేవు; ఇది కేవలం సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితమవుతుంది అని రాసుకుంది. కానీ 'సంస్కృతి'కి ఆర్ఎస్ఎస్ ఇచ్చిన నిర్వచనం ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉంది. అంటే ఆర్ఎస్ఎస్

ఉద్దేశపూర్వకంగా వంచించడం కాదా? ఆర్ఎస్ఎస్‌కి ఎప్పటికప్పుడు ప్రతి పదానికి అర్థాలు మార్చడం పరిపాటి. అందువలనే 1972 మేలో ఆదాయపు పన్ను అధికారులకు దేవరస్ ఇందుకు పూర్తి విరుద్ధమైన వివరణనిచ్చారు; "ఆర్ఎస్ఎస్ లక్ష్యం దాన ధర్మాలు కావని ఆదాయపు పన్ను అధికారులు తప్పుగా అర్థంచేసుకున్నారని" అన్నారు. "నమ్మకం, చట్టపరమైన బాధ్యతలను అధికారులు సరిగ్గా అర్థంచేసుకోవడంలో విఫలమయ్యారు; ఈ పన్ను వేయబడిన సంస్థకి తన లక్ష్యాలకనుగుణంగా సొమ్మును రాజ్యాంగంలో నిర్దేశించిన విధంగా ఖర్చుచేయవలసిన చట్టపరమైన బాధ్యత ఉంటుంది." అన్నారు.

1979 ఐక్యరాజ్య సమితికి ఇచ్చిన నివేదికలో ఇదే దేవరస్, "సంస్థకి కేంద్రంలో ప్రభుత్వం స్థాపించేంత ప్రజాదరణ ఉంది" అన్నారు:

'ఒక ప్రజాతంత్ర వ్యవస్థలో ఇందుకు (అధికారంలోకి వచ్చేంత ప్రజాదరణ ఉన్నందుకు) ఎవరూ అసూయ చెందాల్సిన పనిలేదు.' అని భోపాల్‌లో వంద మందితో జరిగిన ఒక రహస్య సమావేశంలో అన్నారు. మూడు రోజుల తరువాత భోపాల్‌కి తిరిగి వచ్చి తానలా అనలేదని మాట మార్చారు. ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక 'ఆర్గనైజర్' ఆ "రిపోర్ట్" పై మండిపడింది. సమావేశం రహస్యంగా జరగలేదని, ప్రతి విషయం రికార్డ్ చేయబడిందని, అవసరమైతే టేపులు వినిపిస్తామని దేవోరస్ ప్రకటించారు. కానీ, యుఎన్ఐ, రిపోర్టర్ టేపులు వింటామంటే తమకు వినిపించలేదని సెప్టెంబర్ 20వ తేదీ పత్రికలో ప్రచురించారు.

ఇటువంటి వివాదాలు కొనసాగుతూనే ఉంటాయి. అసలు విషయం, ఆర్ఎస్ఎస్‌కి రాజకీయ ఆశలు ఉన్నాయనేది స్పష్టంగా కనపడుతున్నది. అటువంటప్పుడు బిజెపిని అడ్డం పెట్టుకోడం వంటి దొడ్డిదారులు వెతుక్కోడం ఎందుకు? ఆర్ఎస్ఎస్ రాజకీయ వాతావరణాన్ని పరిశీలిస్తూ ఉంటుంది. తన 'విధానం' మార్చుకునే నిర్ణయం తీసుకున్న రోజు, బిజెపి కార్యకర్తలంతా ఆర్ఎస్ఎస్‌లో చేరిపోతారు. ఆర్ఎస్ఎస్ ఒక కొత్త రాజకీయ సంస్థగా అవతరిస్తుంది. బిజెపి నాయకులు అంతా పరిత్యజించబడి, అవమానంతో ఎవరి సొంత గూటికి వారు పంపబడతారు. ఎబివిపి, విహెచ్‌పి, బజరంగ్‌దళ్‌లు కొత్తగా ఏర్పడ్డ ఆర్ఎస్ఎస్ పార్టీ సేవకు అంకితమవుతాయి. ఇప్పుడున్న బిజెపి నాయకులెవరూ ఈ పరిస్థితులు అడ్డుకొనే అవకాశాలు లేవు.

హెగ్డేవార్ బుద్ధికుశలత సంఘ్‌కి బాగా ఉపయోగపడింది. ఆర్ఎస్ఎస్ అధికార పత్రిక ఆర్గనైజర్ 2016 డిసెంబర్‌లో ప్రకటించినట్టు "హెగ్డేవార్ 'గురు దక్షిణ' అనే కొత్త విధానాన్ని సృష్టించుకుంది. సంఘ్ తానెవ్వరి నుండి దానాలు అడగనని

చెప్పుకుంది. ఇక్కడెటువంటి సభ్యత్వ రుసుము లేదు. ప్రతి స్వయం సేవకుడు తన గురువుకి ప్రతి ఏడూ ఇతోధికంగా కృతజ్ఞతాపూర్వకంగా సమర్పించుకుంటాడు. గురువంటే ఒక వ్యక్తి కాదు; అది స్వచ్ఛతకి, త్యాగానికి, ధైర్యానికి, కాషాయ జెండాకి ప్రతి రూపం. ఏ ఒక్క వ్యక్తి గురువు కాదు; ఏ ఒక్కరి పేరుతో చేసే నినాదం గురువు కాదు. సంఘ్ 'భారత్ మాతాకి జై' అనే నినాదాన్ని మాత్రమే ప్రతి రోజూ శాఖల్లో ప్రార్థనల తరువాత ఇస్తుంది. గత 91 సంవత్సరాలుగా ఇదే నినాదాన్ని ఇస్తున్నది. కృతజ్ఞతతో ఇచ్చే సొమ్ము ఆర్ఎస్ఎస్ స్వయం సంవృద్ధిగా పని చేయడానికి సరిపోతుంది. ఈ రోజు లక్షలలో గురుదక్షిణ సమర్పించుకునే స్వయం సేవకులున్నారు. శాఖల స్థాయిలో ఉన్న ఆఫీస్ బేరర్లు తప్పితే ఇంకెవ్వరికి ఈ గణాంకాల వివరాలు తెలియవు.

ఆర్ఎస్ఎస్ దేశంలోనే ఒక అత్యంత ధనిక సంస్థ. దాని రాజకీయ విభాగం అన్ని రాజకీయ పార్టీలకన్నా అత్యంత ధనిక పార్టీ.

“ఒక గొప్ప భారతదేశాన్ని అందించగల శక్తి సామర్థ్యాలుగాని, విజ్ఞానం గాని ఆర్ఎస్ఎస్‌కి లేవు. 1963 లోనే డోనాల్డ్ యూజీన్ స్మిత్ తాను రాసిన ‘లౌకిక రాజ్యంగా భారతదేశం’ అనే పుస్తకంలో హిందూ మతతత్వం భారత దేశ ఫాసిజం రూపం అని పేర్కొన్నాడు. ఆర్ఎస్ఎస్‌కి ఫాసిజానికి పోలికలు ఇట్టే కనిపెట్టవచ్చు. నాయకుని సిద్ధాంతం, సైనికీకరణకి ప్రాధాన్యతనివ్వడం, జాతి–సంస్కృతుల ఆధిపత్య సిద్ధాంతం, మతతత్వ సిద్ధాంతం గల తీవ్ర జాతీయవాదం, గతకాల గొప్పదనాన్ని సూచించే గుర్తులకు ప్రాధాన్యం, జాతి సంఘీభావ ప్రాధాన్యత, మత, ప్రాంతీయ మైనారిటీలను దేశంలో భాగంగా పరిగణించకపోవడం... ఆర్ఎస్ఎస్ లో ఉండే ఈ లక్షణాలన్నీ ఫాసిస్ట్ ఉద్యమాల్లో ఉండేవే. యూరోప్‌లోని ఫాసిజంలో రాజ్యాన్ని ఆరాధించడం ప్రధాన లక్షణం. ఇందులో వ్యక్తి తన ఉనికిని కోల్పోతాడు. అదే అతని జీవిత పరమావధి అవుతుంది. ఇది ఆర్ఎస్ఎస్ సిద్ధాంతంలో లేదు; ఆర్ఎస్ఎస్ లక్ష్యం హిందూ సమాజ స్థాపన.”

ఆర్ఎస్ఎస్ **దేశానికి ప్రమాదం** ఎ.జి. నూరాని

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్